ఆంధ్రప్రభ

Estd 1938


www prabhanews com

Journalism first!

సంపుటి:56 • సంచిక:263 • బుధవారం 3 జనవరి 2018 • హైదరాబాద్ ❋ పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంతఋతువు, పుష్య మాసం, తిథి: బహుళ పాడ్యమి ఉ. 6.40 వరకు, అనంతరం విదియ తె. 4.20 వరకు; నక్షత్రం: పునర్వసు ఉ. 11.53 వరకు, అనంతరం పుష్యమి; అమృతకాలం: ఉ. 9.45 నుండి 11.15 వరకు; వర్జ్యం: రా. 7.22 నుండి 8.51 వరకు; దుర్ముహూర్తం: ఉ. 11.36 నుండి 12.24 వరకు; రాహుకాలం: మ. 12.00 నుండి 1.30 వరకు; యమగండం: ఉ. 7.30 నుండి 9.00 వరకు



అనగనగా రెండున్నర రూపాయల నోటు!

న్యూఢిల్లీ: భారత కరెన్సీలో ఒకటి... రెండు.. ఐదు.. పది రూపాయల నోట్ల గురించి మాత్రమే మనకు తెలుసు. కానీ రెండున్నర రూపాయల నోటు కూడా ఒకటుండేదని మనలో చాలా మందికి తెలీదు. చాలా ఏళ్ల కిందటే దీని చలామణి నిలిచిపోయింది. ఈ నోటు చలామణిలోకి వచ్చి నేటికి సరిగ్గా వందేళ్లు పూర్తవుతున్నాయి. అయినా చరిత్రలో దానికంటూ ప్రత్యేకత ఉంది. అణాల కాలంనాటి పరిభాషలో దీనిని రెండు రూపాయల ఎనిమిది అణాలుగా పేర్కొనేవారు. సరిగ్గా వందేళ్ల కిందట జనవరి 2, 1918లో ఈ నోటు తొలిసారి చలామణిలోకి వచ్చిందని రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఈ నోటు ఇంగ్లండ్‌లో చేతితో తయారుచేసిన తెల్లకాగితంపై ముద్రితమై ఇండియాలో వాడుకలోకి వచ్చింది. దీనిపై ఐదవ బ్రిటీష్ జార్జి చక్రవర్తి బొమ్మ, బ్రిటీష్ ఆర్థిక కార్యదర్శి ఎంఎంఎస్ గుబ్బే సంతకం ఉండేదట. నోటుకు కుడివైపు పైభాగంలో, కిందివైపు ఎడమ భాగంలో 2/8 (రెండున్నర రూపాయలు) సంఖ్య ఉండేది. నంబర్‌కు ముందు నోటు చలామణిలో ఉండే ప్రాంతాలను గుర్తుతెచ్చేలా, ఏడు ఇంగ్లీషు అక్షరాలను ఉపయోగించారట. ఎ- కాన్పూర్, బి-బాంబే, సి-కలకత్తా, కె- కరాచి, ఎల్- లాహోర్, ఎం-మద్రాస్, ఆర్- రంగూన్ గా పేర్కొన్నారు. నోటుకు వెనుకవైపు ఎనిమిది భారతీయ భాషల్లో రెండున్నర రూపాయలు అని ముద్రించారు. ఇది అప్పట్లో ఒక డాలర్ విలువకు సరిసమానం. మొదటి ప్రపంచ యుద్ధం కాలంలో ➪ 3వ పేజీలో...



హెచ్-1బి వీసాలు పొడిగించరు

75వేల మంది భారతీయులు స్వదేశం రాకతప్పదు

గ్రీన్‌కార్డ్ పెండింగ్‌తో ఆశనిపాతం

3లో

ఫిబ్రవరిలో పంచాయతీ పోరు..?

ప్రభుత్వ యోచన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఏ ఎన్నికనైనా గడువు దాటి జాప్యం చేయకూడదని భావిస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్ గడువులోగానే గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని గతంలోనే ప్రకటించిన విషయం విదితమే. అందుకు అనుగుణంగానే ఏర్పాట్లు జరుగుతున్నాయి. పంచాయతీరాజ్ చట్టానికి ఇప్పటికే దాదాపు తుది రూపునివ్వగా, ఒకటి రెండు అంశాలపై స్పష్టత రాగానే.. ఈనెలలోనే అసెంబ్లీ ముందుకు తీసుకొచ్చి ఆమోదం వేయించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. శాసనసభ ఆమోదం పొందాక.. రాష్ట్రపతి ఆమోదం కోసం బిల్లు వెళ్ళనుండగా, రాష్ట్రపతి ఆమోదముద్ర ➪ 2వ పేజీలో...



గ్రామ రైతు సమన్వయ సమితుల ద్వారా ఇంటింటికి పంపిణీకి కార్యాచరణ!

త్వరలో సీఎం సమక్షంలో తుది నిర్ణయం

ఆన్‌లైన్ బదిలీ... చెక్కుల పంపిణీతోనూ చిక్కులే

రైతు చేతికే రొక్కం!

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నష్ట, నష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునేందుకు వచ్చే వ్యవసాయ సంవత్సరం నుంచి ఎకరాకు రూ.8వేల చొప్పున పెట్టుబడి రాయితీ ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం అమలుపై లోతుగా అధ్యయనం చేస్తోంది. ఈ పథకాన్ని బ్యాంకులతో ముడిపెడితే పాత బకాయల కింద ఈ నిధులను జమ చేసుకునే ప్రమాదం ఉన్నందున ఆచితూచి అడుగులు వేస్తోంది. జూన్ రెండోవారం నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున ఈ ఏడాది మే నెలలోనే నిర్ణీత పెట్టుబడి మొత్తాన్ని రైతు ఖాతాల్లో జమ చేస్తామని ఇదివరకే ముఖ్యమంత్రి ప్రకటన చేసినప్పటికీ అమల్లో చిక్కులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయాన్ని పసిగట్టిన ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిపెట్టారు. పెట్టుబడి రాయితీ మొత్తాన్ని చెక్కులు, డిమాండ్ డ్రాఫ్టుల రూపంలో అందజేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ఫైలును గత ఏడాది డిసెంబర్‌లోనే సీఎం కార్యాలయానికి పంపించారు. ఈ విధానం ద్వారా కూడా రైతులు బ్యాంకులను సంప్రదించాల్సి వస్తున్నందున తాజాగా మరో నిర్ణయం తీసుకున్నారు. నగదు రూపంలోనే పెట్టుబడి మొత్తాన్ని నేరుగా రైతులకు చెల్లించేందుకు సుముఖంగా ఉన్నారు. ఈ విధానంతో ఎలాంటి చిక్కులు ఎదురయ్యే అవకాశాలు లేనందున ముఖ్యమంత్రి కూడా ఆమోదిస్తారని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. వ్యవసాయ స్థితిగతులను చక్కబెట్టేందుకు, తద్వారా చిన్న, సన్నకారు రైతు కుటుంబాల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు ఏర్పాటు చేసిన గ్రామ రైతు సమన్వయ సంఘాల ద్వారా ఈ నిధులను పంపిణీ చేయనున్నారు. ఇంటింటికీ తిరిగి పెట్టుబడి రాయితీ పథకం నిధులను పంపిణీ చేసేందుకు కాస్త ఎక్కువ సమయం అవసరమవుతున్నందున ఏప్రిల్ నెల నుంచే ఈ ప్రక్రియను ప్రారంభించేందుకు అధికారులు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. రైతు సంక్షేమ కార్యక్ర మాలన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలన్న తెలం గాణ ప్రభుత్వ సంకల్పం ➪ 3వ పేజీలో...

సింగరేణి చైర్మన్‌గా రఘునందన్?



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సింగరేణి కాలరీస్ కంపెనీ నూతన చైర్మన్‌గా ప్రస్తుత రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్‌రావును నియమించే అవకాశమున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుత చైర్మన్ ఎన్.శ్రీధర్ నియామక పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో.. ప్రభుత్వం ఆయన స్థానంలో రఘునందన్‌ను నియమించవచ్చన్న చర్చ జరుగుతోంది. డిసెంబర్ 31కే నియామక గడువు ముగియగా.. కొద్దిరోజుల్లోనే ఇందుకు సంబంధించిన మార్పులు జరుగుతాయని అధికారవర్గాల సమాచారం.

కోల్‌ఇండియాకు శ్రీధర్?

రాష్ట్ర ప్రభుత్వ సిఫారసు 9



నాంపల్లి కోర్టు నుంచి గజల్ శ్రీనివాస్‌ను రిమాండ్‌కు తరలిస్తున్న దృశ్యం

లైంగిక వేధింపుల కేసులో

గజల్ శ్రీనివాస్ అరెస్ట్

- చంచల్‌గూడ జైలుకు తరలింపు
- ఆధారాలున్నాయి: పోలీసులు
- ఆమెతో మసాజ్ చేయించుకోలేదు: గజల్ శ్రీనివాస్
- శ్రీనివాస్ భయపెట్టాడు: బాధిత యువతి ఆరోపణ
- 12 వరకు జ్యుడీషియల్ రిమాండ్... చంచల్‌గూడ జైలుకు



బాధిత యువతి



పనిమనిషి పార్వతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: లైంగిక వేధింపుల కేసులో ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్‌ని పంజాగుట్ట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం నాంపల్లి కోర్టులో హాజరుపర్చగా కోర్టు ఈ నెల 12 వరకూ జ్యూడిషియల్ రిమాండ్ విధించింది. దీంతో ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. మరోవైపు గజల్ శ్రీనివాస్ దాఖలు పర్చిన బెయిల్ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. ఈ కేసులో కస్టడీ పిటిషన్ దాఖలు చేస్తామని ఏసీపీ విజయ్ కుమార్ తెలిపారు. ఆధ్యాత్మికత, దేశ భక్తి, మహిళల భద్రత తదితర అంశాలపై ఎన్నో కళారూపాలు చేసిన కేసిరాజు శ్రీనివాస్ అలియాస్ గజల్ శ్రీనివాస్ లైంగిక వేధింపుల కేసులో అరెస్ట్ కావడం తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. యువతిపై లైంగిక వేధింపుల కేసులో గజల్ శ్రీనివాస్‌ను హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. లైంగిక వేధింపుల కేసు నేప థ్యంలో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే, ఆలయవాణి అనే వెబ్ రేడియోలో ఓ యువతి రేడియో జాకీగా పనిచేస్తున్నారు. ఈ వెబ్ రేడియోకు గజల్ శ్రీనివాస్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారు. ఈ క్రమంలో తనపై గజల్ శ్రీనివాస్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, మానసికంగా వేదిస్తున్నాడని ఆరోపిస్తూ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా శ్రీనివాస్ లైంగికంగా, మానసికంగా వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. ఆధారాలతో సహా ఆమె డిసెంబర్ 29వ తేదీ సాయంత్రం కేసు పెట్టారు. తనను బెదిరిస్తూ పెట్టిన మేసేజ్‌లను పోలీసులకు ➪ 10వ పేజీలో...

జూన్ 2న ఏపీ హైకోర్టు ఏర్పాటు!

త్వరలో జడ్జిల కమిటీ

చంద్రబాబు లేఖతో

సన్నాహాలు వేగవంతం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉమ్మడి హైకోర్టును విభజించేందుకు, అమరావతిలో ఏపీ హైకోర్టును తాత్కాలిక భవనంలో ప్రారంభించేందుకు సన్నాహాలు వేగవంతమయ్యాయి. రెండు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు వేర్వేరుగా హైకోర్టులు వచ్చే జూన్ 2 వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. అమరావతిలో తాత్కాలిక హైకోర్టు ఏర్పాటుకోసం అవసరమైన భవనాలను పరిశీలించేందుకు ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ➪ 3వ పేజీలో...



భారీగా ఐఏఎస్‌ల బదలీలు

29 మందికి స్థానచలనం



- జనగామ, మహబూబాబాద్, మెదక్ కలెక్టర్ల బదలీ
- స్థానిక ఎమ్మెల్యేతో గొడవపడిన జనగామ కలెక్టర్ పెద్దపల్లికి బదలీ
- జీహెచ్ఎంసీకి ముగ్గురు అదనపు కమిషనర్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అధికార పార్టీ శాసనసభ్యులు, నేతలతో వివాదాలు కొనితెచ్చుకున్న జనగాం, మహబూబాబాద్ కలెక్టర్లతో పాటు రెవెన్యూ ఉద్యోగిపై చేయి చేసుకుని ఆరోపణలు ఎదుర్కొంటున్న మహబూబ్‌నగర్ జాయింట్ కలెక్టర్‌ను, సీనియర్ ఐఏఎస్ అధికారులను పెద్దఎత్తున బదిలీ చేస్తూ మంగళవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. బదిలీ అయిన వారిలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, కమీషనర్లు ఉన్నారు. ఖాళీగా ఉన్న పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌గా జనగామ కలెక్టర్ దేవసేనను నియమించగా, స్థానిక ఎమ్మెల్యేతో వివాదాలు పొడసూపిన మహబూబాబాద్ కలెక్టర్‌ను ఎయిడ్స్ కంట్రోల్ కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కళాశాల విద్యా కమీషనర్, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషనర్, కార్యదర్శిగా రెండు పదవులు నిర్వహిస్తున్న వాణిప్రసాద్‌కు కళాశాల విద్యా కమీషనర్ బాధ్యత నుంచి తప్పించి సర్వీస్ కమీషన్ కార్యదర్శికే ప్రభుత్వం పరిమితం చేసింది. మెదక్ కలెక్టర్‌గా ఉన్న భారతీ హోలికేరిని అక్కడి నుంచి తప్పించి గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ అనదపు కమీషనర్‌గా నియమించింది. 2015వ బ్యాంచ్‌కు చెందిన ఐఏఎస్‌లకు ఈ బదిలీలో భాగంగా సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

వికారాబాద్ కలెక్టర్‌ను ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేయడంతో ఆ స్థానంలో మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఉన్న సయ్యద్ ఉమల్ జలీల్‌ను నియమించింది.

అంతకు ముందే ప్రభుత్వం ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌లపై బదిలీ వేటువేసింది. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్న సురేష్ చందాను రాష్ట్ర ఆర్థిక సంఘం కమీషన్ సభ్య కార్యదర్శిగా నియమించింది. రెవెన్యూ శాఖలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న బీఆర్ మీనాను కొత్తగా ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ కమీషన్ కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది. సురేష్ చందా 1985 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వారు కాగా, మీనా 1986వ బ్యాచ్‌కు చెందినవారు.

మూడేళ్ళు పూర్తి చేసుకున్న సీనియర్ ఐఏఎస్ అధికారులతోపాటు ఆయా స్థానాల్లో పనిచేస్తున్న వారికి ప్రభుత్వం స్థానచలనం కల్పించింది. ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ, ముఖ్య కార్యదర్శి ఎస్పీ సింగ్, తన కార్యాలయంలోని ఉన్నతాధికారులతో బదిలీలపై పూర్తిస్థాయిలో కసరత్తు చేసిన ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు అధికారులను మార్చుతూ నిర్ణయం తీసుకున్నారు.

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి భూవివాదంలో తలదూర్చిన జిల్లా కలెక్టర్ దేవసేనతో పాటు మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్ నాయక్‌తో గొడవ పడిన ఆ జిల్లా కలెక్టర్ ప్రీతిమీనాపై ప్రభుత్వం బదిలీ వేటువేసింది. దేవసేనను ➪ 3వ పేజీలో...

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా

ఎర్రోళ్ల శ్రీనివాస్

సభ్యులుగా మరో ఐదుగురి నియామకం 2లో



సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు చెబుతున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

9లోపు విద్యార్థులకు

హెల్త్ కిట్లు

34 కొత్త కేజీబీవీ భవనాలకు శంకుస్థాపన

రూ.198 కోట్లతో నిర్మాణం: డిప్యూటీ సీఎం కడియం 2లో



గాంధీభవన్‌లో మంగళవారం టీపీసీసీ ముఖ్యనేతల సమావేశం

ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే

70కిపైగా సీట్లు మావే

సర్వేలన్నీ కాంగ్రెస్‌కే అనుకూలం: ఉత్తమ్ 10లో

9లోపు విద్యార్థులకు హెల్త్ కిట్లు

• రూ. 198 కోట్లతో భవనాల నిర్మాణం • 34 కొత్త కేజీబీవీ భవనాలకు శంకుస్థాపన: ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో 34 కొత్త కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల భవనాలకు శంఖుస్థాపన చేయనున్నట్టు ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. వీటితోపాటు 61 అకాడమిక్ బ్లాక్‌లను నిర్మించనున్నారు. వీటి కోసం రూ. 198 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. విద్యాశాఖ అధికారులతో కడియం శ్రీహరి మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్య ప్రత్యేకప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, పాఠశాల విద్య సంచాలకులు జి కిషన్, టిఎస్‌ఈడబ్ల్యూఐడీసీ ఎండీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని కెజిబివిలు దేశంలోనే అత్యుత్తమంగా ఉన్నాయని, వాటిని మరింత పటిష్టం చేయాలని కడియం అధికారులను ఆదేశించారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న 34 కెజిబివిల భవనాలకు 15లోపు శంఖుస్థాపన చేసి 2018 అక్టోబర్ నాటికి నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కెజిబివిలు, మోడల్ స్కూల్స్, విద్యాశాఖ నిర్వహిస్తున్న గురుకులాల్లో ప్రస్తుతం 1,03,000 విద్యార్థులు విద్యను కొనసాగిస్తున్నారని అన్నారు. విద్యార్థులందరికీ 9లోపు హెల్త్ కిట్లను పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. వీటిని నాలుగు దఫాలుగా 12 నెలలకు సరిపడేవిధంగా సరఫరా చేయాలన్నారు. బాలికలకు అవసరమయ్యే వస్తువులతో బాలికల హెల్త్ కిట్లు, బాలురకు అవసరమైన వస్తువులతో బాలుర హెల్త్ కిట్లు వేర్వేరుగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వీటి కోసం ఏటా రూ. 12 కోట్లను ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇటువంటి హెల్త్ కిట్లను పంపిణీ చేయడం లేదన్నారు. జనవరి 1 నుంచి రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో ఒకేరకమైన మెనునూ విద్యార్థులకు అందిస్తున్నట్టు స్పష్టం చేశారు. మెనులో ప్రతి రోజు ఉదయం పావు లీటర్ పాలు, తర్వాత అల్పాహారం , మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం అందిస్తున్నామన్నారు. మెనులూ నెలకు నాలుగు సార్లు చికెన్, రెండు సార్లు మటన్, ప్రతిరోజు గుడ్డు, నెయ్యి అందిస్తున్నట్టు చెప్పారు. ఎస్ఎస్‌సి పరీక్షల నేపథ్యంలో జిల్లాల వారీగా కలెక్టర్ల నేతృత్వంలో జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్లతో సమీక్షసమావేశాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కడియం అధికారులను ఆదేశించారు. సమీక్షల్లో పరీక్షల్లో విద్యార్దులు ఉత్తమ ఫలితాలు సాధించేలాగా దృష్టి పెట్టాలన్నారు.

ఇంటర్‌లో గ్రేడింగ్‌పై కమిటీ: కడియం శ్రీహరి

ఇంటర్మీడియట్‌లో గ్రేడింగ్ విధానం అమలుపై ప్రత్యేకంగా కమిటీని నియమిస్తున్నట్టు ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి మంగళవారం తనను కలిసిన విలేకర్లకు చెప్పారు. ఈ కమిటీ గ్రేడింగ్ విధానంపై అధ్యయనం చేసి 15 రోజుల్లో నివేదికను ఇవ్వనుందన్నారు. నివేదిక అనంతరం నిర్ణయం తీసుకుంటామన్నారు.

అయితే ఇంటర్‌లో గ్రేడింగ్ ఇవ్వడంతో విద్యార్థుల్లో ఒత్తిడితగ్గే అవకాశం ఉంటుందన్నారు. కానీ జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో కొన్నింటికి మార్కులు అర్హతగా ఉన్న నేపథ్యంలో అమలు ఎలా చేయాలి, తద్వారా వచ్చే కష్టనష్టాలను కమిటీ నివేదికను బట్టి ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుందని తెలిపారు.

విద్యా వ్యాపారానికి చెక్‌పెడదాం

విద్యా వ్యాపారాన్ని తగ్గించ డానికి మార్గాలను అన్వేషించాలని, ఇందుకు సంబంధించిన రోడ్‌మ్యాప్‌ను రూపొందించాలని ఇంటర్ బోర్డు అధికారు లను ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి ఆదేశించారు. మార్పులు విద్యార్థికి ఉపయోగకరంగా ఉండాలన్నారు. లెక్చరర్ సంఘాల సమస్యలను తానే ముందుగా పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. కాంట్రాక్ట్ లెక్చరర్లు, టైం స్కేల్ లెక్చరర్ల సమస్యలపై త్వరలోనే సంఘాల నాయకులు, కమిషనర్‌తో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో బోధించే లెక్చరర్లు వృత్తి బోధనతోపాటు, సామాజిక బాధ్యతతోనూ పనిచేయా లన్నారు. ఇంటర్ బోర్డును దేశంలోనే నంబర్-1 గా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. ప్రగతి పథంలో ఇంటర్ విద్య అనే అంశంపై ఇంటర్ విద్యా జేఏసీ మంగళవారం ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో సదస్సును నిర్వహించింది. ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన సదస్సు జరిగింది. సదస్సుకు ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి అతిథిగా హాజరయ్యారు.

శాసనమండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఇంటర్ విద్య కమిషనర్ డాక్టర్ ఏ అశోక్, కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘాల నాయకులు సురేష్, కనకచంద్రం తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 2.40 లక్షల మంది విద్యార్థులు చేరడానికి అవకాశం ఉందని, కానీ ప్రస్తుతం ఇంటర్ రెండు సంవత్సరాల విద్యార్థులు కలిపి కూడా 2 లక్షలకు చేరడం లేదన్నారు.



3,86,000 న్యూ ఇయర్ బేబీలు

న్యూయార్క్: కొత్త ఏడాదిలో ప్రారంభోత్సవ వేడుకల్లో పసిపిల్లలు సైతం శ్రుతి కలిపారు. ప్రపంచవ్యాప్తంగా 2018 జనవరి 1న మొత్తం 3లక్షల 86వేలమంది జన్మించినట్టు యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్స్ ఫండ్ (యునిసెఫ్) వెల్లడించింది. కొత్త ఏడాది మొదటిరోజున జన్మించిన పిల్లల సంఖ్యలో ఇండియాకే ప్రథమస్థానం లభించింది. మనదేశంలో జనవరి 1న మొత్తం 69,070మంది జన్మించారని యూనిసెఫ్ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా జరిగిన జననాల్లో సగం 9దేశాల్లోనే జరిగిందని నివేదికలో తెలిపింది. ఇండియా తరువాత స్థానంలో చైనా 44,670 జనాలతో ద్వితీయస్థానంలో నిలిచింది. అనంతరం నైజీరియా 20,210, పాకిస్థాన్ 14,910, ఇండోనేషియా 13,370, అమెరికా 11,280, కాంగో 9,400, బంగ్లాదేశ్ 8,370 ఉన్నాయి. అయితే వీరిలో కొంతమంది తొలిరోజే మృత్యువాత పడ్డారు. ఇండియాలో జననాల సంఖ్య ఇదేస్థాయిలో ఉంటే అతిత్వరలోనే చైనాను పక్కనపెట్టి జనాభాలో భారత్ తొలిస్థానంలో నిలవడం ఖాయమని యూనిసెఫ్ వెల్లడించిది.

ప్రయాణికులకు ఆటంకం

న్యూఢిల్లీ: పొగ మంచు ధాటికి ఢిల్లీలో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. రోడ్డు, రైల్వే, విమాన ప్రయాణికులు సైతం పొగమంచు కారణంగా ప్రయాణాలు ఆలస్యం కావడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 65రైళ్లు ఆలస్యంగా బయలుదేరాయి. సుమారు 15రైళ్లను రద్దు చేశారు. పొగమంచు ధాటికి రైళ్లతోపాటు పలువిమానాల సమయాల్లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ విమానాశ్రయంలో వందల సంఖ్యలో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించారు.

తెలంగాణను చూసి నేర్చుకోండి

• రాజస్థాన్ పత్రికలో 24గంటల కరెంట్‌పై ఎడిటోరియల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వ్యవసాయానికి 24గంటల ఉచిత కరెంట్ సరఫరా చేస్తున్న మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందంటూ రాజస్థాన్‌కు చెందిన ప్రముఖపత్రిక రాజస్థాన్ పత్రిక తన ఎడిటోరియల్ వ్యాసాన్ని ప్రచురించింది. తెలంగాణను చూసి నేర్చుకోండి శీర్షికన ఇది ప్రచురితం కాగా, ప్రతి రాజకీయ పార్టీ, ప్రభుత్వాలు రైతు సంక్షేమంపై మాటలు చెబుతున్నాయి తప్ప ఆచరణలో చూపడంలేదని.. తెలంగాణ మాత్రమే ఇందుకు మినహాయింపు అని పేర్కొంది. గత కొన్నేళ్ళుగా దేశవ్యాప్తంగా రైతులు కష్టకాలాన్ని ఎదుర్కొంటున్నారని, అయితే అతివృష్టి.. లేకుంటే అనావృష్టి కారణాలతో రైతులు గోసపడుతున్నారన్నారు. అప్పుల ఊబిలో కూరుకున్న అన్నదాత మరో దారిలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని.. రైతు సమస్యలపై ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో కూలంకష చర్చ జరగాల్సి ఉందని పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం రైతులకు చేసి చూపించిందని.. ఇపుడు మిగతా రాష్ట్రాల వంతు వచ్చిందని పత్రిక పేర్కొంది.

మరో 3 నెలలపాటు సీఎస్‌గా ఎస్పీ సింగ్

• ఈ నెలాఖరుతో ముగియనున్న ఆయన పదవీకాలం
• పొడిగింపు కోరుతూ కేంద్రానికి రాష్ట్రం ప్రతిపాదన



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఈ నెలాఖరుతో ముగియనున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ పదవీకాలాన్ని మూడు నెలలపాటు పొడిగించేందుకు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించింది. కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఈ అంశంపై ప్రత్యేకంగా మాట్లాడినట్టు తెలుస్తోంది. ఈ నెలలోనే జరగనున్న ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు, కొన్ని కీలకమైన బిల్లుల ఆమోదం తదితర కార్యక్రమాలు ఉన్నందున ఎస్పీ సింగ్ సేవలు మరో మూడు నెలలపాటు అవసరమన్న విషయాన్ని స్పష్టంచేశారు. పదవీకాలం ముగిసిన సీఎస్‌లకు మూడు నెలల చొప్పున కాలపరిమితిని పొడిగించే ఆనవాయితీ రాష్ట్రంలో ఇదివరకే ఉన్నందున ఎస్పీ సింగ్‌ను కొనసాగించేందుకు సానుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ప్రతిష్ట పెరిగింది

• విద్యుత్‌సౌధలో కోలాహలం • సీఎండీకి అభినందనల వెల్లువ
• సమన్వయంతో సాగుదాం • సమీక్షలో ప్రభాకర్ రావు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ద్వారా తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థల కీర్తి ప్రతిష్టలు మరింతగా పెరిగాయి . జాతీయ స్థాయిలో ఈ ఘన విజయం సాధించిన తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ రంగ సంస్కరణల్లో ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలిచింది. డిసెంబర్ 31అర్ధరాత్రి నుంచి రాష్ట్రంలో 23లక్షల వ్యవసాయ పంపుసెట్లకు 24గంటల విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి కేసీఆర్ స్వప్నాన్ని సాకారం చేసిన తెలంగాణ రాష్ట్ర జెన్కో , ట్రాన్స్‌కో సంస్థలతోపాటు ఉత్తర , దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల ఉద్యోగుల కృషిని ప్రభుత్వం గుర్తించింది. ఉద్యోగులందరికీ నజారానా ప్రకటించింది. ఇంక్రిమెంట్లతో ఉద్యోగుల కుటుంబాలు పండగ చేసుకున్నాయి. ప్రభుత్వం ఎంతో ఉదారంగా ఇచ్చిన ఈ ప్రోత్సాహకాలతో విద్యుత్ సౌధలోని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థల ప్రధాన కార్యాలయాల్లో మంగళవారం పండగ వాతావరణం నెలకుంది. ఉద్యోగులు పెద్ద సంఖ్యలో విద్యుత్‌సౌధకు చేరుకుని పరస్పరం అభినందించు కుంటూ స్వీట్లు పంచుకున్నారు. ట్రాన్స్‌కో , జెన్కో సంస్థల సీఎండీ డి.ప్రభాకర్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలలతో ఘనం గా సత్కరించారు. ఇంతటి ఘనవిజయానికి మూలకారకులైన సీఎండీ ప్రభాకర్ రావును ఉద్యోగులు అభినందనలతో ముంచెత్తారు.

నూతన సంవత్సరంలో తొలి పనిదినం కావటం , వ్యవసాయ రంగానికి 24గంటల విద్యుత్ సరఫరా , తెలం గాణ ఉద్యోగులందరికీ ప్రభుత్వం ప్రత్యేక ఇంక్రిమెట్లు ప్రకటించిన నేపద్యంలో ఉద్యోగులందరూ సీఎండీ ప్రభాకర్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు. ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, డైరెక్టర్లు జగత్ రెడ్డి , నర్సింగరావు, లలిత్ కుమార్ , వెంకటరాజం, సూర్యప్రకాశ్ , ట్రాన్స్‌కో జీఎం జి.విజయకుమార్ ,వివిధ రంగాల అధిపతులు , వివిధ యూనియన్ల నాయకులు ప్రభాకర్ రావును కలిసిన అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సీఎండీ ప్రభాకర్ రావు మాట్లాడుతూ 24గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయటంవల్ల తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థల కీర్తి ప్రతిష్టలు ఎంతగానో పెరిగాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా విద్యుత్ సంస్థల ఉద్యోగుల శ్రమను గుర్తించి ప్రత్యేక ఇంక్రిమెంట్లు ప్రకటించారన్నారు. 24గంటల విద్యుత్ సరఫరా ప్రారంభించటంతోనే విజయం సాధించినట్టు కాదన్నారు. దానిని విజయవంతంగా కొనసాగించటం పెద్ద సవాల్ అని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో మరింత ఉత్సాహంగా పనిచేయాలని పిలునిచ్చారు.

సమన్వయంతో పనిచేద్దాం

అనంతరం జెన్‌కో , ట్రాన్స్‌కో డైరెక్టర్లు , సీనియర్ ఉద్యోగులతో సీఎండీ ప్రభాకర్ రావు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలోని రెండు విద్యుత్ సంస్థలైన ఎస్‌పీడీసీఎల్ , ఎన్‌పీడీసీఎల్ సీఎండీలు జి.రఘుమారెడ్డి, గోపాల్‌రావుతోపాటు ఇతర డైరెక్టర్లతో మాట్లాడారు. వ్యవసాయ రంగానికి 24గంటల విద్యుత్ సరఫరా ప్రారంబించిన తరువాత ఏర్పడిన పరిస్థితిని జిల్లాల వారీగా సమీక్షించారు. ఏరోజుకారోజు విద్యుత్ వినియోగపు డిమాండ్‌ను అంచనా వేసుకుంటూ , డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్‌ను సమకూర్చుకోవాలని సూచించారు. ఎక్కడ ఏ చిన్న అంతరాయం వచ్చినా అంతా సమన్వయంతో వ్యవహరించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. వివిధ స్ధాయిలో ఉన్న అధికారులనుంచి క్షేత్రస్ధాయి సిబ్బంది వరకూ 24గంటలూ అప్రమత్తంగా ఉండాలని సీఎండీ ప్రభాకర్ రావు హెచ్చరించారు.

ఫిబ్రవరిలో పంచాయతీ పోరు..?

• కొత్తచట్టంతో గ్రామాలకు మహర్దశే
• ఈ నెలలోనే చట్టానికి సభ ఆమోదం
• గ్రేటర్ తరహాలో వారంలోనే ఎన్నికల ప్రక్రియ?

(మొదటి పేజీ తరువాయి)

పదేవరకు ఎన్నికలకు వెళ్ళకుండా ఆగాల్సిన అవసరంలేదని ప్రభుత్వవర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో ఫిబ్రవరిలోనే ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయని టిఆర్ఎస్ ముఖ్యనేతల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో టిఆర్ఎస్‌కు అత్యంత అనుకూలమైన వాతావరణం ఉండగా, 24గంటల ఉచిత విద్యుత్ గ్రామాల్లో గ్రాఫ్ అనూహ్యంగా పెరిగిందన్న నివేదికలు అందుతున్నాయి. గొర్రెల పంపిణీ ద్వారా సంపద మరింతగా వృద్ధి చెందుతుండడం, చెరువుల్లో వేసిన చేపల సంపద కూడా అందుబాటులోకి వస్తుండడం గ్రామాల్లో పలువర్గాలు ఆర్థికంగా మెరుగుపడుతున్నాయి. ఈ క్రమంలో గ్రామాల్లో పార్టీకి అనుకూలమైన పరిస్థితి ఉన్న నేపథ్యంలో గడువుప్రకారమే ఎన్నికలకు వెళ్ళాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 8వేలకు పైగా పంచాయతీలుండగా, కొత్తగా ఏర్పడనున్న పంచాయతీలతో ఈ సంఖ్య 11వేలు దాటనుంది. గ్రామీణ వ్యవస్థ బలోపేతానికి ముఖ్యమంత్రి కెసిఆర్ పంచాయతీరాజ్ చట్టాన్ని నిపుణులతో చర్చించి రూపొందిస్తుండగా.. ఈ చట్టం గ్రామాల అభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. కొత్తచట్టం ద్వారా నేరుగా గ్రామపంచాయతీలకు నిధులు రావడంతో పాటు అనేక బాధ్యతలు, అధికారాలు అప్పగించనున్నట్లు సమాచారం. గ్రామాల ముఖచిత్రాన్ని మార్చాలని, ప్రగతికి పట్టుగొమ్మలుగా పంచాయతీలను తీర్చిదిద్దాలని భావిస్తున్న సిఎం కెసిఆర్ అనేక వినూత్న ఆలోచనలను ఈ చట్టంలో చేరుస్తున్నట్లు తెలిసింది. నిపుణులతో పలుమార్లు చర్చించిన సిఎం.. అందుకు అనుగుణంగా బిల్లు రూపొందించమని సూచించినట్లు తెలుస్తోంది.

గ్రేటర్ తరహాలోనే..

గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియ నెలల తరబడి సాగకుండా.. ఎన్నికలు, ప్రచారమంతా వారం, పదిరోజుల్లో ముగించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇదే వ్యూహాన్ని అవలంభించగా, విపక్షాలు తేరుకునేలోపే నామినేషన్లు, ఎన్నికల ప్రక్రియ పూర్తిచేసి పెద్ద షాక్‌నిచ్చింది. ఇక కొత్తపంచాయతీలకు సంబంధించిన ప్రతిపాదనలన్నీ ఇప్పటికే ప్రభుత్వం వద్దకు చేరగా.. ఈనెలలోనే ఉత్తర్వులన్నీ విడుదలకానున్నాయి. ముఖ్యమంత్రి అవలంభించేవ్యూహాలతో పంచాయతీలన్నీ గంపగుత్తగా టిఆర్ఎస్ ఖాతాలోనే పడతాయని పార్టీవర్గాలు ధీమాగా ఉన్నాయి. గ్రామపంచాయతీ ఎన్నికల విషయంలో సిఎం పట్టుదలగా ఉండడం, మంత్రులకు.. ఎమ్మెల్యేలకు ఇప్పటికే దీనికి సంబంధించిన సంకేతాలుండడంతో ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరిగేందుకే ప్రాధాన్యతినిస్తున్నారు. ఇక పంచాయతీలలో సర్పంచ్ పదవికి ప్రత్యక్షంగా ఎన్నికలు నిర్వహించాలా.. పరోక్షంగా నిర్వహించాలా అన్నదానిపై సిఎం పలుకోణాల్లో నివేదికలు కోరినట్లు తెలిసింది. పనిచేయని సర్పంచ్‌లను రీకాల్ చేసే నిబంధనపై కూడా చర్చిస్తున్నట్లు సమాచారం. హరితహారం కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్న సిఎం.. నూతన పంచాయతీరాజ్ చట్టంలో దీనిని చేర్చి మొక్కల పెంపకం బాధ్యతను సర్పంచ్‌లపైనే పెట్టనున్నట్లు సమాచారం. ప్రతిగ్రామంలో 80శాతం మొక్కల పెంపకం బాధ్యత వంటి లక్ష్యాలు విధించనున్నట్లు సమాచారం. దేశంలోనే వినూత్నంగా.. ఆదర్శనీయంగా పంచాయతీరాజ్ చట్ట రూపకల్పన జరుగుతుండగా, బిల్లు ఈనెలలోనే సభ ముందు పెట్టి, ఫిబ్రవరిలో ఎన్నికలకు వెళ్ళే అవకాశం ఉందని టిఆర్ఎస్ ముఖ్యవర్గాలు తెలిపాయి.



రెండోరోజూ కిక్కిరిసిన ప్రగతి భవన్

• సీఎంకు శుభాకాంక్షల వెల్లువ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : నూతన సంవత్సరం రెండోరోజు కూడా సీఎం అధికార నివాసం ప్రగతి భవన్ సందర్శకులతో క్రిక్కిరిసింది. మొదటిరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు రాని వారందరూ పెద్దఎత్తున తరలివచ్చారు. పోటీపడి ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందించారు. సీఎంను కలిసిన వారిలో మంత్రులు జగదీష్‌రెడ్డి, హరీష్‌రావు, చందూలాల్, ఈటల రాజేందర్, ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, శాసనమండలి ఉపాధ్యక్షుడు నేతి విద్యాసాగర్, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు రవీంద్ర నాయక్, వేముల వీరేశం, గ్యాదరి కిషోర్, భాస్కరరావు, పూల రవీందర్, కంచర్ల భూపాల్‌రెడ్డి, బండా నరేందర్‌రెడ్డి, ఉమా మాధవరెడ్డి, పైళ్ళ శేఖర్‌రెడ్డి, ఎలిమినేటి కృష్ణారెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, గంగుల కమలాకర్, పువ్వాడ అజయ్, రామలింగారెడ్డి, రెడ్యానాయక్, ఏనుగు రవీందర్‌రెడ్డి, సచివాలయ అధికారుల సంఘం అధ్యక్షుడు నరేందర్‌రావు తదితరులు ఉన్నారు.

సీఎంతో ఎర్రోళ్ళ శ్రీనివాస్ భేటీ

తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్‌గా నియమితులైన ఎర్రోళ్ళ శ్రీనివాస్ ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. తన సేవలను గుర్తించి కీలక బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లకు సీఎం అభినందనలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)లో అత్యుత్తమ అవార్డులను అందుకున్న తెలంగాణ వాలెంటీర్లను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు మంగళవారం అభినందించారు. 2016-17 సంవత్సరానికి కేంద్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ఎన్ఎస్ఎస్ అవార్డులను ప్రకటించింది. ఇందులో తెలంగాణ వాలెంటీర్లకు నాలుగు అవార్డు దక్కాయి. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌కు చెందిన అనురాగ్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్‌కు ఉత్తమ యూనిట్ అవార్డు లభించింది. అలాగే అనురాగ్ గ్రూప్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సి.మల్లేశ్‌కు ఉత్తమ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డు, ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలకు చెందిన నవీన్, జేఎన్‌టీయూకు చెందిన పి.లలిత్ ఆదిత్యకు ఉత్తమ వాలెంటీర్ అవార్డులు అందుకున్నారు. గత నెలలో ఈ అవార్డులు అందుకున్న వారు మంగళవారం ప్రగతి భవన్‌లో సీఎంను కలిశారు. ఈ సందర్భంగా వారిని కేసీఆర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ లైజనింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎంఎస్ఎస్ రెడ్డి, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డిలు కూడా ఉన్నారు.

పీఆర్‌టీయు డైరీ ఆవిష్కరణ



• ఏకీకృత సర్వీస్ రూల్స్ ఏర్పాటు, సీపీఎస్‌ను రద్దు చేయాలని సీఎంను కోరిన సంఘం నేతలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: పిఆర్‌టియు తెలంగాణ రాష్ట్రశాఖ రూపొందించిన 2018 డైరీని ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు మంగళవారం ప్రగతి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు టి హరీష్ రావు, ఈటల రాజేందర్, జి జగదీశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి, పూల రవీందర్, పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు పి సరోత్తం రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు. డైరీ ఆవిష్కరణ సందర్భంగా పిఆర్‌టియు నేతలు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వారు సీఎంని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించడం కోసం కోర్టులో ఉన్న స్టేటస్ కోను ఎత్తేసేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పండిట్, పిఈటీలకు పదోన్నతులు కల్పించాలన్నారు. డిప్యూటీడీఈవో, డైట్ లెక్చరర్స్, ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు, జెఎల్ పదోన్నతులు ఇవ్వాలన్నారు. పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాలకు పెంచాలని కోరారు. అన్ని సమస్యల పరిష్కారానికి సీఎం కేసీఆర్ సుముఖంగా ఉన్నారని పిఆర్‌టియు నేతలు తెలిపారు.

తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఎర్రోళ్ల శ్రీనివాస్ నియామకం



సిద్దిపేట, ప్రభన్యూస్ : తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థి నేత ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా నియమిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సిద్దిపేట జిల్లా, చిన్న కోడూర్ మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పట్టా పొంది, తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి సంఘాలను ఏకం చేసి చురుగ్గా పాల్గొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల అడుగు జాడల్లో నడుస్తూ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్ సముచిత స్థానం కల్పించి ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమించారు. కమిషన్ సభ్యులుగా సూర్యాపేట జిల్లా, నూతనకల్ మండలం ఎడవల్లికి చెందిన బోయిండ్ల విద్యాసాగర్, రంగారెడ్డి జిల్లా, కేశంపేట కొండగుట్ట తండాకు చెందిన బాల్‌రాజునాయక్, ఆదిలాబాద్ జిల్లా, సిరికొండ మండలం రాయగూడ గ్రామానికి చెందిన పురుసం నీలాదేవి, హైదరాబాద్‌కు చెందిన సుంకపాక దేవయ్య, రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండలం ముచ్చింతల గ్రామానికి చెందిన చిలకమర్రి నర్సింహులు నియమితులయ్యారు.

సిద్దిపేటలో పలువురి హర్షం...

సిద్దిజేట జిల్లా, చిన్నకోడూర్ మండలం గంగాపూర్‌కు చెందిన ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమించినందుకు సిద్దిపేటకు చెందిన పలువురు నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న వారికి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులు గుర్తించి రాష్ట్ర స్థాయి పదవిని ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

అనగనగా రెండున్నర రూపాయల నోటు!

(మొదటిపేజీ తరువాయి)

సామాన్య జనం కాగితం నోట్ల కంటే వెండి కాయిన్ల నాణేలను తమదగ్గర ఉంచుకునేందుకు ఇష్టపడ్డారు. బ్రిటిష్ ప్రభుత్వం ప్రజల నుంచి వెండి నాణేలకోసం పెరిగిన డిమాండ్‌ను నిలువరించకపోయింది. చిన్న డినామినేషన్ కలిగిన 1/2 వెండి కాయిన్, 1/4,రూపాయి నాణెం, 2 అణాల నాణేలను ఉపసంహరించి కాపర్-నికెల్ నాణేలను అమల్లోకి తెచ్చింది. 1917 నవంబర్‌లో రూపాయి నోటును, అనంతరం 1918లో 2 1/2 రూపాయి నోటును చలామణిలోకి తెచ్చింది. అప్పటి చరిత్రకు సాక్షిగా నిలిచిన ఈ నోటు ఒక్కటే అందుబాటులో ఉండగా... 2015, డిసెంబర్ 2న ముంబైలో జరిగిన తోడీవాల వేలంపాటలో ఈ 2 1/2 రూపాయి నోటును ఓ ఔత్సాహికుడు రూ.6,40,000కు దక్కించుకున్నాడు. అయితే చలామణిలో రూపాయి, రెండున్నర రూపాయల నోటు నాణేలతో పోటీపడటంలో విఫలమైనాయి. 1926, జనవరి 1 ఈ నోట్లు చలామణి నుంచి తప్పించారు. 1940లో మళ్లీ రూపాయి నోటును తిరిగి చలామణిలోకి తెచ్చారు.

రైతు చేతికే రొక్కం!



(మొదటిపేజీ తరువాయి)

కార్యరూపంలోకి రాబోతోంది. ఇప్పటి వరకున్న వ్యవసాయ పరపతి విధానం పూర్తిగా గ్రామ రైతు సమన్వయ సమితిల ఆధీనంలోకి వచ్చేస్తోంది. వచ్చే ఏడాది నుంచి ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, పంట రుణాలు, దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలు, వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు, బిందు, తుంపర సేద్యం పరికరాలు, పాలిహౌస్‌ల నిర్మాణం, సబ్సిడీ ట్రాక్టర్లు తదితర సహకార కార్యక్రమాలన్నీ ఈ ఏకీకృత విధానం ద్వారానే అమలు చేయబోతున్నారు.

వ్యవసాయం, ఉద్యానవనం, అనుబంధ శాఖలైన పట్టు పరిశ్రమ, పాడి పరిశ్రమ, పశు గణాభివృద్ధి కార్యక్రమాలు, మత్స్య పరిశ్రమ, కోళ్ళ పరిశ్రమ రంగాల అభివృద్ధి పూర్తిగా రాష్ట్ర రైతు సమాఖ్య పర్యవేక్షణలోనే జరుగుతుంది. దేశ చరిత్రలో ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా సరికొత్త పథకాలను ప్రవేశపెట్టాలన్న దిశగా సీఎం కేసీఆర్ దృష్టి కేంద్రీకరించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు చిన్న, సన్నకారు రైతు కుటుంబాలకు మరింత ప్రయోజనం చేకూర్చే విధంగా ఉండాలన్న సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

పూర్తిస్థాయి అధ్యయనం తర్వాతే కార్యాచరణ ప్రణాళిక

ఇప్పటి వరకు అమల్లో ఉన్న విధానంలో ప్రతియేటా పంట రుణాలివ్వడం, కట్టలేని పరిస్థితుల్లో రద్దు చేయడం, నిబంధనల పరిధిలోకి రాని రైతులకు లబ్ధి చేకూరక నానా హైరానా కావడం, ప్రభుత్వాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా నిందించడం లాంటి వాటికి స్వస్తి చెప్పి, సహకార రుణ పరపతి వ్యవస్థలోనే సరికొత్త అధ్యాయాన్ని ఆవిష్కరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యమంత్రి మదిలో ఉన్న సరికొత్త ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు పలు శాఖల ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆయన మార్గదర్శకాల ప్రకారం రూపొందించిన కొన్ని పథకాల అమలు సాధ్యాసాధ్యాలపై ఆర్థిక నిపుణులతో సమాలోచనలు జరుపుతున్నారు.

వాతావరణం హెచ్చుతగ్గులతో ప్రతియేటా ఏదో ఒక రకమైన విపత్తు సంభవించడం, తద్వారా వ్యవసాయ రంగం అస్తవ్యస్తం కావడం, ఈ రంగాన్నే నమ్ముకున్న అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ప్రభుత్వ సహకారం కోసం ఎదురుచూడడం, సందర్భాలను అదునుగా చేసుకుని ఆయా పార్టీలు ఓట్ల రాజకీయాలకు పాల్పడడం లాంటి సంఘటనలు పునరావృతమవుతున్న నేపథ్యంలో కొత్త పథకాల ఆవశ్యకతపై సీఎం దృష్టిసారించారు. ఇప్పుడున్న సహకార పరపతి విధానాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయడంతో పాటు వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి, పంట రుణాల వితరణకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఆవిష్కరించాలని నిర్ణయించారు.

యేటా రూ.10వేల కోట్ల రాయితీతో చేయూత

ఈ అంశంపై ఇప్పటివరకు ప్రభుత్వంలో జరిగిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల తరహాలో మరో పరపతి వ్యవస్థను నెలకొల్పబోతున్నారు. ప్రతి సీజన్‌లో ఎంచుకున్న లక్ష్యాలు సాధ్యపడక పోవడంతో పంట రుణాలను బ్యాంకుల ద్వారా కాకుండా నేరుగా రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ద్వారానే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతియేటా బడ్జెట్‌లో సహకార పరపతి వ్యవస్థకు రూ.10వేల కోట్లకు తగ్గకుండా నిధులు కేటాయించి కేవలం బడుగు రైతుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలన్న లక్ష్యంతో నిబంధనలు రూపొందిస్తున్నారు. అంతేకాకుండా ప్రత్యేక రాయితీలతో కూడిన మరిన్ని పథకాలను వచ్చే ఏడాది నుంచి ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

ఇప్పటికే పూర్తయిన రుణామాఫీ ప్రక్రియ, తాజాగా ప్రకటించిన పెట్టుబడి రాయితీ పథకాలపై గ్రామస్థాయిలో వివిధ వర్గాల ప్రజలు, ముఖ్యంగా రైతుల్లో ఉన్న అభిప్రాయాలను తెలుసుకునేందుకు సూక్ష్మసర్వే నిర్వహిస్తున్నారు. మెజారిటీ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కొత్త పథకాల నియమ నిబంధనలను ఖరారు చేయబోతున్నారు. రాష్ట్ర అభివృద్ధికి, ఆర్థిక వృద్ధిరేటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడుతున్న వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా ఆదుకునేందుకు గల అవకాశాలపై ప్రభుత్వం దృష్టిసారించింది.



తప్పు చేసింది మా వాళ్లే అయినా.. శిక్ష మాకెందుకు...!

• డ్రంక్ అండ్ డ్రైవ్ కౌన్సెలింగ్‌లో కుటుంబసభ్యుల ఆవేదన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కొత్త ఏడాది మందు కొట్టి డ్రైవింగ్ చేస్తూ దొరికిన వారికి కౌన్సిలింగ్ స్టార్ట్ అయింది. బేగంపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ దగ్గర డ్రంక్ అండ్ డ్రైవర్స్‌కు కౌన్సిలింగ్ నిర్వహించారు. దీనికి భార్యా, పిల్లలు, తల్లితో సహా అందరూ హాజరు కావాలని నిబంధన ఉంది. దీంతో బాధితులు వారి కుటుంబసభ్యులందర్నీ తీసుకొచ్చారు. వారి సమక్షంలోనే క్లాసులు ఇస్తున్నారు. ఇంట్లోని వారు ఎవరో ఒకరు వస్తే సరిపోదని.. అందరూ రావాలని పోలీసులు గట్టిగా చెప్పడంతో ఇంటిల్లిపాది అందరూ కౌన్సిలింగ్ సెంటర్‌కు తరలివచ్చారు. ఈ సెంటర్ దగ్గర కొన్ని విషాదకర దృశ్యాలు కనిపించాయి. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన తన కొడుకు కోసం 80 ఏళ్ల వృద్ధురాలు వచ్చారు. నడవలేని ఆమె కర్ర సాయంతో కౌన్సిలింగ్ సెంటర్‌లోనికి వెల్లడం అక్కడి వారి గుండెలను బరువెక్కించింది. కొడుకు చేసిన తప్పుకు ఈ వయస్సులో ఆ తల్లికి ఇదేం శిక్ష అనుకోవటం కనిపించింది. మరో కేసులో భార్య, ఇద్దరు పిల్లలతో కౌన్సిలింగ్ సెంటర్‌కు వచ్చాడు బాధితుడు. ఓ వైపు భార్య చీదరింపులు.. మరోవైపు పిల్లల ఆలనాపాలనతో ఆ దంపతుల వేదన అంతా ఇంతా కాదు.. ఇద్దరు చంటి పిల్లలతో వచ్చి.. సెంటర్‌లో ఇబ్బందులు పడ్డారు. ఆ చిన్నారులు చేసిన నేరం ఏమంటో.. మరో కేసులో సెంటర్‌కు వచ్చిన మహిళ భర్త పక్కనే కూర్చుని కన్నీళ్ల పర్యంతం అయిన దృశ్యాలు కనిపించాయి. ఇలా ఒక్కొక్కరిది ఒక్కో బాధ అక్కడ. కొదరు అయితే ఇంకెప్పుడు మందు కొట్టను అని కుటుంబసభ్యులకు ప్రామీస్ చేయడం కనిపించింది. మత్తులో వెహికల్ డ్రైవింగ్ చేస్తే వారికే కాకుండా మిగతావారి ప్రాణాలు ప్రమాదంలో పడతాయి. ఇలా చాలా ఘటనలు జరిగాయి. ఈ క్రమంలోనే డ్రంక్ అండ్ డ్రైవ్ తీసుకొచ్చింది ప్రభుత్వం. పట్టుబడిన వారికి కుటుంబసభ్యుల సమక్షంలోనే కౌన్సిలింగ్ ఇస్తున్నారు. అత్యధికంగా మందు కొట్టి పట్టుబడిన వారికి జైలు శిక్ష కూడా విధిస్తున్నారు. ఇలా డిసెంబర్ 31 రాత్రి 19 గంటల నుంచి జనవరి 1 ఉదయం 5 గంటల వరకు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 2,500 మందికి వచ్చే శుక్రవారం వరకు ఆయా పోలీస్‌స్టేషన్ల దగ్గర కౌన్సిలింగ్ జరుగుతుంది. ఫస్ట్ డే కొంతమంది కుటుంబసభ్యులతో తరలివచ్చారు. తప్పు చేసింది మా వాళ్లే అయినా.. శిక్షమాకు ఎందుకు అంటూ కొందరు మహిళలు ఆవేదన వ్యక్తం చేయటం కనిపించింది.

కౌన్సెలింగ్‌కు యాంకర్ ప్రదీప్ డుమ్మా

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ పరిదిలో 2499 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైన సంగతి విదితమే. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారందరికీ వారి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చినట్లు ట్రాఫిక్ అదనపు డీసీపీ అమర్‌కాంత్‌రెడ్డి తెలిపారు. యాంకర్ ప్రదీప్ కౌన్సిలింగ్‌కు హాజరు కాలేదని ఆయన స్పష్టం చేశారు. ప్రదీప్ హాజరు కావడానికి శుక్రవారం వరకు సమయం ఉందన్న డీసీపీ ఆయన కౌన్సిలింగ్‌కు ఎప్పుడు హాజరవుతారనేది సమాచారం లేదని చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 345 కార్లను పోలీసులు ఆయా స్టేషన్లకు తరలించారు,.



ప్రధాని మోడీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న పీఎంవో సిబ్బంది

భారీగా ఐఏఎస్‌ల బదలీలు



(మొదటిపేజీ తరువాయి)

ఖాళీగా ఉన్న పెద్దపల్లి కలెక్టర్‌గా నియమించి, మహబూబాబాద్ కలెక్టర్ డాక్టర్ ప్రీతీమీనాను ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డైరెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. రెవెన్యూ ఉద్యోగిపై చేయి చేసుకుని వివాదాస్పదంగా మారిన మహబూబ్‌నగర్ జిల్లా జాయింట్ కలెక్టర్ శివకుమార్ నాయుడును ప్రణాళిక బోర్డు కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది. మహబూబ్‌నగర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఎవరిని ఎంపిక చేసుకోవాలన్న అధికారాన్ని కలెక్టర్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరో ఏడాదిన్నరలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతుండడంతో ఆయా శాఖల్లో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులను మార్చి ఆ స్థానాల్లో కొత్త వారిని ఎంపిక చేయాలని సీఎం కేసీఆర్ ఇదివరకే నిర్ణయించారు. కొత్త జిల్లాలు ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆయా జిల్లాల్లో పనిచేస్తున్న కలెక్టర్ల పనితీరును సమీక్షించిన సీఎం కేసీఆర్ వివాదాస్పదమైన వారిని తప్పించాలని నిర్ణయించారు. అందులో భాగంగానే మూడు జిల్లాల కలెక్టర్లపై వేటువేశారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో ముఖ్య కార్యదర్శి హోదాలో ఉన్న 1989 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శాంతికుమారికి అదనంగా వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి పదవిలో నియమించారు.

ఐఏఎస్ అధికారుల జాబితా ఇదే

పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం	బదిలీ అయిన స్థానం
రాజేశ్వర్ తివారీ (1986)	వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి	రెవెన్యూ శాఖ
ఎ.శాంతికుమారి (1989)	ముఖ్యమంత్రి కార్యాలయం	వైద్య ఆరోగ్యశాఖ
అరవింద్ కుమార్ (1991)	రెసిడెంట్ కమీషనర్ (ఢిల్లీ)	పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ
జి.అశోక్ కుమార్ (1992)	బీసీ సంక్షేమ శాఖ	రెసిడెంట్ కమీషనర్ (ఢిల్లీ)
బుర్రా వెంకటేశం (1995)	-----	బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి
నవీన్ మిట్టల్ (1996)	పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ	కళాశాల విద్యా కమీషనర్
ఆర్‌వి చంద్రవన్ (1993)	ప్రొహిబిషన్, ఎక్సైజ్	రెవెన్యూ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్)
సోమేష్ కుమార్ (1989)	----------	ప్రొహిబిషన్, ఎక్సైజ్ కమీషన్
సందీప్ కుమార్ సుల్తానియా (1998)	ఆర్థిక శాఖ కార్యదర్శి	పశు సంవర్ధకశాఖ
అనితా రాజేంద్ర (1998)	హోంశాఖ	బీసీ సంక్షేమశాఖ కమీషనర్
సయ్యద్ జలీల్ (1998)	మైనారిటీ సంక్షేమ శాఖ	కలెక్టర్ (వికారాబాద్)
డాక్టర్ క్రిస్టినా (2001)	పర్యాటక శాఖ	కమీషనర్ గిరిజన సంక్షేమం
డాక్టర్ జ్యోతి బుద్ధప్రకాశ్ (2002)	వేయిటింగ్	ఎస్సీ అభివృద్ధి సంస్థ
వాకాటి కరుణ (2004)	ప్రజారోగ్యం	సీసీఎల్ఎ డైరెక్టర్
డాక్టర్ కె.ఇలంబర్తి (2005)	వేయిటింగ్	కార్యదర్శి సమాచార కమీషన్
ఎం.చంపాలాల్ (2006)	వేయిటింగ్	హోం (సైనిక్ వెల్ఫేర్)
ఎంఆర్ఎం రావు (2007)	పంచాయితీరాజ్	కలెక్టర్ (నిజామాబాద్)
దేవసేన (2008)	కలెక్టర్ జనగామ	కలెక్టర్ పెద్దపల్లి
అనితా రామచంద్రన్	కలెక్టర్ యాదాద్రి	కలెక్టర్ జనగామ అదనపు బాధ్యతలు
కె.మురళీ (2006)	కలెక్టర్ భూపాలపల్లి	డైరెక్టర్ స్టేట్ ఆర్చీవ్స్
భారతి హోలికేరి (2010)	కలెక్టర్ మెదక్	అదనపు కమీషనర్ జిహెచ్ఎంసి
డాక్టర్ ప్రీతీమీనా (2010)	కలెక్టర్ మహబూబాబాద్	డైరెక్టర్ ఎయిడ్స్ కంట్రోల్
కె.శివకుమార్ నాయుడు (2011)	జేసీ మహబూబ్‌నగర్	కార్యదర్శి ప్లానింగ్ బోర్డు
కేకే సుదామ్‌రావు (2012)	సీసీఎల్ఎ కార్యదర్శి	ఓఎస్‌డి తెలంగాణ భవన్ (ఢిల్లీ)
ఎస్.పట్నాయక్ (2014)	సబ్‌కలెక్టర్ బోదన్	అదనపు కమీషనర్ జిహెచ్ఎంసి
ముస్రఫ్ అలీ ఫారూఖీ (2014)	సబ్ కలెక్టర్ మెట్‌పల్లి	అదనపు కమీషనర్ జిహెచ్ఎంసి
అనురాగ్ జయంతి (2015)	------	సబ్ కలెక్టర్ బోదన్
గౌతం (2015)	-------	సబ్ కలెక్టర్ మెట్‌పల్లి
పమేలా సత్పతి (2015)	-------	సబ్ కలెక్టర్ భద్రాద్రి
రాహుల్ రాజ్ (2015)	------	సబ్ కలెక్టర్ బెల్లంపల్లి

'సైనికుల మరణాల్లో కొత్తేముంది'

బీజేపీ ఎంపీ నేపాల్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: సైనికులు మరణించడం సాధారణమే ఇందులో కొత్తేముంది అంటూ బీజేపీ ఎంపీ నేపాల్ సింగ్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. పుల్వామా ఎన్‌కౌంటర్‌పై స్పందిస్తూ జవాన్లపై రాంపూర్ (యూపీ) ఎంపీ చేసిన కామెంట్లు పెద్ద దుమారాన్ని రేపాయి. యుద్ధంలో శత్రువులతో పోరాడేటపుడు సైనికులు చనిపోతుంటారు అందులో కొత్తేముంది, సైన్యం అంటేనే ఏదో ఒకరోజు యుద్ధంలో ప్రాణాలు వదలాలిసిందే అంటూ పేర్కొన్నారు. ఇటీవల పాకిస్థాన్ తరచూ కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘించడంతో సైనికుల ప్రాణాలు కోల్పోయారు. అదేవిధంగా సిఆర్పీఎఫ్ క్యాంపుపై ఉగ్రదాడి కారణంగా పలువురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయంపై రాంపూర్ బీజేపీ ఎంపీ నేపాల్‌సింగ్ మాట్లాడుతూ సైన్యంలో ప్రతిరోజూ సైనికులు చనిపోతూనే ఉంటారని, యుద్ధంలో సైనికులు చనిపోని దేశం ఉండదన్నారు. మనుషులు చనిపోకుండా ఆపగలిగింది ఏదైనా ఉంటే చెప్పండన్నారు. బుల్లెట్ల నుంచి మరణాన్ని ఆపగలింగిదేమైనా ఉంటే చెప్పండని పేర్కొన్నారు. కాగా సైనికుల ప్రాణ త్యాగాలను చులకన చేస్తూ ఎంపీ ఇలా మాట్లాడటంపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. దీంతో ఎంపీ నేపాల్ సింగ్ వెనక్కు తగ్గారు. తనకు ఆర్మీని తక్కువ చేయాలన్న ఉద్దేశం లేదని క్షమాపణ చెప్పారు. తాను సైనికులను కించపరచాలని అలా మాట్లాడలేదని, తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారంటూ విచారం వ్యక్తం చేశారు. వాస్తవానికి బుల్లెట్ల కారణంగా సైనికులు ప్రాణాలు కోల్పోకుండా శాస్త్రవేత్తలు చేస్తున్న ప్రయత్నాలు గురించి మాత్రమే తాను అలా వ్యాఖ్యానించానన్నారు.

నూరేళ్ల బంధం... కొన్ని క్షణాలే

• ప్రియుడితో వివాహం..అంతలోనే మరణం




అమెరికా: ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకుని నిండు నూరేళ్లు కలిసుండాలని ప్రతి ఆడపిల్ల కోరుకుంటుంది. కానీ కోరుకున్న వ్యక్తిని పెళ్లి చేసుకున్న క్షణాల్లోనే ఓ యువతి కన్నుమూసింది. ఈ ఘటన అమెరికాలోని కనెక్టికట్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. కనెక్టికట్‌కు చెందిన హెథర్, డేవిడ్ 2015 నుంచి గాఢంగా ప్రేమించుకుంటున్నారు. 2016లో హెథర్‌కి బ్రెస్ట్ క్యాన్సర్ ఉన్నట్లు తెలిసింది. అప్పటికే వ్యాధి ముదరడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. 2017 డిసెంబర్ ఆఖరి వారంలో ఆమె పరిస్థితి దిగజారుతుండడంతో వెంటనే పెళ్లి చేసుకోవాలని నిర?యించుకున్నారు. సాధారణ పెళ్లిళ్లలాగే కుటుంబ సభ్యులందరి సమక్షంలో ఆస్పత్రిలోనే హెథర్, డేవిడ్‌లు వివాహ బంధంతో ఒకటయ్యారు. పైగా పెళ్లికి వచ్చేవారు ఎలాంటి కానుకలు తీసుకురావద్దని ఆ డబ్బును ఛారిటీలకు ఇవ్వాల్సిందిగా హెథర్ కోరింది. కానీ వారి ప్రేమ విధికి తలవంచక తప్పలేదు. బెడ్‌పై ఉన్న హెథర్.. తన భర్త డేవిడ్‌తో ప్రేమగా మాట్లాడిన మాటలే ఆఖరి మాటలయ్యాయి. డేవిడ్, కుటుంబ సభ్యుల ముందే హెథర్ కన్నుమూసింది. పెళ్లి సమయంలో హెథర్, డేవిడ్ దంపతులు దిగిన ఫొటోలు ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి.

హెచ్-1 బి వీసాలు పొడిగించరు

న్యూఢిల్లీ: అమెరికాలో తాత్కాలిక ఉద్యోగాలకుద్దేశించిన హెచ్-1బి వీసాల పొడిగింపుకు అధ్యక్షుడు ట్రంప్ ససేమీరా అనడంతో అటు అక్కడ పనిచేస్తున్న వేలాది మంది భారతీయులకు ఇది ఆశనిపాతంగా మారింది. ఇప్పటికే ఈ వీసా కింద అక్కడ పనిచేస్తూ.. గ్రీన్ కార్డు హోదాకు దరఖాస్తుచేసుకున్నవారి పరిస్థితి అయోమయంలో పడింది. అ అమెరికాలో ఉద్యోగాలు అమెరికన్లకే అన్న నినాదంతో ముందుకెళ్తున్న ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ హెచ్-1బి వీసాల జారీ నిబంధనలను కఠినతరం చేశారు.

ఈ మేరకు హెచ్-1బి వీసాల దుర్వినియోగంను అరికట్టడానికి డిహెచ్ఎస్ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ) కొత్త నిబంధనలను రూపొందించింది. ఇందులో భాగంగా హెచ్-1బి వీసాల పొడిగింపును నిలిపివేయడానికి ఉద్దేశించిన ప్రతిపాదనలను డిహెచ్ఎస్ చట్టంలో భాగంగా చేయాలని యోచిస్తున్నది. ట్రంప్ 2016 ఎన్నికల ప్రచారంలో ప్రకటించిన బై అమెరికన్ హైర్ అమెరికన్ హామీ మేరకు ఈ నిబంధనలు అమల్లోకి తెస్తున్నట్లు డిహెచ్ఎస్ ప్రకటించింది. ఈ తాజా ప్రతిపాదనల వివరాలను అంతర్గత మెమోల రూపంలో ఇప్పటికే డిహెచ్ఎస్ డిపార్ట్‌మెంట్‌లో పంపిణీ చేశారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం హెచ్-1బి వీసామీద ఇప్పటికే అక్కడ మూడేళ్లుగా ఉద్యోగం చేస్తూ గ్రీన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థన పెండింగ్‌లో ఉంటే అటువంటివారికి హెచ్-1బి వీసా పొడిగింపుకు వీలు ఉన్నది.

అయితే తాజా నిబంధనల్లో ఈ పొడిగింపుకు అవకాశం లేదు. ఈ ప్రతిపాదన అమలైతే అమెరికా నుంచి సుమారు 75వేల మంది భారత్‌కు చెందిన హెచ్-1బి వీసాదారులు తిరిగి స్వదేశానికి వస్తారు. వీటికి అదనంగా డిపెండెంట్ వీసాలకు సంబంధించి కనీస వేతన పరిమితిని పెంచే ప్రతిపాదన కూడా ఉంది. గత ఏడాది జూన్‌లో అమెరికా కార్మిక కార్యదర్శి అలెగ్జాండర్ అకోస్టా హెచ్ -1బి వీసాలు పొందగోరే విదేశీ వర్కర్లు వారి వేతనం ప్రస్తుతం అమల్లో ఉన్న 60 వేల డాలర్ల



నుంచి 80వేల డాలర్లకు పెంచాలని ప్రతిపాదించారు. ఒకవేళ కాంగ్రెస్ ఈ ప్రతిపాదనను ఒప్పు కుంటే 80వేల వేతనంకు దిగువున ఉన్నవారు ఉద్యోగాలు కోల్పోయి స్వదేశానికి స్వచ్ఛందంగా తిరిగి వస్తారు.2015 వరకు అమెరికాలో హెచ్-1బి వీసాలు 2,75,317 జారీకాగా, వాటి లో 70.9శాతం(1,95,247 వీసాలు భారతకే దక్కినవి) తర్వాత స్థానంలో చైనా 9.7శాతం(26,669) వీసాలు పొందింది. కెనడా 1.3శాతం(3,607)వీసాలతో మూడో స్థానంలో ఉండగా, 0.6 శాతం(1602) వీసాలను పొంది పాకిస్తాన్ 10వ స్థానంలో ఉంది.



(మొదటిపేజీ తరువాయి)

జూన్ 2న ఏపీ హైకోర్టు ఏర్పాటు!

రమేశ్ రంగనాథన్ త్వరలో న్యాయమూర్తులతో ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. న్యాయమూర్తుల కమిటీ ఏపీకి వెళ్లి అక్కడి భవనాలను పరిశీలించి హైకోర్టు ఏర్పాటు నిమిత్తం భవనాన్ని పరిశీలించి ఎంపిక చేసి తుది నిర్ణయాన్నిజనవరి చివరి వారం లోగా తెలియజేస్తే జూన్ లో హైకోర్టు ఏర్పాటుకు తగిన సన్నాహాలు చేసుకుంటామని ఏపీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి కి లేఖ రాసిన విషయం తెలిసిందే. ఆ లేఖలోని వివరాలను ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టులో మంగళవారం విలేకరులకు వివరించారు. ఏపీ ప్రభుత్వం గుర్తించిన కొన్ని భవనాలను జడ్జీల కమిటీ పరిశీలించి వాటికి అవసరమైన మరమ్మతులు, మార్పులు - చేర్పులు చేసేందుకు తగు సూచనలు చేస్తారు. జడ్జీల కమిటీ సూచనలకు అనుగుణంగా ఏపీ ప్రభుత్వం భవనాన్ని ఏప్రిల్, చివరి వారంలో సిద్ధం చేసేందుకు, వేసవి సెలవుల్లో ఫైళ్లు, ఫర్నీచర్ తదితర సామాగ్రిని ఏపీ హైకోర్టుకు తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. హైదరాబాద్ లో ఉన్న హైకోర్టుకు వెళ్లడానికి ఆంధ్రప్రదేశ్ నుంచి కక్షిదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో ఏపీ హైకోర్టును అమరావతి ప్రాంతంలోని తాత్కాలిక భవనంలో ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేవలం హైకోర్టు అవసరాలకే కాకుండా న్యాయమూర్తులు, సిబ్బంది నివాసాలకు కూడా తగిన భవనాలు అవసరమవుతాయి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి హైకోర్టు విభజనపై తెలంగాణ ప్రభుత్వం, న్యాయవాదులు కేంద్ర ప్రభుత్వం పై తీవ్రంగా ఒత్తిడి తెచ్చాయి. అయితే అప్పట్లో ఏపీ అంతగా సంసిద్ధత వ్యక్తం చేయకపోవడం , భవనాలను సిద్ధం చేయకపోవడంతో ఏపీకి ప్రత్యేక హైకోర్టు ఆలస్యమైంది. అయితే తాత్కాలిక భవనాల్లో హైకోర్టు ఏర్పాటు చేసేందుకు ఏపీ ముఖ్యమంత్రి సంసిద్ధతను వ్యక్తం చేస్తూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడంతో ప్రత్యేక హైకోర్టు చేసేందుకు సన్నాహాలు ఊపందుకున్నాయి. దీనికి తోడు లోక్ సభలో కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ప్రకటన చేయడంతో ఉమ్మడి హైకోర్టు విభజనకు మార్గం సుగమమైంది.

ఐచ్ఛికాల ఆధారంగా న్యాయమూర్తుల కేటాయింపు.

ఉమ్మడి హైకోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తులు ఇచ్చిన ఐచ్ఛికాల ఆధారంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల హైకోర్టులకు కేంద్ర ప్రభుత్వం న్యాయమూర్తులను విభజించిన విషయం తెలిసిందే. ఉమ్మడి హైకోర్టుకు మొత్తం 61 మంది న్యాయమూర్తులను కేటాయించారు. 60 :40 నిష్పత్తిలో ఏపీకి 37 మంది, తెలంగాణకు 24 మంది న్యాయమూర్తులను నిర్ణయించారు. ఉమ్మడి హైకోర్టులో ప్రస్తుతం పనిచేస్తున్న 31 మంది న్యాయమూర్తుల్లో 17 మందిని ఏపీకి, 12 మందిని తెలంగాణ కు కేటాయించారు. ఈ విషయాన్ని ఏసీజే న్యాయమూర్తులతో చర్చిస్తారు. ఏపీలో భవనాల్ని చూసేందుకు జడ్జీలతో కమిటీని ఏర్పాటు చేస్తారు. అంతా సవ్యంగా జరిగితే కేంద్ర మంత్రి వర్గ అనుమతితో రాష్ట్రపతి ప్రకటన వెలువడుతుంది.

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు వీరే.

జస్టిస్ సి.వి.నాగార్జున రెడ్డి, జస్టిస్ పి.వి.సంజయ్ కుమార్, జస్టిస్ ఎమ్మెస్.రామచంద్రరావు, జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి, జస్టిస్ పి.నవీన్ రావు జస్టిస్ చల్లా.కోదండరామ్, జస్టిస్ బి.శివశంకరరావు, జస్టిస్ ఎమ్మెస్కే.జైస్వాల్, జస్టిస్ డాక్టర్షమీమ్ అక్తర్, జస్టిస్ పి.కేశవరావు, జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, జస్టిస్ టి.అమర్ నాథ్ గౌడ్ ఉన్నారు.

ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు

జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్, జస్టిస్ ఎస్వీ.భట్, జస్టిస్ ఏవీ.శేషసాయి, జస్టిస్ దావూ.శేషాద్రినాయుడు, జస్టిస్ ఏ.రామలింగేశ్వరరావు, జస్టిస్ ఎం.సీతారామమూర్తి, జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ టి.సునీల్ చౌదరి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి, జస్టిస్ ఎ.శంకరనారాయణ, జస్టిస్ జి.శ్యాంప్రసాద్, జస్టిస్ జి.ఉమాదేవి,జస్టిస్ఎన్.బాలయోగి,జస్టిస్టి.రజనీ,జస్టిస్డీవీఎస్ఎస్.సోమయాజులు,జస్టిస్కె. విజయలక్ష్మి,జస్టిస్ఎం.గంగారావుఉన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
బుధవారం 3 జనవరి 2018

పాక్ ముసుగు తొలగుతోంది!

ఉగ్రవాదంపై పోరు కోసం అమెరికా నుంచి అందుతున్న సహాయాన్ని ఉగ్రవాద సంస్థలను పోషించడానికే వినియోగిస్తున్నామని పాక్ మాజీ అధ్యక్షుడు జనరల్ పర్వేజ్ ముషార్రఫ్ ప్రకటించి చాలా కాలమైంది. బహుశా అది అమెరికన్ పాలకుల దృష్టికి రాలేదో,వచ్చినా, ఉద్దేశపూర్వకంగా మిన్నకున్నారో తెలియదు. భారత్‌లో దాడులు నిర్వహిస్తున్న ఉగ్రవాదులకు పాక్ ప్రభుత్వమే సాయంఅందిస్తోందని మన ప్రభుత్వం ఘోషించినా అమెరికన్ ప్రభువులు పట్టించుకోలేదు. ఉగ్రవాదంపై పోరు విషయంలో పాక్ ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అనుసరిస్తోందన్న వాస్తవాన్ని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా సైతం ఆలస్యంగా గుర్తించారు. పాక్‌పై అమెరికాకు అప్పుడే అనుమానం ప్రారంభమైంది. ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు పూర్తిగా జ్ఞానోదయం అయింది. తామందించిన సహాయానికి దొంగ లెక్కలు చూపి ఇంతకాలం పాక్ మోసం చేస్తూ వచ్చిందంటూ ఆయన కొత్త సంవత్సరారంభం రోజున ట్విట్టర్‌లో తీవ్రంగా విరుచుకు పడ్డారు. పదిహేనేళ్ళుగా అందిస్తున్న సహాయాన్ని ఆపేస్తున్నామంటూ ఆయన తీవ్రంగా హెచ్చరించడం వెనక కారణం ఏమై ఉంటుందో చెప్పడం పెద్ద కష్టమేమీ కాదు. అధికారాన్ని చేపట్టి ఈ నెల 20వ తేదీ నాటికి ఏడాది పూర్తవుతున్నా, ట్రంప్ ఇంతవరకూ సాధించిందేమీ లేదు సరి కదా, కొత్త వివాదాలకు తెరలేపుతున్నారు. ఆర్థికాభివృద్ధి రేటు అంతంత మాత్రంగా ఉంది. అధికారంలోకి రాగానే కోరినన్ని ఉద్యోగాలిస్తాననీ,స్థానికుల ఉపాధి కోసమే అమెరికా తొలి ప్రాధాన్యం అనే నినాదం ఇచ్చానని చెప్పుకున్న ట్రంప్ గడచిన ఏడాదిలో ఉపాధి కల్పనలో ఘోరంగా విఫలమయ్యారు. మరోవంక ట్రంప్ తమకు వ్యతిరేకమని ముందే గ్రహించిన పాకిస్తాన్‌చైనా పంచన చేరింది. ఆర్థికరంగంలో ప్రపంచాధిపత్యం కోసం తహతహలాడుతున్న చైనా వన్ బెల్ట్- వన్ రోడ్డు ప్రాజెక్టుపై ఎవరెన్ని అభ్యంతరాలు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో చైనాకి నమ్మకమైన మిత్రునిగా వ్యవహరిస్తున్న పాక్ నిజరూపాన్ని లోకానికి తెలియజేయాలని నిర్ణయించుకున్నారు. గడిచిన ఏడు దశాబ్దాలుగా పాకిస్తాన్‌కి అమెరికా మధ్యలో కొన్ని విరామాలు ఉన్నా, దాదాపుగా నిరవధికంగా సాయం అందిస్తూనే ఉంది. ఆ సహాయం దుర్వినియోగం అవుతోందనీ, ఆఫ్ఘనిస్థాన్‌లో హఖానీ గ్రూపు ఉగ్రవాదులు, తాలిబన్ల కోసం ఖర్చు చేస్తోందని తెలుసుకోవడానికి అమెరికాకు ఇంత కాలం పట్టిందంటే ఆశ్చర్యమే. భారత్ ఎన్నోసార్లు అమెరికా అధ్యక్షుల దృష్టికి ఈ విషయాలను ఏనాడో తీసుకునివచ్చింది. అత్యంత ఆధునిక సమాచార సాంకేతిక వ్యవస్థ కలిగిన అమెరికాకు పాక్ దొంగాట ఇంతవరకూ తెలియదంటే ఎవరూ నమ్మరు. ట్రంప్ పార్టీ (రిపబ్లికన్ పార్టీ) కే చెందిన జార్జి బుష్ నిర్వాకం, స్వార్థ పూరిత నిర్ణయాల కారణంగానే పాకిస్తాన్ ఉగ్రవాదులకు బరితెగింపుగా ఊతమివ్వడం మొదలు పెట్టింది. తన గడ్డపైనే ఉగ్ర స్థావరాలకు అనుమతి ఇచ్చింది. అంతకు ముందు అధ్యక్షులుగా వ్యవహరించిన జిమ్మి కార్టర్, బిల్ క్లింటన్ ప్రభృతులు కూడా ఆఫ్ఘనిస్థాన్‌లో సోవియట్ ప్రాబల్యాన్ని తగ్గించడం కోసం పాకిస్తాన్‌కి అడిగిన వెంటనే సహాయం అందిస్తూ వచ్చారు. జార్జిబుష్ హయాంలో ఆఫ్ఘన్‌లో తాలిబన్లు అంతర్జాతీయ ఉగ్రవాది బిన్ లాడెన్‌కు ఆశ్రయం ఇచ్చారు. లాడెన్ నేతృత్వంలోని అల్‌ఖైదా సభ్యులు వాషింగ్టన్, న్యూయార్క్ నగరాలపై దాడి చేసిన తర్వాత బుష్ కళ్ళు తెరిచారు. పాక్ సహకారంతో ఉగ్రవాదంపై అంతర్జాతీయ పోరు ప్రారంభించారు. ఈ అవకాశాన్ని ఆనాటి పాక్ అధ్యక్షుడు, సైనిక పాలకుడు ముషర్రఫ్ వినియోగించుకున్నారు. అమెరికానే పాక్ బురిడీ కొట్టించింది. అందుకే పట్టరాని అసహనంతో, అవమానంతో ట్రంప్, తప్పుడు లెక్కలతో పాక్ ప్రభుత్వం తమను (అమెరికాను) ఫూల్స్ చేసిందనే పదాన్ని ఉపయోగించారు. అణు బాంబు మీట నొక్కుతా, అమెరికాను మటాష్ చేస్తానంటూ ప్రగల్బాలు పలుకుతున్న ఉత్తర కొరియా అధినేత కిమ్‌కి చైనా, పాక్‌లు మద్దతు ఇస్తుండటంతారాస్థాయిలో ట్రంప్ రగిలి పోవడానికి కారణం. ట్రంప్ వ్యాఖ్యలను పాక్ లెక్క చేయలేదు. మమ్మల్ని (పాక్‌ను) ఏనాడు నమ్మారు కనుక అంటూ తేలిగ్గా తీసి వేసింది. ఏమైనా పాక్ ద్రోహబుద్ధిని అగ్రరాజ్యాధినేత బహిరంగంగా దుయ్య బట్టడం మనకు నైతిక విజయమే. ట్రంప్ మాదిరిగానే చైనా అధ్యక్షుడు కూడా కళ్ళు తెరిచే రోజు దూరంలో లేదు.

బీజేపీ అనుకున్నది అవుతుందా?



పెంటపాటి పుల్లారావు,
రాజకీయ విశ్లేషకులు,
న్యూఢిల్లీ

నోట్‌బందీ, జూలై 2017 నుంచి జిఎస్టీలను అమలులోకి తెచ్చిన ప్రధాని నరేంద్రమోడీ 2019 ఎన్నికలు విజయాన్ని చేకూర్చి పెడతాయని అంచనా వేశారు. ఆయన అనుకున్నదానికి వ్యతిరేకంగా జరుగుతోంది. నిజానికి గుజరాత్ ఎన్నికలు విజయ పరంపరకు ఆరంభం కావాల్సి ఉంది. 2017 సంవత్సరాంతంలో మోడీకి కొన్ని ఎదురుదెబ్బలు తగిలాయి. ప్రమాదకరంగా ఇబ్బందులకు చేరువయ్యారు. 2018లో బాగా పనిచేస్తే తప్ప వాటి నుంచి బయటపడడం కష్టం. గుజరాత్ ఎన్నికల్లో ఆయనకు కేవలం పాస్ మార్కులే వచ్చాయి. ఘన విజయాన్ని ఆశించినప్పటికీ, అంతంతమాత్రం గెలుపు మాత్రమే సాధ్యపడింది. ఒకవేళ గుజరాత్‌లో పరాజయం పాలైఉంటే మిగిలిన పదవీకాలం చాలా కష్టతరమయ్యేది. ఐదేళ్ళ తరవాత తన పనితీరుపై తీర్పు చెప్పాలని 2014లో పదవీ స్వీకరించినప్పుడు ప్రజలను కోరారు. ఐదేళ్ళు చాలా ఎక్కువ సమయమని అప్పట్లో ఆయన భావించారు. 2019 ఎన్నికల జ్వరం అప్పుడే ప్రారంభమైంది. మోడీ ఖగోళశాస్త్ర విద్యార్థి అయ్యుండుంటే చరిత్రలో ఐదేళ్ళకాలం ఒక లేశ మాత్రమని గ్రహించి ఉండేవారు.ఇంతవరకూ ఆయన దేశానికి ప్రయోజనం కలిగించేలా చేసిందేమీ లేనప్పటికీ,చెడు మాత్రం మాత్రం చేయకూడదు. ఎవరికీ ఏ విధంగానూ హాని కలిగించొద్దని 2500 ఏళ్ళ క్రితం ప్రఖ్యాత గ్రీస్ వైద్యుడు హిప్పోక్రేట్స్ అన్నారు. రోగాన్ని తగ్గించలేకపోతే పో కానీ, పరిస్థితిని దిగజారేలా చేయకూడదు. మోడీ ఎంత మంచి చేసినా, ఆయన తీసుకునే చెడ్డనిర్ణయాలు దాన్ని మరిచిపోయేలా చేస్తాయి. ఒక్క తప్పు భారత ప్రధాని భవితవ్యాన్ని అంధకారం చేస్తాయి.

1972లో ఇందిరా గాంధీ ప్రతిపక్షమనేది లేకుండా పరిపాలిస్తున్నారు. 1974 వచ్చేసరికి, అంతా తానై పాలించాలనుకున్నారు. ఆ నిర్ణయం 1977లో ఇందిరను చిత్తుచిత్తుగా ఓడించింది. చరిత్రలో నిలిచిపోయింది. యువకుడు, ఉత్సాహవంతుడూ కాబట్టి రాజీవ్ గాంధీ 25ఏళ్ళ పాటు ప్రధానమంత్రిగా ఉంటారని మాజీ ప్రధాని చంద్రశేఖర్ 1986లో అభిప్రాయపడ్డారు. జరిగిందేమిటి? వేధింపుల కారణంగా రాజీవ్ ఓటమి పాలయ్యారు. పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా పంజాబ్, అసోం, కశ్మీర్‌లలో శాంతిని నెలకొల్పారు. చంద్రస్వామి అనే తాంత్రికవేత్తతో ఆయనకున్న సాన్నిహిత్యం చట్టపరమైన చిక్కుల్లోకి నెట్టి, పదవిని కోల్పోయారు. అటల్ బిహారీ వాజ్‌పేయి పరిపాలన కూడా బాగున్న తరుణంలో భజనపరులు వచ్చే ఎన్నికల్లో బీజేపీ స్వంతంగా 300 సీట్లు ఖాయమని చెప్పారు. ఎందుకంటే భారత దేశం మొత్తం మిమ్మల్ని ప్రేమిస్తుండడమే దీనికి కారణమని గాలి కొట్టారు. ఈ మాటలు విని వాజ్‌పేయి, జార్ఖండ్ ముక్తిమోర్చా, డిఎమ్‌కె, హర్యానా పార్టీ ఆఫ్ చౌతాల, వంటి పార్టీలతో పొత్తు కుదుర్చుకోకుండానే ఆర్నెల్ల ముందే 2004లో ఎన్నికలకు వెళ్ళారు. ఘోరంగా పరాజయం పాలయ్యారు. అదిప్పుడు అందరూ మరిచిపోయారు.

నరేంద్రమోడీ చాలా చురుకైన ప్రధాన మంత్రే అయినప్పటికీ, ఆర్థికంగా చాలా ఘోరమైన తప్పులకు పాల్పడ్డారు. అంతర్జాతీయంగా చమురు ధరలు తక్కువగా ఉన్నందున ఇబ్బందులు ఎదురుకాలేదు. ఆర్థిక మంత్రిగా అరుణ్‌జైట్లీ విఫలమైనట్లే ఉంది. పి. చిదంబరాన్ని ఆయన గుర్తుకుతెస్తున్నారు. భారతీయుల్ని పన్ను ఎగవేతదారులంటూ మాట్లాడుతుంటారు. జైట్లీ పనితీరు చాలా అధ్వానంగా ఉంది. మోడీ మంత్రివర్గంలోని సభ్యులందరికీ పనితీరు అంశంలో తక్కువ మార్కులే వస్తాయి. అలాంటి మంత్రుల్ని తప్పించడానికి ప్రధానమంత్రి మోడీకి ఇప్పుడు కొంచెం సమయం దక్కింది. ప్రస్తుత మంత్రివర్గ సభ్యుల్లో చాలామంది గతంలో పార్టీ అధికార ప్రతినిధులుగా ఉండేవారు. వారు బాగా మాట్లాడగలరు.. పనితీరు దగ్గరకొచ్చేసరికి విఫలమవుతారు. వారికి రాజకీయంగా ఎటువంటి ప్రతిష్టా లేదు. 2019లో తిరిగి అధికారంలోకి రావాలంటే, మోడీ గొప్ప పరిపాలనను అందించి ఉండాలి.. దురదృష్టవశాత్తు తప్పులు మొత్తం అవకాశాలను చెడగొట్టేశాయి. మంచి రాజకీయాలు మాత్రమే ఇప్పుడాయన్ను కాపాడగలవు. మోడీకి ప్రస్తుతమున్న అతి పెద్ద ఆస్తి అమిత్ షా. ఇటీవలి భారత రాజకీయాల్లో మెరుగైన ఆటగాడిగా పేరొందారు.

బీజేపీ, మోడీల ముందు సవాళ్ళు

☛ గుజరాత్ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీలో శక్తిని నింపాయి. మోడీ స్వరాష్ట్రంలో కాంగ్రెస్ అమోఘమైన పోరాట పటిమను కనబరిచింది. రాజకీయంగా మోడీ సృష్టించిన సమస్యల కారణంగా వచ్చిన కోపాన్ని ఇందులో ప్రయోగించింది. గుజరాత్‌లో మంచి ఫలితాలను రాబట్టి ఉంటే, మోడీకి 2019 ఎన్నికలు చాలా సులభమయ్యేవి. ఇప్పుడు రాహుల్ గాంధీ ప్రతిపక్ష ప్రధాన మంత్రి అభ్యర్థిగా మోడీని ఎదుర్కొనవచ్చు. కాంగ్రెస్ పార్టీ శక్తిసామర్థ్యాలే కాక, అతి పెద్ద యంత్రాంగమూ ఉంది. రాహుల్ చురుకైన వాడు కాదని బీజేపీ తరచూ ఎగతాళి చేసింది. పడుకున్న కుక్కల్ని అలాగే ఉండనివ్వమని బ్రిటన్ ప్రధానమంత్రి నెవిల్లె చంబెర్లైన్ అనేవారు. అంటే శత్రువుల్ని ఎప్పుడూ రెచ్చగొట్టద్దని అర్థం. బీజేపీ ఇప్పుడు చేసిందదే. తన శత్రువుల్నందర్నీ అది నిద్రలేపింది.



☛ 2014 ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో ఉన్న 80 లోక్‌సభ స్థానాల్లో 72 గెలుచుకుంది. 2017లో అసెంబ్లీని సైతం కైవసం చేసుకుంది. ఈ విజయాలు మాయావతి, అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీలను ఒక్కటి చేసింది. కలిసి పోరాడాల్సిన పరిస్థితి వాటికి సంక్రమించింది. లేకపోతే, ఆ పార్టీలే కనుమరుగయ్యే స్థితి కలిగింది. నాలుగు దశాబ్దాల కాలంలో ప్రతిపక్షంలో ఐకమత్యం కనిపించడం ఇదే మొదటిసారి. ఫలితంగా బీజేపీ బలం గణనీయంగా పడిపోతుంది. ఉత్తర భారతంలోని అనేక రాష్ట్రాలలో ఇవే దృశ్యాలు కనిపించబోతున్నాయి. అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ సైతం ప్రతిపక్షంతో చేయి కలిసే అవకాశాలున్నాయి. ఇది ఉత్తర భారతంలో భారతీయ జనతా పార్టీకి చికాకులు సృష్టిస్తాయి.

> **1972లో ఇందిరా గాంధీ ప్రతిపక్షమనేది లేకుండా పరిపాలిస్తున్నారు. 1974 వచ్చేసరికి, అంతా తానై పాలించాలనుకున్నారు. ఆ నిర్ణయం 1977లో ఇందిరను చిత్తుచిత్తుగా ఓడించింది. చరిత్రలో నిలిచిపోయింది. యువకుడు, ఉత్సాహవంతుడూ కాబట్టి రాజీవ్ గాంధీ 25ఏళ్ళ పాటు ప్రధానమంత్రిగా ఉంటారని మాజీ ప్రధాని చంద్రశేఖర్ 1986లో అభిప్రాయపడ్డారు. జరిగిందేమిటి? వేధింపుల కారణంగా రాజీవ్ ఓటమి పాలయ్యారు. పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా పంజాబ్, అసోం, కశ్మీర్‌లలో శాంతిని నెలకొల్పారు. చంద్రస్వామి అనే తాంత్రికవేత్తతో ఆయనకున్న సాన్నిహిత్యం చట్టపరమైన చిక్కుల్లోకి నెట్టి, పదవిని కోల్పోయారు.**

☛ 2014లో కాంగ్రెస్, శరద్‌పవార్‌కు చెందిన ఎన్సీపీలు విడివిడిగా మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశాయి. విడిగా పోటీ చేసినా వాటికి 45శాతం సీట్లు వచ్చాయి. పార్లమెంటు ఎన్నికల్లో ఐక్యంగా పోటీ చేసుంటే 2014లో 48 స్థానాలకూ 44 స్థానాలొచ్చి ఉండేవి కావు. మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వం ఏమంత బాగా పనిచేయడం లేదు. ఆ రాష్ట్రంలో వ్యవసాయపరంగా తీవ్రమైన సంక్షోభముంది. కాంగ్రెస్, ఎన్సీపీ ఒకటైతే.. బీజేపీకి ఇక్కట్లే.

☛ 2014 ఎన్నికల్లో గుజరాత్‌లో ఉన్న మొత్తం 26 పార్లమెంటు సీట్లనూ బీజేపీ గెలుచుకుంది. తాజా అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ తెచ్చుకున్న ఓట్లను లెక్కలోకి తీసుకుంటే బీజేపీ పది ఎంపీ సీట్లను కోల్పోతుంది. జార్ఖండ్, అసోం, రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘర్ రాష్ట్రాలలో బీజేపీ అధికారంలో ఉంది. 2019 ఎన్నికల్లో బీజేపీకి ఇక్కడ కూడా తీవ్రమైన పరీక్ష ఎదురవుతుంది. తమ అధ్వాన పరిపాలన తీరును ఆయా ప్రభుత్వాలు సమర్థించుకోవాల్సి ఉంటుంది. ఈ రాష్ట్రాలలోనూ బీజేపీ ఇంచుమించుగా అన్ని ఎంపీ స్థానాలనూ గెలుచుకుంది.

☛ ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో కలిపి 81ఎంపీస్థానాలున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఈ రాష్ట్రాల్లో మనుగడ లేదు. తెలుగుదేశం, టిఆర్ఎస్, వైయస్ఆర్ కాంగ్రెస్, డీఎంకె, ఏఐఏడీఎంకే వంటి ప్రాంతీయ పార్టీలదే ఇక్కడ హవా. ఎవరికి ఎక్కువ స్థానాలొస్తే వారినే తన భాగస్వామిగా బీజేపీ ఎంచుకుంటుంది. ఈ దశలో వాటని మనం పరిగణనలోకి తీసుకోలేం.

☛ పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో 62 ఎంపీ స్థానాలున్నాయి. పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, కేరళలో వామపక్షాలకు 60మంది ఎంపీలున్నారు. ఈ రెండు పార్టీలూ ఎట్టి పరిస్థితుల్లోనూ భారతీయ జనతా పార్టీ ప్రభుత్వానికి మద్దతునివ్వవు. ఇప్పటికే ఆ ఎంపీలు బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నారు. బెంగాల్‌లో బీజేపీ కొద్దో గొప్పో ఎంపీ స్థానాలను గెలుచుకునే అవకాశముంది. కేరళలో ఒక్క స్థానం కూడా ఆ పార్టీకి రాదు. ఈ 62 ఎంపీల్లో కేవలం 5 సీట్లు మాత్రం బీజేపీకి రావచ్చు.

2014లో పెద్ద సంఖ్యలో ఎంపీ సీట్లను గెలుచుకున్న చోట్ల బీజేపీకి 2019లో గణనీయమైన నష్టం వాటిల్లే అవకాశముంది. తమిళనాడు, కేరళ, బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీకి చెప్పుకోదగ్గ పెరుగుదల ఉన్నప్పటికీ 2019 ఎన్నికల్లో ఎంపీ సీట్లను గెలుచుకోవడానికి ఆ పెరుగుదల స్థాయి సరిపోదు. బెంగాల్, తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాలలో మొత్తం 118 ఎంపీ సీట్లున్నాయి. వీటిల్లో 5 సీట్లుమించి పార్టీ గెలుచుకోలేదు. మిగిలినవి బీజేపీకి వ్యతిరేకంగానే ఉన్నాయి తప్ప మద్దతుగా లేవు. కొన్ని రాష్ట్రాలలో పెద్ద సంఖ్యలో ఎంపీ సీట్లను గెలుచుకోవడం వల్లనే అధికారంలోకి రాగలిగింది. 2019లో తిరిగా అధికారంలోకి రావాలంటే, కొత్త భాగస్వాములను కనుగొనడమో లేదా గతంలో ఓడిన రాష్ట్రాలలో ఎక్కువ స్థానాలు గెలవడమో తప్పని సరి.

కొత్త రాష్ట్రాల్లో దూసుకుని వెళ్ళడం కన్నా, కొత్త మిత్రులను సంపాదించడం తేలిక. బీజేపీ వోట్ల శాతం పెరగవచ్చు కానీ, కొత్త రాష్ట్రాల్లో ఎక్కువ సీట్లను బిజెపి గెలవలేదు. బీహార్‌లో జనతాదళ్(యు)సీనియర్ నాయకుడు, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ని మహాకూటమి నుంచి బయటకు వచ్చేట్టు చేసి అమిత్ షా, మోడీలు ఘన విజయం సాధించారు. ఎన్డీయేలో చేర్చుకున్నారు. ఇది బీహార్‌లో బీజేపీకి పట్టును సాధించి పెట్టింది. ఇతర చోట్ల కూడా బీజేపీ అమలు జేసేందుకు ఇది ఒక ఉదాహరణ.

కొత్త మిత్రులను బీజేపీ తన వైపునకు తిప్పుకోవడానికి కీలకమైన రెండు రాష్ట్రాలు ఉన్నాయి. 2014లో కర్నాటకలో త్రిముఖ పోటీలో మొత్తం 28 ఎంపీ సీట్లలో 16 స్థానాలను బీజేపీ దక్కించుకుంది. ఈసారి పరిస్థితి అలా ఉండకపోవచ్చు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య కాంగ్రెస్‌కి సారథ్యం వహిస్తున్న కారణంగా బీజేపీ అన్ని సీట్లూ నిలబెట్టుకోలేకపోవచ్చు. ప్రభుత్వ ఏర్పాటులోనూ అంతే. బీజేపీ ముందున్న ఒకే ఒక ప్రత్యామ్నాయం మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ నేతృత్వంలోని జనతాదళ్ (ఎస్)తో పొత్తుపెట్టుకోవడం. ఇందుకోసం బీజేపీ త్యాగాలు చేయాల్సి వస్తుంది. కర్నాటకలో బీజేపీ ఓడిపోతే సిద్దరామయ్య మళ్ళీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారు. 2019లో ఓటమిని ఎదుర్కోవల్సి వస్తుంది. ఈ పరిస్థితిని నివారించడానికి బీజేపీ ఈసారి తప్పనిసరిగా దేవెగౌడ్ మద్దతు కోసం ప్రయత్నించాల్సిఉంది. తన ఓట్ల శాతాన్ని పెంచుకోవడానికి ఇదే మార్గం. కాంగ్రెస్, దేవెగౌడ కూటమి జతకడితే బీజేపీకి ఓటమి అనివార్యం.

ఒడిషాలో మొత్తం 21లోక్‌సభ సీట్లు ఉన్నాయి. 2014లో బీజేపీ ఒకే ఒక్క స్థానాన్ని గెల్చుకుంది. ఇప్పుడు ముఖ్యమంత్రి, బిజూ జనతాదళ్ (బీజేడీ) అధ్యక్షుడు నవీన్ పట్నాయక్‌ని ఓడించగలనని బీజేపీ భావిస్తోంది. అది బీజేపీకి పెద్ద రిస్కే. బీజేడీతో బీజేపీ జతకట్టకపోతే, ఆ పార్టీతో కాంగ్రెస్ పొత్తు కుదుర్చుకుంటుంది. అలా జరిగితే ఒడిషా, పశ్చిమబెంగాల్ మాదిరిగా బీజేపీ వ్యతిరేక రాష్ట్రంగా ఆవిర్భావమవుతుంది. ఒడిషాలో ప్రస్తుతం మూడు పార్టీల వ్యవస్థ ఉంది. కాంగ్రెస్, బీజేడీ పొత్తు కుదుర్చుకుంటే, బీజేపీ ఓడిపోతుంది. దానిప్రభావం జాతీయ రాజకీయాలపై ఉంటుంది.

ఆర్థికపరిస్థితి మెరుగుకాకపోవడం, నోట్లరద్దు, జిఎస్‌టి అమలులో వైఫల్యం, అధిక పన్నులు, ఉపాధి కల్పన జరగకపోవడం, వంటి సమస్యలతో బీజేపీ ఓటర్ల ఆగ్రహాన్ని ఎదుర్కొంటోంది. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంపై జనానికి గొప్ప విశ్వాసం ఉంది. ఆయన నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజల ఆశలను సాకారం చేయలేక పోతోంది. బీజేపీ ఓటమికి కొద్ది పాటి మొగ్గు చాలు.

బీజేపీ కొత్త మిత్రులను సంపాదించుకోవల్సి ఉంటుంది. లేదా, కాంగ్రెస్ శిబిరంలోకి కొత్త భాగస్వామ్య పక్షాలు చేరకుండా చూడాల్సి ఉంది. కర్నాటక, ఒడిషా వంటి కీలక రాష్ట్రాల్లో ఎక్కువ సీట్లు సంపాదించాలన్న ఆశతో ఉంది. ముక్కోణపు పోటీ అయితేనే. ఒడిషా, కర్నాటకలలో కాంగ్రెస్ నవీన్ పట్నాయక్, దేవెగౌడలతో జత కడితే, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం బీజేపీ తరం కాదు.

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో బొటాబొటీ మెజారిటీ రావడంతో బీజేపీ శ్రేణుల్లో భయం పట్టుకుంది. ఎంతో సునాయాసంగా గెలవాల్సిన గుజరాత్‌లో పరిస్థితి క్లిష్టంగా తయారవడానికి నోట్ల రద్దు,జిఎస్‌టి అమలులో వైఫల్యం, ప్రచారార్భాటంగా ప్రారంభించిన పథకాలు నీరుగారడం కారణం. బీజేపీ ముందున్న ప్రత్యామ్నాయం చాలా సూక్ష్మమైనది. కొత్త మిత్రులను బీజేపీ ఆకర్షించకపోతే, కాంగ్రెస్ ఆ పని చేస్తుంది. బీజేపీ ఈ రెండు రాష్ట్రాల్లో ఎంపిక చేసుకోగలిగితే, 2019 ఎన్నికల్లో మంచి విజయావకాశాలున్నాయి. గుజరాత్ ఫలితాలు ప్రధాని మోడీకి, బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షాకు భయాన్ని పుట్టించాయి. వారు ఇప్పుడు మునుపటంత ధైర్యంగా లేరు. కొత్త మిత్రుల కోసం అన్వేషించవచ్చు. ఒడిషా, కర్నాటకలలో అలవి కాని వాగ్దానాలను చేయవచ్చు. అప్రదిష్ట పాలైన యెడ్యూరప్ప నేతృత్వంలో కర్నాటకలో బీజేపీ గెలుపొందగలదని ఎవరైనా ఊహించగలరా? హిమాచల్ ప్రదేశ్‌లో బీజేపీ సీనియర్ నాయకుని పరిస్థితి ఏమైందో చూడండి. పాత ముఖాల పట్ల ప్రజలకు రోత కలుగుతోంది.

2019లో బీజేపీకి స్పష్టమైన ప్రత్యామ్నాయం ఉంది. కొత్త మిత్రులను ఎంపిక చేసుకోవడం. లేని పక్షంలో గెలుపొందడం కష్టమే. ఆ తర్వాత రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ ఎన్నికలను బీజేపీ ఎదుర్కోవల్సి ఉంది. రాజకీయాల్లో విచిత్రమైన కలయికలు ఉంటాయని సుప్రసిద్ధ రచయిత జార్జి బెర్నార్డ్ షా అన్నారు. అంటే, కత్తులు నూరుకున్న వారు కూడా మిత్రులు కావచ్చు. బీజేపీ ముందున్న పరిష్కారం ఇది ఒక్కటే, సమయం మించిపోతోంది.

అభిప్రాయం

పోడు భూములే ముద్దు

అభివృద్ధి, పారిశ్రామికీకరణ పేరుతో పాలకవర్గాలు సామ్రాజ్యవాద అభివృద్ధి నమూనాలను అంతం చేస్తున్నారు. ఆదివాసీ ప్రాంతాలను ధ్వంసం చేస్తున్నారు. ఆదివాసీ చట్టాలనూ, జీవోలనూ, సంస్కృతినీ నిర్వీర్యం చేసి ఏజెన్సీలో గిరిజనేతరుల దోపిడీకి మార్గం సిద్ధం చేస్తున్నారు. ఆదివాసీలనూ నిలువునా నిర్వాసితులుగా మారుస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెంలో గుండాల మండలంలో సింగరేణి ఓపెన్ కాస్ట్‌లు తీసి ఆదివాసీల జీవన విధానాన్ని విధ్వంసం చేయాలని కుట్ర పన్నుతున్నారు. గుండాల నుండి భూపాలపల్లి వరకు డజన్లకొద్దీ ఓపెన్‌కాస్టులు ప్రారంభించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఏజెన్సీ ప్రాంతమైనా గుండాల నుండి భూపాలపల్లి వరకూ విస్తరించిన బొగ్గు తీసేందుకు ఓపెన్ కాస్టులనూ ప్రారంభించి కోల్ కారిడార్‌నూ ఏర్పరచడానికి పాలకులు ప్రయత్నిస్తున్నారు. సింగరేణి సంస్థ బొగ్గు గనుల తవ్వకాలపై ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ జిల్లాలోని ఆదివాసీ ప్రాంతాలనూ, గోదావరి నదీతీరాన గ్రామాలనూ పట్టాలనూ, అది కూడా ఏజెన్సీ ప్రాంతమైన ఐదవ షెడ్యూల్ ఆదివాసీ భూభాగాలనూ ఓపెన్‌కాస్టుల రూపంలో ధ్వంసం చేయడానికి, ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్న సహజవనరులు ఖనిజ సంపదనూ దొడ్డిదారిలో దోచుకుని ఆదివాసులనూ పీల్చి పిప్పిచేసి అమెరికన్ సామ్రాజ్యవాదులకూ ధారాదత్తం చేయాలని కలలు కంటున్నారు. ఆదివాసీలు, ఆదివాసేతరులు తమ పంట భూములనూ, నివాస ప్రాంతాలనూ బతుకు దెరువుకోల్పోయి, జీవించే హక్కును కోల్పోతున్నారు. గాలి, నీరు, నేల, అడవి ఆదివాసుల హక్కు అని అందుకే ఓపెన్ కాస్టులనూ ఆదివాసీలు ఆదివాసేతర ప్రజానీకం పెద్దఎత్తున పోరాటానికి సన్నద్ధమవుతున్నారు. మానవ మనుగడకా అనేక రకాల ప్రమాదం పొంచి ఉన్న ఓపెన్ కాస్టులనూ పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమైన గుండాల మండలంలో ఏర్పాటుకు సింగరేణి సంస్థ తహతహలాడుతున్నది. ఓపెన్‌కాస్టు గనుల కారణంగా ఉత్తర తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలలో 124 గ్రామాలు కనుమరుగయ్యాయి. రాష్ట్రంలో 31 ఓపెన్ కాస్టులు, 6 అండర్‌గ్రౌండ్ మైన్స్ ఉన్నాయి. మరో 20 ఓపెన్‌కాస్టులు వస్తాయని సింగరేణి డైరెక్టర్ చెబుతున్నారు. ఓపెన్‌కాస్టులు తవ్వడం మూలంగా భూమిలోపల నిక్షిప్తమైన సల్ఫర్ వాయువులు వాతావరణంలో కలిసి క్యాన్సర్ జబ్బులకూ దారితీస్తుంది. పోడు భూములపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీలకూ ఇప్పటివరకూ పట్టాలు లేవు. అడవుల రక్షణకూ చర్యలు చేపట్టాలి. వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు ఆదివాసీలకూ తెలియజేసి ఆదివాసీల పోడు భూములకూ మోటార్లు ఇచ్చి భూములనూ అభివృద్ధి చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు.

● పూకె రామకృష్ణ దొర, 9866073866

సైన్సు కాంగ్రెస్ తరలింపు ఫలితం..?

ఉవ్వెత్తున లేచిన ఎన్నో ఉద్యమాలకు సజీవ సాక్ష్యం. పోరాటాల పురిటిగడ్డకు అన్యాయం జరిగింది. తెలంగాణ రాష్ట్ర కీర్తిని ప్రపంచవ్యాప్తంగా మార్మోగించే అద్భుత అవకాశం చేజారింది. రాష్ట్రంలోని విద్యాభివృద్ధికి నిధులొచ్చే ప్రక్రియకు మంగళం పాడారు. తెలంగాణ రాష్ట్రం ప్రపంచంలోని అన్ని దేశాల్లో మొదటి స్థానం వహించింది. యువ మంత్రి కేటీఆర్ ఎన్నో అవార్డులు పొంది తెలంగాణ రాష్ట్రం పేరును ప్రపంచంలోనే టాప్ చేశారు. చైతన్యానికిపెట్టింది పేరు. ఉద్యమాలకు పురిటిగడ్డ, విద్యావేత్తలు, మేధావులను దేశానికి అందించిన ఉత్తమ విశ్వవిద్యాలయం ఉస్మానియా విశ్వవిద్యాలయమే దేశంలోనే బెస్ట్ యూనివర్సిటీ అయిన ఉస్మానియా సైన్సు కాంగ్రెస్‌ను చేజార్చుకోవటం చారిత్రక తప్పిదం. ఓయూ ఘనకీర్తికి కళంకం. తెలంగాణ గడ్డకు, తెలంగాణ బిడ్డలకు అవమానం. ఎందరో విద్యావేత్తలు, మేధావులను జాతికి అందించిన ఓయు ఇపుడు ఎందుకు అందివచ్చిన సైన్సు కాంగ్రెస్‌ను చేజార్చుకుంది.



వాస్తవంగా సైన్సు కాంగ్రెస్ మన రాష్ట్రంలో జరిగితే తెలంగాణ రాష్ట్రానికి ప్రపంచ తెలుగు మహాసభల వలే కొండంత కీడే వచ్చేది. కొత్త సంవత్సరంలో ప్రధానమంత్రి వంటివారు రావటం వల్ల విశ్వవిద్యాలయాలకు నిధులు వచ్చేవి. నిధులు, నీళ్ళు, నియామకాల పేరిట సాగిన తెలంగాణ ఉద్యమానికి ఓయు విద్యార్థులు వెన్నుదన్నుగా నిలిచారు. ఉద్యమాలకు సజీవ సాక్ష్యంగా నిలిచిన విశ్వవిద్యాలయంలో జనవరి 3 నుంచి జరగాల్సిన ఇండియన్ సైన్సు కాంగ్రెస్ మహాసభలను భద్రతా కారణాల వల్ల నిర్వహించలేమని వి.సి. ప్రకటించటం విడ్డూరం, విచారకరం, ఈ నిర్ణయం వల్ల విశ్వవిద్యాలయ ప్రగతి వెనుకబడిపోతుంది. భవిష్యత్ అగమ్య గోచరం కాదా! విశ్వవిద్యాలయ నూతన జవసత్వాలు అందిస్తామని ప్రచారం చేసుకుంటున్న పాలకులు ఇలా చేయటం సమంజసమా! తెలంగాణరాష్ట్రాన్ని సాధించి పెట్టిన ఓయు, కేయూ, ఇతర యూనివర్శిటీల విద్యార్థుల కోరికలను ప్రభుత్వం ఎందుకు తీర్చలేదు. విశ్వవిద్యాలయాలనే తెలంగాణఉద్యమ కేంద్రాలుగా మార్చిన వారికి ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిస్థితి తెలియదా?

3 సంవత్సరాల నుండి ఓయు విద్యార్థులు, ఉద్యోగులు, రిసెర్చి స్కాలర్‌లతో మాట్లాడటానికి పాలకులకు తీరికలేదా? ఓపికలేదా? లేదా తెలంగాణ ఉద్యమకారులను లెక్కచేయటం లేదని అనుకోవాలా దేశంలోనే 7వ ప్రాచీన యూనివర్శిటీగా ఓయుకు మంచి పేరు ఉంది. 16 వేలమంది దరఖాస్తు చేసుకున్నారు. అది టిక్కెట్ల రిజర్వేషన్లతో సహా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. చివరి క్షణంలో తెలంగాణ ప్రభుత్వం మేము నిర్వహించలేమని చేతులు ఎత్తేయటంతో మణిపూర్ రాష్ట్రానికి తరలిపోయింది. ఇది తెలంగాణకు తీరని అన్యాయం. కొన్ని రోజుల క్రితం ఓయులో ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకోవటం, నాన్ టీచింగ్ ఉద్యోగుల దీక్ష చేపట్టడం, వంటి కారణాలతో మంచి అవకాశం వదులుకున్నారా!

విశ్వవిద్యాలయ ఫండింగ్ సంస్థలైన యుజిసి, సిఎస్ఐసి, డిఎస్‌టి వంటి సంస్థలు నిధులు తగ్గించే అవకాశాలు ఉన్నాయి. తద్వారా పరిశోధనకు అన్యాయం జరుగవచ్చు.


ఓయూ స్వర్ణోత్సవాల్లో రాష్ట్రపతి మాత్రమే మాట్లాడారని, సిఎం కేసీఆర్‌ను మాట్లాడనియ్యలేదనే మాట వాస్తవం. ఇపుడు అదే పునరావృతం కాదా. అని ప్రశ్నించేవారున్నారు. ఇండియన్ సైన్సు కాంగ్రెస్ వల్ల బోధన ఇతర అంశాలు ప్రధాని దృష్టికి వెళ్ళి పరిష్కారమయ్యేవి. కారణాలు ఎన్నిఉన్నా ఇండియన్ సైన్సు కాంగ్రెస్‌ను తెలంగాణ రాష్ట్రం జారవిడుచుకోవడం దురదృష్టకరం. ఇప్పుడున్న నిధులు పరిశోధనకు సరిపోవటం లేదు. రద్దు చేసుకున్నందుకు నిధుల కోత, అక్రిడేషన్ తగ్గిస్తే దాని ప్రభావం రీసెర్చి విద్యార్థులపై పడవచ్చు. ఎన్నో విషయాల్లో మంచిపేరు పొందిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇండియన్‌సైన్సు కాంగ్రెస్ రద్దు వల్ల అప్రతిష్టపాలైంది.

● రావుల రాజేశం, 9848811424

స్త్రీ విద్యకు పునాది సావిత్రి బాయి పూలే

నివాళి

ఆధునిక సమాజం సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా, ఉన్నత విలువలు, సామాజిక అభివృద్ధికి జీవితాలను త్యాగం చేసిన వారిని విస్మరించకూడదు. మన దేశంలో మొట్టమొదటిగా కులతత్వం, సంస్కృతి, మతవ్యవస్థపై వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తుల్లో జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే చెప్పుకోదగినవారు. సావిత్రి బాయి పూలే విద్య అనే అంశాన్ని బాలికలకు, అట్టడుగు వర్గాల వారికి అందుబాటులోకి తెచ్చారు. జ్యోతిరావు పూలే సహచారిగా, ఆయన పోరాట జీవితంలో తోడుగా నిలబడటమే కాకుండా, సమాజానికి సేవ చేయడంలో సఫలీకృతమయ్యారు. స్వతంత్ర వ్యక్తిత్వం, వికాసంతో సాహిత్య ప్రతిభను రూపొందించుకొని సమాజానికి గొప్ప సామాజిక ఉద్యమకారిణిగా, సామాజిక స్థిరీకరణ కోసం, మెరుగైన విద్య అట్టడుగు బడుగు బలహీనవర్గాల వారికి చేరువచేయడంలో తన జీవితాన్ని అర్పించారు సావిత్రి బాయిపూలే. ఒక్కమాటలో చెప్పాలంటే, స్త్రీ అభ్యుదయానికి దిక్సూచి సావిత్రి బాయి పూలే. మహిళా సాధికారత కోసం ఉద్యమించిన స్త్రీ, ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి స్త్రీవాది సావిత్రి బాయి పూలే అని టిఫానీ వానే వ్యాఖ్యానించారు.




సావిత్రి బాయి పూలే 1831 వ సంవత్సరం జనవరి 3న మహారాష్ట్రలోని వైగాన్‌లో జన్మించారు. ఆమె కవయిత్రి కూడా. మన దేశాన్ని బ్రిటిష్‌వారు పరిపాలిస్తున్న సమయంలో మహిళా హక్కులకోసం, వారి విద్యకోసం, పోరాడి గెలిచిన ధీరవనిత. జ్యోతిబాపూలే సహకారంతో 1848లో పూణేలోని బైడ్‌వాడ ప్రాంతంలో మొట్టమొదటి మహిళా పాఠశాలను స్థాపించారు. మహారాష్ట్రలోని బాల్యవివాహాలకు వ్యతిరేకంగా పోరాడి ఆ దురాచారాన్ని రూపుమాపారు. వితంతులైన చాలామంది బాలికలను చులకనతో చూస్తున్నారని గ్రహించి, దీనిని రూపుమాపేందుకు పోరాడారు. ఇలాంటి మహోన్నతుల ఆదర్శం వృథాకాకుండా ఉండాలంటే ప్రభుత్వాలు ఈ కింది అంశాలపై దృష్టిపెట్టవలసి ఉంది. తన జన్మదినమైన జనవరి 3ను జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా గుర్తించాలి, మహిళా హక్కులకోసం, స్త్రీ సాధికారత కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వారిని ప్రభుత్వం గుర్తించి చేయూతనందించాలి, దేశంలోని వివిధ పాఠశాలల్లో, కళాశాలల్లో వృత్తినే దైవంగా భావిస్తూ... విశిష్ట సేవలను అందిస్తున్న ఉపాధ్యాయినిలను ప్రోత్సహించాలి, పూలే దంపతుల చరిత్రను, సేవను పాఠ్యాంశాలుగా తీసుకురావాలి, సమాజాభివృద్ధికి జీవితాలనే పణంగా పెట్టిన వ్యక్తుల జీవిత విశేషాంశాలపై విద్యాసంస్థల్లో సెమినార్స్ నిర్వహించాలి, మహోన్నతుల ఆశయాలను ప్రతిబింబించే వారి జీవిత చరిత్రల రచయితలకు ప్రోత్సాహకాలందించాలి.

● సూరం అనిల్, 9059457045

'హరితహారం విజయవంతం చేద్దాం'

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో అటవీశాఖ కీలక పాత్ర పోషిస్తోందని పీసీసీఎఫ్ పి.కె.ఝా అన్నారు. మంగళవారం అరణ్యభవన్‌లో నూతన సవంత్సరం సందర్భంగా ఝా కేక్‌కట్ చేసి ఉద్యోగులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ మానసపుత్రిక హరిత హారాన్ని విజయవంతం చేసే బాధ్యత అటవీశాఖపైనే ఉందన్నారు. సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణలో అటవీశాఖ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తోందన్నారు. కొత్త సంవత్సరంలో కూడా అధికారులు ,సిబ్బంది మరింత ఉత్సాహంతో పనిచేయాలన్నారు. అటవీ రక్షణ , వన్యప్రాణుల మనుగడకు ప్రాధాన్యత ఇస్తూ పనిచేయాలని ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ ముఖ్యకార్యదర్శి రజత్ కుమార్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ అవినీతికి పవన్ మద్దతు




హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు మాట ల గారడీతో ప్రజలను ముంచు తుంటే, ఆయనకు సహకరించేలా జనసేన అధ్య క్షుడు పవన్ కళ్యాణ్ మాట్లా డారని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. మాయ మాటలతో ప్రజలను వంచిస్తున్న కేసీఆర్ మత్తులో పవన్ పడ్డారని మంగళవారం జరిగి న విలె కరుల సమావేశంలో అన్నారు. నిరంతర విద్యుత్ పేరుతో వేలాదికోట్ల అవినీతికి తెర తీశారని, ఈ అవినీతికి పవన్ మద్దతు ఇస్తారా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ సొమ్మును కేసీఆర్ దోచుకుంటుంటే వాస్తవాలు తెలుసుకుని ప్రజలకు చెప్పాల్సిన పవన్ మెచ్చుకోవడం సమంజసమేనా అని రేవంత్ నిలదీశారు. పవన్ కళ్యాణ్ అపరిచితుడంటూ ట్విట్టర్‌లో కేసీఆర్ పేర్కొన్న విషయాన్ని అప్పుడే మరిచిపోయారా అని ఆయన అన్నారు. కేసీఆర్ దోపిడీకి పవన్ కళ్యాణ్ బ్రాండ్ అంబాసిడర్‌గా చేసేలా ఉన్నారని రేవంత్ ఎద్దేవా చేశారు. కేసీఆర్ సీఎం అయ్యాక ఎంతమంది మహిళలు, రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారో పవన్ తెలుసా అని ఆయన ప్రశ్నించారు. 40 నెలల్లో కనీసం 4సార్లు క ూడా సచివాలయం రాని కేసీఆర్ పాలన బాగుందని ప్రశంసించడం, ఏమి చూసి పవన్‌కు అద్భుతంగా కనిపించిందని అన్నారు.

కేసీఆర్ బుట్టలో పవన్: వీహెచ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : టీఆర్ఎస్ ప్రభుత్వ ఏపాలన బాగుందని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాన్ కితాబివ్వడం విడ్డూరంగా ఉందని మాజీ ఎంపీ వి. హనుమంతరావు విమర్శించారు. సీఎం చంద్రశేఖర్‌రావు బుట్టలో పవన్‌కళ్యాణ్ పడ్డారని ఆయన ఆరోపించారు. మంగళవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. 24 గంటల విద్యుత్ ఇవ్వక ముందే మెచ్చుకోవడంలో ఆంతర్యమేమిటని ఆయన నిలదీశారు. రైతు ఆత్మహత్యలపైన పవన్ ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. పవన్‌కు జగన్ అవినీతి కనిపించినప్పుడు.. కేసీఆర్ అవినీత కనిపించడం లేదా..? అని ఆయన ప్రశ్నించారు. అవినీతి రహిత పాలనకోసం పార్టీ పెడుతున్నట్లు ప్రకటించిన పవన్ , అవినీతి సీఎంను పొగడటం సరికాదన్నారు. కేసీఆర్‌కు ఎంత మంది భజన చేసినా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే గెలుస్తోందన్నారు.


పెన్షన్ విధానం మారాలి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రజా సమస్యలపై అడగడానికి తమకు అవ కాశం ఇవ్వకుండా, పవన్ కళ్యాన్‌కు అపాయింట్‌మెంట్ ఇవ్వడాన్ని బట్టి చూస్తే సీఎం కేసీఆర్ ఆలోచనా విధానం ఎలాంటిదో అర్ధమవుతూనే ఉందని తెలం గాణ రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. అధికారం చేతి కందగానే ఆయనకు ఆప్తులు శత్రు వులుగా మారారని, శత్రువులు మిత్రులయ్యారని ధ్వజ మెత్తారు. ఇప్పుడున్న పరి స్థితుల్లో మిత్రులకు, శత్రువులకు తేడా లేకుండా పోయిం దని, రాజకీయాలు ఆ స్థాయికి దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ నియా మకాలపై, ఉద్యోగుల కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంపై మంగళవారం ఆయన సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌ను కలిశారు. ఉపాధ్యాయ నియామకాల్లో టెట్ రాసిన అభ్యర్థులకు టీఆర్‌టీ రాసే అవకాశం ఇవ్వాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని మార్చాలని సీఎస్‌ను కోరినట్లు చెప్పారు.

క్రీమిలేయర్ ఎత్తివేయాలి

5న బీసీ విద్యుత్ ఉద్యోగుల మహాసభలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. మంగ ళవారం సంఘం అధ్యక్షుడు కె.కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సరవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న పదివేలమంది బీసీ విద్యుత్ ఉద్యోగులతో మహాసభలు జరపాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే రాజ్యాంగ వసరణ బిల్లు ప్రవేశపెట్టి బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో 54లక్షల ఉద్యోగాలు ఉంటే బీసీ ఉద్యోగులు కేవలం 4.62లక్షల మంది మాత్రమే ఉన్నారన్నారు. 56శాతం జనాభా ఉన్న బీసీలకు ఉద్యోగాల్లో కేవలం 9శాతం మాత్రమే ప్రాతినిధ్యం ఉందన్నారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సులు , కోర్టు తీర్పులు ఉన్నప్పటికీ ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. బీసీ ఉద్యోగులు ప్రమోషన్లు లేక అటెండర్లుగా , వాచ్‌మెన్లుగానే మిగిలిపోతు ఉద్యోగవిరమణ చేయాల్సివస్తోందన్నారు.తెలంగాణ రాష్ట్రంలోని బీసీ విద్యుత్ ఉద్యోగుల మహాసభను జనవరి 5న నిర్వహిస్తున్నట్టు సంఘం అధ్యక్షులు కె కుమార స్వామి, ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్న గౌడ్ తెలిపారు. బీసీ విద్యుత్ ఉద్యోగుల కార్యవర్గ సమావేశం బీసీ భవన్‌లో మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో బ్రమేందర్, యాదగిరి, గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, రవీందర్, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాంకులతో సంబంధం లేకుండా

బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి

ర్యాంకులతో నిమిత్తం లేకుండా బీసీ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను వర్తింప చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ మహాసభ డిమాండ్ చేసింది. ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థుల తరహాలోనే వెనుకబడినవర్గాలకు కూడా కల్పించాలని మహాసభ నేతలు డిమాండ్ చేశారు.మంగళవారం నాడిక్కడ మహాసభ అధ్యక్షుడు రాజేంద్రపటేల్, ఉపాధ్యక్షులు నల్లెల కిషోర్, ప్రదీప్ తదితరులు మాట్లాడుతూ, ప్రైవేటు రంగంలో కూడా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వే,న్లు కల్పించాలన్నారు. అలాగే కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న ఫీజుల దోపిడిని అరికట్టేందుకు విద్యాహక్కు చట్టాన్ని తీసుకరావాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో25శాతం సీట్లు పేదలకు ఇవ్వాలని, బీసీ క్రిమిలేయర్ నిబంధనను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

మందకృష్ణ దీక్ష భగ్నం

- ఉపవాస దీక్షకు అనుమతి ఇవ్వని పోలీసులు
- దీక్షకు యత్నించిన మందకృష్ణ అరెస్టు
- నేడు, రేపు ఆందోళన కార్యక్రమాలు
- 5వ తేదీలోగా పార్లమెంట్‌లో బిల్లురాని పక్షంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయం వరకు నిరసన ప్రదర్శనకు పిలుపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎమ్మా ర్పీ ఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఉపవాస దీక్ష భగ్నమైంది. ఆయనను పోలీ సులు మరో సారి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సీ వర్గీకరణ కోరుతూ మంగళవారం నుంచి 48 గంటల పాటు ఉపవాస దీక్షచేపట్టాలని ఆయన నిర్ణయించారు. ఇందులో భాగంగా దీక్షకు అనుమతి ఇవ్వాల్సిందిగా పోలీసులకు విజ్ఞప్తి చేశారు. దీనిని పోలీసులు తిరస్కరించడంతో పార్శీగుట్టలోని ఎమ్మా ర్పీఎస్ కార్యా లయం లో ఆయన ఉపవాస దీక్షకు పూను క ున్నారు. వెంటనే పెద్దఎత్తున పోలీసులు అక్కడకు చేరుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కొద్దిసేపు పోలీసులు, ఎమ్మా ర్పీస్ కార్యకర్తల మధ్య తోపులాటలు, వాగ్వివాదం చోటుచేసుకుంది.ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ, 24 సంవత్సరాల నుంచి ఓపికతో శాంతియుతంగా వర్గీకరణ కోసంఉద్యమం చేస్తున్నామన్నారు. బీజేపీ ఎస్సీ వర్గీకరణ బిల్లుకు మద్ద తిస్తోంది కానీ...పార్లమెంటులో మాత్రం బిల్లు ప్రవేశపెట్టడం లేదని మండిపడ్డారు. వర్గీకరణపై ఆ పార్టీకీ నిజంగా చిత్తశుద్ధి ఉంటే రెండు రోజుల్లో పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. జీఎస్‌టీ, ఓబీసీ, త్రిబుల్ తలాక్‌పై పలు రాజకీయ పార్టీలు ఒప్పుకోకపోయినా కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభలో బిల్లు ఆమోదం చేపించుకోలేదా? అని ప్రశ్నించారు. వర్గీకరణను వంద రోజుల్లో తేలుస్తామని చెప్పి మూడేళ్ళు అవుతున్నా...ఎలాంటి పురోగతి కనిపించడం లేదని ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. బిల్లుపై ఈ నెల 4వ తేదీ వరకు గడువు ఇస్తున్నామని, లేనిపక్షంలో 5వ తేదీ ఉదయం బీజేపీ రాష్ట్ర కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. వర్గీకరణపై ఉషమెహర్ కమిషన్ వేసింది కాంగ్రెస్ కాబటి లోక్‌సభ, రాజ్యసభలో బిల్లుపై మాట్లాడాలని డిమాండ్ చేశారు. అలాగే 5వ తేదీలోపు రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీకి అఖి లపక్షాన్ని తీసుకోవాలని సూచించారు. హైకోర్టు విభజన కోరకు ఎలా లోక్‌సభలో మాట్లాడారో....పీఎం అపాయింట్‌మెంట్ విషయాన్ని కూడా అలాగే లేవనెత్తాలని తెరాస సభ్యులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఇందులో సాంఘిక సంక్షేమ శాఖ దళితులకే కట్టపెట్టాలన్నారు. దళితుల మీద దాడులను అరికట్టి, అందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. తనను బలవంతంగా అరెస్టు చేసినా కూడా దీక్షను కొనసాగిస్తామని పేర్కొన్నారు. కాగా ప్రభుత్వ తీరునూ నిరసిసూఎమ్మార్పీఎస్ కార్యకర్తలు బుధవారం ఎమ్మార్వో , కలెక్టర్ కార్యాలయాల ముందు ఆందోళనలు శాంతియుతంగా చేయాలని, గురువారం రహదారులపైన శాంతియుత ఆందోళనలు చేయాలని ఆయన పులుపనిచ్చారు. నిర్బంధాలతో దళితులకు దూరం కావద్దని, బాధ్యతతో మా హృదయాలను చూరగొనాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.



దీక్షకు అనుమతి కోరుతూ కమిషనర్‌ను కలసిన మందకృష్ణ

అంతకు ముందు దీక్షకు అనుమతి కోసం ఆయన హైద రాబాద్ నగర పోలీసు కమిషనర్‌ను కలిశారు. శాంతి యుతంగా చేసే తన దీక్షకు ఇందిరాపార్కు వద్దగానీలేదా బాబుఘాట్ వద్ద అనుమతి ఇవ్వాలని కోరారు. కానీ పోలీసులు అను మతి ఇవ్వడానికి నిరాకరించారని మీడియాత మాట్లాడుతూ, మందకృష్ణ తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తంచేశారు. అయితే ఎవరూ అడ్డుకున్నా తమ దీక్ష ఆగదన్నారు. గత ప్రభుత్వా కంటే ఇప్పుడు అణిచివేత ఎక్కువగా ఉందని మండిపడ్డారు. సమస్యల పరిష్కారంలో భాగంగా చేసే ఉద్యమాలకు ప్రభు త్వం అనుమతి ఇవ్వకపోవడం దారుణమన్నారు. భారతి సంస్మరణ సభ పెట్టకపోతే బాగుండేదని చాలామంది అంటు న్నారని....తాము శాంతియుత ర్యాలీ చేశామే తప్ప పోలీసులపై దాడులు చేయలేదని స్పష్టం చేశారు. మిలియన్ మార్చ్‌లో అంత విధ్వంసం చేసిన కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, కోదండరామ్‌లను ఎందుకు అరెస్టు చేయలేదని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్ ప్రజలు సమస్యలపై నగరంలో కాకుండా కరీంగనర్‌లో ధర్నా చేయాలా? అని ప్రశ్నించారు. ఉద్యమంలో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులపై పెట్టిన 307 కేసులు ఏమయ్యాయని ఆయన అడిగారు. దళితులం కాబట్టే తమపై కేసులు పెడుతున్నారని మందకృష్ణమాదిగ ఆరోపించారు.

అసెంబ్లీ తీర్మానాన్ని అవమానించినట్లే : సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగను అరెస్టు చేయ డమంటే.. వర్గీకరణ కోసం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని అవమానించినట్లే అవుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. వర్గీకరణపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లకుండా నిరసనలు తెలిపే ఎమ్మార్పీఎస్ నేతలను అరెస్టు చేయడం టీఆర్ఎస్ ప్రభుత్వానికి తగదని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో హెచ్చరించారు. అన్ని పార్టీలు మద్దతిచ్చినప్పుడు పార్లమెంట్‌లో బిల్లు పెట్టకుండా ఎందుకు ఆలస్యం చేస్తున్నారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వర్గీకరణ విషయం రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, చంద్రశేఖర్‌రావులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్‌పై కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న నిర్బంధాన్ని ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలన్నారు.

ఓయూలో కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం..

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ఉపవాస దీక్ష చేస్తున్న మంద కృష్ణమాదిగ అరెస్టు చేసిదానికి నిరసనగా మంగళవారం రాత్రి ఉస్మానియా యూనివర్సిటిలో ఆర్ట్స్ కాలేజీ వద్ద సీఎం చంద్రశేఖర్‌రావు దిష్టిబొమ్మను మాదిగ విద్యార్థి ఫెడరేషన్ నాయకులు దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పల్లెర్ల సుధాకర్, కొమ్ము శేఖర్, సంగమేశ్వర్, పరుశరామ్, సోమశేఖర్, సురేష్, మురళీకృష్ణ సుమంత్, రమేశ్, బెనర్జీ, రామకృష్ణ తిమ్మప్ప, బాబు, భాస్కర్ తదితరులు ఉన్నారు.

మంద కృష్ణ అరెస్టు.. మాదిగ జాతిపై యుద్ధమే

ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు మాదిగ జాతిపైన యుద్ధం చేస్తున్నారని తెలంగాణ ఇంటిపార్టీ అధ్యక్షుడు చెరుకు సుధాకర్‌గౌడ్ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం మంద కృష్ణమాదిగ దీక్ష చేస్తుంటే పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. భవిష్యత్‌లో టీఆర్ఎస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుందన్నారు.

కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌లో కొనసాగుతున్న మందకృష్ణ దీక్ష

అనుమతి లేకుండా ఉపవాస దీక్షకు పూనుకున్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణను పోలీసులు అరెస్టు చేసి కంచన్‌బాగ్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అయితే అక్కడ కూడా ఆయన తన దీక్షను కొనసాగిస్తున్నారు. మందకృష్ణతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు రాజమల్లయ్య, సాదం వెంకటేశ్ యాదవ్, అశోక్‌తో పాటు మరో 20 మంది కూడా ఉన్నారు.

నేటి నుంచి ఎంపీలో ఆరెస్సెస్, బీజేపీ సమీక్ష

- వర్తమాన సవాళ్లపై అధినేతల మేధోమథనం
- భవిష్యత్తు చర్యలపై దిశానిర్దేశం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్), భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మూడు రోజుల పాటు నిర్వహించనున్న సమీక్షా సమావేశాలు నేటి నుంచి మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో ప్రారంభం కానున్నాయి. జాతీయ భద్రత, దేశ ఆర్థిక పరిస్థితి, పాక్ - చైనాలతో భారత దేశ సంబంధాలు సహా దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై బీజేపీ, ఆరెస్సెస్ అగ్రనేతలు సమాలోచనలు జరపనున్నారు. వీటితో పాటు దేశవ్యాప్తంగా సమాజంలో కులాల మధ్య నెలకొన్న విబేధాలు, తద్వారా తలెత్తుతున్న అశాంతి గురించి కూడా ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. ఈ మధ్యనే జరిగిన గుజరాత్ ఎన్నికల సమయంలో మూడు సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం వహించిన ముగ్గురు యువనేతలు బీజేపీని ఒక దశ లో ఓటమి భయంతో వణికించారు. చివరకు 99 సీట్లకే పరిమితం చేయడంలో కీలక పాత్ర పోషించారు. రాజకీయ ప్రత్యర్థులు సామాజిక సమీకరణాలతో బీజేపీ విజయావకాశాలపై గండికొడుతున్న తీరును సమావేశాల్లో విశ్లేషించుకునే అవకాశముందని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ సమావేశాల్లో ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్, బీజేపీ అధినేత అమిత్ షాతో పాటు ఆరెస్సెస్‌లోని ఇతర కీలక నేతలు సురేష్ భయ్యాజి జోషి, కృష్ణ గోపాల్, దత్తాత్రేయ హోసబలె కూడా హాజరవుతున్నారని సమాచారం.

ప్రపంచ సంక్షేమాన్ని కోరుతూ ఆధ్యాత్మికవేత్త ధ్యానేశ్వర్ రూపొందించిన ప్రార్థన 'పసాయిదాన్'ను 3 రోజుల పాటు జరిగే ఈ సమీక్షా సమావేశాలకు పేరుగా నిర్ణయించారు. గత 6 నెలల కాలంలో జరిగిన ప్రధాన సంఘటనలపై సమీక్షతో పాటు సవాళ్లకు ఎలా ఎదుర్కోవాలన్న విషయంపై మేథోమథనం జరుగుతుందని సంఘ్ నేతలు చెబుతున్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన వస్తు సేవల పన్ను (జీ ఎస్టీ) ప్రభావం, దేశ ఆర్థిక స్థితిగతులు, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ ఎన్నికలు, డోక్లాం ఉద్రిక్తతలు వంటివి ఈ సమీక్షలో భాగమవుతాయని ఆరెస్సెస్ ప్రతినిధులు వెల్లడించారు. ప్రతి సంవత్సరం మార్చి నెలలో జరిగే ఆరెస్సెస్ సర్వసభ్య సమావేశానికి భిన్నంగా వర్తమానాంశాలపైనే ఈ పసాయిదాన్ దృష్టి పెడుతుందని వారంటున్నారు. ఈ సమావేశాల నిర్వహణ కంటే చాలా ముందు నుంచే ఆరెస్సెస్ అగ్రనేతలు సమగ్ర కసరత్తు చేశారని సంఘ్ నేతలు చెబుతున్నారు. గత 6 నెలల కాలంలో 18 నగరాలు, పట్టణాల్లో పర్యటించిన ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్, సమాజాన్ని ప్రభావితం చేసే వివిధ వర్గాల ప్రజలు, ప్రతినిధులను కలిశారు. ఇందులో మాజీ సైనికోద్యోగులు, ప్రొఫెసర్లు, కళాకారులు, సామాజికవేత్తలు, ఇతర ప్రజా సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

గత ఏడాది విజయదశమి సందర్భంగా మోహన్ భగవత్ చేసిన రాజకీయ ప్రసంగంలో ప్రస్తావించిన కాశ్మీర్ సమస్య, రోహింగ్యా శర ణార్థుల విషయం, గోరక్షణ, ఆర్థిక పరిస్థితి, కేరళ - బెంగాల్ రాష్ట్రాల్లో పరిస్థితులు, జాతీయత వంటి అంశాలపై ఆయన అభిప్రాయాలు సేకరించారని తెలుస్తోంది. వీటిలో కాశ్మీర్ అంశం గురించి మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందు పరిచిన ఆర్టికల్ 370 ద్వారా జమ్ము -కాశ్మీర్ పొందుతున్న స్వయంప్రతిపత్తిని తొల గించాలని, తద్వారా దేశం లోని ఇతర రాష్ట్రాలతో సమానంగా మార్చాలని వ్యాఖ్యా నించారు. ఈ విషయంలో ఆరెస్సెస్ -బీజేపీలు మొదటి నుంచి ఒకే వైఖరితో స్వయం ప్రతిపత్తిని వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే.

ఇక రోహింగ్యా శరణార్థుల గురించి మాట్లాడుతూ, వారికి ఆశ్రయం కల్పించే ముందు దేశ భద్రతను తప్ప నిసరిగా పరి గణలోకి తీసుకోవాలని కూడా అన్నారు. మోహన్ భగవత్ జరిపిన యాత్రలకు తోడు, ఈసారి సంఘ్‌లో కీలక నేతలుగా ఉన్న అరుణ్ కుమార్, కృష్ణగోపాల్, దత్తాత్రేయ హోసబలె దేశవ్యాప్తంగా వివిధ నగరాల పర్యటన చేపట్టారు. సామాజిక, ఆర్థిక వ్యవహారాల్లో దేశం ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. వీటన్నింటినీ క్రోడీకరించి రూపొందించిన నివే దిక ను ఉజ్జయినిలో జరిగే సమావేశాల్లో ప్రవేశపెట్టి, దానిపై సమగ్రంగా చర్చించనున్నారని తెలుస్తోంది.

రసాయనిక వ్యవసాయంతో

ప్రాణాంతక వ్యాధులు

- పంటలను తగులబెట్టడంతో పెరుగుతున్న భూతాపం: పద్మశ్రీ సుభాష్ పాలేకర్

అమరావతి, ఆంధ్రప్రభ: పాశ్చాత్య పద్ధతుల్లో అధిక దిగుబడుల కోసం చేసే రసాయనిక వ్యవసా యంతో పండించే పంటలు ప్రాణాంతక వ్యాధికారకా లుగా మారుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయని పద్మశ్రీ సుభాష్ పాలేకర్ తెలియజేశారు. గత మూడు రోజులుగా అమరావతి కేంద్రంగా జరుగుతున్న ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ కార్యక్రమం లో మంగళవారం ఆయన పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ఇటీవల భారత ప్రభుత్వం ప్రకటించిన విధంగా కర్బన ఉద్గారాలను 22 శాతం తగ్గించాలంటే ఒక్క ప్రకృతి సేద్యంతోనే అది సాధ్యమవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం లో పంటలను తగుల బెట్టే దుర్మార్గపు చర్యలు ఉండవని, అలాగే మిథేన్ వాయువును వెలువరించే ఎటువంటి కంపోస్టులను కూడా తయారు చేయడం ఉండదన్నారు. ప్రస్తుతం అధికశాతం రైతాంగా అవలంభిస్తున్న నాడెపు కంపోస్టు, వర్మి కంపోస్టు, పేడ ఎరువులు ద్వారా అనేక హరిత గృహ వాయువు లు వెలువడి భూతాపం విపరీతంగా పెరుగుతుం దని, దీని వలన వాతావరణంలో సమతుల్యం లోపించి అతివృష్టి, అనావృష్టిలు సంభవిస్తున్నా యని తెలిపారు. రసాయనిక సేద్యంలో వాడే ఎరువులు, పురుగుల మందుల వలన పంటలు ప్రాణాంతక వ్యాధులకు కారకాలుగా మారి, వ్యవసాయ కూలీలకు గొంతు క్యాన్సర్, వినియో గదారులకు మధుమేహ వ్యాధి, ఉబ కా యం, పలు రకాల కాన్సర్లు సోకుతున్నాయని చెప్పారు.

ప్రకృతి సేద్యంలో వేరు వ్యవస్థ పటిష్టం..

ప్రకృతిసేద్యంలోకాష్టాచ్ఛాదన చేయడం వలన వేరు వ్యవస్థవద్ద జీవన ద్రవ్యం తయారై మొక్కలు దృఢంగా పెరుగుతాయని పాలేకర్ వివరిం చారు. అన్నపూర్ణలాంటి జీవనద్రవ్యంలో సకల పోషకాలు ఉంటాయని, ప్రకృతి ధర్మంలో భాగంగా ఇది వేరు వ్యవస్థ వద్దనే తయారవుతుం దన్నారు.

దీని వలన భూమికి, భూసారానికి హానిని కలిగించే ఎటువంటి వాయువులను విడుదల కావని చెప్పారు. కానీ వేరుకు సంబంధం లేకుండా ఎక్కడో తయారయ్యే రసాయనాలను ఎరువులు, మందుల రూపంలో వాడటం వలన భూసారం దెబ్బతినడం తోపాటు దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయని తెలిపారు. దీనితో రైతులకు వ్యవసాయ పెట్టుబడులు భారీగా పెరుగుతాయని, తద్వారా అప్పులపాలై పండించిన పంటలకు తగిన రేటు రాక రైతన్నలు బలవర్మరణాలకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు.

ప్రపంచబ్యాంక్ పరిశీలనలో

అమరావతి దరఖాస్తు


రాజ్యసభలో కేంద్ర ఆర్థికమంత్రి జైట్లీ వెల్లడి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని అమరావతి నిర్మాణం చేపట్టేందుకు 3,324 కోట్ల రూపాయల రుణం కోరుతూ ఆ రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన దరఖాస్తులు ప్రస్తుతం ప్రపంచ బ్యాంక్ పరిశీలనలో ఉందని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి అరుణ్ జైట్లీ వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు విజయసాయిరెడ్డి రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ... రుణం మంజూరు విషయంలో ప్రపంచ బ్యాంక్ అధ్యయనం, మదింపు ప్రాథమిక దశలో ఉన్నట్టు ఆయన తెలిపారు. ప్రాజెక్ట్ మదింపు ప్రక్రియ పూర్తయ్యాక రుణానికి సంబంధించిన సంప్రదింపులు ప్రారంభమవుతాయని, ఆ తర్వాతే ప్రపంచ బ్యాంక్ రుణం మంజూరు చేస్తుందని అరుణ్ జైట్లీ అన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి జనరల్ కేటగిరీ రాష్ట్రాలు ప్రపంచ బ్యాంక్ వంటి ఆర్థిక సంస్థల నుంచి పొందే ఆర్థిక సాయం మొత్తం ప్రాజెక్ట్ వ్యయంలో 70 శాతానికి మించకూడదు. మిగిలిన 30 శాతం రాష్ట్ర ప్రభుత్వం తమ సొంత వనరుల నుంచే సమకూర్చుకోవాల్సి ఉంటుందని ఆయన వెల్లడించారు. అమరావతి రాజధాని అభివృద్ధి ప్రాజెక్ట్‌కు ప్రపంచ బ్యాంక్ రుణం ఇంకా ఆమోదం పొంద నందున నిధులు, వాటి వినిమయ పత్రాల సమర్పణ ప్రసక్తే లేదని విజయసాయిరెడ్డికి అరుణ్ జైట్లీ జవాబిచ్చారు.

ఏపీ అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ నిర్మాణానికి రూ. 1500 కోట్లు

ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిలో అసెంబ్లీ, రాజ్ భవన్, హైకోర్టు, సెక్రటేరియట్ వంటి తదితర సదుపాయాల నిర్మాణానికి గడిచిన మూడేళ్లలో రూ.1500 కోట్ల రూపాయల నిధులను విడుదల చేసినట్టు ఆర్థిక శాఖా సహాయ మంత్రి పి.రాధాకృష్ణన్ వెల్లడించారు.

రాజ్యసభలో ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు రాతపూర్వక జవాబిస్తూ... ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా అమరావతిలో సౌకర్యాల కల్పన కోసం ప్రత్యేక సహాయం కింద కేంద్రం ఈ నిధులను విడుదల చేసినట్టు తెలిపారు. రాజ్ భవన్, అసెంబ్లీ భవనాల నిర్మాణం కోసం 2014-15 ఆర్థిక సంవత్సరంలో రూ. 500 కోట్ల రూపాయల, 2015-16లో రాజధాని నిర్మాణం కోసం రూ. 350 కోట్లు, మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ. 200 కోట్లు, 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ.450 కోట్ల నిధులు విడుదల చేసినట్టు రాధాకృష్ణన్ వివరించారు. ఆయా నిర్మాణాల కోసం ఇప్పటివరకూ కేంద్రం రూ. 1583 కోట్లు ఖర్చు చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం నీతి ఆయోగ్‌కు పత్రాలు సమర్పించిందని కేంద్ర మంత్రి తన సమాధానంలో పేర్కొన్నారు.




9లోగా జీతాలు చెల్లించండి

రేయాన్స్ యాజమాన్యానికి ప్రభుత్వ హెచ్చరిక

హైదరాబాద్, ఆంధ్రప్రభ: భూపాలపల్లి జిల్లా కమలాపూర్ రేయాన్స్ ఫ్యాక్టరీ (బిల్ట్ - బల్లాపూర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్) కార్మికులకు ఈనెల 9వ తేదీలోగా నెల జీతం చెల్లించాల్సిందిగా కార్మిక మంత్రి నాయిని నర్సింహారెడ్డి ఆదేశించారు. ఫ్యాక్టరీని మూత వేయడంతో దాదాపు 750 మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని, వారందరికీ జీతాలు చెల్లించి 10వ తేదీన సచివాలయంలో జరిగే సమావేశానికి యాజమాన్యం తరపున కంపెనీ సీఈవో హాజరు కావాలని నాయిని ఆదేశించారు.ఫ్యాక్టరీ మూతపడి రెండేళ్ళు గడుస్తున్నా కార్మికుల సమస్యలు తీర్చడం లేదని రేయన్స్ ఫ్యాక్టరీ కార్మిక సంఘాల జేఏసీ ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. మంత్రులు నాయిని, కడియం శ్రీహరి, చందూలాల్ జేఏసీ నేతలతో మంగళవారం సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఫ్యాక్టరీ యాజమాన్య ధోరణిపై మంత్రులకు యూనియన్ ప్రతినిధులు వివరించారు. 32 నెలలుగా వేత నాలు ఇవ్వడం లేదని, వేతనాలు అడిగితే గడువులు పెడుతున్నారేగానీ తమ గోడు పట్టించుకోవడం లేదని వారు ఫిర్యాదు చేశారు. 9లోగా జీతాలు చెల్లించకపోతే ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని మంత్రులు హెచ్చరించారు.

ఎంసెట్ కన్వీనర్‌గా యాదయ్య



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో మే 2 నుంచి 5 వరకు జరిగే ఎంసెట్ కన్వీనర్‌గా తిరిగి జెఎన్‌టియు రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్ యాదయ్యను ఎంపిక చేశారు. లాసెట్ కన్వీనర్‌గా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్‌బి ద్వారకానాథ్‌ను ఎంపిక చేశారు. ఐసెట్ కన్వీనర్‌గా కాకతీయ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ ఎం సుబ్రమణ్య శర్మను ఎంపిక చేశారు. గతంలో ఈ రెండు సెట్లను నిర్వహించిన కన్వీనర్లు పదవీ విరమణ చేయడంతో కొత్తవారిని ఎంపిక చేసినట్టు తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. మిగిలిన అన్ని సెట్లకు పాత కన్వీనర్లనే ఎంపిక చేశామన్నారు. మే 31 లోప ు అన్ని ప్రవేశ పరీక్షలను పూర్తి చేయనున్నట్టు తెలిపారు. ప్రవేశ పరీక్షల తేదిలను ప్రకటించిన నేపథ్యంలో వాటికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ, పరీక్ష ఫీజులను నిర్ణయించడానికి కన్వీనర్లు త్వరలోనే సమావేశాలను ఏర్పాటు చేసి వివరాలను వెల్లడిస్తారని తెలిపారు. మే 9న ఈ సెట్, 17న ఐ సెట్, 25న లా సెట్, 26న పీజీ లాసెట్, 27న పీజీ ఈసెట్, 31న ఎడ్ సెట్‌ను నిర్వహిస్తారు. జాతీయ పరీక్షల తేదిలకు ఎటువంటి ఆటంకం రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి రూపొందించిన 2018 డైరీని మండలి చైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి, టిఏఎఫ్ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ స్వరూప్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ లింబాద్రి, ప్రొఫెసర్ వెంకటరమణ, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి డాక్టర్ ఎన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీజేఎల్ అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా మధుసూదన్‌రెడ్డి తిరిగి ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో డాక్టర్ పి మధుసూదన్‌రెడ్డి తిరిగి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జి రామానుజ చారీ, ప్రధాన కార్యదర్శిగా బాబురావు ఎన్నికయ్యారు. ఫైనాన్స్ కార్యదర్శిగా కవితా కిరణ్, లేడి కార్యదర్శిగా టి సుధారాణి ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీగా లక్ష్మణ్‌రావు, ఉపాధ్యక్షులుగా ఎస్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మొత్తం 20 మందితో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

నంద్యాల టీడీపీలో మరో వివాదం

అమరావతి, ఆంధ్రప్రభ: నంద్యాల ఉప ఎన్నికలు ముగిసిన అనంతరం క ూడా ముఖ్యమంత్రికి తెలుగుదేశం పార్టీలో వివాదాల బెడద తప్పడం లేదు. ఏ సమస్య తలెత్తినా పరిష్కరించడంలో తనదైన శైలిని ప్రదర్శిస్తున్న ముఖ్యమం త్రికి ఆళ్ళగడ్డ, నంద్యాల నియోజకవర్గాలకు చెందిన నేతల తీరుతో మరో సమస్య ఎదురైంది. తాజాగా తలెత్తిన వ్యవ హారంపై ముఖ్యమంత్రి వద్దనే తాడోపేడో తేల్చుకునేందుకు మంత్రి భూమా అఖిలప్రియ రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రిని కలిసి సీనియర్ నేత ఏ.వి. సుబ్బారెడ్డిపై ఫిర్యాదు చేయాలని సంకల్పించినట్టు సమాచారం.



సచివాలయంలో హోంమంత్రి నాయిని నరసింహా రెడ్డిని కలిసిన కువైట్ భారత రాయబారి కే. జీవసాగర్



ఎస్‌బీఐకి కాసుల పంట!



● నికర లాభాల కంటే.. జరిమానాల వసూళ్ళు ఎక్కువ ● కనీస బ్యాలెన్స్ నిబంధనలతో భారీగా బాదుడు ● జరిమానాలతో రూ.1,711 కోట్ల ఆరాయం ● ఎస్‌బీఐ క్యూ2 నికరలాభం రూ.1,581.55 కోట్లు మాత్రమే

న్యూఢిల్లీ : ఆర్‌బీఐ నిబంధనలు ప్రభుత్వరంగానికి చెందిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కి ఆయాచితవరంగా మారాయి. పొదుపు ఖాతాలో కనీస నిల్వల కంటే తగ్గితే ఖాతాదారు నుంచి స్వల్పమొత్తంలో రుసుము వసూలు చేయాలనే నిబంధన బ్యాంకులకు కాసులపంట పండిస్తోంది. ఖాతాదారుడికి అందించే సేవలకు గాను ఖాతాదారుడు తన ఖాతాలో కనిష్టంగా కొంత మొత్తం ఉంచాలని, లేదంటే వారి నుంచి స్వల్పంగా రుసుము వసూలు చేయాలని ఆర్‌బీఐ కొత్త నిబంధనల సారాంశం.

ఈ నిబంధనే పలు బ్యాంకులకు కాసులు వర్షం కురిపించింది. ఆర్థికమంత్రిత్వశాఖ విడుదల చేసిన గణాంకాలను బట్టి చూస్తే.. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా గతేడాది ఏప్రిల్ నుంచి నవంబర్ కాలానికి మొత్తం రూ.1,711 కోట్లు వసూలు చేసింది. ఇవి ఖాతాదారులు తమ ఖాతాలో కనీస నిల్వలు ఉంచనందుకు చెల్లించిన జరిమానాలుగా చెప్పుకోవచ్చు. ఇదే ఎస్‌బీఐ జులై నుంచి సెప్టెంబర్ త్రైమాసికంలో నికరలాభం రూ.1,581.55 మాత్రమే ఆర్జించగలిగింది. దీని బట్టి చూస్తే బ్యాంకు జరిమానాల ద్వారానే పెద్దమొత్తంలో ఆదాయం సంపాదించినట్లు తెలుస్తోంది. అదే ఏప్రిల్ - సెప్టెంబర్ కాలంలో ఆర్జించిన నికరలాభం రూ.3,586 కోట్లతో పోల్చుకుంటే మొత్తం జరిమానాలో 50 శాతంగా చెప్పుకోవచ్చు. కాగా ఈ జరిమానాల తంతు ఐదు సంవత్సరాల తర్వాత ఈ ఆర్థిక సంవత్సరంలో తిరిగి ప్రవేశపెట్టారు.

SBI'S MONTHLY AVERAGE BALANCE REQUIREMENT

Region	MAB	Penalty Charges
Metro	₹ 5000	₹ 50-100
Urban	₹ 3000	₹ 50-100
Semi-Urban	₹ 2000	₹ 50-100
Rural	₹ 1000	₹ 20-50

Source: Shrutika.bhosale/India.com

ప్రభుత్వరంగానికి చెందిన పంజాబ్ నేషనల్ బ్యాంకు ఏప్రిల్ - నవంబర్ కాలంలో రూ.97.34 కోట్లు జరిమానాల రూపంలో వసూలు చేస్తే.. సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.68.67 కోట్లు, సెంట్రల్ బ్యాంకు రూ.62.16 కోట్లు తమ తమ పరిధిల్లో కస్టమర్ల నుంచి ముక్కుపిండి వసూలు చేసుకున్నాయి. ఇటీవల ఐఐటి - ముంబైకి చెందిన స్టాట్సిటిక్ ప్రొఫెసర్ అధ్యయనంలో.. పీఎస్‌యు బ్యాంకులతో పాటు ప్రైవేటు బ్యాంకులు అనైతికంగా ప్రజలనుంచి జరిమానాల రూపంలో ఎలా దోచుకుంటున్నాయో గణాంకాలతో సహా బట్టబయలు చేశారు. చాలా మటుకు బ్యాంకులు సరాసరి 78 శాతం వరకు కనీస బ్యాలెన్స్ పేరుతో వసూలు చేశాయనిచెబుతున్నారు. ఆర్‌బీఐ కొత్త నిబంధనలు కస్టమర్‌ను దృష్టిలో ఉంచుకొని తక్కువమొత్తంలో వసూలు చేసుకునే వెసలుబాటు కల్పిస్తే ఈ బ్యాంకులు తమ ఇష్టం వచ్చినట్లు ఖాతాదారుల నుంచి వసూలు చేసుకుంటున్నాయి. తాజా పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ఆర్‌బీఐ సరైన గైడ్‌లైన్స్ ఇవ్వాలని, బ్యాంకు ఖాతాలో కనీస నిల్వలు లేకపోతే ఎంత మొత్తం వసూలు చేయాలో ఏ రకంగా శ్లాబ్‌లు విధించాలో ఆర్‌బీఐ స్పష్టమైన గైడ్‌లైన్స్ ఇవ్వాలని బ్యాంకింగ్ రంగానికి చెందిన నిపుణులు సూచిస్తున్నారు. గుడ్డిలో మెల్లగా ప్రధానమంత్రి జన్‌ధన్ యెజన ఖాతాలపై మాత్రం ఎలాంటి రుసుము లేకుండా కనికరించారు. ఐదు సంవత్సరాల తర్వాత తిరిగి ఎస్‌బీఐ ఖాతాలో కనీస నిల్వలు ఉంచాలన్న నిబంధన తీసుకొచ్చింది.

ఒక వేళ మీరు ఎస్‌బీఐ ఖాతాదారు అయితే గుర్తుంచుకోవాల్సిన అంశాలు ఇవి :

మెట్రో నగరాల్లో ఉండే ఖాతాదారులు ఖాతాలో కనీసం రూ.5,000 నిల్వలు ఉంచాలి. తర్వాత సెప్టెంబర్‌లో దాన్ని రూ.3,000కు సవరించింది. అర్బన్, సెమి అర్బన్, రూరల్ ప్రాంతాల విషయానికి వస్తే వరుసగా రూ.3,000, రూ.2,000 రూ.1,000గా నిర్ణయించింది. అయితే పెన్షనర్లు, ప్రభుత్వం నుంచి లభించే లబ్ది ఖాతాదారులకు మినహాయింపులు ఇచ్చింది. అలాగే మైనర్లకు కూడా అక్టోబర్ 1 నుంచి తప్పించింది.

ఒక వేళ బ్యాంకులో కనీస నిల్వలు లేవంటే : ఖాతాలో కనీస నిల్వలు లేవంటే రూ.100 జరిమానాతో పాటు సేవల పన్ను వడ్డిస్తారు. మెట్రో నగరాల్లో రూ.100తో పాటు సేవల పన్నుఅదనం, ఒక వేళ ఖాతాలో కనీస నిల్వల కంటే 75 శాతం తగ్గితే రూ.100తో పాటు సేవలపన్ను విధిస్తారు. ఒక వేళ50 శాతం తగ్గితే రూ.50తో పాటు సేవల పన్ను బాదుతారు. అదే గ్రామీణ ప్రాంతాల్లో అయితే జరిమానా రూ.20 నుంచి రూ.50 వరకు ఉంటుంది దీనికి సేవలపన్ను అదనం.

2014 నుంచే ఎన్‌పీఏలు

అర్థిక మంత్రి అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకుల్లో ఏప్రిల్ 1, 2014 నుంచే పెద్దమొత్తంలో మొండిబకాయిలు పేరుకుపోయాయి. ఈ బ్యాంకుల్లో రుణాలు మంజూరు చేసే ముందు సరైన అధ్యయనం చేయకుండా ఎలాంటి సెక్యూరిటీలు తీసుకోకుండా అడ్డుఅదుపు లేకుండా రుణాలు ఇవ్వడంతో ఈ మొండిబకాయిలే ప్రస్తుతం గుదిబండగా మారిపోయాయని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ రాజ్యసభలో మంగళవారం నాడు ప్రస్తావించారు.


బ్యాంకుల్లో పేరుకుపోయిన మొండిబకాయిలపై అడిగిన ప్రశ్నకు జైట్లీ సమాధానమిస్తూ.... తమ ప్రభుత్వం బ్యాంకు రుణాలను (రైటాఫ్) రద్దు చేయలేదని స్పష్టం చేశారు. ఒక అంశం మాత్రం స్పష్టం ... బ్యాంకులు ఎలాంటి అధ్యయనం చేయకుండా నిర్లక్ష్యంగా ఇష్టం వచ్చినట్లు రుణాలు మంజూరు చేయడంతో ప్రస్తుతం ఇలాంటి దారుణమైన పరిస్థితిని ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న బకాయి దారుడు బ్యాంకుకు అప్పు తీర్చాల్సిందే. అయితే ఇక్కడ బ్యాంకులు ఆదాయపు పన్ను మినహాయింపు కోసం తీసుకున్న రుణం పేరు మార్చాలని కోరింది. దీనికి ప్రజల్లో ఒక అపోహ నెలకొందని.. ప్రభుత్వం లేదా బ్యాంకులు రూ.55,000 కోట్ల వరకు రుణాలు మాఫీ చేసిందని అపోహ చెందుతున్నారని అలాంటిది ఏమీ లేదని బకాయిలు దారుడు బ్యాంకుకు చెల్లించాల్సింది చెల్లించాల్సిందేనన్నారు. మార్చి 31, 2014న రూ.2.16 లక్షల కోట్లున్న ఎన్‌పీఏ సెప్టెంబర్ 30, 2017 నాటికి రూ.7.33 లక్షల కోట్లకు చేరాయి. ఎస్‌బీఐ వాటా అత్యధికంగా రూ.1,86,115 కోట్లు కాగా... పంజాబ్ నేషనల్ బ్యాంకు రూ.57,630కోట్లు, బ్యాంకు ఆఫ్ ఇండియాల రూ.49,307 కోట్లుగా తేలింది. జైట్లీ మాట్లాడుతూ ఏ కార్పొరేట్ రుణాన్ని రద్దు చేయలేదన్నారు.

పొదుపు బాండ్ స్కీం కొనసాగుతుంది



న్యూఢిల్లీ : రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బాండ్ స్కీంను పూర్తిగా ఎత్తివేయలేదని ఆర్థికమంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. అయితే వడ్డీరేట్లను 8 శాతం నుంచి 7.75 శాతానికి తగ్గించిదని వివరణ ఇచ్చింది. గవర్నర్‌మెంట్ ఆఫ్ ఇండియా సేవింగ్స్ (టాక్సబుల్) బాండ్స్ 2003 పై ప్రభుత్వం 8 శాతం వరకు వడ్డీ రేటు ఇచ్చేవి. ఇవి మంగళవారం నుంచి నిలిపివేయడం జరిగింది. కాగా 8 శాతం సేవింగ్స్ బాండ్స్ స్కీంను ఆర్‌బీఐ బాండ్ స్కీమ్‌గా ప్రజలకు తెలుసు.. ప్రస్తుతానికి ఈ బాండ్ స్కీంను నిలిపివేయడం జరిగింది. దీని స్థానంలో 7.75 శాతం సేవింగ్స్ బాండ్ స్కీంను తీసుకొచ్చినట్లు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి ఎస్ సీ గార్గ్ ట్విటర్లలో పేర్కొన్నారు. ఈ టాక్సబుల్ బాండ్లపై ప్రవాస భారతీయులకు తప్పించి అందరు కొనుగోలు చేయవచ్చు... పెట్టుబడులపై ఎలాంటి పరిమితిలేదు. కాగా 2003లో ప్రభుత్వం రిటైల్ ఇన్వెస్టర్లను ప్రోత్సహించడానికి 8 శాతం వడ్డీని ఆఫర్ చేసింది. ఈ బాండ్లు ఏప్రిల్ 21, 2003 నుంచి సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉంచారు. దీని కాలపరిమితి ఆరు సంవత్సరాలు. పెట్టుబడులపై ఎలాంటి పరిమితి లేదు. ఎంతైనా పెట్టుబడులు పెట్టుకోవచ్చు.

మార్కెట్ ఫ్లాట్



ముంబై: స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు స్వల్పనష్టాలతో ముగిసాయి.. మదుపరులు క్యూ3 ఫలితాలతో పాటు గ్లోబల్ మార్కెట్లో ముడిచమురుధరలపై దృష్టి పెట్టారు. దీంతో పాటు యూరోపియన్ మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ కావడంతో సెంటిమెంట్ ప్రకారం దాని ప్రభావం దేశీయ మార్కెట్లపై కనిపించింది. సెన్సెక్స్ కేవలం 0.49 పాయింట్లు క్షీణించి 33,812.26 వద్ద ముగిసింది. జనవరి ఒకటవ తేదీని 244.08 పాయింట్లు నష్టపోయిన విషయం తెలిసిందే. నిఫ్టీ మాత్రం 6.65 పాయింట్లు లాభపడి 10,442.20 వద్ద ముగిసింది.

ఈ వారంతం నుంచి క్యూ3 ఫలితాలు సీజన్ మొదలవుతుంది. అటు తర్వాత ఇన్వెస్టర్లు బడ్జెట్‌పై దృష్టిపెడతారు. తయారీ రంగానికి చెందిన పీఎంఐ జోరందుకున్నా దాని ప్రభావం మార్కెట్లపై కనిపించలేదు. బీఎస్‌ఈలో అత్యధికంగా నష్టపోయిన షేర్లలో బీపీసీఎల్ 2.12 శాతం, హెచ్‌పీసీఎల్ 1.98 శాతం, ఐఓసీ 0.83 శాతం నష్టపోయాయి. భారతి ఎయిర్‌టెల్ 2.24శాతం వరకు నష్టపోయింది. ఎస్‌బీఐ 1.35 శాతం, ఎల్అండ్‌టి 1.01 శాతం, యాక్సిస్ బ్యాంకు 0.91 శాతం, టీసీఎస్ 0.79 శాతం, ఐటీసీ 0.76 శాతం, అదానీ పోర్ట్స్ 0.62 శాతం, హిందుయూనీలీవర్ 0.58 శాతం, ఇన్ఫోసిస్ 0.49 శాతం, ఎస్ బ్యాంకు 0.49 శాతం, ఐసీఐసీఐబ్యాంకు 0.42 శాతం, వరకు నష్టపోయాయి. దీనికి వ్యతిరేకంగా ఓఎన్‌జీసీ 2.36 శాతం, కోల్ ఇండియా 1.46 శాతం, ఎన్టీపీసీ 1.19 శాతం, ఇండస్‌ఇండ్ బ్యాంకు 1.15 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 0.87శాతం, టాటాస్టీల్ 0.75 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 0.70 శాతం లాభపడ్డాయి.

వచ్చే ఏడాది నుంచి జీడీపీ వృద్ధిరేటు జోరు: హెచ్‌ఎస్‌బీసీ



న్యూఢిల్లీ : రాబోయే కొన్ని సంవత్సరాల భారత వృద్ధిరేటు జోరందుకుంటుందని 2019-20 నాటికి జీడీపీ వృద్ధిరేటు 7.6 శాతానికి ఎగబాకుతుందని హెచ్‌ఎస్‌బీసీ ఒక నివేదికలో వెల్లడించింది. పెద్దనోట్ల రద్దుతో పాటు జీఎస్టి ఇబ్బందుల నుంచి భారత్ గట్టెక్కిందని నివేదికలో పేర్కొంది. హచ్‌ఎస్‌బీసీ అంచనా ప్రకారం 2018-19 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 7.0 శాతం, ఈ ఆర్థిక సంవత్సరం 6.5 శాతం నమోదు కావచ్చునని తేల్చి చెప్పింది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టి ప్రభావంతో జీడీపీ వృద్ధిరేటుపై కనిపిస్తుందని నివేదకిలో వివరించింది. ప్రభుత్వం తీసుకొచ్చిన నిర్మాణాత్మకమైన సంస్కరణల వల్ల దీని ఫలాలు 2020 తర్వాత చేతికి అందివస్తాయని తెలిపింది. వృద్ధిరేటు క్రమంగా పుంజుకుంటూ ముందుకుపోతుందని తేల్చి చెప్పింది. ఆర్‌బీఐ మాత్రం వడ్డీరేట్లను తగ్గించదని స్పష్టం చేసింది. ప్రస్తుతానికి ఇవే రేట్లు కొనసాగుతాయని అంచనా వేసింది. ద్రవ్యోల్బణం నాలుగు శాతం వద్ద స్థిరపడుతుందని నివేదికలో పేర్కొంది.

5 నుంచి జీఎస్‌టీపై ఎఫ్‌ట్యాప్సీ అవగాహన సదస్సు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)పై సందేహాలు, ఫిర్యాదుల నివృత్తిపై ఎఫ్‌ట్యాప్సీ నాలుగు రోజులపాటు సర్టిఫికెట్ కోర్సును నిర్వహించనుంది. గత జులైలో అమల్లోకి వచ్చిన జిఎస్‌టిపై తలెత్తిన సందేహాల నివృత్తి ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. ఇప్పటికీ అర్థంకాని సాంకేతిక అంశాలు, సూక్ష్మ, చిన్నతరహా వ్యాపారస్తులు జిఎస్‌టి చెల్లింపుల్లో ఎదురవుతున్న సాంకేతిక అంశాలపై ఈ సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌ట్యాప్సీ సహాయ సంచాలకురాలు ఎన్‌విఎస్ లక్ష్మీ తెలిపారు. జిఎస్‌టి అమలుతో ఎదురవుతున్న అన్ని రకాల సమస్యలకు పరిష్కారం చూపడం, కేంద్ర, రాష్ట్రాల జిఎస్‌టిల లెక్కింపు, నమోదు, చెల్లింపు, సాంకేతిక సమస్యల నివృత్తి కోసం ఈనెల 5 నుంచి ఫెడరేషన్ హౌస్‌లో ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. వ్యాపారులు, ఎన్‌జీవోలు, అకౌంట్స్ విద్యార్థులు, చార్టర్డ్ అకౌంటెంట్లకు ఉపయుక్తంగా ఉండేవిధంగా ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు లక్ష్మీ తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొనేవారు ఎఫ్‌ట్యాప్సీ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె కోరారు.

ఇన్ఫీ పగ్గాలు చేపట్టిన సలీల్‌పారిఖ్

సలీల్ రాకతో ఇన్ఫీ దశ తిరుగుతుంది :పాయ్



బెంగళూరు : దేశంలోని అతి పెద్ద ఐటి కంపెనీల్లో ఇన్ఫోసిస్ రెండవ స్థానంలో ఉంది. సలీల్ ప్రకాశ్ కంపెనీ సీఈవోగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాకతో కంపెనీ దశ తిరుగుతుందని ఇన్ఫీ మాజీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ టీవీ మోహన్‌దాస్ చెప్పారు. ఐటి వ్యాపారంతో పాటు మారుతున్న మార్కెట్ పరిస్థితులపై పారిఖ్‌కు పక్కాగా అవగాహన ఉందని దీనికి తగ్గట్లు ఆయన టీంను ఏర్పాటు చేసుకుంటారని పాయ్ అభిప్రాయపడ్డారు. పారిఖ్ బెంగళూరు ప్రధాన కార్యాలయంలో కూర్చుని క్యాంపస్‌కు వచ్చే క్లయింట్లతో చర్చలు జరిపి ఒప్పందాలు కుదుర్చుకుంటారని, దీంతో క్లయింట్లతో సంబంధాలు బలపడతాయని.. ప్రాజెక్టులపై పనిచేసే టీంలో కూడా నూతనోత్సాహం కలుగుతుందని పాయ్ అన్నారు. పారిఖ్‌కు గతంలో కెప్‌జెమినిలో పనిచేసిన అనుభవం ఉంది. క్లయింట్ల అవసరాలతో పాటు వారితో ఎలా వ్యవహరించాలో ఆయన బాగా తెలుసునని పాయ్ అన్నారు. పనిలో పనిగా మాజీ సీఈవో విశాల్‌సిక్కాపై విమర్శలు గుప్పించారు. ఆయన ప్రధాన కార్యాలయంలో కూర్చుని పనిచేయకుండా అమెరికాలో కూర్చుని పనిచేశారని, దీని వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని.. సీఈవో అనే వ్యక్తిని తన టీంను ఉత్సాహపర్చడానికి ప్రధాన కార్యాలయంలో ఉండాలని పాయ్ అన్నారు. కెప్‌జెమినీలో పారిఖ్ తన నాయకత్వ పటిమను చూపించారని పాయ్ పేర్కొన్నారు.

తయారీరంగం పీఎంఐ జోరు

బెంగళూరు : గత నెల డిసెంబర్‌లో తయారీరంగం జోరందుకుంది. కంపెనీలకు కొత్త ఆర్డర్లు రావడంతో పాటు ఉత్పత్తి పెరగడంతో కంపెనీలు ధరలు కూడా పెంచుకున్నాయని నిక్కీ పర్చేజ్‌మేనేజర్స్ ఇండెక్స్ పేర్కొంది. డిసెంబర్‌లో 54.7 పాయింట్లకు ఎగబాకగా.. నవంబర్‌లో 52.6 పాయింట్లుగా నమోదైంది. వరుసగా గత ఐదు నెలల నుంచి తయారీరంగం జోరందుకుంటోంది. ఇటీవలి షాక్‌లు.. పెద్దనోట్ల రద్దు జీఎస్టిల నుంచి ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్నాయని ఐహెచ్‌ఎస్ మార్కిట్ ఆర్థికవేత్త ఆష్నాదోదియా తెలిపారు. డిమాండ్ పెరగడంతో కంపెనీలు ధరలను కూడా పెంచుకున్నాయి.


రిలయన్స్ 16బి డాలర్ల విస్తరణ పూర్తి

ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్ జామ్‌నగర్ కాంప్లెక్స్‌లో ప్రపంచంలోనే అతి పెద్ద ఆఫ్ గ్యాస్ క్రాకర్‌ను ఏర్పాటు చేసింది. దీని కోసం 1600 కోట్ల డాలర్లను వెచ్చింది. ప్రస్తుతం ఉత్పత్తి చేస్తున్న ఎథిలెన్ ఉత్పత్తి రెట్టింపు చేస్తుంది. ప్రపంచలోని టాప్ పెట్రోకెమికల్స్ ఉత్పత్తి కంపెనీలతో రిలయన్స్ పోటీ పడుతుంది. జామ్‌నగర్ ప్లాంట్ నుంచి ఏడాదికి 60మిలియన్ టన్నుల పెట్రోలియం రిఫైనరీ ప్లాంట్‌ను నిర్వహిస్తోంది.

పీఎస్‌బీ బ్యాంకుల విలీనం లేదు

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకుల విలీనం ప్రతిపాదన ప్రస్తుతం కేంద్రప్రభుత్వం పరిశీలనలో లేదని ఆర్థికశాఖసహాయమంత్రి శివ ప్రతాప్ శుక్లా రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా జవాబిచ్చారు. అయితే ప్రభుత్వం జాతీయ బ్యాంకుల విలీనం ప్రతిపాదనలను ఫ్రేమ్‌వర్కులో ఎలాంటి మార్పులు చేయలేదని ఆయన అన్నారు. బ్యాంకింగ్ కంపెనీస్ (అక్విసియేషన్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్) చట్టం 1970, 1980 ప్రకారం కేంద్రప్రభుత్వం ఆర్‌బీఐతో సంప్రదింపులు జరిపి ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకును ఇతర బ్యాంకులతో విలీనం చేసే అధికారం కలిగి ఉంటుంది. గతేడాది ప్రభుత్వరంగానికి చెందిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాతో ఐదు దాని అనుబంధ బ్యాంకులు భారతీయ మహిళాబ్యాంకును విలీనం చేశారు. దీంతో ఎస్‌బీఐ ప్రపంచంలోని టాప్ 50 బ్యాంకుల్లో ఒకటిగా నిలిచింది.

లెమన్‌ట్రీ ఐపీవోకు సెబి పచ్చజెండా



న్యూఢిల్లీ : ఆతిథ్యరంగానికి చెందిన చెయిన్ లెమన్‌ట్రీ హోటల్స్‌కు మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీవో)కు అనుమతి లభించింది. గత ఏడాది సెప్టెంబర్ 22వ తేదీన కంపెనీ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ) సెబికి సమర్పించింది. కాగా డిసెంబర్ 22న లెమన్‌ట్రీకి సెబి అనుమతించింది. ప్రస్తుతం ఉన్న వాటాదారులు మాపెల్‌వుడ్, విస్పరింగ్ రిసార్ట్స్, పామ్ ఇంటర్నేషనల్, ఆర్‌జె కార్పొరేషన్‌కు మొత్తం 195,797,000 వాటాలు కేటాయిస్తుంది. మొత్తం పెయిడ్‌ఆఫ్ ఈక్విటీలో 24.90 శాతం వరకు ఈ వాటాలుంటాయి. స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయిన తర్వాత వాటాదారులకు అసలైన లబ్ధి చేకూరుతుంది. ఈ షేర్లు బీఎస్‌ఈతో పాటు ఎన్‌ఎస్‌సీలో లిస్ట్‌అవుతాయి. కంపెనీ చేతిలో మొత్తం 40 హోటల్స్ 4,300 గదులు.. దేశంలోని 24 నగరాల్లో ఉన్నాయి. లెమన్‌ట్రీని 2002లో పాటూ కేశ్వానీ ప్రారంభించారు.

ఎస్‌యూవీలపై ఫిదా!

● పెరుగుతున్న మోజు ● ప్రతి నాలుగు ప్యాసింజర్ కార్లు విక్రయిస్తే ఒక ఎస్‌యూవీ ● త్వరలో మార్కెట్లో కొత్త ఎస్‌యూవీలు



హైదరాబాద్ : ఒకప్పుడు ఇంటికి ఒక కారు ఉంటే మహాగొప్ప! 1980 దశకంలో రోడ్లపై కార్లు బహు అరుదుగా కనపడేవి. అటు తర్వాత 1984లో ఇందిరాగాంధీ జమానాలో మారుతి సుజుకి రోడ్లపై వచ్చింది. అటు తర్వాత నుంచి కొన్ని సంవత్సరాల పాటు మారుతి -800 కొనసాగింది. కాలక్రమంలో ప్రభుత్వం పెద్ద ఎత్తున సంస్కరణలు తీసుకురావడంతో విదేశీ కంపెనీలను దేశంలో ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడానికి అనుమతించడం జరిగాయి. ప్రపంచంలోని అతి పెద్ద ఆటో కంపెనీలు భారత్‌లో తమ ప్లాంట్‌లను ఏర్పాటు చేసుకొని నెలకో కొత్త మోడల్స్‌ను పరిచయం చేశాయి. ప్రస్తుతం రోడ్లపై ఎన్నో రకాల కార్లు తిరుగుతున్నాయి. చిన్న కార్ల మోజు తగ్గి ప్రజలు సెడాన్స్ (నాలుగు మీటర్ల కంటే పెద్ద) కార్లపై పడింది. కస్టమర్ల అభిరుచిని గమనించిన మారుతి కూడా 800 సీసీ ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేసింది. టాటామోటార్స్ ప్రపంచంలోనే అతి చిన్న కారు నానోను తీసుకొచ్చి భారీగా నష్టపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం దీన్ని పూర్తిగా నిలిపివేయాలని కంపెనీ నిర్ణయించింది.

ప్రస్తుతం పరిస్థితి ఏమిటంటే కస్టమర్లు స్పోర్ట్ యుటిలిటి వెహికల్స్ (ఎస్‌యూవీ)లపై పడింది. కేవలం రెండు సంవత్సరాల కాలంలో సుమారు రెండు డజన్ల కంటే ఎక్కువ మోడల్స్ రోడ్లపై హల్‌చల్ చేస్తున్నాయి. ఎస్‌యూవీలకు డిమాండ్ పెరిగిపోవడంతో మార్కెట్లో దీని వాటా ఆల్‌టైం హైకి ఎగబాకింది.

ప్రతి నాలుగు వాహనాల్లో ఒకటి ఎస్‌యూవీ : నవంబర్ చివరి నాటికి చూస్తే దేశంలో విక్రయించే ప్రతి నాలుగు ప్యాసింజర్‌కార్లలో ఒకటి యుటిలిటి వాహనంగా ఉంది. 27 శాతం మార్కెట్ వాటాను ఆక్రమించింది. ఐదు సంవత్సరాల క్రితం ప్రతి ఐదు ప్యాసింజర్ వాహనాలు విక్రయిస్తే ఒకటి ఎస్‌యూవీగా ఉండేవి.. అప్పుడు తక్కువ ఎస్‌యూవీలు అందుబాటులో ఉండేవి కాబట్టి కొనుగోళ్లు కూడా తక్కువగా ఉండేవి. ప్రస్తుతం ప్రతి కంపెనీ ప్రత్యేకంగా ఎస్‌యూవీలకు పెద్దపీట వేస్తున్నాయి.

2016లో మారుతి ఎంట్రీ : ఎస్‌యూవీలకు భవిష్యత్తులో మంచి డిమాండ్ ఉంటుందని ముందుగానే పసిగట్టిన మారుతి సుజుకి 2016లో ఎస్‌యూవీపై దృష్టి పెట్టి విటారా బ్రెజ్జాను తీసుకొచ్చింది. అప్పటి వరకు మార్కెట్లో మహీంద్రా అండ్ మహీంద్రా హవా కొనసాగింది. ఎస్‌యూవీలకు వస్తున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని టాటామోటార్ కూడా గత సెప్టెంబర్‌లో నెక్సాన్‌ను విడుదలచేసింది. విడుదలచేసిన రెండు వారాల్లో పదివేల బుకింగ్‌లు జరిగిపోయాయి. వెయిటింగ్ లిస్టు రెండు నెలలకు చేరింది. వెయిటింగ్ లిస్టు జాబితాను తగ్గించడానికి ఉత్పత్తి పెంచడం మొదలుపెట్టింది. ప్రస్తుతం అత్యధికంగా అమ్ముడుపోయే ఎస్‌యూవీ మార్కెట్లో నెక్సాన్ రెండవ స్థానంలో ఉంది.

జీప్ బుకింగ్‌లు పదివేలు : జీప్ కంపాస్‌ను విడుదల చేసిన రెండు నెలల్లోనే 10వేల యూనిట్లు బుకింగ్ అయ్యాయి. పూనేలోని ఫియాట్ యూనిట్లో ఉత్పత్తి చేస్తోంది. మిడ్‌సైజ్ ప్రీమియం ఎస్‌యూవీ ధర రూ.15 లక్షలుగా నిర్ణయించింది. సొసైటీ ఆఫ్ ఇండియాన్ ఆటోమొబైల్ మాన్యూఫ్యాక్చరర్స్ (సియామ్) విడుదల చేసిన గణాంకాల ప్రకారం యుటిలిటి వాహనాల అమ్మకాలు ఏకంగా 20 శాతం పెరిగాయి. జనవరి - నవంబ ర్‌లో 5.97 లక్షల యూనిట్లు విక్రయిచబడ్డాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో 4.97 లక్షల యూనిట్ల వరకు విక్రయాలు జరిగాయి.

మార్కెట్లో లభిస్తున్న ఎస్‌యూవీలు : ఇదిలా ఉండగా మార్కెట్లో ప్రస్తుతం టాటా నెక్సాన్, హ్యుందాయ్ క్రెటా, మారుతి బ్రెజ్జా, టాయోటా ఇన్నోవా క్రైస్టా, టయోటా ఫార్చునర్ (కొత్త మోడల్) ఫోర్డ్ ఈకోస్పోర్ట్(కొత్త మోడల్) మహీంద్రా టీయువీ 300, మహీంద్రా కెయువీ 100, మహీంద్రా నోవోస్పోర్ట్, రెనో డస్టర్ (కొత్త మోడల్), హోండా బీఆర్‌వీ, టాటా హెక్సా, జీప్ కంపాస్, స్కోడా కోడియాక్, ఫోక్స్‌వ్యాగెన్ టైగ్వ్యాన్, ఇసుజు ఎంయూ-ఎక్స్, ఫోర్డు ఎండీవర్ (కొత్త మోడల్), మహీంద్రా స్కార్పియో (కొత్త మోడల్), మహీంద్రా బోలేరో (మిని), రెనో కాప్చర్‌లాంటివి గత రెండు సంవత్సరాల నుంచి మార్కెట్లో విడుదల అవుతూ వస్తున్నాయి.

ఎస్‌యూవీ అమ్మకాలు పెరగడంతో మొత్తం ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 8 శాతం పెరిగి 2.18 మిలియన్ యూనిట్లకు ఎగబాకాయి. లేదంటే అమ్మకాలు కేవలం 4.7 శాతంగా ఉండేవి అవి కార్లు, వ్యాన్‌లు మాత్రమే. ప్రపంచవ్యాప్తంగా 45 శాతం వృద్ధి : ప్రపంచవ్యాప్తంగా ఎస్‌యూవీల వాటా 45 శాతం వరకు ఉంటుంది. ప్రస్తుతం భారత్ మార్కెట్లో ఎస్‌యూవీ అమ్మకాలు పుంజుకుంటున్నాయి. కస్టమర్ల అభిరుచులను బట్టి వివిధ రకాల ఎస్‌యూవీలను మోడల్‌ను బట్టి ఆటో కంపెనీలు ధరలు కూడా అందుబాటులో ఉంచుతున్నాయి. వాటిలో నాలుగు మీటర్ల కంటే తక్కువ, మిడ్‌సైజ్ సెగ్మెంట్, ప్రీమియం, లగ్జరీ ఎస్‌యూవీలు.. కస్టమర్ల అభిరుచులకు తగ్గట్లు కంపెనీలు అందుబాటులో ఉంచుతున్నాయని ఆటో కంపెనీల అధికారులు చెబుతున్నారు.

బ్రెజ్జా సాధించిన విజయంతో మారుతి సుజుకి దాని కంటే పెద్ద సైజు ఎస్‌యూవీని తేవాలని చూస్తోంది. దీనికి పోటీ కంపెనీలు హ్యుందాయ్ క్రెటా, రెనో డస్టర్‌కు పోటీ ఇవ్వాలని అదే సైజులో కొత్త బ్రెజ్జా ఎస్‌యూవీని 2019లో తీసుకువస్తుంది.

హ్యుందాయ్ కూడా నాలుగుమీటర్ల కంటే తక్కువ ఎస్‌యూవీని తేవాలని చూస్తోంది. ఈ ఎస్‌యూవీని 2016 ఇండియా ఆటో ఎక్స్‌లో ప్రదర్శించింది. కొత్త ఎస్‌యూవీ మారుతి విటారా బ్రెజ్జాకు పోటీ ఇస్తుంది. టాటామోటార్స్‌కూడా మిడ్‌సైజ్ ఎస్‌యూవీని తీసుకొచ్చి క్రెటా, రెనోకాప్చర్‌కు పోటీ ఇవ్వాలనుకుంటోంది. మహీంద్రా అండ్ మహీంద్రా కూడా మరో కాంపాక్ట్ ఎస్‌యూవీని రాబోయే కొన్ని నెలల్లో తీసుకొచ్చి టాటానెక్సాన్, మారుతి బ్రెజ్జాకు పోటీ ఇవ్వాలనుకుంటోంది.

క్యూలో మరిన్ని కంపెనీలు : ఇదిలా ఉండగా ఫోక్స్‌వ్యాగెన్, ఫియట్, స్కోడా, నిస్సాన్ డాట్సన్, ఎంజీ మోటార్, కియాలు కూడా భారతీయ మార్కెట్లో సరికొత్త ఎస్‌యూవీలతో హల్‌చల్ చేయనున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న ఎస్‌యూవీలు ఆకర్షణీయంగా ఉంటున్నాయి. అత్యాధునిక ఫీచర్లను తీసుకురావడంతో స్త్రీలు, పురుషులు అన్న తేడా లేకుండా అన్నీ వయసుల వారు నడపడానికి సౌకర్యవంతంగా ఉంటోంది. ఇక్కడ మరో అంశం ఏమిటంటే ప్రభుత్వం ఎస్‌యూవీపై పెద్దమొత్తంలో పన్నుతో పాటు సుంకాలు రుద్దిన రోజు రోజుకు డిమాండ్ పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు.

'నారీ' పోర్టల్ ఆవిష్కరణ

- మహిళా సాధికారత, స్వావలంబనకు టెక్నాలజీ తోడ్పాటు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ప్రధాన మంత్రి మాత వందన యోజన ఈ ఏడాది పూర్తిస్థాయిలో కార్యాచరణలోకి వస్తుందని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రి మేనకా గాంధీ అన్నారు. మహిళా సాధికారత కోసం, మహిళల్లోని శక్తి సామర్థ్యాలను వెలికి తీసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన వివిధ రకాలైన పథకాల గురించి వివరించేందుకు ఏర్పాటు చేసిన 'నారీ' అనే ఆన్‌లైన్ పోర్టల్‌ను ఆమె ఢిల్లీలో ప్రారంభించారు. కేంద్ర సర్కార్ పథకాలు, కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ఈ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా మహిళలు సులభంగా తెలుసుకోవచ్చు. 350 ప్రభుత్వ పథకాల గురించి ఈ పోర్టల్‌లో సమాచారం ఉంటుంది. ప్రతిరోజూ ఆ పోర్టల్‌ను అప్ డేట్ చేస్తుంటారు. సంబంధిత మంత్రిత్వ శాఖలు, విభాగాలు ఇతర స్వతంత్ర సంస్థలను ఈ పోర్టల్ అనుసంధానం చేస్తుంది. అలాగే దరఖాస్తులు, సమస్యల పరిష్కారానికీ నారీ పోర్టల్ ఉపయోగకరంగా ఉండబోతోంది. మహిళల జీవితాలను ప్రభావితం చేసే అంశాలకు సంబంధించిన సమాచారాన్నీ దీని ద్వారా పొందవచ్చు. పోషకాహారానికి సంబంధించిన సలహాలు, ఉద్యోగాల వేట, ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారికి సూచనలు, సలహాలు, పెట్టుబడులు, మదుపునకు సూచనలు, నేరాలకు సంబంధించిన సమాచారం, మహిళా విధానాలు, చట్టపరమైన చర్యలు, సరళీకృత దత్తత విధానాలు వంటి అంశాలూ ఈ పోర్టల్‌లో ఉంటాయి. మహిళా సాధికారత, వారిలోని శక్తి, సామర్థ్యాలు, నైపుణ్యాలను మెరుగు పరుచుకునేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, సేవల ప్రయోజనాన్నీ దీని ద్వారా తెలుసుకోవచ్చు. నారీతో పాటు మహిళా, శిశు మంత్రిత్వ శాఖ స్వచ్ఛంద సంస్థలు, పౌర హక్కుల సంఘాలతో ఇంటరాక్ట్ అయ్యేందుకు రూపొందించిన ఈ-సంవాద్ అనే పోర్టల్‌ను కూడా మేనకా గాంధీ ఆవిష్కరించారు. సంబంధిత మంత్రిత్వ శాఖలోని సీనియర్ ఆఫీసర్లు ఈ పోర్టల్‌ను పర్యవేక్షిస్తుంటారు.

కేంద్ర ప్రభుత్వం మహిళలు, పిల్లల సంక్షేమం కోసం సమర్థవంతమైన విధానాలు, చర్యలు చేపట్టడంలో ఇది సహాయపడుతుంది. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి మహిళలు సమాచారం తెలుసుకోవడానికి రూపొందించిన మొట్టమొదటి సైట్ ఇది అని మేనకాగాంధీ విలేకరులకు వివరించారు. 2018వ సంవత్సరానికిగానూ తమ మంత్రిత్వ శాఖ అజెండాపై కూడా ఆమె సమీక్ష జరిపారు. దేశవ్యాప్తంగా 315 జిల్లాల్లో నూతన జాతీయ పౌష్టికాహార మిషన్‌ను ఈ నెలలో కార్యాచరణలోకి తీసుకురాబోతున్నామని మేనకా గాంధీ అన్నారు. ప్రధానమంత్రి మాత వందన యోజన ప్రకారం ప్రసూతి ప్రయోజన పథకం 50.7 లక్షల మంది మహిళలకు ఈ సంవత్సరం షరతులతో నగదు బదిలీ చేయబడుతుందని కేంద్ర మంత్రి వివరించారు. జీవోఎం ప్రస్తావించిన ఆడవారి అక్రమ రవాణా బిల్లును వచ్చే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి తుది అంకానికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడతామనీ ఆమె అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు సమాన హక్కులు, ఆర్థిక అవకాశాలు, సాంఘిక మద్దతు, చట్టపరమైన సహాయం, గృహ కల్పనకు సంబంధించిన ఎన్నో పథకాలు, చట్టాలను అమలు చేస్తున్నాయని మేనకా గాంధీ అన్నారు. అయితే అవగాహనారాహిత్యం వల్ల ఎక్కువ మంది వీటి ద్వారా లబ్ది పొందలేకపోతున్నారమని ఆమె అభిప్రాయపడ్డారు.

ఐఎస్‌సీ సమావేశంపై జోక్యం చేసుకోలేం

మా అధికార పరిధిలో లేదు : హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇండియన్ సైన్స్ కాంగ్రెస్(ఐఎస్ సీ) సమావేశం ఉస్మానియా వర్సిటీలో నిర్వహించాలని ఆదేశించే అధికార పరిధి తమకు లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఐఎస్‌సీ సమావేశం ఎప్పుడు, ఎక్కడ నిర్వహించాలనేది కొత్త ఢిల్లీలోని ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ (ఐఎస్ సీఏ) మాత్రమే నిర్ణయిస్తుందని, అందువల్ల తాము ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. ఆ అధికారం ఉందని తెలియజేసే వివరాలతో అదనపు అఫిడవిట్‌ను వారం రోజుల్లో దాఖలు చేయాలని పిటిషనర్ తరపు న్యాయవాదిని హైకోర్టు ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జి.శ్యాంప్రసాద్ లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ వచ్చే వారానికి వాయిదా వేసింది.

భూ కబ్జాదారుల పేర్లు తెలపండి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: మంచిర్యాల జిల్లా, నెన్నెల్ మండలంలో రెండు వేల ఎకరాల భూమిని కబ్జా చేసిన వ్యక్తుల పేర్లు తదితర పూర్తి వివరాలతో అదనపు అఫిడవిట్ ను రెండు వారాల్లో దాఖలు చేయాలని ఉమ్మడి హైకోర్టు పిటిషనర్ కు సూచించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జి.శ్యాంప్రసాద్ లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ .ఈ వ్యవహారంలో పిటిషనర్ కు బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నందువల్లే భూ ఆక్రమణదారుల పేర్లను సమర్పించలేకపోయానని తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ఆ భూఆక్రమణదారుల పేర్లు, పూర్తి వివరాలతో రెండు వారాల్లో అదనపు అఫిడవిట్ దాఖలు చేయాలని పిటిషనర్ తరపు న్యాయవాదికి సూచించింది. తదుపరి విచారణ సంక్రాంతి సెలవుల తర్వాతకి వాయిదా వేసింది.మంచిర్యాల జిల్లా నెన్నెల్ మండలం లో రూ.ఐదు వేల కోట్ల విలువచేసే రెండు వేల ఎకరాల ప్రభుత్వ భూ కుంభకోణం పై దర్యాప్తు నిర్వహించేలా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని మంచిర్యాల జిల్లా నెన్నెల్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన ఇందూరి.రాంమ్మోహన్ రావు దాఖలు చేశారు. ఆ ప్రభుత్వ భూమిని స్థానిక తెరాస నాయకులతో పాటు మరికొందరు ఆక్రమించారని తెలిపారు. ఆ భూమి విలువ మార్కెట్లో రూ.5000 కోట్ల పైనే ఉంటుందని పిటిషనర్ తెలిపారు. ఆక్రమణదారులు అంతటితో ఆగకుండా ఆ భూమిని వివిధ బ్యాంకుల్లో తనఖా పెట్టి వ్యవసాయ రుణాలు కూడా పొందినట్లు పేర్కొన్నారు.

మానవత్వం మరిచిన మానవ మృగాలు

- భార్య, కొడుకు చేతిలో ఒకరు, సోదరుని చేతిలో మరొకరు..
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రెండు దారుణ హత్యలు



భూపాలపల్లి, ప్రభన్యూస్: మనవత్వం మరిచిన మానవ మృగాల చేతిలో ఏ పాపం ఎరుగని ఇద్దరు దారుణ హత్యలకు గురైన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో చోటుచేకున్నాయి. గణపురం మండల కేంద్రానికి చెందిన గడ్డం రవి (50) అతని భార్య జమున, కుమారుడు వినోద్ డిసెంబర్ 31 అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లో జరిగిన చిన్న ఘర్షణ లో దారుణంగా కొట్టి హత్య చేశారు. రవి తలపై కర్ర, బీరు సీసాతలో ఇరువురు కొట్టడంతో తీవ్ర గాయమై రక్త స్రావంతో స్పృహ కోల్పోయాడు. కొన ఊపిరితో ఉన్న గడ్డం రవిని 108 వాహనంలో వరం గల్ కు తరలించగా ఆసుపత్రిలో సోమవారం ఉదయం మృతి చెం దారు. రవి మరణానికి కారకులైన భార్య జము, కు మారుడు వినోద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రవి బంధు వులు ,కొత్తపల్లి కాలనీ వాసులు గణపురం ప్రధాన రహదారి పై మంగళవారం ధర్నా చేశారు. నిందితులను కఠి నంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇద్దరి పై హత్య కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలుపడంతో ధర్నా విరమించుకున్నారు.

సోదరిని కడతేర్చిన అన్న

వెంకటాపురం మండలం పెద్దాపురం ,లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఏదుల సారక్క (40) స్వంత సోదరుని చేతిలో హత్యకు గురైన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. మూడు రోజుల క్రితం సారక్క గ్రామస్థురాలు మంచాల మల్లక్కతో కలిసి సమీపంలోని అడవికి చిపురు పుల్లలకు వెళ్లారు. సారక్కపై పాత కక్ష్యలతో ఉన్న సోదరుడు ఎల్లయ్య మరో ఒక్కరిద్దరితో కలిసి వెంబడించి అడవిలో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు వివరించారు. అడవిలోనే సారక్కను దహనం చేశారు. సారక్క తల్లి లక్ష్మీ తన కూతురు కనిపించడం లేదని వెంకటాపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మంగళవారం సాయంత్రం పోలీసులు మంచాల మల్లక్కతో కలిసి అడవంతా గాలించారు. సారక్క సోదరుడు ఎల్లయ్యను పోలీసులు నిలదీయడంతో చంపి దహనం చేసిన ప్రాంతాన్ని చూపించారు. పోలీసులు సారక్క సోదరున్ని అదుపులోకి తీసుకున్నారు. మృతురాలు సారక్కకు జాగృతి సంస్థలో ఉమెన్‌వింగ్ జిల్లా కన్వీనర్‌గా కొనసాగుతుంది. గతంలో సీటి గ్రూప్‌లో పని చేసి లొంగిపోయి తల్లిగారి గ్రామంలో నివాసం ఉంటున్నారు. సారక్కకు చెందిన భూమి విషయంలో సోదరునితో గత కొద్ది కాలంగా గొడవలు కొనసాగుతున్నాయి.

ఉన్మాది ఘాతుకం

కుమార్తెకు విష మిచ్చి.. అత్త గొంతు కోసిన అల్లుడు



చింతలపాలెం, ప్రభన్యూస్: సూర్యాపేట జిల్లా, చింతలపాలెం మండలంలోని తమ్మారం గ్రామంలో చిల్లా నర్సింహారావు అనే యువకుడు కన్నకూతురికి ఎలుకల మందును పాలల్లో కలిపి తాపి, అత్తను గొంతు కోసి తాను కూడా విషం తాగి, హత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు, స్థానికులు తెలిపారు. అమ్మెర సైదులు లక్ష్మిల సంతానమైన లావణ్యకు చిల్లా నర్సింహారావుతో ఐదు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. బతుకుదెరువు నిమిత్తం మేళ్ళచెర్వు సువర్ణ సిమెంట్ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నర్సింహారావు ఆదివారం జనవరి 1 న రెండు రోజులు సెలవు దినాలు కావడంతో భార్యతో కలిసి తమ్మారం గ్రామంలోని అత్తగారి ఇంటికి వచ్చాడు. ఈ సదర్భంగా వారి మధ్య వివాదం చోటుచేసుకోవడంతో మంగళవారం ఉదయం 11 గం.ల సమయంలో 13 నెలల పాప నవ్యశ్రీకి పాలల్లో ఎలుకల మందు కలిపి తాపించాడు. గమనించిన భార్య పాపను తీసుకుని ఆసుపత్రికి పోగా, ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో అత్త లక్ష్మితో గొడవకు దిగి ఆమె గొంతు కోసి క్రూర మృగంలా ప్రవర్తించాడని తెలిపారు. ఇది గమనించిన స్థానికులు, గ్రామస్థులు రక్తపు మడుగుల్లో ఉన్న లక్ష్మిని హుజూర్ నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కుమార్తె నవ్యశ్రీ పరిస్థితి విషమంగా ఉండడంతో మేళ్ళచెర్వు ఆసుపత్రి నుంచి కోదాడ ఆసుపత్రికి తరలించారు. నర్సింహారావు కూడా విషం సేవించగా హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిర్వహిసున్నారని, పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నర్సింహారావును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పరమేష్ తెలిపారు.

కన్నతల్లిపై అత్యాచారం...హత్య

వి.కోట , ప్రభ న్యూస్ : సభ్యసమాజం సిగ్గుపడేలా కన్నతల్లి పై అత్యాచారం చేసి, ఆపై ఆమెను ఉరివేసి ప్రాణాలు తీశాడు. 65సంవత్సరాలు పూర్తి అవుతున్న తల్లిని సుమారు 45 సంవ త్సరాల కుమారుడు మానవ మృగంలా ఈ ఘాతుకానికి పాల్పడిన సంఘటనవి.కోట మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని శివుని కుప్పం గ్రా మానికిచెందిన రామకృష్ణప్ప, బెల్లమ్మలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. ఇందులో ఒక కుమారుడు సుబ్రమణ్య(45) ప్రవర్తన సక్రమంగా లేదు. గతంలో సొంత సోదరిపై అత్యాచారానికి పాల్పడ్డాడు.ఆసమయంలో గ్రామస్థులు చీవాట్లు పెట్టగా గ్రామం విడిచి దూరప్రాంతాలకు వెళ్ళాడు. ఇటీవల మరలా గ్రామా నికి చేరుకున్నాడు. ఇలా ఉండగా మంగ ళవారం ఉదయం పూటుగా మద్యం సేవించి వచ్చి ఇంట్లో వున్న తల్లిపై అఘాయి త్యం చేశాడు, పైగా మానవత్వం కోల్పోయి హత్య చేశాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు అతడి ని వీధిలోని స్థంభానికి కట్టి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు.

కోటి విలువ చేసే గుట్కా స్వాధీనం



శంషాబాద్, ప్రభన్యూస్: కోటి నలభై లక్షల విలువ చేసే నిషేధిత గుట్కా భ్యాగులను ఎస్‌వోటి పోలీసులు తనిఖీలో పట్టుకున్నారు. శంషాబాద్ కేంద్రంలో తొండుపల్లి జాతీయ రహదారిపై కర్ణాటక నుంచి కరీంనగర్ జిల్లా , గోదవరికని లోని కల్యాణ్‌నగర్ కు డీసీఎంలో తరలిస్తున్న 230 గుట్కా భ్యాగులను డిసిఎం నెం.(ఎపి 02 టిసి 6933) సీజ్ చేశారు. శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శంషాబాద్ డీసీపీ పద్మజ తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురంనకు చెందిన డీసీఎం డ్రైవర్ వడ్డెరి గంగాద్రీ, పూలకుంటకు చెందిన నర్సింహ్మారెడ్డి క్లీనర్‌గా పనిచేస్తున్నారు. గత నెల 30న అనంతపురం నుంచి టమాటో లోడుతో కర్ణాటక లోని కోలార్ వద్ద టమాటోలను అన్ లోడ్ చేసారు. అనంతపురం డీసీఎం సూపర్ వైజర్ పూర్ణ తెలిపిన మేరకు డీసీఎంను సాయికి అప్పగించాడు. రెండు గంటల తరువాత డీసీఎంలో గుట్కా సంచులను వేసుకొని వచ్చి గంగాద్రీకి డీసీఎంను అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీసీపీ పద్మజ తెలిపారు. గుట్కా ఎక్కడ తయారు అవుతుంది ఇంకా ఎవరెవరు తెప్పిస్తున్నారనే విషయంపై పరిశీలిస్తున్నామని అన్నారు. సెప్టెంబర్‌లో ఇదే కోలార్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వినుకొండకు గుట్కా తరలిస్తుండగా అద్దంకి పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించారు.

లంగర్‌హౌస్‌లో రెచ్చిపోయిన రౌడిషీటర్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: లంగర్ హౌస్‌లో రౌడిషీటర్లు రెచ్చిపోయారు. అప్పు తీర్చాలని కోరిన వ్యక్తి ఇంటిపై రౌడిషీటర్ల ముఠా దాడికి పాల్పడింది. డిఫెన్స్ కాలనీలో నివాసం ఉంటున్న హకీం ఇంటిపై రౌడిషీటర్లు దాడికి పాల్పడ్డారు. మూసి ఉన్న తలుపులను ధ్వంసం చేసి ఇంట్లోకి చొరబడ్డారు. హకీం ఇంట్లో లేకపోవడంతో ఆయన భార్య.. కుమారుడిపై దాడి చేశారు. హకీస్టిక్స్.. తల్వార్‌లతో ఇంట్లో ఉన్న సామాగ్రిని ధ్వంసం చేశారు. బీరువాలో ఉన్న రూ.40 వేల నగదు, హకీం భార్యపై ఉన్న నగలను దొంగిలించారు. ఇంటి బయట ఉన్న స్కూటర్‌ను ధ్వంసం చేస్తూ స్థానికులను బెదిరించుకుంటూ వెళ్లిపోయారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి.

అసోం ఎన్‌ఆర్‌సీ రిజిస్టర్‌లో వింత వింతలు

గువాహటి: నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్‌ఆర్‌సీ) తాజాగా విడుదల చేసిన తొలి ముసాయిదా నివేదికలో సామాన్యులతోపాటు ప్రముఖుల పేర్లు గల్లంతయ్యాయి. ఎన్ఆర్‌సీ పునర్ముద్రిత జాబితా తప్పుల తడకగా మారింది. ఉండాల్సిన వారి పేర్లు లేకపోగా, ఉండకూడని వారిపేర్లను ఇందులో జోడించడం పలు విమర్శలకు తావిస్తోంది. రెబల్‌లీడర్ ఉల్ఫా కమాండర్ ఇన్‌చీఫ్ పరేశ్ బారుహ్‌కు కొత్త జాబితాలో స్థానం దక్కింది. కాగా చాలా మంది రాజకీయ నాయకుల పేర్లు కనిపించలేదు. ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఏఐయూడీఎఫ్) చీఫ్, లోక్‌సభ ఎంపీ అయిన బద్రుద్దీన్ అజ్మల్ పేరు గల్లంతయింది. అలాంటి వ్యక్తి దిబ్రూఘర్ జిల్లాలో 15 ఫిబ్రవరి 1957లో జన్మించినట్లు అధికారులు తాజా రికార్డుల్లో నమోదుచేశారు.

పవిత్ర యజ్ఞంలా జన్మభూమి

- 13 వేల గ్రామాల్లో 3 వేల వార్డుల్లో గ్రామ సభలు
- ప్రతిభ చూపిన ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డులు
- గ్రామీణ క్రీడల నిర్వహణకు ప్రతి జిల్లాకు రూ.3 లక్షలు
- అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో ఏపీ సీఎం



గ్రామాలు, వార్డులకు స్టార్ రేటింగ్

ప్రతి గ్రామం, వార్డుకు టెన్ స్టార్ రేటింగ్ ఇస్తామని పది అంశాల ఆధారంగా ఈ రేటింగ్ ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి ఆత్మగౌరవమైన మరుగుదొడ్డి నిర్మాణం, విద్యుత్, వంట గ్యాస్, మంచినీటి కనెక్షన్, గ్రామంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రోడ్ కనెక్టివిటీ, ఫైబర్ కనెక్టివిటీ ప్రతి కుటుంబానికి రూ.10 వేల కనీస ఆదాయం, ప్రతి పాఠశాలకు మౌలిక సదుపాయాలు, తల్లిబిడ్డకు పౌష్టికాహారం తదితర అంశాలపై రేటింగ్‌లు ఇస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి అయ్యన్నపాత్రుడు ప్రణాళిక శాఖ ఉన్నతాధికారులు సంజయ్‌గుప్తా, చలపతిరావు, వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి పి.రాజశేఖర్, గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన(సెర్ప్) శాఖల కమిషనర్లు రామాంజనేయులు, కృష్ణమోహన్, అరుణ్ కుమార్, వివిధ జిల్లాల కలెక్టర్లు, నోడల్ ఆఫీసర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అమరావతి, ఆంధ్రప్రభ: జన్మభూమి- మా ఊరు కార్యక్రమం పవిత్ర యజ్ఞమని ఈ ప్రజా సేవ కార్యక్రమంలో పోటాపోటీగా పనిచేయాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. మంచిని ప్రోత్సహించడంతోపాటు మానవతా కోణంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గడిచిన మూడున్నరేళ్లలో అనేక సమస్యలు పరిష్కరించి చరిత్ర సృష్టించడమే కాకుండా అన్నింటా ప్రజలే ముందు (పీపుల్స్ ఫస్ట్) అన్న అంశాన్ని ఆచరిసున్నామన్నారు. 5వ విడత జన్మభూమి- మా ఊరు కార్యక్రమాన్ని ఇదే స్ఫూర్తితో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పది రోజుల పాటు 13 వేల గ్రామాలు, 3 వేల వార్డుల్లో జన్మభూమి గ్రామ సభలు జరపాలని స్పష్టం చేశారు. మంగళవారం ముఖ్యమంత్రి ఉండవల్లిలోని తన నివాసం నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మభూమి - మా ఊరు కార్యక్రమ నిర్వహణకు సంబంధించి 175 మంది నోడల్ ఆఫీసర్స్‌ను నియమించామన్నారు. జన్మభూమి కార్యక్రమం జరిగే ఈ పది రోజులు నిత్యం టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సమర్థవంతంగా పనిచేసిన ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులను గుర్తించి అవార్డులు ఇస్తామని ప్రకటించారు. ప్రతి వార్డు గ్రామ సభ ప్రారంభానికి ముందుకు ప్రార్థన, సీఎం సందేశం, ప్రతిజ్ఞ, అజెండాపై చర్చ జరపాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కార నివేదిక ప్రజలకు చదివి వినిపించాలని లబ్ధిదారులకు పింఛన్లు, ఇతర ప్రయోజనాలను పంపిణీ చేయాలని సూచించారు. ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలు, పశు వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. గ్రామీణ క్రీడలు, సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహించి జన్మభూమి గ్రామసభ వేడుకలా జరగాలన్నారు. గ్రామీణ క్రీడల నిర్వహణకు సంబంధించి ప్రతి జిల్లాకు రూ.3 లక్షల సప్లిమెంటరీ ఫండ్ కేటాయిస్తున్నామని వీటితో పాటు పంచాయితీ నిధులను కూడా అవసరాన్ని బట్టి వినియోగించుకోవచ్చన్నారు. ముగ్గులు, సంస్కృతి పోటీలు నిర్వహించడం ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలన్నారు. ప్రజల భాగస్వామ్యం ఉంటే రియల్ టైమ్‌లో అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. గ్రామాల అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు, ఎన్ఆర్‌విలు భాగస్వాములుగా ఉండాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజాభాగస్వామ్యానికి పెద్దపీట వేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సాధికారమిత్రల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని గ్రామ, వార్డు సభల్లో వీరిని ప్రజలకు పరిచయం చేయాలని సూచించారు. సంచార జాతుల్లో అర్హులైన వారందరికి పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఆదేశించారు. అదే విధంగా మహిళలు, చిన్నారుల్లో పోషకాహారలోపాన్ని గుర్తించి నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు.

ఏపీ ఆర్టీసీ ఎండీగా సురేంద్రబాబు!

- సూత్రప్రాయంగా నిర్ణయించిన ప్రభుత్వం
- పదోన్నతి వచ్చిన వెంటనే బాధ్యతలు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) మేనేజింగ్ డైరెక్టర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి ఎన్.వి.సురేంద్రబాబు నియ మితులు కానున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ మన్నం మాల కొండయ్య పోలీసు బాస్‌గా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. దీం తో ఆ బాధ్యతలను సురేంద్రబాబుకు అప్పగించేందుకు ప్రభుత్వం ఆలో చన చేస్తున్నట్లు అధికారవర్గాల సమాచా రం. సంక్రాంతి పండుగముందుగా ని, ఆ తర్వాత కాని ఆయనకు ఆ బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నా యి. రాష్ట్రవ్యాప్తంగా పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసేందుకు ఇప్పటికే కసరత్తు చేసింది. అనేక విభాగాలు ఖాళీగా ఉండగా కేంద్ర సర్వీసుల నుంచి వచ్చిన అధికారులు కొందరు పోస్టింగ్‌కోసం ఎదురు చూస్తున్నారు. మూడు రోజుల కిందట ఆర్టీసీ ఎండి పోస్టు కూడా ఖాళీ కావడంతో ఐపీఎస్ అధికారుల బదిలీలు అనివార్యం కానుంది. అదనపు డీజీ హోదాలో గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాలను పర్యవేక్షిస్తున్న సురేంద్ర బాబుకు మరో వారం రోజుల్లో డీజీపీగా పదోన్నతి రానుంది. అంతకు ముందు ఉమ్మడి రాష్ట్రంలోని పలు కీలక విభాగాల్లో పని చేసిన సురేంద్రబాబు నిక్కచ్చిగా వ్యవహరించేఅధికారిగా ఐపీఎస్ వర్గాల్లో పేరుంది. నష్టాల బారి నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆర్టీసీ గట్టెక్కాలంటే సురేంద్రబాబు లాంటి సమర్థుడైన అధికారి అవసరం ఎంతైనా ఉందనేది ప్రభుత్వ ఆలోచన. ఈ క్రమంలోనే ఆయనను ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించేందుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించిందంటున్నారు. రాష్ట్రంలో ఆర్టీసీ ఎండిగా బాధ్యతలు నిర్వహించిన అధికారులనే డీజీపీ పదవి వరిస్తుం దనే సెంటిమెంటు నెలకొన్న నేపథ్యంలో ఆ బాధ్యతలు చేపట్టేందుకు అనేక మంది అధికారులు ప్రయత్ని స్తున్నట్లు తెలిసింది. ఇటీవల డాక్టర్ మాలకొండయ్య డీజీపీలు అయ్యారు. దీంతో ఆర్టీసీ ఎండి పోస్టుకు గతంలో ఎన్నడూ లేని విధంగా డిమాండ్ పెరిగింది. ఎవరెంతగా పోటీ పడుతున్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాడు నాయుడు మాత్రం సురేంద్ర బాబు వైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. పదోన్నతి వచ్చిన వెంటనే సురేంద్రబాబును ఆర్టీసీ ఎండిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశాలు ఉన్నాయి.



హైదరాబాద్ పోలీస్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ ఉద్యోగార్థులకు కోఠి మెడికల్ కళశాలలో ఉచిత శిక్షణ. కార్యక్రమాన్ని ప్రారంభించిన సీపీ వి.వి. శ్రీనివాసరావు

హైదరాబాద్-కాకినాడ ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్ - కాకినాడ మధ్యన ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నారు. ఈ రైళ్లు 9, 11 తేదీల్లో హైదరాబాద్ నుండి బయలుదేరి మరుసటిరోజు ఉదయం కాకినాడకు చేరుకుం టాయి. తిరుగు ప్రయా ణంలో కాకి నాడ నుండి 10, 12 తేదీల్లో ఈ రైళ్లు బయలుదేరుతాయి. మార్గ మధ్య లోని అన్ని స్టేషన్లల్లో ప్రత్యేక రైళ్లను నిలుపుదల చేయబోతున్నామని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

విమాన ప్రమాదాలను నివారించండి

•రాజ్యసభలో కేంద్ర మంత్రికి టీఎస్సార్ వినతి

విశాఖపట్నం, ప్రభన్యూస్: ఇటీవల కాలంలో పెరుగుతున్న ఆందోళనకర ఘటనల నేపథ్యంలో ప్రయాణికుల భద్రత దృష్ట్యా విచారణ జరిపి తగిన నివారణ చర్యలు తీసుకోవాలని కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి అశోక్ గజపతిరాజును రాజ్యసభ సభ్యుడు టి.సుబ్బరామిరెడ్డి కోరారు. వివిధ ఎయిర్ పోర్టుల్లో జరుగుతున్న ఘటనలపై రాజ్యసభ జీరో అవర్‌లో మంగళ వారం టి.సుబ్బరామిరెడ్డి ప్రస్తావించారు. ప్రమాదకర ఘటనలు భవిష్యత్‌లో జరగకుండా సివిల్ ఏవియేషన్ డైరెక్టర్ జనరల్‌తో సేఫ్టీ ఆడిట్ జరిపించాలని టిఎస్సార్ కోరారు. గత ఏడాది నవంబరులో వైజాగ్ ఎయిర్‌పోర్టు రన్‌వే మీద ఆడిప పందిని ఇండిగో ఎయిర్ క్రాఫ్ట్ ఢీకొన్న ఘటనను ఈ సందర్భంగా గుర్తు చేశారు. టేకాఫ్ అయిన తరువాత అలస్యంగా పైలట్ ఈ విషయాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో విమాన చక్రం దెబ్బతిందన్నారు. ఈ ఘటన నేపథ్యంలో ఇంధనం పూర్తిగా వున్న సందర్భంలో విమానం ల్యాండ్ అయితే ప్రమాదం కనుక ఇంధనం వాడకం జరిగే వరకూ 45 నిమిషాల పాటు సముద్రంపైనే చక్కర్లు కొట్టినట్లు తెలిపారు. అనంతర తిరిగి వైజాగ్ ఎయిర్ పోర్టులో ల్యాండ్ అయినట్లు తెలిపారు. అలాగే గత వారం లక్నో నుంచి సిటీ అరేబియా విమానం టేకాఫ్ అవుతున్న సమయంలో విమాన ముందు టైర్లు ఊడిన ఘటనను ప్రస్తావించారు. ఈ విమానంలో 300 మంది ప్రయాణికులు ఆ సమయంలో వున్నారని తెలిపారు. గత ఏడాది ఆగస్టులో ఢిల్లీ ఎయిర్‌పోర్టు లో పార్క్ చేసి వున్న ఎయిరిండియా ఎయిర్ క్రాఫ్ట్‌ను ఇథోపియన్ విమానం ఢీకొన్న ఘటన గురించి వివరించారు. 2017 సెప్టెంబరులో జోహాట్-గౌహాతి -కోల్‌కతా విమానం అస్సాంలో స్కిడ్ అయినప్పటికీ 95 మంది ప్రయాణికులు అదృష్టవశాత్తూ ప్రమాదం నుంచి బయట పడిన విషయాన్ని తెలిపారు. కొంతకాలం కిందట వంద మంది ప్రయాణికులతో ఎయిరిండియా విమానం ల్యాండ్ అయిన తరువాత నెలకొన్న ప్రమాదకర పరిస్థితి, ఈ తరువాత మంటలను అదుపు చేసిన పరిస్థితిని వివరించారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్‌లో జరగకుండా తగిన విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రిని కోరారు.

ఫార్మా డీ అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

•కేంద్ర ఆరోగ్యమంత్రికి ఏపీ ఎమ్మెల్సీ వీర్రాజు వినతి

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని ఆసుపత్రుల్లో ఫార్మాడీ పూర్తి చేసిన వారికి కొత్త పోస్టులు మంజూరు చేసి నియామకం చేపట్టాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు కేంద్ర ఆరోగ్యశాఖా మంత్రి జె.పి.నడ్డాను కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. 2008లో కేంద్రం ప్రవేశపెట్టిన ఫార్మా డీ కోర్సును ఇండియన్ ఫార్మసీ కౌన్సిల్ గుర్తింపు ఉందన్నారు. ఈ కోర్సు వలన ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ, ఫార్మాలజీ, ఫార్మాకోథెరపీ, పాథాలజీ, టాక్సికాలజీ, క్లినికల్ రీసెర్చ్, ఫార్మా కోవిజిలెన్స్, థెరపూటిక్ డ్రగ్ మానిటరింగ్ తదితర అంశాల్లో నైపుణ్యం సాధించడం వలన నాణ్యమైన చికిత్స అందుబాటులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు, ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా దీనిని గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ డిగ్రీ పొందిన వారికి ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులు, హెల్త్‌కేర్ కార్యక్రమాలు, టీబీ, మలేరియా, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల్లో వినియోగించుకోవచ్చన్నారు. వీరి సేవల వలన దీర్ఘకాలిక వ్యాధులు, మెటర్నిటీ, పిల్లల వైద్యంలో ఖర్చును గణనీయంగా తగ్గించుకునేందుకు వీలుంటుందని తెలిపారు. ప్రతి ఆసుపత్రిలో ఫార్మాసిస్ట్ విధిగా ఉండాలని ఆయన కోరారు. ఫార్మా డీ కోర్సు పూర్తి చేసిన వారికి స్వయం ఉపాధి అందించే రుణ సదుపాయం కల్పించాలని ఆయన పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లో డ్రగ్ ఇన్‌ఫర్మేషన్ సెంటర్లు స్థాపించి నిరంతరం అందుబాటులో ఉండేలా వారి సేవలు వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం పేషెంట్ కౌన్సిలింగ్ కేంద్రాలను ప్రతి ఆసుపత్రుల్లోనూ ప్రారంభించాల్సి ఉందన్నారు. ఫార్మాడీ కోర్సులు పూర్తి చేసిన వారిని డ్రగ్, మలేరియా, ఫుడ్, హెల్త్ ఇన్‌స్పెక్టర్లుగా నియమించాలని ఆయన కోరారు.

నిరుపేదల ముంగిట్లో సంక్షేమం

•ఏపీలో అట్టహాసంగా ప్రారంభమైన జన్మభూమి-మా ఊరు కార్యక్రమం •సంక్షేమం, అభివృద్ధి పథకాల పంపిణీతో గ్రామాల్లో పండుగ వాతావరణం •కర్నూలు జిల్లాలోని పెండెకల్‌లో గ్రామ సభను బహిష్కరించిన గ్రామస్తులు •కృష్ణా జిల్లాలో ఉనికిలిలో అధికారులను నిలదీసిన వైనం •నెల్లూరు జిల్లాలో గ్రామ సభను బహిష్కరించిన జన్మభూమి కమిటీ



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా తీసుకుని నిర్వహిస్తున్న 5వ విడత జన్మ భూమి - మా ఊరు కార్యక్రమం మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమైంది. సంక్షేమ పథకాల పంపిణీతో పల్లెల్లో పండుగ వాతావరణం కనిపించింది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకాశం జిల్లాలోని దర్శి పట్టణంలో లాంఛనంగా ప్రారంభించారు. సంక్రాంతి శోభ పల్లె, పట్టణం అనే తేడా లేకుండా కనిపిస్తుందం టూ ముఖ్యమంత్రి చెప్పారు. సంక్రాంతి కానులు ఇస్తున్నామని వాటితో పేదలు పండుగ చేసుకోవాలంటూ ప్రజల్లో ఉత్సాహం నింపారు. మూడో విడత రుణ మాఫీ నిధులను త్వరలోనే విడుదల చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తొలిరోజు మంత్రులు యనమల రామకృష్ణుడు, శిద్ధా రాఘవరావు, కామినేని శ్రీనివాస్, పైడికొండల మాణిక్యాల రావు, దేవినేని ఉమా మహేశ్వరరావు, పరిటాల సునీత, పత్తిపాటి పుల్లారావు, కాలువ శ్రీనివాసులు, నిమ్మకాలయ చినరాజప్ప, కొల్లు రవీంద్ర, అమర్నాథరెడ్డి, నక్కా ఆనందబాబు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, అయ్యన్నపాత్రుడు, స్పీకర్ కోడెల శివప్రసాద్, ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, చీఫ్ . విప్ పల్లె రఘునాథరెడ్డిలు వివిధ చోట్ల పాల్గొన్నారు. అయితే, కృష్ణా జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గంలో వైకాపా నేత సామినేని ఉదయ భాను తన అనుచరులతో నిరసన తెలపడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కర్నూలు జిల్లాలోని పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గిలి మండలం పెండెకల్ గ్రామంలో జన్మ భూమి గ్రామ సభను గ్రామస్థులు బహిష్కరించారు. నెల్లూరు జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలోని ఇందుకూరుపేట మండలంలో డేవిష్ పేటలో జన్మ భూమి కమిటీ సభ్యులు గ్రామ సభను బహిష్కరించారు. ఈ సంఘటనలు మినహా 13 జిల్లాల్లోని 175 నియోజకవర్గాల్లో జన్మ భూమి కార్యక్రమం విజయవంతంగా జరిగింది. నిరుపేదల లోగిళ్లలోకి సంక్షేమం తీసుకొస్తున్నామంటూ మంత్రులు విస్తృతంగా ప్రచారం చేశారు.

కృష్ణా జిల్లాలో జిల్లాలోని కలిదిండి మండలంలో వైద్య ఆరోగ్య శాఖా మంత్రి కామినేని శ్రీనివాస్, నందిగామ, నందిగామ, పునాదిపాడు, గొల్లపూడిల్లో రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, బందరులో క్రీడలు, న్యాయ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర. మోపిదేవి, కోడూరు, నాగాయలంక ల్లో ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. కలిదిండి మండలంలోని కైకలూరు మండలం వేమరప్పాడు, మండవల్లి, తామరకొల్లు, కొచ్చెర్ల గ్రామ సభల్లో మంత్రి కామినేనిపాల్గొన్నారు. కలిదిండి మండలంలో జర్నలిస్టులకు ఇళ్ళపట్టాలు పంపిణీ చేశారు. జగ్గయ్యపేట పట్టణంలో ప్రైవేటు ఈనాం భూముల ను ప్రభుత్వం కాజేయాలని చూస్తుందంటూ వైకాపా నేత సామినేని ఉదయ భాను ఆధ్వర్యంలో నిరశన కార్యక్రమం చేపట్టారు. పోలీసులు అప్రమత్తమై సామినేని అక్కడినుండి తరలించారు. చిల్లకల్లులో ఫించన్ల పంపిణీలో జన్మ భూమి కమిటీల తీరుపై చిల్లకల్లు సర్పంచి విజేత, జడ్పీటీసీ నానీల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుం ది. మండలవల్లి మండలం ఉనికిలిలో తాగునీటి సమస్యపై ప్రజలు అధికారులను నిలదీయండంతో అధికారులు జారుకున్నారు. సభలోకి అధికారులు రావాలంటూ ప్రజలు ఆందోళన చేశారు. తూ.గో.జిల్లా పెద్దాపురం మండలం దివిలి, తిరుపతి, తుని నియోజకవర్గంలోని ఏ.మల్లవరం, గ్రామ సభల్లో పాల్గొన్న ఉప ముఖ్యమం త్రి నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడేపల్లి గూడెంలోని 2వ వార్డు, నందమూరు, మీనవల్లూరు గ్రామ సభల్లో దేవాదాయ శాఖా మంత్రి పైడికొండల మాణిక్యాల రావు పాల్గొన్నారు. విశాఖ జిల్లా పాయకరా వుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి, తూ.గో.జిల్లా తుని నియోజకవర్గంలోని తొండంగి, వేమవరంలో ఆర్థిక శాఖా మంత్రి యనమల రామకృష్ణుడు పాల్గొన్నా రు. నక్కపల్లిలో రైతులకు సబ్సిడిపై ట్రాక్టర్లు పంపిణీ చేశారు. మత్స్యకారులకు వలలు, పింఛన్లు, డ్వాక్రా రుణాలు పంపిణీ చేశారు. రామగిరి మండలంలో మంత్రి పరిటాల సునీత పాల్గొన్నారు. రామగిరి మండలంలోని గంతిమర్రిలో పాల్గొన్నారు. పెనుబోలు గ్రామంలో రూ. 30 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును, రూ. 7 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. గంతిమర్రిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సామూహిక శ్రీమంతాల కార్యక్రమంలో పాల్గొన్నారు. చెన్నే కొత్తపల్లి మండలంలోని బసినేపల్లి గ్రామంలో పాల్గొన్నారు. రుణ మాఫీ కింద 503 మందికి రూ. 1.59 కోట్లు పంపిణీ చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద 412 మంది రైతులకు రూ.91 లక్షలు, వంద శాతం సబ్సిడిపై 106 మందికి 10 టన్నుల జిప్సమ్ పంపిణీ చేశారు. నాగసముద్రం గ్రామానికి చెందిన ఇద్దరు రైతులకు ట్రాక్టర్లు పంపిణీ చేశారు. పసుపు కుంకుమ కింద 34 మంది మహిళలకు రూ.9.24 లక్షలు, వడ్డీ మాఫీ కింద రూ.9.60 లక్షలు, ఎస్సీ, ఎస్టీ బీసీ కార్పొరేషన్ల ద్వారా 50 శాతం సబ్సిడీపై 20 మందికి రూ. 11 లక్షలు పంపిణీ చేశారు. జిల్లాలోని రాయదుర్గం నియోజకవ ర్గంలోని డీ హిరేహల్ మండలం ఓబులాపురంలో గ్రామీణ గృహ నిర్మాణం, పౌర సంబంధాల శాఖ కాలువ శ్రీనివాసులు పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి నక్కా ఆనంద బాబు గుంటూరు జిల్లా వేమూరు నియోజకవర్గం బట్టిప్రోలు మండలం పెసరలంక, చింతమోటు, పెదలంక, కొల్లూరు గ్రామ సభల్లో పాల్గొన్నారు. పెసర లంకలో రూ.4లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిం చారు. చంద్రన్న భీమా, కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. గుంటూరు జిల్లా చిలకలూరుపేట నియెజకవర్గం సాతులూరు, సొలస, గొట్టిపాడు గ్రామాల్లో పౌర సరఫరాల శాఖా మంత్రి పత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. సాతులూరులో రూ.1.50 కోట్ల వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్స వాలు, శంకుస్థాపనలు చేశారు. చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గంలోని పాకాల మండలం గాదంకి, నెండ్రగుంటల్లో పరిశ్రమల శాఖా మంత్రి ఎన్ అమర్నాథ రెడ్డి పాల్గొన్నారు. రూ.23 లక్షల సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక శ్రీమంతాల కార్యక్రమంలో పాల్గొన్నారు. మైక్రో ఇరిగేషన్ పరికరాలను పంపిణీ చేశారు. నీరు చెట్టులో భాగంగా ఇంకుడు గుంత ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి మునిసిపాలిటీలోని 21వ వార్డులో సభాపతి కోడెల శివప్ర సాద్ పాల్గొన్నారు. నర్సరావుపేట మండలం ములకలూరులో లబ్ధిదారులకు రేషన్ కార్డులు చంద్రన్న కానుక, ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. నర్సరావుపేటలోని స్టేడియంలో పిల్లలకు అక్షరాభ్యాసం చేశారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం సర్వేపల్లిలో వ్యవసాయశాఖా మంత్రి సోమిరెడ్డిచంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు. 35 ఎన్టీఆర్ గృహాలను ప్రారంభించారు. చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణీలకు శ్రీమంతం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పౌష్టికాహారం పంపిణీ చేశారు. రహదారులు మురియు భవనాలు శాఖా మంత్రి అయ్యన్న పాత్రుడు విశాఖ జిల్లా నర్సీపట్నం నియోజకవర్గంలోని నాతవరం మండలం డీ ఎర్రవరంలో పాల్గొన్నారు. చంద్రన్న బీమా, ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కడప జిల్లాలో మంత్రి ఆదినారాయణ రెడ్డి జమ్మలమడుగు నియోజకవర్గం, జమ్మలమడగు మండలంలో దేవగుడి, గొనిగనూరులలో పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి గొనిగనూరులో జరిగిన గ్రామసభలో పాల్గొన్నారు. రాజంపేట నియోజకవర్గంలో మున్సిపాలిటీ పరిధిలోని ఈడిగపాలెంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు. కర్నూలు జిల్లాలో ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి నియోజకవర్గంలోని పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గిలి మండలం పెండెకల్ గ్రామంలో ఎద్దుల దొడ్డి నుండి పెండెకల్‌కు రోడ్డు నిర్మించాలని గత జన్మ భూమిలో దరఖాస్తులు ఇచ్చినా పరిష్కారం కాలేదని జన్మ భూమిని గ్రామస్థులు బహిష్కరించారు. అలాగే నెల్లూరు జిల్లాలోని కొవ్వూరు నియోజకవర్గ పరిధిలోని ఇందుకూరుపేట మండలంలోని డేవిష్ పేటలో ఎమ్మెల్యే శ్రీనివాసుల రెడ్డి జన్మ భూమి కమిటీలో పొరుగు గ్రామానికి చెందిన నేతను నియమించడంతో జన్మ భూమి కమిటీ గ్రామ సభను బహిష్కరించింది.





తాంత్రిక పూజలపై చంద్రబాబు ఆగ్రహం

•వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రప్రభ' కథనంపై ప్రకంపనలు •ప్రధాన అర్చకునికి స్థానచలనం •తాంత్రిక పూజలు జరగలేదు : ఈవో సూర్యకుమారి

అమరావతి, ఆంధ్రప్రభ : ఇంద్రకీలా ద్రిపై తాంత్రిక పూజలు జరిగాయా.? అలంకా రం మార్చి భైరవి పూజలు చేశారా..? అమ్మల గన్నయమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ కనకదుర్గమ్మ ఆలయంలో అత్యంత రహస్యం గా నిర్వహించిన తాంత్రిక పూజల వ్యవహారం సీఎం కార్యాలయాన్ని తాకింది. తాంత్రిక పూ జలకు సంబంధించి 'ఆంధ్రప్రభ'లో ప్రచురి తమైన వార్త కథనంపై ముఖ్యమంత్రి కార్యా లయం స్పందించింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారని తెలిసింది. అమ్మవారి గుడిలో సాధారణంగా సాత్విక పూజలు నిర్వహిస్తారు.

అయితే రహస్యంగా భైరవి పూజ నిర్వహించారన్న సమాచారం బయటకురావడంతో దేవాదాయశాఖ ఉన్నతాధి కారులు నిశ్చేష్టుల య్యారు. తాంత్రికపూజలపై 'ఆంధ్రప్రభ' గత నెల 27వ తేదీన 'అమ్మ వారికి అర్ధరాత్రి పూజలా..?' శీర్షికన ప్రచురితమైన వార్త కథనం ప్రకంపనలు సృష్టించింది. మహిషాసు రమర్ధిని అవతరమా..? ఎవరి ఆదేశాల మేరకు పూజలు ..? సీసీ కెమె రా పుటేజీల పరిశీలన జరిగిందా..? అంటూ ప్రచురితమైన వార్త కథనంతో పెను ప్రకం పనలు చోటు చేసుకున్నాయి. కనకదుర్గ మ్మకు మరోరూపమైన 'భైరవి'ని ప్రసన్నం చేసుకునేందుకే రహస్యంగా ఈ తాంత్రిక పూజలు నిర్వహించారన్నది సమాచారం. దుర్గగుడి ఉన్నతాధికారి ఆదేశాల మేరకే ఈ పూజలు జరిగాయన్న ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. ఆలయ అధికారి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి చేపడుతున్న చర్యలు, తీసుకుంటున్న నిర్ణయాలు వివాదా స్పదమౌ తున్నాయి.

ఆలయ అధికారిపై జరుగుతున్న కుట్రలను ఎదుర్కొనేందుకు పరిహారంగా తాంత్రిక పూజలు జరిగినట్లుగా సాగుతున్న ప్రచారంపై ప్రభుత్వంలో కదలికలు మొదలయ్యాయి. గత మంగళవారం రాత్రి అమ్మవారి అలంకారాన్ని మార్చి మరీ భీకర పూజలు చేయాల్సిన అవ సరం ఏముందన్న ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. ఈ వ్యవ హారంపై ఇప్పటికే దుర్గగుడి పాలకమండలిలోని కొందరు సభ్యులు, పలువురు అధికారులు సీఎం చంద్రబాబుదృష్టికి తీసుకు వెళ్ళారు. మొత్తానికి ఈ వ్యవహారం అంతటా అలజడి సృష్టించ డంతో నష్టనివారణ చర్యలకు అధికారులు ఉపక్రమించారు. ఇందు లో భాగంగా దుర్గగుడి ప్రధాన అర్చకుడు బద్రీనాథ్‌ను ఘాట్ రోడ్డు దిగువున ఉన్న కామధేను ఆలయానికి పంపించారని తెలిసింది.


అమ్మవారికి అర్ధరాత్రి పూజలా?

తాంత్రిక పూజలు అవాస్తవం : ఈవో సూర్యకుమారి

దుర్గగుడిలో ఎటువంటి తాంత్రిక పూజలు జరగలేదని దుర్గ గుడి ఈవో సూర్యకుమారి స్పష్టం చేశారు. డిసెంబరు 26వ తేదీ అర్ధ రాత్రి సమయంలో దుర్గగుడిలోకి ఓ అజ్ఞాత వ్యక్తి ప్రవేశించి తాంత్రిక పూజలు నిర్వహించినట్లు వస్తున్న ఆరోపణలపై సూర్యకుమారి స్పం దించారు. దుర్గగుడిపై ఈ మాదిరి ప్రచారం చేయడం బాధాకర మన్నారు. ప్రధాన అర్చకుడు అంతరాలయాన్ని శుభ్రం చేసుకునేం దుకు గాను ఒక సహాయకుని తెచ్చుకున్నారని చెప్పిన ఆమె ప్రధాన అర్చకుడైన బద్రీనాథ్ బాబుపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయంలో భద్రతా లోపాలు ఉంటే సమీక్ష చేసుకుంటామని చెప్పిన సూర్యకుమారి తనపై ఎవరైనా కుట్ర పన్నితే వారి కోరిక నెరవేరాలని అమ్మవారిని కోరుకుంటానని ఆమె ఉద్వేగంతో తెలిపారు.

ఇదంతా అవాస్తవం : బద్రీనాథ్ బాబు

తాంత్రిక పూజలు జరిగాయని వస్తున్న ఆరోప ణల్లో ఏమాత్రం వాస్తవం లేదని ఆలయ ప్రధాన అర్చకులు బద్రీనాథ్ బాబు తెలిపారు. మరుసటి వేక ువజాముకే అమ్మవారి గర్భగుడిని త్వరగా సిద్ధం చేయాలన్న తొందరలో తాను సహాయకుడిగా ఓ వ్యక్తిని వెంట తెచ్చు కున్నాను తప్ప ఇతర పూజలేవీ నిర్వహించలేదన్నారు. సహాయ కుడిగా వచ్చిన వ్యక్తి కూడా కృష్ణాజిల్లాలోని ఓ ఆలయంలో అర్చకుని గా ఉన్నారని ఆయన దేవాదాయశాఖ నుంచి వేతనం తీసుకుంటున్నారని బద్రీనాథ్ బాబు స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో ఆలయ అధికారిని బాధ్యులుగా చేయడం సరికాదని ఆయన వ్యాఖ్యానించారు.

ఎర్రచందనం అమ్మకానికి టెండర్లు

అమరావతి, ఆంధప్రభ: రాష్ట్రంలో పట్టుబడిన ఎర్ర చందనం నిల్వలను అమ్మేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తొమ్మిదో విడతగా ఐదు స్లాట్లలో ఈ ఎర్రచందనం అమ్మకాన్ని ఈ టెండర్, ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో విక్రయించేందుకు నిర్ణయించారు. ఇప్పటికే రాష్ట్రంలో 8,584.1363 మెట్రిక్ టన్నుల ఎర్ర చందనం నిలువలను పట్టుకున్నారు. ఇందులో 965.494 టన్నులను ఈ ప్రొక్యూర్ మెంట్ టెండర్ విధానంలో అమ్మనున్నారు. ఇందుకోసం నియమించిన కమిటీకి ప్రిన్సిపల్ ఛీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. కర్నూలు జిల్లా ఛీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, ఏపీఎఫ్‌డీసీ జనరల్ మేనేజర్లు సభ్యులుగా ఉంటారు. చైనా, జపాన్, మలేషియా, సింగపూర్, యుఏఈ, థాయ్‌లాండ్, ఇండోనేషియా దేశాల్లోని ప్రముఖ దినప త్రికల్లో ప్రకటనలు జారీ చేస్తారు. ఈ ప్రకటనలద్వారా పిలచిన టెండర్లలో ఎక్కువ కోడ్ చేసిన వారికి మూడు స్లాట్లలో ఆక్షన్ నిర్వహిస్తారు. మొదటిగా జనవరి 24 నుండి 27 వరకూ నిర్వహిస్తారు. ఈ స్లాట్‌లో అమ్ముడు కాకపోయినా, లేక మిగిలిపోయిన వాటిని 29 నుండి 31వ వరకు నిర్వహించనున్న రెండో స్లాట్‌లోనూ, అప్పటికీ మిగిలిన దానిని ఫిబ్రవరి 2వ తేదీ నుండి 5వ తేదీ వరకూ నిర్వహించబోయే మూడో స్లాట్‌లోనూ అమ్ముతారు. అమేరకు రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి అనంత రాములు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

అటవీ అభివృద్ధి సంస్థ వీసీ అండ్ ఎండీగా ప్రదీప్ కుమార్

ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీగా ఎన్ ప్రదీప్ కుమార్‌ను నియమించారు. ఈమేరకు రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి అనంత రాములు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

సంతృప్తి శాతాన్ని పెంచడమే లక్ష్యం: సీఎం

అమరావతి, ఆంధ్రప్రభ: అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్ళి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కోరారు. ప్రజలలో సంతృప్తి శాతాన్ని పెంచడమే సర్కారు లక్ష్యమని పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ఆయన వెలగపూడి సచివాలయంలో జన్మభూమి కార్యక్రమంపై ప్రిన్సిపల్ సెక్రెటరీలు, సెక్రెటరీలతో సమావేశమయ్యారు. మొదటి రోజు జన్మభూమి జరిగిన తీరును సమీక్షించారు. పదమూడు జిల్లాల నుంచి మొదటి రోజు సమాచారాన్ని తెప్పించుకున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు రియల్ టైం గవర్నెన్స్ కేంద్రానికి జన్మభూమి సమాచారాన్ని పంపించాలని ఆదేశించారు.

సినీ రంగానికి మూలం నాటక రంగం



అనంతపురం కల్చరల్, ప్రభ న్యూస్: సినీ రంగంలో దిగ్గజాలందరూ నాటకరంగం నుంచివచ్చినవారే. స్వాతంత్ర్య పోరాట కాలం నుంచి నేటి వరకు కళాకారులే ఉద్యమ స్ఫూర్తిదాతలుగా నిలిచారని సినీనటులు, దర్శకులు, రచయిత ఎల్.బి.శ్రీరామ్, మాదాల రవి పేర్కొన్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలో బళ్లారి రాఘవ స్మారక రాష్ట్రస్థాయి సాంస్కృతిక ఉత్సవాలు ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో కళాకారులు విచ్చేసి, తమ కళారూపాలను ప్రదర్శించారు. ఉదయం ఎల్‌కెపిలో బళ్లారి రాఘవ చిత్రపటాన్ని ఆవిష్కరించి సమావేశాన్ని ప్రారంబించారు. సాయంత్రం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి సాంస్కృతిక ఉత్సవాలకు సినీనటులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళా రంగం లో దిగ్గజాలందరూ ప్రజానాట్యమండలినుంచే వచ్చినవారన్నారు. ప్ర జలలో చైతన్య స్ఫూర్తిని నింపేవారు కళాకారులేనన్నారు. నాటకరంగంలో ప్రతి వ్యక్తి హీరోగానే వ్యవహరిస్తారన్నారు. బుర్రకథలు, లంకాదహనం, గజేంద్రమోక్షం లాంటివి నాటకరూపంలో కళాకారులు ప్రజల్లో చైతన్యం నింపేవారన్నారు. కళలు, కళాకారులకు అంతం లేదన్నారు.

ఆటో - లారీ ఢీ

• కోటెకల్లులో రోడ్డు ప్రమాదం
• నలుగురు మృతి..
11 మందికి గాయాలు






ఎమ్మిగనూరు రూరల్ , ప్రభ న్యూస్: కొత్త సంవత్సరం రెండవ రోజే మృత్యువు ప్రమాదం రూపంలో నలుగురిని బలితీసుకుంది. మంగళ వారం ఎమ్మిగనూరు మండల పరిధిలోని కోటెకల్లు సమీపంలో ఎమ్మిగనూరు నుండి ఆదోనికి 15 మంది ప్రయాణికులతో వెళుతున్న టాటా ఏసీ.. ఆదోని నుండి ఎమ్మిగనూరుకు వస్తున్న లారీ (ప్రొక్లైన్ మిషన్ లోడుతో) అతి వేగంతో ఢీకొన్నా యి. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జుపుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న ఎమ్మిగనూరు భీంలింగా రెడ్డి ఆటో డ్రైవర్ (30),కోటెకల్లు బోయ అంజినమ్మ(60)కోటెకల్లు హరిజన కర్రెక్క(75) ఈ ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, బనవాసి ఖాదర్ బాషా(45), ఎమ్మి గనూరు ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ముగతి అన్వర్ బాషా, కోటెకల్లు ఈరన్న, కోటేకల్లు దేవదాసు, బన వాసి సల్మాన్ రాజు, ఆదోని నూర్ అహ్మద్ తోపాటు ప్ర భుదాసు, సుమ, శివరామాచరి, జయ మ్మ, ఆంజి నేయులు తీవ్ర గాయపడి కర్నూలు, ఎమ్మి గనూరు ప్ర భుత్వ ఆసుపత్రుల్లో చికిత్సపొందు తలున్నారు. లారీ డ్రైవర్ వాహనాన్ని అతి వేగంగా నడడపం వల్లే ఘోరం జరిగినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఇలా ఒకేరోజు ఒకే చోట నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పో వడంతో రోదనలు మిన్నంటాయి. భర్త కోల్పోయి ఒకరు, తండ్రిని కోల్పోయి మరోకరు ,కొడుకును కోల్పోయి ఒకరు ఇలా ఒక్కొకరు ఒక్కోలా రక్తపు మడు గులో పడి ఉన్న దృశ్యాలు కలిచివేశాయి. కాగా రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకున్న ఆదోని డీఎస్పి ప్ర సాద్, ఎమ్మిగనూరు సీఐ ప్రసాద్, రూరల్ ఎస్సై వేణు గోపాల్, ట్రాఫిక్ ఎస్సై క్రిష్ణారెడ్డిలు సిబ్బంది తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కార ణాలపై ఆరా తీశారు. కాగా ఎమ్మెల్యే జయ నాగేశ్వ రరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి, ఎంపిపి శంకరయ్య, వైకాపా ఎమ్మిగ నూరు ఇంచార్జి జగన్మోహన్ రెడ్డి , ఈహోళీ ల్దారు వెంకటేశ్వర్లు బాది తులను పర మార్శించారు. ఆలాగే సంఘటనా వివ రాలను అడిగితెలుసు కున్నారు. మర ణించిన కుటుం బాలకు మాజీ ఎమ్మె ల్యే చెన్న కేశవ రెడ్డి తనవంతుగా కొంత ఆర్థిక సాయం అందించారు. నలుగురు ప్రాణాలు బలి గొన్న ఈ ఘోర రోడ్డు ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెం దిన నలు గురుకు ఎమ్మినూరు ప్రభుత్వ ఆసు పత్రిలో పోష్టు మార్టం నిర్వహించి మృతదేహాలను కుటుంబ సభ్యులను అందజేశారు.

ప్రకృతి సేద్యానికి ప్రోత్సాహకాలు

అమరావతి,ఆంధ్రప్రభ: తక్కువ పెట్టుబడి తో అధిక దిగుబడులను ఇస్తున్న ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేస్తున్న రైతాంగానికి రాష్ట్రప్రభు త్వం అద్భుతమైన ప్రోత్సాహకాలను అందించ డం జరుగుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ తెలియజేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా గల బైబిల్ మిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ కార్య క్రమంలో ఆయన మంగళవారం ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు విజయ్ కుమార్ పటిష్టమైన వ్యవస్థను రూపొందించి ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.


కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియా గాంధీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర కన్వీనర్ యలగొండల రాము , తదితరులు

ప్రాధాన్యతా క్రమంలో భూసేకరణ

ప్రభుత్వ స్పెషల్ చీఫ్‌సెక్రటరీ జోషి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సాగునీటి ప్రాజెక్టుల కోసం చేపడుతున్న భూసేకరణ ప్రక్రియను ప్రాధాన్యతను బట్టి జరపాలని ప్రభుత్వ స్పెషల్ సిఎస్ శైలేంద్ర కుమార్ జోషి కోరారు. భూసేకరణ పురోగతి, నిధుల ఖర్చుకు సంబంధించి మంగళవారం సెక్రటేరియట్ నుండి జిల్లా కలెక్టర్లు, ఇరిగేషన్ ఇంజనీర్లతో స్పెషల్ సిఎస్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. నిధులను ఖర్చు చేసే సమయంలో ప్రాధాన్యతలు ముందుగానే గుర్తించాలని అన్నారు. వచ్చే మార్చి 31లోగా ప్రాజెక్టుల భూసేకరణకు అవసరమయ్యే నిధుల వివరాలు కూడా ఇపుడే సమ ర్పించాలని స్పెషల్ సిఎస్ జిల్లాకలెక్టర్లను ఆదేశిం చారు. ఏ ప్రాజెక్టు పూర్తికావడానికి భూసేకరణ వ్యవహారంలో బాటిల్‌నెక్స్ ఉన్నాయో.. వాటిని పూర్తిచేయడం వల్ల ఎంతవరకు ఆయకట్టుకు సాగునీరు అందనున్నదో తనిఖీచేసి తగిన నిధులు వెచ్చించాలని జోషి కోరారు. ఆయాప్రాంతాల్లో రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. జిల్లాలు, ప్రాజెక్టులు, మండ లాలు, గ్రామాల వారీగా, సర్వే నెంబర్లవారీగా ప్రభుత్వా నికి వివరాలు పంపాలని ఆదేశించారు. జిల్లాల పునర్వి భజన తర్వాత కొత్త జిల్లాలకు నిధులు బదిలీచేసిన వివరాలు కూడా పంపాలని జిల్లా కలెక్టర్లను కోరారు. దీనికి చెందిన ప్రొఫార్మాలను ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపినట్లు తెలిపారు. ఆయా ప్రొఫార్మాలు పూర్తిచేసి పంపాలన్నారు. భూసేకరణ కోసం పత్రికల్లో విస్తృతంగా ప్రచారం జరగాలని, అదే సమయంలో ఖర్చును కూడా దృష్టిలో పెట్టుకోవాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వికాస్‌రాజ్, ఈఎన్‌సిలు మురళీధర్‌రావు, నాగేందర్ రావు, సిఈలు భగవంత రావు, హరేరాం, శ్యాంసుందర్, సురేష్, ఖగేందర్ రావు, లింగరాజు, శంకర్, సునిల్, ఓఎస్‌డి శ్రీధర్‌రావు దేశ్‌పాండే పాల్గొన్నారు.

రెండు గంటల్లో ఆరుగురి హత్య

ఆర్మీ మాజీ అధికారి కిరాతక చర్య

పల్వాల్ : హర్యానాలో దారుణం జరిగింది. పల్వాల్‌లో ఆర్మీ మాజీ ఆఫీసర్ ఊచకోతకు పాల్పడ్డాడు. కేవలం రెండు గంటల వ్యవధిలోనే ఒక ఐరన్ రాడ్డుతో ఆరుగుర్ని కొట్టి చంపాడు. పల్వాల్‌లో ఈ హత్యాకాండ చోటుచేసుకున్నది. ప్రస్తుతం వ్యవసాయ శాఖలో సబ్ డివిజనల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న 45 ఏళ్ల నరేశ్ కదియన్ ఈ హత్యలకు పాల్పడ్డాడు. మంగళవారం తెల్లవారు జామున ఉదయం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఈ హత్యలు జరిగినట్లు తేల్చారు. నరేశ్ గత కొన్నాళ్లుగా మానసిక సమస్యతో బాధపడుతున్నట్లు తెలిసింది. భార్యా పిల్లలు ప్రస్తుతం నరేశ్‌కు దూరంగా ఉంటున్నారు. 2003లో ఆర్మీ లెఫ్టినెంట్ ఉద్యోగం నుంచి నరేశ్ వాలెంటరీ రిటైర్మెంట్ తీసుకున్నాడు. 2015లోనూ ఓ పోలీస్ కానిస్టేబుల్‌తో ఆయన గొడవకు దిగారు. ఇవాళ చనిపోయినవారిలో ఇద్దరు సెక్యూర్టీ గార్డులు, ఓ మహిళ ఉన్నట్లు గుర్తించారు.

అరుణ్ సాగర్ రచనలు.. చైతన్య దీపికలు

- సమాజం కోసం జర్నలిస్టుల పోరాటం: మంత్రి హరీశ్‌రావు
- గోరటి వెంకన్నకు అరుణ్‌సాగర్ సాహితీ పురస్కారం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : జర్నలిస్టులు నిరంతరం సమాజం కోసం పాటుపడతారని కానీ వారి ఆరోగ్య విషయాన్ని ఏ మాత్రం పట్టించు కోవడం లేదని, ఇప్పటికైనా జర్నలిస్టులు తమ ఆరోగ్య గురించి పట్టించుకోవాలని ఇరిగేషన్, మార్కెటింగ్ శాఖ మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్ట్ అరుణ్‌సాగర్ పేరుమీద మంగళవారం పొట్టి శ్రీరా ములు తెలుగు యూనివర్శిటీ ఆడిటోరియంలో సాయంత్రం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, గాయకుడు గోరటి వెంకన్నకు అరుణ్ సాగర్ సాహితీ పురస్కా రాన్ని అందజేశారు. ఈయనతో పాటు 2017 సంవత్సరానికి గాను ప్రింట్ మీడియా నుంచి ఎల్రక్టానిక్ మీడియా నుంచి పలువురిని ఎంపికచేసి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ జర్నలిస్టులు పొద్దున లేచినప్పటి నుంచి సమాజాభివృద్ధికి విశేషకృషి చేస్తున్నారన్నారు. ప్రత్యేక తెలం గాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టులు ముఖ్య పాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు. అరుణ్‌సాగర్ అనేక కవితలు, రచనలు చేశారని, ఆయన రాసిన పుస్తకాలు చదివానని అందులో సమాజానికి మేలు చేసే అంశాలు చాలా ఉన్నాయన్నారు. అరుణ్‌సాగర్ చనిపోయిన తరువాత ఆయనకు ఎక్కువగా గుర్తింపు వచ్చిందన్నారు. రోడ్లు భవనాల శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ అరుణ్‌సాగర్ ఖమ్మం జిల్లా వాసి కావడం మేము గర్వించదగ్గ విషయ మన్నారు. ఆదివాసీల గురించి ఆయన రాసిన కథనాలు అద్భుతంగా ఉన్నాయని తుమ్మల ప్రశంసించారు.

ప్రస్తుతం కమర్షియల్ జర్నలిజమే నడుస్తోంది : పాలగుమ్మి సాయినాథ్

నేటితరం జర్నలిజం విలువలను కోల్పోతుందని, ప్రస్తుతం కమర్షియల్ జర్నలిజమే నడుస్తుందని సీనియర్ పాత్రికేయులు పాలగుమ్మి సాయినాథ్ పేర్కొన్నారు. 1992-2016 సంవత్సరం వరకు దేశవ్యాప్తంగా 50 మంది జర్నలిస్టులను హత్య చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు కార్పొరేట్ సంస్థల ఆధీనంలోనే ఈ మీడియా నడుస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ బాల్క సుమన్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, శాసనమండలి చీఫ్ విప్ పల్లె రాజేశ్వర్ రెడ్డి, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. టీవీ5 సౌజన్యంతో మీడియా అకాడమీ ఈ అవార్డులను అందించింది.

గల్ఫ్ బాధితులను ఆదుకోండి

- గవర్నర్‌కు బీజేపీ నేతల వినతి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: గల్ఫ్ బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చొరవ చూపే విధంగా తగు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ భాజపా రాష్ట్ర నేతలు మంగళవారం గవర్నర్ ఇఎస్ఎల్. నరసింహన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. విదేశాల్లో ఉపాధి కోసం వెళ్ళిన వారి పరిస్థితి అగ్యమ గోచరంగా మారుతోందని వారు గవర్నర్ దృష్టికి తీసుకెళ్ళారు. గల్ఫ్‌కు వెళ్ళి వారి కనీస సమాచారం కూడా కుటుంబ సభ్యులకు తెలియడం లేదన్నారు. చివరకు చనిపోయిన సమాచారం కూడా అం దడం లేదన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు తీసుకునేవిధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 10 లక్షలమందికి పైగా గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్నారన్నారు. మరో 10 లక్షల మందిపైగా అక్కడ పని తిరిగి రాష్ట్రా నికి వచ్చి కూలీనాలీ చేసుకుని జీవిస్తున్నారన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో గల్ఫ్ బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పట్లో అనేక వాగ్దానాలు చేశారని గుర్తు చేశారు.

గల్ఫ్ బాధిత కుటుంబాలకు అండగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఎన్ఆర్ఐ పాలసీని తీసుకరావడంతో పాటు రూ.500 కోట్లతో ప్రత్యేక గల్ఫ్ మైగ్రెంట్ వెల్ఫేర్ కార్పోరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పి నాలుగేళ్ళు అవుతున్నా.... ప్రభుత్వం పట్టించు కోకపోవడం చాలా దారుణమని ఆయన మండిపడ్డారు. గల్ఫ్‌నుంచి తిరిగి వచ్చి ఇక్కడ మృతి చెందిన 431మంది కుటుం బాలకు రూ. 6 లక్షల చొప్పున నష్టపరి హారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే గల్ఫ్ బాధితులకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం వర్తింప చేయాలని సూచించారు. రేషన్ కార్డుల నుంచి వారి పేర్లను తొలగించకుండా చర్యలు తీసుకోవాలని లక్ష్మణ్ అన్నారు. భూమిలేని, పేద, వలస కార్మికులకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏజెంట్ల చేతిలో మోసపోయిన వారికి డబ్బులు తిరిగి ఇప్పించాలని, మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి రిక్రూటింగం వ్యవస్థపై మరింత నిఘా పెట్టాలని సూచించారు. అలాగే నకిలీ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకు వారికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్, మీడియా కమిటీ కన్వీనర్ సుధాకర శర్మ, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహానాయుడుతో పాటు గల్ఫ్ బాధితుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం... సంతృప్తి

నా లక్ష్యం.. ధ్యేయం

- నాది పేదల కులం
- రైతులకిచ్చిన మాట నిలబెట్టుకున్నా
- పదేళ్లలో రాష్ట్రాన్ని ప్రథమస్థానంలో నిలబెడతా
- దర్శి జన్మభూమి సభలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



ఒంగోలు, ప్రభ న్యూస్ బ్యూరో : సమాజంలో రెండే కులాలు ఉంటాయని, తానెప్పుడూ పేదల పక్షమే నిలబడతానని, తనది పేద కులమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ఇచ్చిన మాటకు నిలబడి రుణమాఫీతో సహా ప్రతి ఒక్కటి పూర్తిచేసి చూపానని, ప్రజలు సహ కరిస్తే పదేళ్లలో రాష్ట్రాన్ని దేశం లో మొదటిస్థానానికి తీసుకెళతానని సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. నేను 24 గంటలు కష్టపడటానికి సిద్ధంగా ఉన్నానని, ప్రజల కోసం అన్నివేళలా ఆలోచిస్తానని, సమస్యలు మీరు చెబితే పరిష్కరించి చూపుతానని భరోసా ఇచ్చారు.

ప్రకాశం జిల్లా దర్శిలో మంగళవారం ఐదవ విడత జన్మభూమి- మా ఊరు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో తాను సాధించిన అభివృద్ధిని ఓవైపు చెబుతూనే మరోవైపు, తానెంత కష్టపడుతున్నది.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమిటన్నది స్పష్టంగా వివరించారు. జన్మ భూమి కార్యక్రమంలో మొదటి రోజైన సంక్షేమం - సంతృప్తి అనే అంశంపై సుదీర్ఘంగా మాట్లాడి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమా లు, వాటి ద్వారా జరిగిన అభివృద్ధిని తెలియజేశారు. రాష్ట్రంలో కనీసం 80శాతం ప్రజానీకం సంతృప్తి చెందేలా చేయడమే తన లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర విభజన కారణంగా ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపో యిందన్నారు. జనాభా మనకు, నిధులు తెలంగాణాకు వెళ్లిపోయాయన్నారు. అయి నప్పటికీ ఒక ప్రణాళిక ప్రకారం ఆలోచించి చేసిన పనులు ఈరోజు సత్ఫలి తాలు ఇవ్వ డం సంతృప్తిని స్తోందని పేర్కొన్నారు. ఇన్ని కష్టాలు ఉన్నా, రుణ మాఫీ జరగదని అందరూ హేళన చేసినా, మొక్క వోని ధైర్యంతో ముందుకెళ్లానన్నారు. 3 విడతలు నిధులు విడుదల చేశానని, ఇంకో రెండువిడతలు 10శాతం వడ్డీతో సహా ఇవ్వబో తున్నానన్నారు. రుణమాఫీ చూసి దేశం యావత్తూ ఆశ్చర్య పోయిందని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో కనీసం ఒకపంటైనా స్థిరంగా పండించు కుని వ్యవసాయం స్థిరపడేం దుకు, రైతు బాగు పడేం దుకు కృషి చేస్తానన్నారు. పోలవరంతో పాటు, మిగిలిన ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు.

వారిపై బోలెడంత బాధ్యత

గత ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేశారని, వారిని తిరిగి సాధికారిక మిత్రలుగా సమాజాన్ని మార్పుచేసే స్థాయికి తీసుకొచ్చామన్నారు. డ్వాక్రా మహిళల రుణాలను రద్దు చేసి, ప్రతి ఒక్కరికీ పదివేల రూపాయలు లబ్ధి చేకూరేలా చేయగలిగామని తెలిపారు. రూ.680 కోట్లతో వడ్డీలేని రుణాలను మాఫీ చేయ బోతున్నామని వివరించారు. ప్రతి 35 గృహాలకు ఒక సాధికారిక మిత్రను ఏర్పా టుచేసి, వారినెత్తిన బోలెడంత బాధ్యత పెట్టబోతున్నానని తెలిపారు.

లక్షా 42వేల రేషన్‌కార్డులు

జన్మభూమి కార్యక్రమం సందర్భంగా లక్షా 42వేల మందికి నూతనంగా రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని, ఆంధ్ర ప్రదేశ్‌లో 4కోట్ల 5లక్షల మంది జనాభా ఉంటే దీనితో 80శాతం మందికి తెల్లకార్డులు ఇవ్వబోతున్నామన్న విషయం గుర్తించా లన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్క పేదవాడికి రేషన్‌కార్డు పంపిణీ చేయమని ఆదేశించినట్లు తెలిపారు. అలాగే మరో 5లక్షల మందికి పెన్షన్లు మంజూరు కాను న్నాయని, దీనితో 50 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవబోతున్నదని పేర్కొన్నారు. ఉగాది నుంచి మరోసారి పెళ్లికానుక అమలు చేస్తున్నామని, ఎస్టీలకు 50వేలు, ఎస్సీలకు 40వేలు, బీసీలకు 35వేల రూపాయలు అందిస్తామని చెప్పారు.

మరెన్నో సంక్షేమ పథకాలు

జగ్జీవన్ జ్యోతి పేరుతో 75 యూనిట్లు లోపు విద్యుత్ వినియోగిస్తే బిల్లు ప్రభుత్వమే కడుతుందని చంద్రబాబు తెలిపారు. ఎన్నికలలోపు రాష్ట్రంలో 19లక్షల ఇళ్లలో గృహ ప్రవేశం చేయిస్తామని తెలిపారు. విద్యార్థులకు భారీ ఎత్తున స్కాలర్ షిప్‌లు ఇస్తున్నామని, మెరిట్ ప్రకారం ఎస్సీ,ఎస్టీ,బీసీ విద్యార్థులను ఉన్నత చదువులు చదివిసామన్నారు. గుంటూరులో క్రిస్టియన్ భవనానికి రూ.10కోట్లు మంజూరు చేశామని, బీసీల కోసం ఆదరణ పథకాన్ని పునరుద్ధరించను న్నామన్నారు. 2029 నాటికి ఆంధ్ర ప్రదేశ్‌ను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలుపుతానని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

పంచాయతీలకు గ్రేడింగ్

ప్రభుత్వ సంక్షేమపథకాలు ఎంత మాత్రం అమలవుతున్నా యన్న విషయం ఆధారంగా పంచాయతీలకు గ్రేడింగ్ ఇస్తున్నామని, వీటి ఆధారంగానే గ్రామాల అభివృద్ధి నిర్ధారణ అవుతుందన్నారు. విద్యుత్, మరుగుదొడ్లు, శుభ్రత, రవాణా, వీధిలైట్లు, పౌష్టికాహారం వంటి పది అంశాలను ఆధారం చేసుకుని గ్రేడింగ్ ఇవ్వబోతున్నామని, ఈ గ్రేడ్‌లను చూసుకునే భవిష్యత్‌లో ఆడపిల్లలను ఆ ఊరికి కోడలుగా పంపుతారని చంద్రబాబు చమత్కరించారు.

ప్రతి వ్యక్తికీ డిజిటల్ లాకర్

టక్నాలజీని అద్భుతంగా వినియోగిస్తున్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ తొలిస్థానంలో ఉందన్నారు. సైబర్ గ్రిడ్‌తో గ్రామాలను అనుసంధానించడం ద్వారా మీ ఇళ్లలోనే వివిధ రకాల వసతులను తీసుకురాబోతున్నామని చంద్రబాబు చెప్పారు. మూడు టీవీలు పనిచేస్తాయని, 24గంటల వైఫై ఉంటుందని, అన్ని ప్రభుత్వ సర్వీసులు ఆన్‌లైన్‌లోనే లభిస్తాయని చంద్రబాబు చెప్పారు. ప్రతి వ్యక్తికి తన రికార్డులను భద్రం చేసుకునేందుకు డిజిటల్ లాకర్ ఇవ్వాలన్న యోచనలో ఉన్నానని, అయితే ఇవన్నీ మీరు సహకరిస్తేనే సాధ్యమన్నారు. 2018ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో అద్భుతమైన సంవత్సరంగా మార్పు చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు.

నేను ఫోన్ చేస్తున్నా... ఎత్తండి

నా దగ్గర నుంచి చాలా మందికి ఫోన్‌లు వస్తున్నాయి. కానీ మీరందరూ నాకంటే బిజీగా ఉంటున్నారు. రాజకీయాలు, పక్షపాతాలు లేకుండా సమస్యలను స్పష్టంగా చెప్పండి, సమస్యల పరిష్కార వేదిక 1100కు ఫోన్ చేయండి. కానీ చాలా మంది నేను ఫోన్ చేసినా ఎత్తడం లేదు. దయచేసి ఫోన్‌లు ఎత్తండి. ఏ సమస్య అయినా నాదృష్టికి తీసుకురండి పరిష్క రించి చూపుతా అంటూ చంద్రబాబు ప్రజానీకానికి హామీ ఇచ్చారు.

ఏపీపీఎస్సీకే ఖాళీల కష్టం!

- రోజు రోజుకూ పెరుగుతున్న పనిభారం
- నియామకాల ప్రక్రియల్లో తీవ్ర జాప్యం
- మరిన్ని నోటిఫికేషన్లతో సతమతం

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పనిభారంతో తీవ్రంగా సతమ తమవుతోంది. సంస్థ అవసరాలకనుగుణంగా అద నపు సిబ్బంది నియామకాలు లేకపోగా కొన్నేళ్లుగా రోజురోజుకీ ఖాళీలు పెరగుతున్నాయి. మరోవైపు విశ్వవిద్యాలయాల సహాయ ఆచార్యులు, ఉపాధ్యాయ నియామకాల రాత పరీక్షలను కూడా కమిషన్ ద్వారా నిర్వహింపజేయాలని ప్రభుత్వం ప్రాథమి కంగా నిర్ణయిం చింది. పారదర్శకత కోసం వీటి రాత పరీక్షల నిర్వహణ బాధ్యతలను కమిషన్‌కు అప్పగిస్తామని చెబుతున్న ప్రభుత్వం అందుకు తగ్గట్లుగా చర్యలు తీసుకోవడం లేదు. రాష్ట్ర విభజన అనంతరం కమిషన్‌లో ఉద్యోగుల కొరత తీవ్రమైంది, విభజన అనంతరం ఏపీకి వచ్చిన 265 పోస్టుల్లో 128 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు ఏపీపీఎస్సీ అవసరాలకు తగినట్లుగా మరో 125 మందిని నియమిం చాల్సిన పరిస్థితి ఉంది. ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా కమిషన్‌లో పరిపాలన వ్యవస్థను పటిష్టం చేసేందుకు అంతర్గతంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక కమిటీ ద్వారా అధ్యయనం చేయించారు. ఈ కమిటీ వెంటనే ఖాళీలను భర్తీచేయాలని, ప్రస్తుతమున్న 51 విభాగాలను 64కు పెంచాలని నిర్దేశించింది. అలాగే అంతర్గత ఆడిట్, పరిశోధన, న్యాయ, పరీక్షల నిర్వహణకు ప్రత్యేక విభాగాలు, అకడమిక్ సెల్ వంటి వాటిని ఏర్పాటుచేయాల్సిన అవసరం కూడా కమిటీ గుర్తించి ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. కమిషన్ కార్యదర్శి ద్వారా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన చర్యలు కొనసాగుతున్నాయి. పని ఒత్తిడివల్ల కొన్ని నియామకాల్లో జాప్యం కూడా అనివార్యం అయిపోయింది.

మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ప్రకటనల జారీకి సిద్ధమవు తోంది. ఇందుకు అవసరమైన సమాచా రాన్ని పంపాలని వివిధ శాఖలను కోరింది. ఈ సమాచారంలో వచ్చిన వెంటనే విడుదలయ్యే జీవోకు అనుగుణంగా ఏపీపీఎస్సీ చర్యలు చేపట్టనుంది. ఈలోగా కమిషన్‌లో మానవ వనరుల కోరతను తీర్చేందుకు, ప్రత్యేక విభాగాల ఏర్పాటుకు, సాంకేతిక వ్యవస్థను పటిష్టం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. తేదేపా అధికారంలోకి వచ్చిన తరువాత 36 ఉద్యోగ ప్రకటనలను కమిషన్ జారీచేసింది. వీటి నియామకాల ప్రక్రియ వివిధ దశల్లో ఉంది. ఈ పరిస్థితుల్లో విశ్వవిద్యాలయాల సహాయ ఆచార్యులు, ఉపాధ్యాయ నియామకాలకు అవసరమైన రాత పరీక్షలను కమిషన్ ద్వారా నిర్వహించేందుకు మానవ వనరుల అభివృద్ధి శాఖ సిద్ధం కావడం వల్ల ఏపీపీఎస్సీపై పనిభారం మరింత పెరగనుంది. సహాయ ఆచార్యుల నియామకాల రాత పరీక్షను ఏపీపీఎస్సీ నిర్వహించబోతుండటం ఇదే ప్రథమం. గతంలో ఉపాధ్యాయ నియామకాల రాత పరీక్షలు ఏపీపీఎస్సీ ద్వారానే జరిగాయి. కాలక్రమంలో విద్యాశాఖే సొంతంగా ఉపాధ్యాయ నియామకాల రాత పరీక్షలను నిర్వహించుకుంటూ వస్తోంది. ఇప్పుడు మళ్లీ ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహింపచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.



ప్రజల సందర్శనకు రాష్ట్రపతి నిలయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : బొల్లారంలోని రాష్ట్రపతి నిలయాన్ని ప్రజల సందర్శనార్ధం ఈ నెల 2 నుండి 15 వరకు తెరిచి ఉంచుతున్నారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు రాష్ట్రపతి నిలయం సందర్శించవచ్చని అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిద్ ఇటీవల బోల్లారంలోని నిలయంలో విడిది చేశారు. రాష్ట్రపతి విడిది ముగిసిన తర్వాత సంప్రదాయం ప్రకారం నిలయాన్ని ప్రజల సందర్శనార్ధం తెరిచి ఉంచడం జరుగుతుంది. రాష్ట్రపతి నిలయం 76 ఎకరాల్లో విస్తరించింది. అందమైన భవనాలు, దాదాపు 116 రకాల ఔషధ మొక్కలు, వివిధ రకాల పూల వనంతో చూడముచ్చటగా ఉంటుంది. సందర్శకులు మొక్కలకు, పరిసరాలకు ఎలాంటి నష్టం కలిగించకుండా క్రమశిక్షణతో వ్యవహరించవలసి ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రపతి నిలయం నిషిద్ధ ప్రాంతమైనందున కొన్ని ఆంక్షల పరిధిలోనే సందర్శకులు పరిసరాలను, పూల వనాలను చూడవలసి ఉంటుందని తెలిపారు. తినుబండారాలను, మంచినీటి బాటిళ్లను బ్రీఫ్‌కేసులను, చేతి సంచులను, మొబైల్ ఫోన్‌లను, రేడియోలు, ఆయుధాలను అనుమతించబోరని తెలియచేశారు. సందర్శకుల సౌకర్యార్థం రాష్ట్రపతి నిలయంలో ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గైడ్లను కూడా ఏర్పాటు చేశామని సమాచార పౌరసంబంధాల కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. సందర్శకులు గేట్ వన్ నుండి ప్రవేశించి గేట్ టూ నుండి నిష్క్రమించవలసి ఉంటుందని తెలిపారు.

మేడారం జాతర ఇక గిరిజన కుంభమేళా

జాతీయ గుర్తింపుపై కేంద్రం సానుకూలం



కేంద్ర గిరిజన శాఖా మంత్రి జుయల్ ఓరమ్‌ను కలిసిన తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి, ఎంపీలు సీతారాం నాయక్, నగేష్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి.

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణాలో రెండేళ్లకోసారి ఘనంగా జరిగే వరంగల్ జిల్లా , తాడ్వాయి మండలంలోని మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలనే రాష్ట్ర సర్కార్ విజ్ఞప్తికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని దేవాదాయ శాఖా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీ పర్యటన చేపట్టిన ఆయన మంగళవారం తెలంగాణా రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి, ఎంపీలు సీతారాం నాయక్, నగేష్, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కేంద్ర గిరిజన శాఖా మంత్రి జుయల్ ఓరమ్‌ను కలిసి మేడారం జాతర విశిష్టతను వివరించారు. అనంతరం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ... మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని ఇప్పటికే తెలంగాణా సర్కార్ అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతరైన మేడారం సమ్మక్క - సారలమ్మల జాతరకు జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వస్తున్నారని వివరించారు. గతేడాది 90 లక్షల మంది భక్తులు వన దేవతలను దర్శించుకున్నారని, ఈసారి ఆ సంఖ్య కోటికి చేరవచ్చని ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. తెలంగాణా ఏర్పా టయ్యాక అధికారికంగా నిర్వహిస్తున్న ఈ జాతరకు ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం 160 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. అలాగే ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 3 వరకు జరిగే ఈ ఉత్సవాల ఏర్పాట్ల కోసం తెలంగాణా సర్కార్ 80 కోట్ల రూపాయలను కేటాయించింది. ఉత్తర భారత దేశంలో జాతీయ గిరిజన వనజ్ ఉత్సవ్ పేరుతో కేంద్రం పండుగ నిర్వహి స్తోందని, అలాగే మేడారం జాతరను కూడా జాతీయ పండుగగా గుర్తించాలని తామంతా జుయల్ ఓరమ్‌కు విజ్ఞప్తి చేసినట్టు మంత్రి వెల్లడించారు. తమ వినతిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన చెప్పారు. 18వ తేదీన ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, గిరిజన శాఖా మంత్రి చందూలాల్ ఆధ్వర్యంలో మేడారం ఏర్పాట్లను పరిశీలించ నున్నట్టు ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు.

శ్రీధర్‌కు అవకాశమివ్వండి

కోలిండియాకు తెలంగాణ ప్రభుత్వం లేఖ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కోలిండియాకు తెలంగాణ ప్రభుత్వం మంగళ వారం లేఖ రాసింది. ప్రస్తుతం సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న శ్రీధర్‌ను కోలిండియా చైర్మన్‌గా నియమించాలని సూచించింది. ఈమేరకు కేంద్రానికి రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. శ్రీధర్ బయోడేటాను కేంద్రానికి పంపిన రాష్ట్రప్రభుత్వం ఆయనకు సంబంధించి గత పదేళ్ళట్రాక్ రికార్డుపై క్లీన్‌చిట్ ఇచ్చింది. 1997బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి శ్రీధర్ ప్రస్తుతం సింగరేణి సిఎండిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన సిఎండిగా బాధ్యతలు చేపట్టిన నాటినుండి సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి గణనీయంగా పెరగడంతో పాటు భారీగా లాభాలు వచ్చాయి. సింగరేణి విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి కూడా రావడంతో పాటు వేయికోట్లకు పైగా లాభాలను ఆర్జించే సంస్థగా నిలిచింది. వృద్ధిరేటులోనూ కోలిండియాకు ధీటుగా సింగరేణి పరుగు తీస్తోంది. గతంలో ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి నర్సింగ్‌రావు, గత సిఎండి సుతీర్థభట్టాచార్య కూడా కోలిండియా చైర్మన్లుగా పనిచేశారు.



పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం టీఎస్ఎస్‌పీ ప్రధాన కార్యాలయం శౌర్య భవనములో టీఎస్ఎస్‌పి ఐజీపీ అభిలాష బిస్త్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పటాలపు కమాండెంట్, అదనపు కమాండెంట్‌లు మరియు టీఎస్ఎస్‌పి హెడ్ ఆఫీస్ స్టాఫ్‌తో సమావేశమునకు రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయగా అడిషినల్ డీజీపీ లా అండ్ ఆర్డర్ అంజనీకుమార్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ మహేందర్‌రెడ్డి కేక్ కట్ చేసి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్ఎస్‌పి సేవలను అభినందించారు.

లైంగిక వేధింపుల కేసులో

గజల్ శ్రీనివాస్ అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

సమర్పించారు. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు ప్రాథమిక విచారణ జరిపి శ్రీనివాస్‌ను అరెస్ట్ చేశారు. ఆయనపై ఐపీసీ సెక్షన్ 354, 354ఏ, 509ల కింద కేసు నమోదు చేసినట్లు అంతకుముందు పోలీసులు తెలిపారు.

ఆధారాలున్నాయి ...పోలీసులు

పంజాగుట్ట పోలీసులు మీడియాతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు.. గజల్ శ్రీనివాస్ పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. సేవ్ టెంపుల్ అనే ఆర్గనైజేషన్‌కు గజల్ శ్రీనివాస్ ప్రచారకర్తగా ఉన్నాడు. ఇందుకోసం పంజాగుట్ట వెంకటరమణ కాలనీలో ఆ ఆఫీస్ ఉంది. ఆ ఆర్గనైజేషన్‌కు అనుబంధంగా గజల్ శ్రీనివాస్ ఆలయవాణి అనే వెబ్ రేడియోను నడిపిస్తున్నాడు. అందులో ప్రోగ్రాం హెడ్‌గా బాధిత యువతి పనిచేస్తోంది. ఆమె అంతకు ముందు బాలవాణి అనే రేడి యోలో పనిచేసింది. ఆలయవాణి వెబ్ రేడియో ఆఫీస్‌లోనే బాధిత యువతిపై శ్రీనివాస్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. తన గదిలోకి యువతిని పిలిపించుకుని.. లొంగదీసుకునే ప్రయత్నం చేసినట్లు వీడియోల్లోస్పష్టంగా ఉందన్నారు.



తనపై ఆరోప ణలు వస్తోన్ననేపథ్యంలో గజల్ శ్రీనివాస్ స్పందించారు. తనపై ఆమె ఎందుకు ఆరోపణలు చేసిందో తనకు తెలియదని అన్నారు. ఆమెతో తాను మసాజ్ చేయించుకోలేదని, ఆమె చేస్తోన్న ఆరోపణల్లో నిజం లేదని అన్నారు. తన భుజానికి దెబ్బ తగలిందని, ఒక రోజు ఫిజిషియన్ రాకపోయేసరికి ఆ యువతి మసాజ్ చేస్తానని చెప్పిందని అన్నారు. తాను వద్దంటున్నప్పటికీ ఆమె తన భుజానికి మందు రాసిందని తెలిపారు. అంతేగాని తాను చెడు భావనతో మసాజ్ చేయించుకోలేదని చెప్పారు. ఫిర్యాదు చేసిన యువతిని తాను ఓ బిడ్డలా చూశానని గజల్ శ్రీనివాస్ తెలిపారు. తామంతా ఓ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొంటూ.. ఆ భావనతోనే పనిచేస్తామని, అటువంటిది ఇటువంటి ఆరోపణలు ఎందుకు వస్తుందో అర్థం కావడం లేదని చెప్పుకొచ్చారు.

ఆమెతో మసాజ్ చేయించుకోలేదు

ఆమెతో మసాజ్ చేయించుకోవడం.. ఒంటి మీద బట్టలు లేకుండా ఉండమని చెప్పడం.. బలవంతంగా హగ్ చేసుకోవడం, ముద్దులు పెట్టడం, కాళ్లు ఒత్తిచ్చుకోవడం వంటి దృశ్యాలు వీడియోల్లో ఉన్నాయని పోలీసులు తెలిపారు. రెండు నెలల నుంచి శ్రీనివాస్ బాధిత యువతిని వేధిస్తున్నాడని, అన్ని ఆధారాలు ఉండడంతోనే అరెస్‌చేసిన ట్లు.. చాలా తీవ్రమైన కేసుగా పరిగణించవచ్చని పోలీసులు తెలిపారు. కాగా, బాధితురాలి ఆర్థిక పరిస్థితులను ఆసరాగా తీసుకుని లైంగిక వేధింపులకు పాల్పడటం, గదిలోకి పిలిచి అసభ్యంగా ప్రవర్తించినట్లు తమ దర్యాప్తులో తేలిందని పంజాగుట్ట ఏసీపీ విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. గజల్ శ్రీనివాస్‌పై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశామని తెలిపారు.

ఆధ్యాత్మిక ముసుగులో గజల్ వికృత చేష్టలు!

ఆధ్మాతిక ముసుగులో గజల్ శ్రీనివాస్ వికృత చేష్టలు బహిర్గతమయ్యాయని మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. బాధిత యువతి పోలీసులకు ఇచ్చిన వీడియో లు, ఫోటోలు మీడియాకు చిక్కాయి. అందు లో బాధిత యువతితో పాటు పనిమనిషితో గజల్ శ్రీనివాస్ వికృత చేష్టలకు పాల్ప డుతూ ఉన్నట్లు ఉంది. తన భుజానికి మాత్రమే ఓ యువతి మందు రాసిందని, ఇంకేమీ జరగలేదని గజల్ శ్రీనివాస్ చెప్పిన విషయం తెలిసిందే. అయితే, ఆయన చేసిన వ్యాఖ్యలకు వీడియోలలోని దృశ్యాలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. బాధిత యువతి చేసిన ఆరోపణలకు బలాన్ని చేకూర్చుతున్నాయి.

గజల్ శ్రీనివాస్ నీచుడు, గదిలో నగ్నంగా.. బాధితురాలు కన్నీటి పర్యంతం

గజల్ శ్రీనివాస్ పచ్చి మోసగాడని లైంగిక వేధింపుల బాధితురాలు ఆరోపించారు. ఆమె మాట్లాడుతూ.. గజల్ శ్రీనివాస్ ఓ నీచుడు, నికృష్టుడు అని దుయ్యబట్టారు. అమ్మాయిలందర్నీ అదే దృష్టితో చూస్తాడని తెలిపారు. గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న సేవ్ టెంపుల్ వెబ్ రేడియోలో తాను రేడియో జాకీగా పనిచేస్తున్నానని బాధితురాలు తెలిపారు. తాను 8 నెలలుగా ఇక్కడ పనిచేస్తున్నానని, నాలుగు నెలలుగా గజల్ శ్రీనివాస్ ప్రవర్తనలో మార్పు వచ్చిందని చెప్పారు. రెండు నెలల నుంచి గజల్ శ్రీనివాస్ నుంచి లైంగిక వేధింపులు ఎక్కువయ్యాయని తెలిపారు. ఆఫీసులోని ఓ ప్రత్యేక గదిలో గజల్ శ్రీనివాస్ ఎప్పుడు నగ్నంగా ఉండేవాడిని బాధితురాలు తెలిపారు. తనను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారని చెబితే ఎవరూ నమ్మరని తెలుసు. అందుకే సాక్ష్యాధారాలతో తాను పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధితురాలు తెలిపారు. అతడు పనిమనిషితో లైంగికచర్యల్లో పాల్గొనేవాడని, ఆ వీడియోలను కూడా తాను పోలీసులకు సమర్పించానని తెలిపారు. గజల్ శ్రీనివాస్ సమాజానికి కనిపించేది ఓ వ్యక్తి అయితే.. ఆఫీసులో మరో వ్యక్తిలా ఉంటాడని తెలిపారు. తన కోరిక తీర్చాలని తనను గజల్ శ్రీనివాస్ వేధింపులకు గురిచేశాడని తెలిపారు. ఈ విషయం ఎవరికి చెప్పినా వినరనే.. తనను తాను కాపాడుకునేందుకే తాను ఈ వీడియోలు, ఫోటోలు రహస్యంగా తీసినట్లు బాధితురాలు తెలిపారు. గజల్ శ్రీనివాస్‌తో శారీరకంగా సంబంధం కలిగిన పనిమనిషి మీడియాకు అవాస్తవాలు చెప్పారన్నారు. నేను గజల్ శ్రీనివాస్‌తో సెక్స్‌లో పాల్గొంటాను. నీవు కూడా అలాగే చేయ్. నాక్కూడా ఫ్యామిలీ, పిల్లలు ఉన్నారు. అయినా నా భర్తకు తెలియకుండా చేస్తున్నా అని పనిమనిషి తను బలవంత పెట్టిందని బాధితురాలు తెలిపారు. లైంగిక వేధింపుల నేపథ్యంలో తాను జాబ్ వదిలేసి పోదామని నిర్ణయించుకున్నానని, అయితే గజల్ శ్రీనివాస్ తనను బెదిరింపులకు గురిచేశాడని తెలిపారు. నీకు ఎక్కడా కూడా జాబ్ దొరక్కుండా చేస్తానని, ఫ్యూచర్ లేకుండా చేస్తానని బెదిరించాడని చెప్పారు. ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ ఇవ్వనని, దొంగతనం లాంటి కేసులను కూడా పెడతానంటూ బెదిరించాడని తెలిపారు. గజల్ శ్రీనివాస్ పీఏ పవన్‌కుమార్, ఇతర ఆఫీసు సిబ్బందికి కూడా వేధింపుల విషయం చెప్పానని, వారు కూడా ఏం చేయలేమని చెప్పారని బాధితురాలు తెలిపారు. గజల్ శ్రీనివాస్ భార్యకు ఈ విషయం చెప్పినా ఆమె కూడా అందరిలానే నమ్మదనే చెప్పలేదు. అయితే పనిమనిషి తనను వేధింపులకు గురిచేస్తోందని మాత్రమే చెప్పాను అని బాధితురాలు తెలిపారు. గజల్ శ్రీనివాస్‌కు బయట పేరు పలుకుబడి ఉంది కాబట్టి.. ఆయన వేధింపులు చేస్తున్నారని తాను చెప్పినా ఎవరూ నమ్మరని ఆమె తెలిపారు. తాను పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు.

చెప్పుతో కొట్టాలని ఉంది



తనను ఆఫీసులో పని చేసుకోనివ్వకుండా వేధింపులకు గురిచేసేవాడని, ఇటీవల కాళ్లు కూడా పట్టించు కున్నాడని బాధితురాలు కన్నీటి పర్యం తమయ్యారు. ఇలాంటి వ్యక్తుల వల్ల ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇతని బారిన ఎంతమంది పడ్డారో తెలియదుగానీ, భవిష్యత్‌లో ఎవరూ కూడా బాధితులు కా కూడదనే తాను పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు చెప్పారు.

రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు...

గజల్ శ్రీనివాస్ రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు బయటపడ్డాయి. మహిళల పట్ల గజల్ శ్రీనివాస్ అసభ్యంగా ప్రవర్తించేవాడని, అభ్యంతరకరమైన ప్రాంతాల్లో మసాజ్ చేయాలని బెదిరించేవాడనే విషయాలు పోలీసులకు బాధితురాలు ఇచ్చిన స్టింగ్ ఆపరేషన్ వీడియోల ద్వారా బయటపడింది. కాగా, ఏ1గా గజల్ శ్రీనివాస్, ఏ2గా పనిమనిషి పార్వతి పేర్లను చేర్చారు.

గజల్‌పై లైంగిక ఆరోపణలపై సన్నిహితులు షాక్..

ఇదంతా ఒక హైడ్రామా అంటున్న జ్యోతిర్మయి

కర్ణాటక సంగీతంలో ప్రముఖ పేరు తెచ్చుకున్న గజల్ శ్రీనివాస్‌పై లైంగిక ఆరో పణలు రావడంతో ఆయన సన్నిహితులు షాక్ అవుతున్నారు. మహిళలను ఎంతో గౌరవంగా చూస్తూ.. వారిపై ఎన్నో గేయాలు పాడిన గజల్ శ్రీనివాస్ అరెస్ట్ అవడంపై ఆయన సన్నిహితురాలు, పాత్రికేయురాలు అయిన జ్యోతిర్మయి మాట్లాడారు. గజల్ శ్రీనివాస్‌పై వస్తున్న ఆరోపణలను ఖండించారు. ఈ వార్త తెలిసినప్పటి నుంచి తాను చాలా బాధపడుతున్నాను. గజల్ శ్రీనివాస్ కుటుంబంతో మా కుటుంబానికి పాతికేళ్ల అనుబంధం ఉంది. మా కుటుంబంలో ఏ ఫంక్షన్ ఉన్నా.. వాళ్ల కుటుంబంలో ఏ కార్యక్రమం ఉన్నా అందరూ కలుస్తుంటాం.. గజల్ శ్రీనివాస్ మెట్టు కు మెట్టు.. రాయికి రాయి పేర్చుకుంటూ వచ్చిన వ్యక్తి. ఆయనకంటూ ఓ గుర్తింపును తెచ్చు కున్నారు.



డిసెంబర్ 29న లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్‌కు ఆయన ఇంట్లో పనిచేసే పార్వతి అనే మహిళ మద్దతు పలుకుతోంది. బాధితురాలి వ్యక్తిత్వంపై నింద వేయడం తమకు ఇష్టం లేదని, ఏదైనా ట్రాప్ జరిగిందా? ఆ ట్రాప్‌లో ఆ అమ్మాయి చిక్కకుందా? లేక గజల్ శ్రీనివాస్‌ను ట్రాప్‌లోకి లాగేందుకు ఎవరైనా ప్రయత్నం చేశారా? అన్న విషయంలో పోలీసుల విచారణ చేయాలని పార్వతితో పాటు ఆయన కుటుంబసభ్యులు, సన్నిహితులు కోరుతున్నారు. పార్వతి మాట్లాడుతూ సదరు బాధితురాలు ఆఫీసుకు వచ్చినప్పుడు అరణ అనే పేరుతో వచ్చిందని, ఐదారు నెలల నుంచి పనిచేస్తుందని తెలిపిం ది. తాను 20 ఏళ్లుగా గజల్ శ్రీనివాస్ వద్ద పనిచేస్తున్నానని, ఇంట్లో పని అయిపోయిన తర్వాత ఆఫీసుకు వెళతానని అంది. గజల్ ఇంట్లో 20 ఏళ్లుగా పనిచేస్తున్న పార్వతి పేరు కూడా పోలీసులు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు.

గజల్‌తో సన్నిహితంగా ఉండమని చెప్పలేదు: పార్వతి

ఆర్టీసీకి అండగా ఉంటాం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటామని రవాణా శాఖ మంత్రి పి. మహేందర్‌రెడ్డి తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం మరిన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ. గుర్తింపు సంఘం నాయకులు అశ్వథామరెడ్డి, ధామస్‌రెడ్డి తదితరులు మంత్రిని కలుసుకొని నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు. సంస్థ పురోభివృద్ధి గురించి చర్చించారు. కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, సానుభూతితో అన్ని సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. కార్మికులు మరింత కష్టపడి సంస్థను కాపాడుకోవాలని కోరారు. ఆర్టీసీని లాభాలబాట పట్టించడంతోనే అనేక సమస్యలకు పరిష్కారం లభించగలదని అన్నారు. ఇప్పటికే సానుకూల ఫలితాలను రాబడుతున్నారని, పరిస్థితి మరింతగా మెరుగుపడవలసి ఉందని మంత్రి తెలిపారు. అంతకు ముందు ఆర్టీసీ కార్మిక సంఘం నాయకులు ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ ను కలుసుకొని నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియచేశారు.

మద్యంపై పెరుగుతున్న రాబడి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మద్యం విక్రయాలతో రాష్ట్ర రాబడి గణనీయంగా పెరుగుతుందని ఎక్సైజ్ శాఖ మంత్రి టి. పద్మారావు గౌడ్ వెల్లడించారు. ప్రభుత్వ విధానాలు, అధికారులు, సిబ్బంది కృషి ఫలితంగానే ఆదాయం పెరుగుతున్నదని వెల్లడించారు. ఎక్సైజ్ కమిషనర్ చంద్రవ దన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకుల్ సబర్వాల్‌తో పాటు పలువురు ఉన్నతాధికా రులు మంత్రిని కలుసుకొని నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను అమలు పర్చడంలో అధికారులు, సిబ్బంది కృషిని అభినందించారు. రాబోవు కాలంలో ఎక్సైజ్ శాఖ కార్యకలాపాలను విస్తృత పరచవలసి ఉందన్నారు. అక్రమాలను అరికట్టడంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కల్లు గీత కార్మికుల ప్రయోజనాలను ఆశించి మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను చేపట్టబోతున్నామని మంత్రి తెలిపారు. వాటిని సమర్థవంతంగా అమలు జరపడంతో పాటుగా అర్హులకు సకాలంలో చేర్చవలసి ఉందని అధికారులకు సూచించారు.

కేసీఆర్ వల్లే 24 గంటల కరెంట్

- కరెంట్ తీగలు పట్టుకోండి.. మతలబు తెలుస్తుంది
- విపక్షాలపై ప్రభుత్వ విప్ పల్లా ధ్వజం
- పవన్ కల్యాణ్ మర్యాదపూర్వకంగానే కలిశారు..



హైదరాబాద్, ఆంధ్రప్రభ ముఖ్యమంత్రి కెసిఆర్ తీసుకున్న సమర్థవంతమైన చర్యల వల్లే మూడున్నరేళ్ళలోనే తెలంగాణ రాష్ట్రం చీకట్లను తరిమి మిరుమిట్లు గొలిపే 24గంటల విద్యుత్ వెలుగులను అందజేస్తున్నదని ప్రభుత్వ విప్ డాక్టర్ పల్లా రాజేశ్వరరెడ్డి అన్నారు. టిఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్ధరాత్రి 12గంటల ఒక నిమిషానికి అద్భుతమైన కాంతులు విరజిమ్ముతూ 2018మొదలైందని, ఇదో అద్భుత విజయమన్నారు. 24గంటల విద్యుత్‌పై రాష్ట్రంలోని రైతులు, పారిశ్రామికవేత్తలతో సహా అన్నివర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. 24గంటల కరెంట్ ఇస్తే తానే స్వయంగా టిఆర్ఎస్‌కు ప్రచారకర్తగా ఉంటానని అసెంబ్లీలో జానారెడ్డి చెప్పారన్నారు. కెసిఆర్ అధికారంలోకి వచ్చిన రెండుమాసాలకే ఏమైంది.. ఛత్తీస్‌గడ్ కరెంట్ అంటూ నిలదీశారన్నారు. కానీ కెసిఆర్ అన్ని సమస్యలను అధిగమిస్తూ విద్యుత్ వ్యవస్థను పటిష్టం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేకపోయిన జైపూర్, భూపాలపల్లి విద్యుత్ ప్రాజెక్టులను పూర్తిచేసిన ఘనత టిఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు.

పవన్‌కల్యాణ్ భేటీకి రాజకీయ ప్రాధాన్యం లేదు

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మర్యాదపూర్వకంగానే ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కలిశారని, 24గంటల విద్యుత్ అమలుతో అసాధ్యాన్ని ఎలా సుసాధ్యం చేశారని అడిగి తెలుసుకున్నారన్నారు. తర్వాత మీడియాతో కూడా పవన్ ఇదే విషయం చెప్పారన్నారు. ఇందులో రాజకీయ ప్రాధాన్యమేమీలేదని, పవన్ కెసిఆర్‌ను కలవడం ఇది రెండోసారి మాత్రమేనన్నారు.

మూడేళ్లలో 580 మంది ఉగ్రవాదుల హతం

న్యూఢిల్లీ: గత మూడేళ్లలో 580 మంది ఉగ్రవాదులను హతమార్చినట్లు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్సరాజ్ అహిర్ తెలిపారు. మంగళవారం లోక్‌సభలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. 2010 నుంచి 2013 మధ్య సుమారు 471 మంది ఉగ్రవాదులను చంపేశారని, ఆ తర్వాత 2014 నుంచి ఇప్పటి వరకు సుమారు 580 మందిని హతమార్చామని మంత్రి స్పష్టం చేశారు. ఇది ప్రభుత్వం సాధించిన ప్రగతిగా పేర్కొన్నారు. అన్నారు. భద్రతా దళాల జీవితాలను ప్రభుత్వం లెక్క చేయడం లేదని కాంగ్రెస్ ఎంపీ జ్యోతిరాదిత్య సింధియా సభలో ప్రశ్నించారు. ఫిదాయేన్ దాడులు ఎక్కువైనట్లు ఆయన ఆరోపించారు. సీఆర్‌పీఎఫ్ కేంద్రంపై దాడికి సంబంధించిన సమాచారం ముందే వచ్చినా.. ప్రభుత్వం సరైన చర్యలు ఎందుకు తీసుకోలేదని ఆయన నిలదీశారు. ఇందుకు బదులిచ్చిన మంత్రి ఎన్డీయే హయాంలో తీసుకున్న చర్యలను వివరించారు. భద్రతలో రాజీలేదని చెప్పారు.

భర్త కోసం కొడుకును అమ్మేసింది

ఉత్తరప్రదేశ్: పేదరికం ఓ తల్లికి తన కన్నబిడ్డను దూరం చేసింది. ఓ మహిళ తన భర్త వైద్యం కోసం 15 రోజుల పసికందును రూ.45 వేలకు అమ్ముకుంది. ఈ దయనీయ ఘటన ఉత్తరప్రదేశ్ బరేలీలోని మీర్‌గంజ్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెలితే.. మీర్‌గంజ్‌కు చెందిన ఓ మహిళ భర్త కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఓ భవనం కట్టడం పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఆయన గాయపడ్డాడు. దీంతో ఆయన కాళ్లు చచ్చుబడిపోయాయి. ఆయనకు వైద్య సేవలు అందించే స్థితిలోలేని భార్య అప్పుడే పుట్టిన తన కుమారుడ్ని అమ్మి, వచ్చిన డబ్బుతో భర్తకు చికిత్స అందించాలని నిర్ణయించుకుంది. పసికందును రూ.45 వేలకు అమ్ముకుంది. 2017 మేలో త్రిపురకు చెందిన ఓ కుటుంబం తమ బిడ్డను రూ.200లకు ఓ ఆటో డ్రైవర్‌కు అమ్ముకుంది.

రైల్లోంచి దూకేసిన విదేశీ పర్యాటకులు

జైపూర్: కదులుతున్న జన్ శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలునుంచి ఇద్దరు విదేశీ పర్యాటకులు కిందకు దూకేశారు. ఈ ఘటన రాజస్థాన్‌లోని సవాయ్‌మధోపూర్‌లో జరిగింది. డచ్ టూరిస్టు మరణించగా, బ్రిటన్ టూరిస్టుకు తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిద్దరు ప్రయాణించాల్సిన రైలుకు బదులు పొరపాటున వేరొక రైలు ఎక్కారు. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించారు. అప్పటికే రైలు పరుగు అందుకుంది. ఆందోళనలో ఏం చేయాలో పాలుపోక ఇద్దరూ కిందకు దూకేశారు. అగ్రా వెళ్లాల్సిన వీరు, పొరపాటున ఢిల్లీ వెళ్లే రైలు ఎక్కడంతో ఈ గందరగోళం ఏర్పడిందని స్థానిక పోలీసులు తెలిపారు.

బీసీ కులాలను ఆదుకోండి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో నివసిస్తున్న బీసీ సామాజికవర్గం కుటుంబాలను ఆదుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రధానంగా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వృత్తులపై ఆధారపడిన గొల్ల, కుర్మ, బేస్త, ముదిరాజ్ కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకువెళ్ళాలని సూచించారు. ఇదే అంశంపై మంగళవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ శాఖాపరమైన లక్ష్యాలను నిర్దేశించారు. 2018లో సాధించే లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ సమావేశంలో పశు సంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేష్ చందా, ఆ శాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ నిర్మల, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, సబ్సిడీ గొర్రెల పథకం మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

పాక్ త్యాగాలు గుర్తించండి

బీజింగ్: ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్తాన్‌ను ప్రపంచమంతా విమర్శిస్తుంటే, చైనా మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. ఉగ్రవాద నిర్మూలకు ఆ దేశం చేస్తున్న కృషిని గుర్తించాల్సిన అవసరం ఉందంటూ వ్యాఖ్యానించింది. '15 ఏళ్లుగా వేల కోట్ల రూపాయల ఆర్థిక సహాయం పొందింది. ఉగ్రవాదాన్ని నిర్మూలించక పోగా, అబద్దాలు, మోసాలతో మమ్మల్ని వెర్రిబాగులోళ్లను చేసింది' అంటూ పాక్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫీంకరించిన మరుసటి రోజే చైనా ఈ విధమైన వైఖరిని ప్రదర్శించింది. ట్రంప్ వ్యాఖ్యలపై మీ అభిప్రాయమేంటని ప్రశ్నించగా, ఉగ్రవాద నిర్మూలనలో పాక్ కృషిని గుర్తించాలి. ఆ దేశం ఎన్నో త్యాగాలు చేసింది. అంతర్జాతీయ సమాజం దానిని గుర్తించాల్సిన అవసరం ఉంది' అని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి గెంగ్ షువాంగ్ బదులిచ్చారు. చైనా, పాక్ మిత్ర దేశాలని, తమ బంధాన్ని మరింత బలోపేతం చేసి పరస్పర సహకారంతో రెండు దేశాలు అభివృద్ధి చెందేలా చూస్తామని షువాంగ్ చెప్పారు. అంతర్జాతీయ అంశాల్లో పాక్ సహకారాన్ని ఆయన కొనియాడారు. ఉపఖండంలో శాంతి, సుస్థిరత స్థాపనకు కృషిచేస్తున్నదని షువాంగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం పాకిస్థాన్‌లో చైనా భారీగా పెట్టుబడులు పెడుతున్నది. అందులో 5000 కోట్ల డాలర్ల చైనా పాకిస్థాన్ ఎకనమిక్ కారిడార్ (సీపీఈసీ) ఒకటి. ఈ కారిడార్ పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో నుంచి వెళ్లడంపై ఇప్పటికే ఇండియా కూడా అభ్యంతరం వ్యక్తంచేసింది.



కేసీఆర్‌పాలనపై అసంతృప్తి

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ కుంతియా
- అధికారంలోకి రాగానే రూ.2 లక్షలు రైతు రుణమాఫీ: ఉత్తమ్
- ఎంఐఎం, తెరాస నుంచి భారీగా కాంగ్రెస్ చేరిక

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ రాంచంద్ర కుంతియా అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిన కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ది చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. మంగళవారం వివిధ పార్టీలకు చెందిన వందలాది మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంఐఎం పార్టీకి చెందిన మాజీ కార్పోరేటర్ బిలాల్ ఆహ్మద్‌తో పాటు ఆయన అనుచరులు, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన హన్వాడకు చెందిన టీఆర్ఎస్ జడ్పీటీసీ నారాయణమ్మ, ఆమె కుమార్ సురేందర్‌రెడ్డితో పాటు వందలాది మంది టీఆర్ఎస్ నాయకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కుంతియా మాట్లాడుతూ వచ్చే కాంగ్రెస్ పార్టీనే విజయం సాధిస్తుందన్నారు. టీఆర్ఎస్, బీజేపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలకు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపా రు. కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ కేడర్‌పై మంత్రులు, టీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు దౌర్జన్యాలకు దిగుతున్నారని తెలి పారు. ప్రతి కార్యకర్తకు తాము అండగా ఉంటామని ఆయన బరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, మాజీ మంత్రి చిన్నారెడ్డి, మండలిలో విపక్షనేత షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌తో పాటు పలువురు పార్టీ నేతలు హాజరయ్యారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

- తెరాస వ్యతిరేక శక్తులను కూడగట్టుకోవాలి
- కలిసి వచ్చే శక్తులతో పోరుకు సిద్ధమవుతాం
- టీ పీసీసీ కార్యవర్గ సమావేశంలో అంతర్గత చర్చ

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం దిశగా ఆ పార్టీ నేతలు అడుగులు వేస్తున్నారు. వివిధ పార్టీల నుంచి చేరికలను భారీగా ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నారు. అధికార టీఆర్ఎస్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, వారికి పార్టీలో తగు ప్రాధాన్యతనివ్వాలనే ఆలోచనకు వచ్చారు. అంతే కాకుండా ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ హాజరయ్యే దళిత, గిరిజన, బీసీ గర్జన సభకు భారీగా ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. పార్టీకి నష్టం చేసే విధంగా ప్రకటనలు చేసే నాయకులపైన దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం మాజీ ఎంపీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను కూడా చర్చించినట్లు తెలిసింది. మంగళవారం గాంధీభవన్‌లో టీ పీసీసీ ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ రాంచంద్ర కుంతియా హాజరయ్యారు. ఈ సమావేశంలో టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, సీఎల్పీ నేత జానారెడ్డి, మండలిలో విపక్షనేత షబ్బీర్‌అలీ, కేంద్ర మాజీ మంత్రులు సర్వే సత్యనారాయణ, బలరాంనాయక్, టీ పీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, వి.హనుమంతరావు, మాజీ స్పీకర్ సురేష్‌రెడ్డిలు హాజరయ్యారు. అనంతరం టీ పీసీసీ కార్యర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం, సోషల్ మీడియా కోఆర్డినేటర్ల నియామకం, ఓటర్ జాబితా సవరణ, పార్టీలో చేరికలతో పాటు ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుబాట అనే అంశాలపై చర్చించారు.

ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే

70కిపైగా సీట్లు మావే

- సంక్రాంతి తర్వాత తెరాస నుంచి భారీ వలసలు
- మిగులు విద్యుత్ ఘనత మాదే
- సర్వేలన్నీ కాంగ్రెస్‌కే అనుకూలం
- నెలాఖరులో రాహుల్ రాక
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో ఉత్తమ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇప్పటికిప్పుడు రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీ 70కిపైగా అసెంబ్లీ స్థానాల్లో విజయకేతనం ఎగురవేస్తుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. సర్వేలన్నీ తమకే అనుకూలంగా ఉన్నాయని ఆయన మంగళవారం గాంధీభవన్‌లో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ తర్వాత అధికార పార్టీ నుంచి తమ పార్టీలోకి భారీగా వలసలు ఉంటాయని, ఇప్పటికే తెరాస ఎమ్మెల్యేలు తనతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పదేళ్ళ పాలనవల్లే రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఘనత తమదేనని, ఇదేదో తమ ఘనతగా సీఎం చెప్పుకోవడం సిగ్గుచేటన్నా రు. తెరాస ప్రభుత్వం గత మూడేళ్ళలో అదనంగా ఒక్క యూనిట్ విద్యుత్ కూడా ఉత్పత్తి చేయలేదని, గత ప్రభుత్వం నిర్మించిన విద్యుత్ ప్రాజెక్టులను ప్రారంభించి తమ గొప్పలుగా చెప్పుకుంటున్నారని టీ.పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లా జైనూర్, భూపాలపల్లి విద్యుత్ ప్రాజెక్టులను కాంగ్రెస్ పార్టీ 70 శాతానికిపైగా పూర్తిచేస్తే తెరాస ప్రభుత్వం వాటిని ప్రారంభించి తమ ప్రాజెక్టులుగా చెప్పుకుంటోందని ఆయన తప్పుబట్టారు. పులిచింతల, జూరాల సాగునీటి ప్రాజెక్టులుగా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిచేసిందని, కానీ అధికారంలోకి రాగానే తెరాస వాటిని ప్రారంభించిందని ఆయన గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు రైతులకు 24 గంటల విద్యుత్ ఇవ్వడాన్ని తన గొప్పలుగా చెప్పుకోవడాన్ని ఆయన కొట్టిపారేశారు. నిరంతర విద్యుత్ సరఫరాపై దేశవ్యాప్తంగా వార్తా పత్రికల్లో ప్రచార ప్రకటనలు ఇచ్చి, అందుకు ప్రతిఫలంగా మొదటి పేజీల్లో వార్తా కథనాలు రాయించుకున్నారని ఆయన ఆరోపించారు. యుపిఎ ప్రభుత్వం తీసుకున్న సంస్కరణలతోనే 27 రాష్ట్రాల్లో మిగులు విద్యుత్ పరిస్థితికి వచ్చాయని ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర రాష్ట్రాలు మిగులు విద్యుత్ సాధిస్తున్నాయంటే అది కేసీఆర్ గొప్పతనమా అని ఉత్తమ్ ప్రశ్నించారు. దేశంలో 50వేల మెగావాట్ల ఉత్పాదన శక్తిగల యూనిట్లు అమ్మకానికి ఉన్నాయని కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి పీయూష్ గోయల్ పార్లమెంట్‌లో చెప్పారంటే విద్యుత్ ఉత్పత్తి ఎంత మిగులుగా ఉందో స్పష్టమవుతోందని ఆయన అన్నారు. ఉత్పత్తి రంగం బాగుండాలంటే విద్యుత్ రంగాన్ని పటిష్టపరచాలన్న ఆలోచనతోనే యుపిఎ ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్యుత్ ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు వందలకోట్లు సొంత ప్రచారానికి ఖర్చు చేస్తున్నారని, ప్రజాధనం దుర్వినియోగం చేస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. భద్రాద్రి, యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టులు మూడేళ్ళు గడిచినా నిర్మాణాలే పూర్తి కాలేదని, మరి కొత్తగా విద్యుత్ ఎలా వచ్చిందని ఆయన ప్రశ్నించారు. భద్రాద్రి యూనిట్‌ను కాలం చెల్లిన టెక్నాలజీతో నెలకొల్పే ప్రయత్నం చేస్తున్నారని, దీనివల్ల నష్టమే వాటిల్లుతుందని ఆయన అన్నారు.



జీరో అవర్ రికార్డు

● చరిత్ర సృష్టించిన రాజ్యసభ ● అనుకున్నట్లుగానే ఎజెండాపూరి ● సభ్యుల సహకారం భేష్ : వెంకయ్య ● కాశ్మీర్ ఉగ్రదాడిపై లోక్‌సభలో కాంగ్రెస్ ఆగ్రహం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మూడు రోజుల విరామం తర్వాత పార్లమెంటు సమావేశాలు మంగళవారం పునః ప్రారంభమయ్యాయి. ఉభయసభలు ఎటువంటి అంతరాయం లేకుండా సజావుగా సాగాయి. రాజ్యసభలో రికార్డు స్థాయిలో జీరో అవర్ అంశాలు, స్పెషల్ మెన్షన్ లన్ని పూర్తయ్యాయి. రాజ్యసభ చరిత్రలో ఎటువంటి అంతరాయం లేకుండా బిజినెస్ పూర్తి కావడం రికార్డు సృష్టించిందని రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం రాజ్యసభలో దివాలా కోడ్ సవరణ బిల్లుపై చర్చ జరిగింది. కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ ఆర్థికమంత్రి చిదంబరం మాట్లాడారు. నాటి యూపీఏ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే విధంగా మోడీ సర్కారు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తమ హయాంలోని మొండి బాకీలన్నీ పెద్ద కుంభకోణంగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై మోడీ ప్రభుత్వం లెక్కలు ప్రకటించాలని డిమాండ్‌చేశారు. 2014 తర్వాత బ్యాంకులు ఇచ్చిన రుణాలెన్నీ, మొండిబాకీలుగా, నిరర్థక ఆస్తులుగా మారాయో చెప్పాలని కోరారు. ఆయా బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులపై ఫోరెన్సిక్ ఆడిట్ జరపాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. అయితే కాంగ్రెస్ హయాంలోనే 2014కు ముందు బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులు నిరర్థకంగా మారాయని స్పష్టం చేశారు. చర్చ ముగిసిన తర్వాత రాజ్యసభ బిల్లుకు ఆమోదముద్ర వేసింది. అలాగే నాబార్డు సవరణ బిల్లుకు కూడా రాజ్యసభ ఆమోదం తెలిపింది.

ఇటు లోక్‌సభలోనూ సభా కార్యక్రమాలు సజావుగా జరిగాయి. ప్రశ్నోత్తరాల సందర్భంగా, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్సరాజ్ అహిర్ మాట్లాడుతూ, యూపీఏ హయాంలో 2010-13 మధ్య 471 మంది ఉగ్రవాదులను చంపితే , తమ మూడున్నరేళ్ల హయాంలో 580 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టామని లోక్‌సభలో తెలిపారు. ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ తర్వాత సభలో పురాతన, పురావస్తు స్థలాల బిల్లుపై సభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా టిఆర్ ఎస్ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ, వరంగల్ లోని వెయ్యి స్తంభాల గుడిని ఆధునీకరించడంలో సరైన నిధులు కేటాయించడం లేదని అన్నారు.

మరోవైపు ప్రభుత్వం లోక్‌సభలో నెగొషియబుల్ ఇనుస్ట్రుమెంట్స్ సవరణ బిల్లు, సుప్రీంకోర్టు - హైకోర్టు న్యాయమూర్తుల జీతాల బిల్లును ప్రవేశపెట్టారు.

కాశ్మీర్‌లో దాడిపై కాంగ్రెస్ ఆగ్రహం

జమ్మూకాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో ఉగ్రవాదుల దాడి అంశాన్ని కాంగ్రెస్ ఎంపీ జ్యోతిరాదిత్య సింధియా లేవనెత్తారు. సైనికుల ప్రాణాలకు ప్రభుత్వం విలువ లేకుండా చేస్తోందని విమర్శించారు. పాకిస్తాన్ తో నెలకొన్న సంబంధాల వల్లే దాడులు జరుగుతున్నాయని అన్నారు. ఉగ్రవాదుల దాడిపై సమాచారం ఉన్నా ప్రభుత్వం ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. అయితే ఈ అంశాన్ని రాజకీయం చేయరాదని, సైనికులపై తమకు అపరిమితమైన గౌరవం ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ అన్నారు.

నేడు రాజ్యసభకు ట్రిపుల్ తలాక్ బిల్లు

● సెలెక్ట్ కమిటీకి పంపాలని విపక్షాల పట్టు ● పెద్దల సభలో ప్రభుత్వానికి మెజారిటీ కరువు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ట్రిపుల్ తలాక్ బిల్లును నేడు రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. ఇప్పటికే లోక్‌సభ ఆమోదం పొందిన ట్రిపుల్ తలాక్ బిల్లును రాజ్యసభ ముందుకు రానుంది. లోక్‌సభలో సంపూర్ణ మెజారిటీ ఉన్న మోడీ ప్రభుత్వానికి రాజ్యసభలో పరీక్ష ఎదురుకానుంది. కాంగ్రెస్, డిఎంకె సహా పలు రాజకీయ పార్టీలు ఈ బిల్లును స్టాండింగ్ కమిటీ పరిశీలనకు పంపాలని డిమాండ్ చేస్తున్నాయి. తలాక్ చెప్పిన భర్తకు మూడేళ్ల జైలు శిక్ష విధించడం వల్ల భార్యకు అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ వాదిస్తోంది. దీనికి పలు పక్షాలు గొంతు కలుపుతున్నాయి. ఈ నేపథ్యంలో బిల్లుపై కూలంకషంగా చర్చించేందుకు దీనిని సెలెక్ట్ కమిటీకి పంపాలని సభలో డిమాండ్ చేసే అవకాశముంది. అదే గనుక జరిగితే ప్రభుత్వానికి రాజ్యసభలో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తనున్నాయి. ఎందుకంటే రాజ్యసభలో ప్రభుత్వానికి తగినంత సంఖ్యాబలం లేదు. విపక్షాల మద్దతు కూడగడితే తప్ప రాజ్యసభలో బిల్లు పాసయ్యే అవకాశం లేదు. అయితే ప్రభుత్వం వ్యూహకర్తలు రంగంలోకి దిగి విపక్షాలను బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. బీజేపీ ఎంపీలంతా సభకు తప్పనిసరిగా రావాలని ఇప్పటికే విప్ జారీ చేసింది. బుధవారం నాడే బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టి, చర్చించి పాస్ చేయించాలని ప్రభుత్వం యోచిస్తోంది. రాజ్యసభలో బిల్లు పాసైతే రాష్ట్రపతి ఆమోదానికి పంపుతారు. ఆ వెంటనే బిల్లు చట్టంగా మారనుంది.

తలాక్‌పై విపక్షాల సమావేశం

కీలకమైన ట్రిపుల్ తలాక్ బిల్లు ప్రభుత్వం రాజ్యసభలోకి తీసుకువస్తున్న నేపథ్యంలో ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్ ఇతర విపక్షా లతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సభలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలనే అంశంపై విపక్షాలన్నీ ఏకతాటిపై నడవాలని నిర్ణయించినట్లు తెలిసింది.

నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లుకు బ్రేక్

● స్టాండింగ్ కమిటీకి పంపిన ప్రభుత్వం

● వైద్యుల ఆందోళనలతో వెనకడుగు

ఎంసీఐ స్థానంలో నూతనంగా తీసుకొస్తున్న నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లుకు బ్రేక్ పడింది. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆందోళన చేపట్టడంతో ప్రభుత్వం ఈ బిల్లుపై వెనక్కి తగ్గింది. శుక్రవారం బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టినప్పటికీ, ఎంబీబీఎస్ వైద్యుల ఆందోళనల కారణంగా దీనిని స్టాండింగ్ కమిటీ పరిశీలనకు పంపుతున్నట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంతకుమార్ ప్రకటించారు. స్టాండింగ్ కమిటీలో దీనిపై విస్తృతంగా చర్చించి, బిల్లును సవరించాలని కోరారు. అయితే అటువంటిదేమీ జరగదని, మెడికల్ వృత్తికి దీని వల్ల లాభం జరుగుతుందని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జెపి.నడ్డా తెలిపారు. దీనిపై ఇప్పటికే ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తో చర్చలు జరిపామని, వారికి ప్రభుత్వ ఆలోచనలు చెప్పామని అన్నారు. అయితే నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లు ద్వారా హోమియోపతి, ఆయుర్వేదం చదివిన వైద్యులు సైతం ఆలోపతిని ప్రాక్టీస్ చేసేందుకు అవకాశం కల్పించారు. ఇందుకోసం ఓ బ్రిడ్జి కోర్స్‌ను ప్రతిపాదించారు. ఏడాదికోసారి సెంట్రల్ హోమియోపతి కౌన్సిల్, సెంట్రల్ ఇండియన్ మెడిసిన్ కౌన్సిల్ సమావేశమై ఆలోపతికి, భారత వైద్యానికి మధ్య ఇంటర్‌ఫేస్‌ను రూపొందిస్తాయి.

వైద్యుల సమ్మె విరమణ

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) మంగళవారం తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విరమించింది. కాగా ఐఎంఏ మాజీ అధ్యక్షుడు కేకే అగర్వాల్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఔట్ పేషెంట్ డిపార్ట్మెంట్ సేవలను 12గంటలపాటు నిలిపివేయాలని తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్టు తెలిపారు.

ఆప్ తర్జనభర్జన

● రాజ్యసభ అభ్యర్థులపై ఉత్కంఠ

న్యూఢిల్లీ: రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక విషయంలో కేజ్రీ సారథ్యంలోని ఆమ్ ఆద్మీ పార్టీ తర్జనభర్జన పడుతోంది. ఎగువ సభకు పంపాల్సిన ముగ్గురు సభ్యుల ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది. పార్టీ సీనియర్ నేతలు కుమార్ విశ్వాస్, అశుతోష్‌కు అవకాశం ఇస్తారని ప్రచారం జరుగుతుండగా, అనూహ్యంగా కొత్త వ్యక్తుల పేర్లు తెరపైకి వచ్చాయి. సంజయ్ సింగ్, సుశీల్ గుప్తా, ఎన్‌డీ గుప్తాలను ఆప్ పెద్దల సభకు పంపనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. వీరిలో సంజయ్ సింగ్ మినహా మిగిలిన ఇద్దరూ ఆప్ సర్కిల్ లో పెద్దగా పరిచయంలేని వ్యక్తులే. సుశీల్ గుప్తా వ్యాపారవేత్త కాగా, ఎన్డీ గుప్తా చార్టర్డ్ ఎకౌంటెంట్. కుమార్ విశ్వాస్‌తో అర్ధరాత్రి కేజ్రీ సమావేశం అయ్యారు. ఇదిలా వుంటే, కుమార్ విశ్వాస్‌కు గుజరాత్ పటేల్ ఉద్యమనేత హార్దిక్ మద్దతు పలికారు. పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన విశ్వాస్ ఎదుగుదలకు బ్రేక్ వేసేందుకు కేజ్రీ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. జనవరి 16న జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో, నామినేషన్ల దాఖలుకు 5 ఆఖరు తేదీ. ఢిల్లీ నుంచి ముగ్గురు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి.

కార్తికి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం కుమారుడు కార్తి చిదంబరంకు ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సమన్లు జారీ చేసింది. మనీలాండరింగ్ కేసులో స్టేట్ మెంట్ రికార్డు చేసేందుకు ఈనెల 11న విచారణాధికారి ముందు హాజరుకావాలని కార్తికి ఈడీ సమన్లు ఇచ్చింది. మనీలాండరింగ్ నివారణ చట్టం కింద కార్తీపై ఈ ఏడాది మేలో కేసు నమోదు చేసిన ఈడీ.. పూర్తివివరాలను రాబట్టేందుకు ఆయన స్టేట్ మెంట్ రికార్డు చేసేందుకు సిద్ధమైంది.ఐఎన్ఎక్స్ మీడియాకు విదేశాల నుంచి నిధుల విషయంలో విదేశీపెట్టుబడుల ప్రమోషన్ బోర్డు క్లియరెన్స్ కోసంకార్తీ అవినీతికి పాల్పడినట్లు సీబీఐ ఆరోపిస్తోంది. 2007లో చిదంబరం ఆర్థికమంత్రిగా ఉన్న సమయంలో కార్తి 305 కోట్లు నిధులను నిబంధనలు విరుద్ధంగా మళ్లించాలని ఆరోపించింది. కార్తీ పాల్పడ్డారని సీబీఐ ఇప్పటికే కేసులు నమోదు చేసిన నేపథ్యంలో ఈడీ కూడా చర్యలు ప్రారంభించింది. ఈ కేసులో సీబీఐ సమన్లను కార్తి సుప్రీంకోర్టులో సవాల్ చేయడంతో న్యాయస్థానం ఆయనకు ఈనెల 1నుంచి 10 తేదీ వరకు బ్రిటన్ కు వెళ్లేందుకు అనుమతించింది. ఈనేపథ్యంలో 11న తేదీన స్టేట్ మెంట్ రికార్డుకు హాజరుకావాలని ఈడీ కార్తికి నోటీసులిచ్చింది.

మధుకోడాకు ఊరట

న్యూఢిల్లీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధుకోడాకు భారీ ఊరట లభించింది. బొగ్గు కుంభకోణం కేసులో సీబీఐ కోర్టు విధించిన మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 25 లక్షల జరిమానాపై ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పుపై ఢిల్లీ హైకోర్టుకు అప్పీల్ చేసుకోవడంతో విచారణ జరిపిన న్యాయస్థానం.. మధుకోడాకు తదుపరి విచారణ తేదీ (ఈనెల 22) వరకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. కేసు విచారణ దశలో ఉన్నందున మధుకోడా దేశం విడిచివెళ్లరాదని న్యాయస్థానం ఆదేశించింది. సీబీఐ కోర్టు విధించిన మూడేళ్ల జైలు శిక్షను రద్దు చేయడంతో పాటు తనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని మధుకోడా ఢిల్లీ కోర్టును ఆశ్రయించడంతో న్యాయస్థానం ఈ నిర్ణయం ప్రకటించింది. ఆరోగ్య సమస్యలు, ఇద్దరు మైనర్ కుమార్తెలు ఉన్నారన్న అంశాలను మధుకోడా కోర్టుకు విన్నవించి..తనకు జైలుశిక్ష నుంచి విముక్తి కల్పించాలని కోరారు. దీంతో జస్టిస్ అను మల్హోత్రా నేతృత్వంలోని ధర్మాసనం మధుకోడా వినతిపై సీబీఐ స్పందన కోరింది. జార్ఖండ్‌కు చెందిన బొగ్గు గనిని కోల్‌కతాకు చెందిన విని ఐరన్ అండ్ స్టీల్ ఉద్యోగ్‌కు కట్టబెట్టడంతో కోడా అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలతో సీబీఐ కోర్టు ఆయనకు మూడేళ్ల జైలుశిక్ష,రూ.25లక్షల జరిమానా విధించింది.

రాయబారిని ఉపసంహరించిన పాలస్తీనా

ఇస్లామాబాద్: పదేళ్ళ క్రితం ముంబాయిపై దాడి ఘటన ప్రధాన సూత్రధారి అయిన హఫీజ్ సయీద్‌తో రావల్పిండిలో ఇటీవల ఒకే వేదికను పంచుకున్న తమ రాయబారి వాలీద్ అబూ ఆలీని పాలస్తీనా ఉపసంహరించుకుంది. జెరూసలెంను ఇజ్రాయెల్ రాజధానిగా గుర్తించినందుకు అమెరికాకు వ్యతిరేకంగా ఈ ర్యాలీని సయీద్ నిర్వహించారు.ఈ ర్యాలీకి వేలాదిమంది హాజరయ్యారు. భారత్‌తో తమకు ఉన్న దౌత్య సంబంధాల దృష్ట్యా ఈ చర్య తీసుకున్నట్టు పాలస్తీనా పేర్కొంది. అబూ అలీ ఉద్దేశ్య పూర్వకంగా హాఫీజ్‌తో చేతులు కలపకపోయినా, భారత్‌తో దౌత్య సంబంధాలకు ఇబ్బంది కలగరాదన్నఉద్దేశ్యంతో తమ రాయబారిపై వేటువేసినట్టు పాలస్తీనా పేర్కొంది.

బంగ్లా మాజీ ప్రధాని ఖలీదా అరెస్టు



ఢాకా: బంగ్లాదేశ్ నేషనలిస్టుపార్టీ (బిఎన్పీ) అధ్యక్షురాలు, మాజీప్రధాని బేగం ఖలీదా జియాను రెండేళ్ళ క్రితం నాటి బాంబుదాడి కేసులో పోలీసులు అరెస్టు చేశారు. రెండేళ్ళ క్రితం ప్రభుత్వనికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం సందర్భంగా బీఎన్పీ కార్యకర్తలు బస్సులపై రాళ్ళతోపాటు, బాంబులు విసిరారు.ఆ కేసులో ప్రధాన నిందితురాలిగా ఖలీదా జియాపై పోలీసులు అభియోగాలు నమోదు చేశారు. కొమిల్లా కోర్టు న్యాయమూర్తి జోయ్ నాబ్ బేగం పోలీసులు దాఖలు చేసిన చార్జిషీట్‌ని ఆమోదిస్తున్నట్టుప్రకటించి, ఖలీదా జియా అరెస్టుకుఆదేశించారు. కాగా,ఆనాటి బాంబుదాడి సంఘటనలో ఎనిమిది మంది ప్రయాణికులు మరణించారు. ఖలీదా జియాపై అవినీతి ఆరోపణ కేసులు చాలా ఉన్నాయి. ప్రస్తుత ప్రధాని ,అవామీ లీగ్ అధ్యక్షురాలు హసీనా,ఖలీదా జియాలు రాజకీయ ప్రత్యర్థులు. అందుకే ఖలీదాపై హసీనా కక్ష తీర్చుకుంటున్నారని బీఎన్పీ కార్యకర్తలు ఆరోపించారు.ప్రస్తుతం లండన్‌లో ఉంటున్న ఖలీదా కుమారుడు తారీఖ్ రెహమాన్‌కూ, మరో 48 మందికీ 2004 నాటి దాడి ఘటనలో ఉరిశిక్ష విధించాలని ఇదే కోర్టులో ప్రాసిక్యూటర్లు వాదించడం గమనార్హం.

ఇరాన్‌లో ఆగని నిరసనలు

● 9 మంది మృతి

టెహరాన్: ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా గడిచిన కొద్ది రోజులుగా నిరవధికంగా జరుగుతున్న నిరసన ప్రదర్శనల్లో మంగళవారం 9 మంది మరణించారు. వీరితో ఇంతవరకూ మరణించిన వారి సంఖ్య 21కి పెరిగింది.పోలీసుల ఆయుధాలు లాక్కోవడానికి ప్రదర్శకులు ప్రయత్నించినట్టు ప్రభుత్వం ఆరోపించింది. మరోవంక తమ న్యాయసమ్మతమైన ఆందోళనను అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని నిరసనకారులు ఆరోపించారు. ప్రభుత్వ అసమర్థత వల్లే ఆర్థిక పరిస్థితి దిగజారిందని వారు అన్నారు. శత్రువుల కుట్రః ఇరాన్‌లో ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనలు శత్రువుల కుట్ర ఫలితమేనని ఇరాన్ సర్వోన్నత నాయకుడు ఆయుతుల్లా ఖమేనీ ఆరోపించారు. శత్రువుల కుట్రలు ఫలించబోవని ఆయన హెచ్చరించారు. ప్రజల ఆగ్రహాన్ని అర్థం చేసుకున్నామని, పరిస్థితి మెరుగు కోసం చర్యలుతీసుకుంటామని అధ్యక్షుడు హసన్ రోహానీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడానికి ఎవరు ప్రయత్నించినా సహించబోమని ఆయన హెచ్చరించారు.







అట్టుడికిన ముంబై

● భీమా- కోరేగావ్ యుద్ధ సంస్మరణ సభలో ఘర్షణలు
● దళితులపై రాళ్లు రువ్విన మరాఠాలు,వాహనాలకు నిప్పు
● ఒకరు మృతి, పలువురికి గాయాలు
● మరాఠాల దాడితో దళితుల ఆందోళన
● ముంబై, పూణె, ఔరంగాబాద్‌లో ర్యాలీలు, బంద్‌లు
● స్తంభించిన రవాణా వ్యవస్థ
● దోషులపై సీఐడీ విచారణకు సీఎం ఆదేశం

పూణె: మహారాష్ట్రలో మరోసారి కులాల కుంపటి రాజుకుంది. భీమా - కోరేగావ్ యుద్ధానికి 200 ఏళ్ల సందర్భంగా దళితులు నిర్వహించిన ఉత్సహం ఘర్షణలకు వేదికైంది. దళితులు, మరాఠా సామాజిక వర్గాల మధ్య జరిగిన ఘర్షణ హింసాత్మకంగా మారింది. ఘర్షణల్లో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. జనవరి 1న భీమా - కోరేగావ్ యుద్ధానికి 200 ఏళ్ల సందర్భంగా పూణె జిల్లాలోని భీమా -కోరేగావ్ గ్రామంలోని దళితులు ఘనంగా సంస్మరణ సభ నిర్వహించారు. యుద్ధం జరిగిన ప్రాంతానికి వేలాదిమంది దళితులు వచ్చి వేడుకలు జరుపుకుంటున్న వేళ.. కొందరు వ్యక్తులు వాహనాలకు నిప్పుపెట్టి, రాళ్లు రువ్వడంతో అగ్గికి ఆజ్యం పోసినట్లైంది. ఈ ఘర్షణలో 28 ఏళ్ల రాహుల్ మృతి చెందగా..5గురు గాయపడ్డారు. భద్రుక్ గ్రామానికి సమీపంలో కొందరు వ్యక్తులు దళితులపై రాళ్లు రువ్వినట్లు పోలీసులు తెలిపారు. దీంతో దళితులు, మరాఠా వర్గాల మధ్య ఘర్షణలు జరిగిందని వివరించారు. పుణె జిల్లాల్లో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలు మహారాష్ట్ర రాజధాని ముంబైకి పాకాయి. దీంతో రాజధానితో రవాణా వ్యవస్థ స్తంభించింది. స్కూల్స్,ఇతర విద్యాసంస్థలు బంద్ పాటిస్తున్నాయి. రైల్వే వ్యవస్థపై కూడా బంద్ ప్రభావం కనిపించింది. పుణె ఘటనకు నిరసనగా ముంబైలో దళితులు పిలుపునిచ్చిన బంద్ ఉద్రిక్తంగా మారింది. రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆందోళనకారులు బస్సులను ధ్వంసం చేశారు. శివసేన కార్యాలయంపై రాళ్లు రువ్వారు. ఈస్టర్న్ హైవే, హార్బర్ లైన్ లపై ఆందోళనలు చేశారు. దీంతో పెద్దఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. చెంబూర్ తో పాటు పలు తూర్పు ప్రాంతాల్లో పోలీసులు 144 సెక్షన్ విధించారు.



49 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు

ఘర్షణలతో సంబంధమున్న వధు బద్రుక్ గ్రామానికి చెందిన 49 మందిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ 49 మంది మంగళవారం వధు బద్రుక్ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బీమా కొరేగావ్ గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ర్యాలీ నిర్వహించిన ఉన్నత వర్గాల వారు..దళితులపై రాళ్లదాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. పలు వాహనాలను ధ్వంసం చేశారు. పోలీస్ వ్యాన్లు, ఇతర వాహనాలకు నిప్పుపెట్టారు.

న్యాయ విచారణకు సీఎం ఆదేశం

రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణల నేపథ్యంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సర్కారు తక్షణ చర్యలు ప్రారంభించారు. పుణె ఘర్షణలపైసీఎం న్యాయవిచారణకు ఆదేశించారు. ఘటనపై హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో దర్యాప్తు జరిపిస్తామన్నారు. ఘర్షణల్లో మృతి చెందిన యువకుడి సంతాపం ప్రకటించిన ఫడ్నవీస్. అతని కుటుంబానికి రూ. 10 లక్షల పరిహారాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో కుల రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశారు. ప్రజలు శాంతి- సామరస్యంగా ఉండాలని కోరారు. సోమవారం పోలీసులు, భద్రతా సిబ్బంది సకాలంలోస్పందించడం వల్లే ఘర్షణలనునిలువరించగలిగామన్నారు.హింసాత్మక ఘటనల వెనకున్నదెవరో తేల్చేందుకు సీఐడీతో విచారణ జరిపిస్తామన్నారు.

భీమా - కోరెగావ్ దళితుల ప్రతిఘటనకు చిహ్నంః రాహుల్

మహారాష్ట్రలోని భీమా - కోరెగావ్ ఘర్షణలపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పందించారు. కేంద్రంలో, మహారాష్ట్రలో అధికారంలో ఉన్న బీజేపీ ఫాసిస్ట్ విధానాల వల్లే దళితులపై దాడి జరిగిందని విమర్శించారు. భీమా- కోరెగావ్ యుద్ధం దళితుల ప్రతిఘటనకు చిహ్నామని అభివర్ణించారు.దేశంలో అల్లర్లకు బీజేపీ విధానాలే కారణమని ఆరోపించిన రాహుల్.. మోడీప్రభుత్వం దళిత వ్యతిరేకిలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్/బీజేపీ సెంట్రల్ పిల్లర్‌లా ఫాసిస్ట్ విధానాలు అవలంభిస్తూ..దళితులను సమాజంలో మరింత అట్టడుగు తొక్కేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఉణా, రోహిత్ వేముల, ప్రస్తుతం భీమా-కొరేగావ్ ఘటనలు ప్రతిఘటనలకు నిదర్శనమని రాహుల్ గుర్తుచేశారు.

ప్రభుత్వం విఫలంఃపవార్

రాష్ట్రంలో కుల ఘర్షణలను ఎదుర్కోవడంలో ఫడ్నవీస్ ప్రభుత్వం విఫలమైందని ఎన్‌సిపీ అధ్యక్షుడు శరద్‌పవార్ ఆరోపించారు. దళితులు తలపెట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమానికి వేలాదిగా జనం తరలివస్తారని తెలిసినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. భీమా కోరేగావ్ విజయోత్సవ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా ఉన్న దళితులు గత 200 ఏళ్లుగా వస్తున్నప్పటికీ ఎన్నడూ ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోలేదని.. ఫడ్నవీస్ ప్రభుత్వం భద్రతా లోపం వల్లే ఘర్షణలు జరిగాయని ఆరోపించారు. ఘర్షణలు ముందస్తు వ్యూహం ప్రకారమే జరిగిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఘర్షణలు జరిగిన ప్రాంతంలో ఆర్ఎస్ఎస్ కొంతకాలంగా ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోందని మండిపడింది.

నేడు మహారాష్ట్ర బంద్

దళితులపై హింసాత్మక దాడులకు నిరసనగా భారిపా బహుజన మహాసంఘ్ (బీబీఎం) నేడు రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది. ముంబైలోని అన్ని పోలీస్ స్టేషన్ల వెలుపల ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని బీబీఎం నాయకుడు ప్రకాష్ అంబేద్కర్ ప్రకటించారు. దళితులపై దాడులను నిలువరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన ఆయన.. అగ్రవర్ణాల వైఖరికి నిరసనగా బంద్ పాటిస్తామని చెప్పారు. బంద్ కు దాదాపు 250 సంఘాలు మద్దతు పలుకుతున్నాయని తెలిపారు.

ఏంటీ భీమా కోరేగావ్ విజయోత్సవం

1818 లో బ్రిటీష్ సేనలకు, మరాఠా రాజు ఫీష్వా బాజీరావు 2 సైన్యానికి మధ్య జరిగిన యుద్ధంలో ఫీష్వాపై బ్రిటన్ సేనలు విజయం సాధించాయి. అయితే బాజీరావు సేనల్లో ఎక్కువ మంది అగ్రకులస్థులు, మరాఠాలతో నిండిఉండటం.. బ్రిటీష్ సైన్యంలో భారతీయ దళితులే ఎక్కువ మంది ఉండటంతో ఈ యుద్ధం దళితుల విజయానికి సూచికగా ప్రతీ ఏడాది వేడుకలు జరుపుకుంటున్నారు. గత కొన్నేళ్లుగా వేడుకగా జరుపుకుంటున్న భీమా కోరేగావ్ విజయోత్సవంలో ఇంతవరకెప్పుడు అల్లర్లు జరగలేదు. ఈ యుద్ధానికి జనవరి 1వ తేదీతో 200 ఏళ్లు పూర్తవడంతో ఈసారి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. దేశంలోని దళితులు కూడా పెద్దసంఖ్యలో భీమా కోరేగావ్ ప్రాంతానికి తరలివచ్చారు. ఈనేపథ్యంలోనే దళితులను రెచ్చగొట్టేలా దాడులు జరిగాయి.

క్రీడాప్రభ

పడగొడతారా పేసర్లు...!



ఆంధ్రప్రభ, క్రీడావిభాగం

పేసర్ల సత్తాపై నమ్మకంతో కెప్టెన్ విరాట్ కోహ్లి దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు సంసిద్ధమవు తున్నాడు. భారత్, దక్షిణాఫ్రికా తొలి టెస్టు ఈనెల 5న కేప్‌టౌన్‌లో ఆరంభమవుతుంది. ఈ మూడు టెస్టుల సిరీస్‌లో కోహ్లి... మహ్మద్ షమి, ఉమేశ్ యాదవ్, భువనేశ్వర్లకు ప్రాధాన్యం ఇస్తాడు.

సీమ్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉండే దక్షిణాఫ్రికాలోని పరిస్థితుల్లో మాత్రమే కాకుండా... ఇంగ్లండ్ పర్యటలనలోనూ విరాట్ ఈ పేస్ త్రయాన్నే ఎక్కువగా నమ్ముకుంటాడు. పచ్చటి పచ్చికతో పేస్‌కు అనుకూలించే వికెట్లపై ఈ త్రయం రాణిస్తే... భారత్ విజయం నల్లేరుపై నడకే అవుతుంది.

భారత క్రికెట్‌కు గత ఏడాది అద్వితీయంగా కలిసి వచ్చిన సంవత్సరం. ఒక్క సిరీస్‌లో క రాడా ఓటమి ఎరుగని టీమ్‌ఇండియాకు లాభించిన మరో అంశం పేస్ బౌలింగ్. ఇటు టెస్టుల్లో అటు వన్డేల్లో భారత్ పేసర్లు అద్భుతంగా రాణించారు. వెస్టిండీస్‌లో, శ్రీలంకలో ఉమేశ్ యాదవ్, మహ్మద్ షమి, భువనేశ్వర్ కుమార్, ఇషాంత్ శర్మ ప్రత్యర్థిని బెంబేలెత్తించారు. వన్డేల్లో భువనేశ్వర్, బుమ్రా, పాండ్య ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను ఊపిరి తీసుకోనీయలేదు. లంకతో స్వదేశంలో టెస్టు సిరీస్‌లో చిత్రంగా స్పిన్నర్ల కంటే పేసర్లే ఎక ్కువ వికెట్లు పడగొట్టారు. నిజానికి స్పిన్నర్ల ఉనికే లేదు. భారత పేస్ బౌలింగ్ అంతగా మెరుగుపడింది. పేసర్ల రాణింపు దక్షిణాఫ్రికా పర్యటనకు ముందు కోహ్లి సేనలో విశ్వాసాన్ని రెట్టింపు చేసి ంది. కోల్‌కత ఈడెన్ గార్డెన్‌లో పచ్చికతో కూడిన పేస్ పచ్చికపై లంకకు చుక్కలు చూపించిన ఉమేశ్, భువనేశ్వర్, షమి త్రయం.. దక్షిణాఫ్రికాలోని అదే మాదిరి వికెట్లపై అదిరిపోయే ప్రదర్శన చేయాలని భారత క్రికె ట్ అభిమాని కోరుకుంటున్నాడు. జట్టు యాజమాన్యం తొలి ప్రాధాన్యం ఉమేశ్ యాదవ్, మహ్మద్ షమి, భువనేశ్వర్ కుమార్ త్రయం వైపే మొగ్గు చూపే అవకాశం ఉంది. సీనియర్ ఇషాంత్‌కు పెద్దగా బౌలింగ్ చేసే అవకాశం రాకపోవచ్చు. పరిమిత ఓవర్ల క్రికెట్లో గత ఏడాది తిరుగులేని ప్రదర్శన చేసి... టెస్టుల్లో చోటు దక్కించుకున్న బుమ్రాను విరాట్ కోహ్లి ఎలా ఉపయోగించుకుంటాడో చూడాలి. అత్యంత వేగవంతమైన పిచ్‌కు నిలయమైన డర్బన్‌లో ఈ సారి టెస్టు మ్యాచ్ లేదు. కానీ తొలి వన్డే మాత్రం ఇక్కడే జరుగుతుంది. ఇక్కడ బౌలింగ్ చేసి అసలుసిసలు పేస్ వికెట్లపై బౌలింగ్ చేసిన అనుభవంతో తదుపరి విదేశీ పర్యటనలకు బుమ్రా సమాయత్తం కావచ్చు. మరి భారత్ పేస్ విభాగం దక్షిణాఫ్రికాలోనూ ఇదే జోరును కొనసాగిస్తుందా? వేగానికి మారుపేరైన దక్షిణాఫ్రికా పిచ్‌లపై అద్భుతంగా రాణిస్తారా?మ్యాచ్‌లో 20 వికెట్లూ తీయగలరా? ఇంతవరకు టెస్ట్ సిరీస్ గెలవని ఆ గడ్డపై అపురూపరమైన విజయాన్ని టీమ్‌ఇండియాకు కట్టబెడతారా? నెంబర్ వన్ ర్యాంకును కాపాడతారా? చూడాలి!



ఉమేశ్... స్వింగు భళా


కొన్నేళ్లుగా టెస్టుల్లో భారత్ పేస్ విభాగంలో ప్రధానాస్త్రంగా ఉన్న ఉమేశ్ యాదవ్.. ఔట్ స్వింగర్ సంధించడంలో అందెవేసిన చేయి. ఈ బంతుల్లో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను అయోమయానికి గురి చేస్తుంది. ఈ ఔట్ స్వింగర్లు బ్యాట్ అంచును తీసుకొని క్యాచ్‌ల రూపంలో వారిని వెనక్కి పంపుతాయి. 2017లో ఉమేశ్ 617 ఓవర్లు బౌలింగ్ చేశాడు. అశ్విన్ (1449) బౌలింగ్ చేసిన ఓవర్లలో ఇవి 45 శాతం. ఇషాంత్, షమి కూడా దాదాపు ఉమేశ్ స్థాయిలోనే బౌలింగ్ చేశారు. ఐతే చిన్నపాటి గాయాల కారణంగా జాతీయ క్రికెట్ అకాడమీకి వెళ్లిన ఉమేశ్ ఇపుడు పూర్తి ఫిట్‌నెస్ సంతరించుకున్నాడని... దక్షిణాఫ్రికాలో ఉమేశ్ ఎక్కువగా బౌలింగ్ చేసేందుకు అవకాశమివ్వాలని అతని మెంటర్ సుబ్రతో అంటున్నాడు. "ఈ వయసులో ఉమేశ్ సాధ్యమైనంత ఎక్కువ బౌలింగ్ చేసేందుకు అవకాశమివ్వాలి. తిరుగులేని ఫిట్‌నెస్‌తో ఉన్న ఉమేశ్.. ఏడాదికి కేవలం ఏడు, ఎనిమిది టెస్టులు ఆడితే ఏం లాభం" అని సుబ్రతో అంటున్నాడు. "ఉమేశ్ రంజీల్లో ఆడి మరింత క్రమశిక్షణ అలవర్చుకున్నాడు. మ్యాచ్ ప్రాక్టీసు కూడా ఉంది. దక్షిణాఫ్రికా పర్యటనకు ముందు సరైన లెంత్‌లో బౌలింగ్ చేస్తున్నాడు. దాని ప్రాధాన్యతను ఉమేశ్ గుర్తించాడు" అన్నాడు. దక్షిణాఫ్రికా బయలుదేరడానికి ముందు ఉమేశ్.. విదర్భ తరపున కర్నాటకపై సెమీ ఫైనల్ మ్యాచ్ ఆడాడు. ఉమేశ్ ఇంతవరకు దక్షిణాఫ్రికాలో ఆడింది లేదు.



భువీ.. భలే భరోసా

ప్రదర్శనకు భరోసా.. భువనేశ్వర్ కుమార్. ఇటు టెస్టులైనా.. అటు పరిమిత ఓవర్ల క్రికెట్ అయినా భువీ ఉంటే.. టీమ్‌ఇండియాకు అదో రకం ధీమా. మ్యాచ్ మ్యాచ్‌కూ పదును తేలుతున్న బౌలింగ్ తో ఇటీవల కాలంలో ఆల్‌రౌండర్‌గా ఎదుగుతున్న భువీ.. సొంతగడ్డపై, లంక లో, విండీస్‌లో సత్తా చాటాడు. ఇదే తొలి దక్షిణా ఫ్రికా పర్యటన అయినప్పటికీ భువీ.. తన ప్రదర్శనపై విశ్వాసంతో ఉన్నాడు. తనపైనే కాకుండా షమి, ఉమేశ్, తాను.. కోల్‌కత ఈడెన్‌లో లంకపై మాదిరిగా సత్తా చాటగలమని నమ్మకంగా చెబుతున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఏడు లంక వికెట్లు కూల్చి టీమ్‌ఇండియా చేజారిపోతున్న మ్యాచ్‌ను డ్రాగా ముగించారు.

ఈ మ్యాచ్‌లో భువీ.. 8 వికెట్లు పడగొట్టాడు. 2014లో లార్డ్స్‌లో, 2016లో సెయింట్ లూసియాలో భారత జట్టు విజయాలు భువీ వల్లే సాధ్యమయ్యాయి. పేస్ పిచ్ ఎదురైనపుడల్లా భువీకి పిలుపు రావలసిందే. ఉమేశ్ మాదిరిగానే భువీ కూడా దక్షిణాఫ్రికా పిచ్‌లు కొత్త అయినప్పటికీ వికెట్ల వేటలో తమ దమ్ము చూపిస్తామంటున్నాడు. నైపుణ్యంలో ఉమేశ్, భువీ భిన్నమైనా... తామిద్దరు ఒకరి నుంచి మరొకరు నేర్చుకుంటామని భువీ అన్నాడు. "ఉమేశ్, ఇషాంత్, షమిల నుంచి రివర్స్ స్వింగ్ ఎలా సంధించాలో నేర్చుకున్నాను. వారు నా వద్ద నుంచి స్వింగ్ బంతులు ఎలా వేయాలో నేర్చుకున్నారు. దీనివల్ల మేం దక్షిణాఫ్రికాలో అద్వితీయంగాబౌలింగ్ చేయగలమ నుకుంటున్నాం" అని భువీ అన్నాడు.





వేగం... షమి మంత్రం

విపరీతమైన వేగంతో బంతుల్ని సంధించగల సత్తా షమి సొంతం. వేగంతో పాటు అతను సంధించే బౌన్సర్లు ప్రత్యర్థి బ్యాట్స్‌మన్ గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తాయి. వేగంతో పాటు బౌలింగ్లో వైవిధ్యం ప్రదర్శించడంలోనూ షమి దిట్ట. సర్రున దూసుకువచ్చే బంతులు షమికి వికెట్లు తెచ్చిపెడతాయి. ఐతే షమి కొన్నిసార్లు గతి తప్పుతాడు. ప్రతి ఓవర్‌కు కనీసం ఓ పేలవమైన బంతి వేసి పరుగులు సమర్పించుకునే బలహీనత షమిది. ఆస్ట్రేలియా పర్యటనలో స్పిన్నర్లకు అనుకూలించని పిచ్‌లపై షమి అద్భుతంగా బౌలింగ్ చేశాడు. కానీ చెత్త బంతుల కారణంగా పరుగుల ఇచ్చు కోవడంలో అతని ఎకానమీ రేటు 4.24కు చేరుకుంది.

ఇషాంత్...అనుభవం

పేస్ బౌలింగ్ విభాగంలోకి కొత్త కుర్రాళ్లు వస్తున్నప్పటికీ ఇషాంత్ ప్రాధాన్యత తగ్గడం లేదు. అతని అనుభవం.. పేస్ దళానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటోంది.

బౌలర్ల నెట్ ప్రాక్టీస్

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో ఈనెల 5న ఆరంభం కాబోయే టెస్టు సిరీస్ కోసం భారత జట్టు సమాయత్తమవుతోంది. బౌలర్లు మంగళవారం నెట్స్‌లో బౌలింగ్ ప్రాక్టీస్ చేశారు. తొలి టెస్టుకు ముందు టీమ్‌ఇండియాకు ఎలాంటి ప్రాక్టీసు మ్యాచ్ లేకపోవడంతో ఆటగాళ్లు నెట్ ప్రాక్టీసుపైనే దృష్టి సారించారు. పేసర్లు ఉమేశ్, బుమ్రా, భువనేశ్వర్ కుమార్ చమటోడ్చారు. ఇక్కడి పిచ్‌పై అదనపు బౌన్స్ లభించడం పేసర్లకు లాభిస్తుందని అంతక ుముందు భువీ అన్నాడు. ఐతే కోకబుర్రా బంతితో బౌలింగ్ చేయాల్సిరావడం సవాలని చెప్పాడు. సిరీస్‌లో సుదీర్ఘంగా బౌలింగ్ చేయడంపై ప్రస్తుతం భారత బౌలర్లు దృష్టి సారించారు. దక్షిణాఫ్రికాలో భారత్ ఒక్క టెస్టు సిరీస్ అయినా గెలవని నేపథ్యంలో ఈ పర్యటన కీలకమైంది.

అదే తేడా...

సాధారణంగా భారత పేస్ బౌలర్ల బౌలింగ్‌లో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ లెగ్ దిశగా ధారాళంగా పరుగులు సాధిస్తారు. స్వదేశంలో మన పేసర్లు స్టంప్స్‌కు గురి పెట్టి అందుకు అనుగుణమైన లైన్‌ను ఎంచుకోవడమే అందుక ు కారణం. ఇలాంటి లైన్‌ను ఎంచుకోవడం వల్లే మన గడ్డపై 45.5 శాతం వికెట్లు ఎల్బీలుగా, బౌల్డ్‌గా లభిస్తాయి. గత ఏడాది భువీ పడగొట్టిన 24 వికెట్లలో 16 స్టంప్స్‌కు గురి చూసి సంధించిన బంతుల ద్వారా లభించినవే. మందకొడి పిచ్‌లపై రివర్స్ స్వింగ్‌కు అవకాశముండడంతో స్టంప్స్‌కు నిదానంగా బౌలింగ్ చేయవచ్చు. ఇలాంటి పిచ్‌లపై ఈ వైఖరే సరైంది. కానీ గత 10 ఏళ్లలో దక్షిణాఫ్రికాలో పేస్ బౌలింగ్‌లో 28 శాతం వికెట్లు మాత్రమే ఎల్బీగా, బౌల్డ్‌గా లభించాయి. అసలుసిసలు పిచ్‌లపై అరుదుగా కాని బంతిని రివర్స్ స్వింగ్ చేయలేరు. దీంతో ఆ పిచ్‌లపై పేసర్లు బ్యాట్ వెలుపలి అంచులు తగిలి క్యాచ్‌లు వచ్చేందుకు ఆఫ్ స్టంప్ వెలుపల బంతులు సంధిస్తారు. దీంతో ఫుల్లర్ లెంత్‌లో బంతులు పడతాయి.



25 నుంచి టీపీఎల్ 20-20

- రాష్ట్రవ్యాప్తంగా 12 జట్లు బరిలోకి - ఎల్‌బీ స్టేడియంలో భారీ ఏర్పాట్లు - బ్రాండ్ అంబాసిడర్‌గా మాజీ కెప్టెన్ అజహరుద్దీన్ - టీపీఎల్ సీఎండి గోవర్దన్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్ 20-20) రెండవ సీజన్ షురూ కానుంది. ఈనెల 25 నుంచి ఫిబ్రవరి 4వ తేదీవరకు ఎల్‌బీస్టేడియంలో డే అండ్ నైట్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు టీపీఎల్ సీఎండి మన్నె గోవర్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది ప్రారంభమైన తొలి టీపీఎల్ సీజన్ ఈ ఏడాదికి మరింత పటిష్టంగా మారిందని, మొత్తం 12 బృందాలు బరిలో ఉన్నాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువ క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో టీపీఎల్ ముందడుగు వేస్తోందన్నారు. క్రికెట్‌లో రాణించే సత్తా అనేక మందికి ఉన్నప్పటికీ ప్రోత్సహించేవేదిక లేక వారి ప్రతిభ బహిర్గతం కావడం లేదన్నారు. తెలంగాణ నుంచి జాతీయ క్రికెట్ టీమ్‌లో పలువురికి చోటు లభించాలన్న ఉద్దేశంతో టీపీఎల్ శిక్షణ ఇస్తోందన్నారు. హైదరాబాద్‌ను నాలుగు బృందాలుగా విభజించి క్రీడాకారుల ను ప్రోత్సహిస్తున్నామన్నారు. సైబరాబాద్ ఛాంపియన్ టీమ్ నుంచి సినిమా, టెలివిజన్ రంగాల్లోని సెలబ్రిటీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రీమియర్ సీజన్-2కు ప్రముఖ క్రికెటర్ భారత క్రికెట్ జట్టు పూర్వ కెప్టెన్ అజహరుద్దీన్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని గోవర్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవలె టీపీఎల్ లోగో, వెబ్‌సైట్‌ను ఆయన ఆవిష్కరించారని చెప్పారు.

ఈ సీజన్ టీపీఎల్‌లో సైబరాబాద్ ఛాంపియన్స్‌తో పాటు సికింద్రాబాద్ వీనస్ లెవెన్, రంగారెడ్డి రాయల్స్, హైదరాబాద్ కింగ్స్, వరంగల్ రైడర్స్, కరీంనగర్ లెజెండ్స్, ఆదిలాబాద్ టైగర్స్, నిజామాబాద్ నిజామ్స్, పాలమూరు పాంథర్స్, నల్గొండ నవాబ్స్, ఖమ్మం కమాండర్స్, మెదక్ లయన్స్ జట్లు పోటీ పడుతున్నాయని టీపీఎల్ సీఎండి గోవర్దన్‌రెడ్డి వివరించారు. ఈ ఏడాది మరింత మంది క్రీడాభిమానులు తిలకించే విధంగా ఎల్‌బీ స్టేడియంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

మెల్‌బోర్న్ పిచ్ నాసిరకం

రేటింగ్ ఇచ్చిన ఐసీసీ

మెల్‌బోర్న్: స్థానిక ఎంసిజి పిచ్‌కు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) పూర్ రేటింగ్ ఇచ్చింది. యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా- ఇంగ్లండ్ మధ్య జరిగిన నాల్గవ టెస్ట్ డ్రాగా ముగియడంతో పిచ్‌పై సర్వత్రా విమర్శలు వచ్చాయి. ఐదు రోజుల్లో రెండు జట్ల ఇన్నింగ్స్‌లో మొత్తం 24 వికెట్లు మాత్రమే పడ్డాయి. ఆస్ట్రేలియా రెండు ఇన్నింగ్స్‌ల్లో 327, 263-4 డిక్లేర్ చేయగా, ఇంగ్లండ్ ఒక్క ఇన్నింగ్స్‌లో 491 పరుగులు చేసింది. కాగా రెండు జట్లు పిచ్ పరిస్థితిపై విమర్శలు గుప్పించాయి. 'పిచ్‌పై బౌన్స్ మధ్యరకంగా ఉంది. మ్యాచ్ సాగుతున్నకొద్దీ పేస్ బౌలింగ్‌లో క్రమక్రమంగా బంతి నెమ్మదించింది" అని మ్యాచ్ రిఫరీ రంజన్ మదుగలె ఐసీసీకి సమర్పించిన నివేదికలో తెలిపాడు. ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు ఓ ప్రకటన చేస్తూ.. పిచ్ పరిస్థితి ఐదురోజుల్లో ఏమాత్రం మారలేదు. అయితే పిచ్‌లో ప్రాకృతికంగా ఏమాత్రం క్షీణించలేదు. పిచ్ నిలకడ ఆటకు ఏమాత్రం తోడ్పడలేదు. అటు బ్యాటింగ్‌కు కాని ఇటు బౌలింగ్‌కు కాని అనుకూలంగా లేకోపోయిందని పేర్కొంది. దీనిపై క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) తమకు రెండు వారాల్లోగా బదులివ్వాలని నిర్వహణ బోర్డు ఆదేశించింది. కాగా ఇటువంటి పరిస్థితి పునరావృ తంకాకుండా, మైదానం నిర్వాహకులతో చర్చించి తగిన చర్యలు చేపడుతామని క్రికెట్ ఆస్ట్రేలియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ జేమ్స్ సదర్‌లాండ్ చెప్పారు. ఐసిసి రేటింగ్ మమ్మల్ని నిరుత్సాహ పరిచింది. దేశంలో అన్ని వేదికలను అంతర్జాతీయ క్రికెట్‌కు సరితూగేవిధంగా తీర్చిదిద్దేందుకు మేము ప్రయత్నిస్తాము అని సదర్‌లాండ్ తెలిపారు. ఇందుకోసం మేము ఐసిసి, ఆటగాళ్లు, నిపుణుల సలహాలను తీసు కుని మెల్‌బోర్న్ క్రికెట్ క్లబ్‌తో కలిసి ఇటువంటి రేటింగ్ పునరావృతంకాకుండా చూస్తామని చెప్పారు. ఐసిసి పిచ్, అవుట్ ఫీల్డ్ పర్యవేక్షణ ప్రక్రియలో ఎంసిజి టెస్ట్ నివేదిక చివరిది. కాగా, గురువారం నుంచి దీనిపై సమీక్ష ప్రారంభం కానుంది. కొత్త ప్రక్రియలో భాగంగా పిచ్, అవు ట్ ఫీల్డ్ నిర్ణీత ప్రమాణాలకు తగ్గట్టు లేకపోతే. ఆ వేదికకు కొన్ని డి మెరిట్ పాయింట్లు కేటాయి స్తారు. ఈ రేటింగ్ ఐదేళ్లవరకు ఆ వేదికకు వర్తిస్తాయి.

తాజా రేటింగ్ ఈ విధంగా ఉంటుంది..

"పిచ్ సగటు స్థాయికి కంటే తక్కుగా ఉందని రిఫరీ నిర్ణయిస్తే... ఆ స్టేడియం(వేదిక)కు ఒక డిమెరిట్ పాయింట్‌ను కేటాయిస్తారు. పిచ్ స్థాయి పూర్(నాసిరకంగా) ఉంటే మూడు పాయింట్లు, పిచ్ స్థాయి అధ్వానంగా ఉంటే ఐదు పాయింట్లు కేటాయిస్తాం" అని ఐసీసీ తన నివేదికలో పేర్కొంది. ఏదైన వేదిక ఐదు డిమెరిట్ పాయింట్లు కూడగట్టుకుంటే అంతర్జాతీయ క్రికెట్ పనికి రాదని నిర్ణయించి 12 నెలలపాటు నిషేధం విధిస్తారు. 10 డిమెరిట్ పాయింట్లు వస్తే దానికి 24 నెలల పాటు నిషేధం విధిస్తారు.



ఆర్‌సీబీ కోచ్‌లుగా కిర్‌స్టన్, నెహ్రా

బెంగళూరు: ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫ్రాంచైజీ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) కోచ్‌లుగా దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు గారీ కిర్‌స్టన్, భారత మాజీ పేసర్ ఆశిష్ నెహ్రా చేరనున్నారు. ఐపీఎల్ వేలం ఈనెల 27, 28 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో హెడ్ కోచ్ డేనియల్ వెటోరీ నేతృత్వంలో బ్యాటింగ్ కోచ్‌గా కిర్‌స్టన్, బౌలింగ్ కోచ్‌గా నెహ్రా పని చేస్తారని ఫ్రాంచైజీ యాజమాన్యం తెలిపింది. గత వారం ఆయన ఒప్పందంపై సంతకాలు చేసినట్లు తెలిసింది. ఐపీఎల్‌లో బాధ్యతలు చేపట్టడం కిర్‌స్టన్‌కు ఇది రెండో సారి. 2015లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ కోచ్‌గా వ్యవహరించాడు.

'డబుల్స్ ఆటగాళ్లను పట్టించుకోరా?'



న్యూఢిల్లీ: బ్యాడ్మింటన్ క్రీడలో సింగిల్స్ మ్యాచ్‌లకే ప్రాధాన్యం ఇస్తున్నారని, డబుల్స్ మ్యాచ్‌లను కాని... ఆటగాళ్లకు కాని అంతగా ప్రాధాన్యత ఇవ్వడంలేదని డబుల్స్ నిపుణురాలు అశ్విని పొన్నప్ప వాపోయింది. దేశంలో ఈ తరహా వివక్షను రూపుమాపాలని పొన్నప్ప సూచించింది. ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో భాగంగా పొన్నప్ప ఢిల్లీ డ్యాషర్స్ తరపున ఆడుతోంది. ఆదివారం హైదరాబాద్ హంటర్స్‌తో మ్యాచ్ అనంతరం పొన్నప్ప మీడియాతో మాట్లాడుతూ.. 'డబుల్స్ క్రీడాకారుల గత రికార్డులు, ప్రస్తుత రికార్డులను పరిశీలిస్తే... గ్రాఫ్‌లో వృద్ధి కనిపిస్తున్నది. అయితే వారి విజయాలకు తగిన ప్రచారం, గుర్తింపు, గౌరవం దక్కటంలేదు. డబుల్స్ ఆటగాళ్లపై ఎందుకీ వివక్షఅని మిమ్మిల్ని అడుగుతున్నాను. వారు బాగా ఆడుతున్నప్పటికి ఎందుకు గుర్తించటంలేదు' పొనప్ప విలేకరుల ముందు ఆక్రోషించారు. మాలో చాలామంది ఆటగాళ్లు కెరియర్‌ను సింగిల్స్‌గానే ప్రారంభించారు. తర్వాత వారు డబుల్స్‌లోకి మారారు. ఇది స్వచ్ఛందంగా జరగలేదు. ఆ విధంగా జరిగితే పరిస్థితి వేరుగా ఉండేదని పొన్నప్ప వ్యాఖ్యానించారు. జూనియర్ ఆటగాన్ని మీరు డబుల్స్‌కు ఆడతారా లేదా సింగిల్స్‌కు ఆడతారా అని ప్రశ్నిస్తే.. అవకాశముంటే సింగిల్స్‌కే తమ ఓటు అని బదులిస్తారని పొన్నప్ప తెలిపింది.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

Lively Interaction For Ever
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్
బుధవారం 3 జనవరి 2018

దృక్పథం

జీవితంలో ఆనందానికి రహస్యం మనకున్నవాటి పట్ల కృతజ్ఞతగా ఉండటం... మనకు లేని, కోల్పోయినవాటి గురించి బాధపడటం వలన ఎప్పటికీ ఆనందాన్ని పొందలేము. ఇది వినడానికి చాలా బాగుంది కదా...కానీ ఆచరించడం అంత తేలిక కాదు. కానీ పాకిస్తానీ అమ్మాయి మునీబా మజారీ ఆ సూక్తికే నిలువెత్తు నిర్వచనంలా నిలిచింది.



జీవిత చక్రం ఆగదు!

నడవలేదు...కానీ నడిపించే స్థైర్యం ఆమె

కదలలేదు...కానీ కదిలించే చైతన్యం ఆమె

ఒక ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకుని...చక్రాల కుర్చీకే పరిమితమైన మునీబా.... తన ఉత్తేజపూరితమైన ప్రసంగాలతో యువతలో నిస్తేజాన్ని తరిమికొడుతోంది. ఆమె మాటలు బుల్లెట్లలా ఉంటాయి. అవి సూటిగా మన మనసులను వచ్చి తాకుతాయి. మెదడుని, హృదయాన్ని కూడా తట్టి లేపుతాయి. వెలుగు కిరణం సోకగానే చీకటి పారిపోయినట్టుగా...ఎంత నిరాశలో ఉన్నవారయినా మునీబా మాటలు విన్నారంటే చాలు...జూలు విదిలించి జీవన కదనరంగంలోకి దూకాల్సిందే. కాళ్లతోనే కాదు..మనసుతో మెదడుతో ఆలోచనలతో ఆత్మధైర్యంతోనూ నడవవచ్చని, జీవితాన్ని పరుగులు తీయించవచ్చని నిరూపిస్తోంది మునీబా. పాకిస్తాన్ ముఖచిత్రం అన్నంత పేరు సాధించిన మునీబా గురించి...ఆమె ప్రపంచానికి అందిస్తున్న స్ఫూర్తి గురించి-

జీవితంలో ముందుకు వెళుతున్నపుడు ఏవో ఒక అడ్డంకులు రావటం అనేది అత్యంత సహజం. కానీ అవన్నీ మన ఊహలే తప్ప...నిజం కాదని...నిజంగా గట్టిగా... అనుకున్నది సాధించాలని అనుకుంటే మాత్రం...ఏ ఆటంకాలు మనల్ని ఆపలేవని అంటోంది మునీబా మజారి. అలా చెప్పగల అర్హత ఆమెకి కచ్చితంగా ఉంది. ఎందుకంటే అందరికీ ఆటంకాలుగా అనిపించేవి ఏవీ ఆమెకు అలా కనిపించడం లేదు మరి.


మునీబా పాకిస్తాన్‌లో ఇప్పుడు చాలామందికి తెలిసిన అమ్మాయి. సోషల్‌మీడియా ద్వారా మనదేశంలో కూడా ఆమె గురించి తెలుసు. పాక్‌లో అయితే మునీబాని మహిళాసాధికారతకు చిహ్నంగా భావిస్తున్నారు. 21ఏళ్ల వయసులో ఒక ప్రమాదంలో మరణం అంచులవరకు వెళ్లి వచ్చిన ఆమెకు...జీవితం విలువేంటో స్పష్టంగా అర్థమైంది. ఊపిరితో ఉండటమే...ఈ ప్రపంచంలో మనం సాధించిన మొదటి విజయంగా మునీబా భావిస్తుంది.


అనుకోని ప్రమాదంతో ఒక్కసారిగా జీవితంలో చీకటి...

మునీబా 1987 మార్చి 3న జన్మించింది. పాక్‌లోని రహీం యార్ ఖాన్ అమె సొంత ఊరు. ఫైన్ ఆర్ట్స్‌లో డిగ్రీ చేసింది. 2007లో ఆమె ఒక కారు ప్రమాదానికి గురయింది. డ్రైవింగ్ చేస్తున్న మునీబా భర్త నిద్రపోవటంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఆమె కాళ్లు తీవ్రస్థాయిలో దెబ్బతిన్నాయి. ఆ ప్రాంతంలో అంబులెన్స్ సదుపాయం లేకపోవటం వలన ఆసుపత్రికి జీపులో తీసుకువెళ్లారు. ఆ తరువాత ఆమె రెండేళ్లపాటు ఆసుపత్రిలోనే ఉండిపోయింది. తరువాత కాలంలో పూర్తిగా చక్రాల కుర్చీకే పరిమితం కావాల్సి వచ్చింది. రెండేళ్లపాటు ఆసుపత్రి బెడ్‌మీద ఉన్నవారు ఎవరైనా...తిరిగి మానసికంగా శారీరకంగా కోలుకోవటం చాలా కష్టం. కానీ మునీబా మాత్రం తన మానసిక స్థైర్యాన్ని ఏమాత్రం కోల్పోలేదు. పై పెచ్చు...ఆమె మరింత దృఢంగా మారింది. అందుకే యాక్సిడెంట్ తరువాత పూర్తిగా ఇతరులమీద ఆధారపడాల్సిన స్థితికి చేరినా, భర్త విడాకులు ఇచ్చినా, తండ్రి తనని ఆ బాధలో వదిలేసినా...ఆమె చెదరలేదు...బెదరలేదు. చివరికి ఆమె తాను దత్తత తీసుకున్న కొడుకు నీల్‌తో మిగిలింది. ఆసుపత్రిలో అత్యంత నిస్సహాయస్థితిలో ఉన్నపుడు జుట్టు చిక్కు తీసుకోలేని స్థితిలో ఆమె జుట్టుని కత్తిరించేసేది. అలాంటి దయనీయమైన స్థితిలో తనకు అండగా నిలిచింది తల్లి, సోదరుడు మాత్రమే అంటుంది మునీబా. ఆసుపత్రి నుండి బయటకు వచ్చిన తరువాత తనలోని ఆత్మస్థైర్యం తాలూకూ విశ్వరూపాన్ని ప్రపంచానికి చాటిందామె . పెయింటర్‌గా, మోటివేషనల్ స్పీకర్‌గా, సామాజిక కార్యకర్తగా, టివి యాంకర్‌గా, గాయనిగా, మోడల్‌గా తనని తాను రుజువు చేసుకుంది.

పెయింటర్‌గా...

ఫైన్ ఆర్ట్స్‌లో గ్రాడ్యుయేట్ అయిన మునీబా...ఆసుపత్రిలో ఉన్నపుడే డాక్టర్ల ప్రోత్సాహంతో తన పాత అభిరుచి పెయింటింగ్‌ని తిరిగి మొదలుపెట్టింది. ఆ సమయంలో మునీబాని ప్రోత్సహించడానికి...ఆమె వేసిన పెయింటింగ్స్ అన్నింటినీ పంజాబ్ (పాక్‌లోని) మాజీ గవర్నర్ సల్మాన్ తసీర్ కొనేవారు. యాక్సిడెంట్ తరువాత మరింత ఎక్కువగా పెయింటింగ్స్ వేస్తోంది. ఆయిల్ పెస్టెల్స్‌తో అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్స్ వేస్తుందామె. ఇప్పుడు తరచుగా తన పెయింటింగ్స్‌తో ప్రదర్శనలు నిర్వహిస్తోంది. అవి బాగా అమ్ముడుపోతున్నాయి కూడా. మునీబాస్ క్యాన్‌వాస్ పేరుతో సొంత సంస్థని నెలకొల్పింది. ఆమె కంపెనీ స్లోగన్ 'మీ గోడలను రంగులు ధరించనివ్వండి'.







మోటివేషనల్ స్పీకర్‌గా...

ఈ రోజున పాక్‌లో మునీబా పేరు ప్రముఖుల లిస్టులో ఉంది. ముఖ్యంగా మోటివేషనల్ స్పీకర్‌గా ఎంతోమందికి ప్రేరణనిస్తోంది. ఆమె మాటలన్నీ తన అనుభవంలోంచి వచ్చినవి కావటం వలన వాటిలో ప్రాణం, జీవం, ధైర్యం అన్నీ తొణికిసలాడుతుంటాయి. అంతర్జాతీయ సృజనకారుల వేదిక అయిన టెడ్ ప్లాట్‌ఫామ్‌పై మునీబా చేసిన ప్రసంగాలు ఎంతోమంది వైకల్యం కలిగిన అమ్మాయిలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. మరెంతోమంది ఆమె అడుగుజాడల్లో నడుస్తూ...తమలోని నిరాశానిస్పృహలను పారద్రోలుతున్నారు. జీవితంలో ఎన్ని ఆటంకాలు, అవరోధాలు వచ్చినా మన ఆత్మ అనేది స్వేచ్ఛగా ఉండాలని అంటుంది...మునీబా. అలా ఉన్నపుడు మనం మన భయాలను జయించవచ్చని అప్పుడు మనసు కలలు కనటం మానదని అంటుందామె. ప్రతి ఉదయం మనం తీసుకునే శ్వాసే ఒక వరమని, దానికే మనం ఎంతో కృతజ్ఞులమై ఉండాలని మునీబా నమ్ముతుంది.

యాంకర్‌గా...మోడల్ గా...

మునీబా పిటివికి యాంకర్‌గా పనిచేస్తోంది. వీల్ చెయిర్‌లో ఉండి యాంకరింగ్ చేస్తున్న మొట్టమొదటి యాంకర్ గా, అదేవిధంగా వీల్ చెయిర్‌లో ఉండి మోడలింగ్ చేస్తున్న మోడల్‌గా కూడా పాక్‌లో రికార్డుని సృష్టించిందామె. పాండ్స్ కంపెనీ వారి మిరకిల్ టీమ్‌లో ఆమె పేరు ఉంది. టోనీ అండ్ గై అనే కంపెనీకి మోడల్‌గా పనిచేసింది. నూరుశాతం వెజిటేరియన్ సౌందర్య ఉత్పత్తుల సంస్థ బాడీ షాప్‌కి పాక్‌లో బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంది.

ఐక్యరాజ్యసమితి గుడ్‌విల్ అంబాసిడర్‌గా...

ఆమె ప్రస్తుతం ఐక్యరాజ్యసమితిలో పాకిస్తాన్ తరపున మొట్టమొదటి మహిళా గుడ్‌విల్ అంబాసిడర్‌గా ఉంది. ఈ పదవిలో ...స్త్రీపురుష సమానత్వం, మహిళా సాధికారతల కోసం కృషి చేస్తోంది, ఐక్యరాజ్యసమితి మహిళా ప్రచార కార్యక్రమాలకు సలహాదారుగానూ వ్యవహరిస్తోంది. 2015లో బిబిసి వారి అత్యంత శక్తిమంతమైన 100మంది మహిళల లిస్టులో మునీబా కూడా ఉంది. ఇంకా సామాజిక కార్యకర్తగా బాలల హక్కులకోసం కృషి చేస్తోంది. బాలలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పోరాటం చేస్తోంది.

మునీబా ఇప్పుడు పాకిస్తాన్‌కి నిజమైన ముఖచిత్రం అనే పేరుని తెచ్చుకుంది. దాన్ని బట్టే చెప్పవచ్చు...ఆమె గడించిన ఖ్యాతి ఎంతటిదో. అలాగే ఆమె నేడు ఎంతోమందికి రోల్ మోడల్. ఎందుకంటే...ఎంతోమందికి భయంకరంగా కనిపించిన అంశాలను ఆమె తేలిగ్గా జయించింది. నిజానికి ఆమెకు జీవితం ఇచ్చిన షాకులకంటే...ఆమె జీవితానికిచ్చిన షాకులే ఎక్కువ. ఎందుకంటే.. తనకు తగిలిన ఎదురుదెబ్బలకు అంతకంటే గట్టిగా జవాబు చెప్పటం నేర్చుకుంది మరి.

- వి. దుర్గాంబ

ఇది జడ్ జనరేషన్...

కొలువులకు క్రియేటివిటీయే ప్రధానం!

స్కూళ్లు కాలేజీల్లోకి కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాప్‌లు వచ్చేసిన కాలమిది. టెక్నాలజీ ఏదో ఒక రూపంలో పిల్లల జీవితాలతో పేనవేసుకుపోయిన రోజులివి. అందుకు తగినట్టుగానే జడ్ జనరేషన్ (1995-2014 మధ్య పుట్టినవారు) పిల్లలకు పూర్తిగా టెక్నాలజీతో అనుబంధమున్న క్రియేటివ్ ఉద్యోగాలే వస్తాయని టీచర్లు విద్యార్థులు కూడా నమ్ముతున్నారు. ఇదే విషయంపై అడోబ్ కంపెనీ నిర్వహించిన ఒక సర్వేలో 95శాతం మంది విద్యార్థులు, 91శాతం మంది టీచర్లు భవిష్యత్తుతరమైన జడ్ జనరేషన్... కెరీర్‌కి సృజనాత్మకతే ప్రధానమని చెప్పారు.

భారత్ డిజిటల్ టెక్నాలజీ రంగంలో దూసుకుపోతున్న తరుణంలో తప్పనిసరిగా టెక్నాలజీయే తమ కెరీర్లో ప్రధాన పాత్ర పోషిస్తుందని పిల్లలు నమ్ముతున్నారు. టీచర్లు కూడా అదే ఉద్దేశ్యంతో ఉన్నారు. ఇప్పుడు తమ జీవితాల్లో అనుభవంలో ఉన్న టెక్నాలజీనే రేపు కెరీర్‌గా మారుతుందని విద్యార్థులు భావిస్తున్నారు. టెక్నాలజీపరంగా ప్రపంచంలో వస్తున్న మార్పులన్నీ తమ కెరీర్‌పై ప్రభావాన్ని చూపుతాయని బలంగా నమ్ముతున్నారు. ఇప్పటికే టెక్నాలజీని తమ రోజువారీ జీవితాల్లో వినియోగిస్తున్న నేటి తరం...రేపు ఇదే టెక్నాలజీతో తాము ఎంత సృజనాత్మకంగా వినూత్నంగా కెరీర్‌లో ముందుకు వెళతామో కదా...అనే ఆశలతో ఉన్నట్టుగా కూడా అధ్యయనం తెలిపింది. విద్యాసంస్థలు సైతం తమ విద్యార్థులు టెక్నాలజీపరంగా రేపు పోటీ ప్రపంచంలో వెనుకబడకుండా ఉండాలని... తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నాయి.

అడోబ్ కంపెనీ...11-17 సంవత్సరాల మధ్య వయసున్న 500 మంది విద్యార్థులను 200మంది టీచర్లను ఈ అధ్యయనం కోసం పలుకరించారు. వారి విద్యా విధానం ఎలా ఉంది...టెక్నాలజీ, సృజనాత్మకత విద్యలో ఎంత పాత్రని పోషిస్తున్నాయి...అవి భవిష్యత్తులో ఎంత కీలంగా మారనున్నాయి...మొదలైన ప్రశ్నలు అడిగినప్పుడు ఇలాంటి సమాధానాలు వచ్చాయి. సుదీర్ఘమైన విజయవంతమైన కెరీర్ కావాలంటే తప్పకుండా టెక్నాలజీని ఒంటబట్టించుకుని తీరాలని...94శాతం మంది విద్యార్థులు, 90శాతం మంది టీచర్లు చెప్పారు. పైగా జడ్ జనరేషన్ తాము ఇంతకుముందు తరాలకంటే...చాలా సృజనాత్మకత ఉన్నవాళ్లమని నమ్ముతున్నట్టుగా కూడా అధ్యయనంలో తేలింది. 89 శాతంమంది విద్యార్థులు, 92 శాతం మంది పిల్లలు ఈ విషయంలో ఏకాభిప్రాయంతో ఉన్నారు. క్లాస్ రూములో క్రియేటివిటీకి కలిసి కృషి చేస్తామని కూడా టీచర్లు. విద్యార్థులు చెప్పారు.



రంగవల్లిక

మీరూ ముగ్గులు పంపొచ్చు

అడ్రసు: లైఫ్ c/o ఆంధ్రప్రభ,
8-2-293/82/ఎ/75, ఫ్లాట్ నెం:75, రోడ్ నెం:9, జూబ్లీహిల్స్, హైదరాబాద్-28
lifepage2012@gmail.com


ముగ్గుని ఎ4 సైజున్న మందపాటి పేపరుమీద వేయాలి. ఔట్ లైన్‌ని, చుక్కలను బ్లాక్ స్కెచ్ పెన్నుతో వేసి లోపల రంగులు నింపాలి. ఎన్ని చుక్కలు ఎన్ని వరుసలు అనే వివరాలను స్పష్టంగా రాయాలి.



18 చుక్కలు 6 వరుసలు
రెండువైపులా ఒక చుక్క విడిచి 6 వరకు




జాస్తి అఖిల,
జయపురం,
కృష్ణాజిల్లా.



21 చుక్కలు
11 వచ్చేవరకు
మధ్యచుక్క



ఎన్. కోటేశ్వరమ్మ,
డిప్యూటీ తహసీల్దారు,
మండవల్లి మండలం,కృష్ణాజిల్లా



21 చుక్కలు
7 వరుసలు
7 వచ్చేవరకు



ఆర్.తేజస్విని,
పెద్దాపురం,
తూర్పుగోదావరి జిల్లా.



27 చుక్కలు
11 వరుసలు
అటు ఇటు 4 చుక్కలు వదిలి
11 చుక్కలు
4 వరుసలు



ఎ.సత్య,
పెద్దాపురం,
తూర్పుగోదావరి జిల్లా.

ఇది న్యూ బృందావనం



మొదటిసారిగా పశ్చిమ దేశాల్లో శ్రీకృష్ణుని బోధనలను వ్యాప్తి చేసి అక్కడి వారిని ఆకర్షించ గలిగారు. చాలా మంది యువకులు, మేధావులు, ఆసక్తికలవారు ఆయన బోధనలకు ప్రభావితమై శిష్యులుగా మారిపోయారు. అక్కడ ప్రారంభమైన ప్రబోధ పర్యటన అంతర్జాతీయ శ్రీకృష్ణ గీతా ప్రచార సొసైటీగా ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణా కాన్షస్‌నెస్ (ఇస్కాన్) అయింది. మానవ సమాజానికి దైవభక్తిని, ఉన్నత స్థాయి సంస్కృతీ సంప్రదాయాలను అలవాటు చేయాలని ప్రభుపాదులు కంకణం కట్టుకున్నారు.

శ్రీ కృష్ణుని పాదపద్మాల పట్ల భక్తి భక్తులకు మోక్షదాయకమైంది. మనం ఆయనను సేవించడం ద్వారా భక్తి, జ్ఞాన వైరాగ్యాలను ఆయన అనుగ్రహాన్ని పొందాలి. అదే భక్తి యోగం. ఈ విషయాన్ని వేద వ్యాస మహర్షి గీతా కల్పవృక్షంలో మనకు వివరించారు. శ్రీకృష్ణ పరమాత్మ బృందావనం అనే గ్రామంలో జన్మించడం, అక్కడ అందరూ ఆయన భక్తులు కావడం, అదొక పవిత్ర స్థలంగా కోట్లాది యాత్రికులు ప్రతి సంవత్సరం సందర్శించడం జరుగుతోంది. అంతర్జాతీయ శ్రీకృష్ణచైతన్య సంస్థ ఇస్కాన్ వ్యవస్థాపకులు, ఆచార్యులైన ఎసి భక్తి వేదాంత ప్రభుపాదులు పుట్టింది బెంగాల్‌లో అయినా కొంతకాలం ఆ బృందావనంలో నివసించారు. భక్తి యోగం ప్రబోధించిన గురువైన ఆయన 1965వ సంవత్సరంలో తన యాత్రను అమెరికా వరకూ తీసికెళ్ళారు. మొదటిసారిగా పశ్చి మదేశాల్లో శ్రీకృష్ణుని బోధనలను వ్యాప్తి చేసి అక్కడి వారిని ఆకర్షించగలిగారు. చాలా మంది యువకులు, మేధావులు, ఆసక్తికలవారు ఆయన బోధనలకు ప్రభావితమై శిష్యులుగా మారిపోయారు. అక్కడ ప్రారంభమైన ప్రబోధ పర్యటన అంతర్జాతీయ శ్రీకృష్ణ గీతా ప్రచార సొసైటీగా ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణా కాన్షస్‌నెస్ (ఇస్కాన్) అయింది. మానవ సమాజానికి దైవ భక్తిని, ఉన్నత స్థాయి సంస్కృతీ సంప్రదాయాలను అలవాటు చేయాలని ప్రభుపాదులు కంకణం కట్టుకున్నారు. అందరూ ఒకచోట చేరి, కృష్ణదేవుని మీద ప్రేమతో, ప్రాణి కోటి మీద ఆదరణతో కలిసి మెలిసి ఉండే ఆనందదాయకమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని తపించారు.

ఇప్పటి ఈ కొత్త బృందావనం సమాజంలోని వారం దరూ ఆయన కోర్కెను నెరవేర్చాలని, ఆ ఫలితాలను పొందాలని సంకల్పించుకున్నారు. శ్రీల ప్రభుపాద జిజ్ఞాసను అంటే సాధారణ జీవితం, దైవిక జీవన విధానాన్ని అర్థం చేసుకున్న వందలాది జనం శ్రీకృష్ణ పాదారవిందాలందు మనసు లగ్నమై, అచంచలమైన భక్తితో విశ్వాసంతో కృష్ణుని సేవిస్తున్నారు. ప్రపంచంలోని వివిధ జీవన విధానాలను పాటిస్తున్న వారు శ్రీకృష్ణ తత్త్వాన్ని అలవరచుకుని, స్వలాభా పేక్షమాని విశ్వశాంతిని కోరుకుం టున్నారు.


ఇస్కాన్ ఆధ్వర్యంలో అమె రికాలో న్యూ బృందావనం నిర్మిత మైంది. ఇది పశ్చిమ వర్జీనియాలో ఉంది. అక్కడ సంవత్సరంలో 30 ముఖ్యమైన పండగలు నిర్వహి స్తారు. పుట్టిన రోజు, పెళ్ళి రోజు వంటి పండగలను అక్కడ చేసుకుని శ్రీకృష్ణ ప్రసాదాన్ని స్వీకరించి రావచ్చు. అంతేగాక కుటుంబంగా వెళ్లిన వారు అక్కడ బస చేసేందుకు న్యూబృందావనంలో సకల సదుపాయాలు ఉన్న అతిథి గృహాలు లభిస్తాయి. హంస సరస్సు అక్కడి ప్రత్యేకత. ముందుగా అక్కడ బస వంటి వాటి కోసం బుక్ చేసుకోవచ్చు.

శ్రీల ప్రభు పాద మరణానంతరం 1979లో ప్రపంచ వ్యాప్తంగా ఇస్కాన్ ద్వారా ఆయన చేసిన కృషికి గుర్తుగా అక్కడ 'ప్రభుపాద ప్యాలెస్ ఆఫ్ గోల్డ్' నిర్మించారు. 8000 చదరపు అడుగుల విస్తీర్ణంలో 22 క్యారట్ల బంగారంతో, విదేశీ పాలరాళ్ళు, చాండిలియర్ పెయింటింగ్స్‌తో ఆ భవనాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. ఆ ఆవరణలో 150 రకాల గులాబీ మొక్కల తోట, తామర పువ్వుల కొలను మనల్ని ఆనందంతో ముంచెత్తుతాయి.

సేంద్రియ విధానంలో పంటలు పండించటమే కాక, పంచ గవ్యాలు వంటివి న్యూ బృందావనంలో లభిస్తాయి. న్యూ బృందావనంలోని గోశాల అమెరికాలో పేరెన్నికగన్న ఆవుల సంరక్షణ కేంద్రాల్లో ఒకటి. అక్కడ వెలసిన శ్రీరాధా బృందావన్ చంద్ర ఆలయాన్ని ఎంతో మంది కృష్ణ భక్తులు యాత్రా స్థలంగా భావించి వచ్చి దర్శించుకుంటుంటారు. ప్రతినిత్యం ఇక్కడ జరిగే పాటలు, నృత్యాలు, భగవద్గీత, భాగవత ప్రవచనాలు మనకు భక్తి యోగాన్ని బోధించి శ్రీకృష్ణపరమాత్మ చెంతకు మన మనసును చేరుస్తాయనడంలో సందేహం లేదు.

- లక్ష్మణరేఖ గోపాలకృష్ణ
9493053206

న్యూ బృందావనంలోని ప్యాలెస్ ఆఫ్ గోల్డ్



ఆత్మదర్శనం ముఖ్యం



ఎందరో దేవుళ్లు, దేవతలు, ఎన్నెన్నో గుడులు. భక్తి పారవశ్యం, భక్తజన సందోహం. ఆధ్యాత్మిక ప్రపంచంలో ఓలలాడుతున్న తన వారిని తరింపజేస్తున్న కరుణామూర్తి ఆ దైవం. అయితే ఆ దేవుడు గుడులకూ, గోపురాలకే పరిమితమా? కాదంటారు మహర్షులు, మహనీయులు. మరి దేవుదెక్కడున్నాడు.

'దేవుడెక్కడ మూతపడు మందిరాల్లోనా
హిమవత్పర్వతాగ్రం పైననా
కాదు ... కాదు
విశ్వ స్థితికి తన రక్తమ్ము పిండెడు
మట్టిలోపలి మనిషిలోనే దేవుడున్నాడు' అని ఒక మహాకవి గేయం. మనుష్యానాం దైవ రూపేణ అని కద ఆర్యోక్తి. అలాగే దేహమే దేవాలయం అని కూడా అన్నారు. అంటే స్పష్టంగా దైవ రూపమేదో తెలుస్తూనే ఉంది. మనలోని దైవాన్ని, ఎదుటి వ్యక్తిలో ఉన్న దైవాన్ని గుర్తెరుగక ఆ గుడి, ఈ గుడి, ఆ తీర్థం, ఈ తీర్థం అంటూ ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. ఇక ముక్కోటి దేవతలన్న ప్రచారం ఒకటి. అవి ఒక స్థితి వారి కోసం చెప్పినది. ఒక సూర్యుండు సమస్త... అన్నట్టు దేవుడొక్కడే. నామరూపరహితుడైన ఆయనను ఏ పేరుతోనైనా పిలుచుకోవచ్చు. కొలుచుకోవచ్చు. దైవాన్ని వారు, వీరు అని విభజించి చూడ్డం సబబుగా అనిపించదు. దైవం సృష్టినంతటినీ ఒకే రకంగా చూస్తాడు. ఇందులో ప్రత్యేకతలు లేవు. అయితే గుళ్లు గోపురాలు దేనికి? అయితే వాటిని దర్శించి ప్రయోజనం లేదా అన్న అనుమానం కలుగుతుంది. అలా వెళ్ళకూడదని కాదిక్కడ చెబుతున్నది. మనలో నిజమైన భక్తి భావం ఉన్నప్పుడు మనం కొలిచే దైవమే ఆ గుడిలో ప్రతిష్ఠితమైన విగ్రహంలో మనకు దర్శన భాగ్యం కలిగిస్తుంది. భక్తి మార్గంలో ఉన్న వారు అంతకన్న ముందు ఆత్మదర్శనాన్ని పొందాలి. మనలో ఉన్న ఆత్మజ్యోతిని మరచి పూజలేల. నీ పుట్టుకతోనే నీ దేహం దేవాలయమైంది. ఆ దేహంలోగల ఆత్మే పరమాత్మ స్వరూపం. ఈ తత్త్వం తెలిసినవారు దేవుణ్ణి వెతుక్కుంటూ పరుగెత్తరు. ఆత్మ సందర్శనమైనపుడు జాలువారే ఆనంద బాష్పాలే ఆ సకల చరాచర లోకేశ్వరుడికి మనం చేసే అభిషేకాలు. మన మనసు పాదులో పూచిన మనో పుష్పాలే దేవతార్చనలకు సరైన మల్లెలు, మందారాలు. కంటి వెలుగులే హారతులు. ఏ మహానుభావులో కాలక్రమంలో ఒక్కో గుడిని కట్టించి ఉండవచ్చు. ఏ దేవుణ్ణో, దేవతనో ప్రతిష్ఠించి ఉండవచ్చు. కాని భక్తుడు తన గుండెను గుడిగా మలచి ఆ గుండె గుడిలో దైవాన్ని ప్రతిష్ఠించి ఆరాధించడం మరువ కూడదు. నిత్యం దైవ ధ్యానంలో మనసును లగ్నం చేయాలి. అప్పుడే నీలోని ఆత్మ జ్యోతి నీ జీవిత గమనానికి చక్కని చుక్కాని అవుతుంది.

- అల్లసాని శివప్రసాద్ శర్మ

ధర్మం-మర్మం

రమ్యక వర్షం- అధిదేవత


రమ్యక వర్ష పురుషుడైన మనువు శ్రీమన్నారాయణుని ప్రియమైన మత్స్యావతారం చూసి ఎప్పటికీ ఆ రూపాన్నే అత్యంత భక్తి యోగంతో మహామత్స్య మంత్రాన్ని పఠించుచూ ఆరాధించుచుండును.

ఓం నమో భగవతే ముఖ్యత మాయ నమః
సత్వాయ ప్రాణాయ ఓజసే సహసే
బలాయ మహామత్స్యాయ నమః

ఈ మంత్రాన్ని యధావిధిగా భక్తి శ్రద్ధలతో ప్రాతఃకాలము, సాయం కాలము జపించిన మానసిక స్థైర్యము, శారీరక బలము, బుద్ధి స్వచ్ఛత, శత్రువులను ఓడించగల సామర్థ్యము, ప్రాణ బలము, ఇంద్రియ బలము, ఎదుట వారిని కప్పివేయ గల తేజస్సు, అద్భుతమైన ప్రతిభా పాటవాలు, సమయస్ఫూర్తి, సకల లోకహిత కాంక్ష, అద్భుతమైన దాన గుణము, తాము కోరు కున్న విద్యా నైపుణ్యం లభించును.



మంత్ర జప విధానము : ప్రాతఃకాలమునే లేచి స్నానాదులు ముగించుకుని పరిశుద్ధమైన వస్త్రములు ధరించి లలాటమున తిలకమును దిద్దుకుని పూజామందిరంలో దీపారాధన చేసి తమ నిత్యకృత్యములైన సంధ్యా వందనాది కార్య క్రమములను ముగించుకుని నిశ్చలమైన పరిశుద్ధమైన మనస్సుతో తమ శక్తికి అనుగుణంగా మంత్రమును జపించవలెను.



- డా॥ కందాడై రామానుజాచార్య

భగవద్గీత

భిన్నా ప్రకృతి వివరణ



అధ్యాయం 7

శ్లోకం 4:

భూమిరాపోనలో వాయుః
ఖం మనో బుద్ధిరేవ చ।
అహంకార ఇతీయం మే
భిన్నా ప్రకృతిరష్టధా ॥

తాత్పర్యం: భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారము అనే ఎనిమిది అంశముల సముదాయము నా భిన్నా ప్రకృతి యన బడును.

భాష్యం: భగవద్విజ్ఞానము అనగా భగవంతుని వ్యక్తిత్వాన్ని, ఆయనవివిధ శక్తులను విశ్లేషణాత్మకంగా తెలిసి కొనుట. ప్రకృతి కూడా భగవంతుని ఒక శక్తి మాత్రమే. శ్రీకృష్ణుడే మహావిష్ణువు, గర్భోదక శాయి, క్షీరోదక శాయి విష్ణువులుగా విస్తరించి ఈ భౌతిక ప్రకృతి అన్ని కార్యాలను పర్యవేక్షిస్తూ ఉంటాడు. ఈ విజ్ఞానం తెలియని జీవులు తామే భౌతిక ప్రకృతికి కారణమని, అధిపతులమని, ఆనం దించె వారమని భ్రాంతి చెందుతూ ఉంటారు. ముఖ్యం గా ఈ భౌతిక ప్రకృతి ఎనిమిది విధాలుగా వ్యక్త మవుతుంది. మొదటి ఐదు భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం. అవి ఐదు రకాల ఇంద్రి యార్థాలైన భౌతికశబ్దము, స్పర్శ, రూపము, రుచి మరియు వాసనను కలిగి ఉంటాయి. నేటి భౌతిక విద్య ఈ పదింటినీ తెలిసికొనుటకే పరిమితమైనది. మనస్సును సైకాలజిస్టులు అర్థం చేసుకొనుటలో విఫలురవు తున్నారు. ఇక అహంకారమైనా 'నేను' 'నాది' అనేదే భౌతిక బంధనానికి కారణం. బుద్ధి, సమగ్రభౌతిక సృష్టియైన 'మహ త్తత్త్వానికి' సంబంధించినది. ఈ ఎనిమిది శక్తుల నుండి ఇరవై నాలుగు భౌతిక మూలకాలు వ్యక్తమవుతాయి. అందరూ వీటిని సాంఖ్య శాస్త్రంగా అధ్యయనం చేస్తారేగాని, వీటికి మూలమైన శ్రీ కృష్ణుని అర్థము చేసికొనపోవుటచే వారు సరైన అవగాహనను పొందలేకపోవుతున్నారు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

చింతన

దినఫలాలు

మేషరాశి: ప్రయాణాలు ప్రయోజనాలని కలిగిస్తాయి. పనులలో శ్రమ తగ్గుతుంది. ఆరోగ్యంలో అనుకూల మార్పులు చేకూరుతాయి. ఆర్థిక చిక్కులు మెల్లమెల్లగా పరిష్కరింపబడతాయి. శత్రుభీతి తగ్గుతుంది.

వృషభరాశి: అనుకూల పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ప్రయాణాల ద్వారా అనుకూలత ఉంటుంది. ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందుతారు. కుటుంబ వ్యవహారాల్లో సమస్యలు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

మిథునరాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. మానసిక ధైర్యం తగ్గుతుంది. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతంలోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారతాయి. అధిక ప్రయత్నాలతో ఆదాయ పరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి.

కర్కాటకరాశి: దూరప్రయాణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబరీత్యా ఆనందాన్ని కలిగిస్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచనదోషాల ద్వారా సమస్యలు, అవమానాలు ఉంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహరాశి: ఆర్థిక ప్రయత్నాలు అనుకూలం. వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విషయాల్లో సులువుగా అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

కన్యారాశి: ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహ రీత్యా ఉంటాయి. సంబంధ, బాంధవ్యాల విషయంలో మనస్పర్థలు చోటు చేసుకుంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు కొనసాగుతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి

తులారాశి: విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళారంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చికరాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. మానసిక చిరాకులు తగ్గుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల/ప్రతికూలతలు ఉంటాయి.

ధనూరాశి: ఉద్యోగ వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆదాయంలో ప్రతికూలత ఉంటుంది. వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగలుగుతారు. కుటుంబ వ్యవహారాల్లో ఆచితూచి వ్యవహరించాలి.

మకరరాశి: ఆరోగ్య రీత్యా అనుకూలత ఉంటుంది. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. ఆదాయానికి అనుకూల పరిస్థితులు ఉంటాయి. సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. ఆర్థిక వ్యవహారాలు అనుకూలం.

కుంభరాశి: సంబంధ బాంధవ్యాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గృహకార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ఆరోగ్య క్రమశిక్షణ తప్పనిసరి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. వ్యాపార అనుకూలత ఉంటుంది.

మీనరాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆరోగ్య ఖర్చులు తగ్గుతాయి. కోర్టు వ్యవహారాల్లో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.

4.1.18 గురువారం

మేషరాశి: గృహవిషయాలు అనుకూలం. విద్యా ప్రయత్నాలు అనుకూలం. రుణ ఒత్తిడులు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూల మార్పులు ఉంటాయి. రుణ ఒత్తిడులు అవమానాన్ని కలిగిస్తాయి. ఆదాయంలో నూతన అవకాశాలు ఏర్పడతాయి.

వృషభరాశి: మానసిక చిరాకులు పెరుగుతాయి. విద్యా ప్రయత్నాలు కలసి వస్తాయి. వాహన కొనుగోళ్ళు ఉపకరిస్తాయి. గృహకార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ప్రయాణాలు సుఖవంతం. ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ఆకస్మిక ప్రతికూలత ఉంటుంది. వేగవంతమైన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆదాయంలో విఘ్నాలు ఎదురవుతాయి.

మిథునరాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. ఆరోగ్య రక్షణ పాటించాలి. స్థిరాస్తి విషయాల్లో జాగ్రత్తలు తప్పనిసరి. పనులను అనుకొన్న సమయానికి పూర్తిచేయలేకపోతారు. అసహన వైఖరి ద్వారా అవమానాలను ఎదుర్కోవలసి వస్తుంది. అధిక ప్రయత్నాలతో అనుకూల పరి స్థితులు ఆదాయపరంగా ఉంటాయి.

కర్కాటకరాశి: ఆర్థిక లావాదేవీల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యం క్రమశిక్షణ లోపిస్తుంది. శత్రుభీతి ఉంటుంది. మానసిక ధైర్యం తగ్గుతుంది. ఆదాయంలో ప్రతికూలత పెరుగుతుంది.

సింహరాశి: ఆర్థికవ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య రక్షణ తప్పనిసరి. వృత్తిలో గుర్తింపు లభిస్తుంది. ఒత్తిడులు అన్నిరకాలుగా పెరుగుతాయి. ఆరోగ్య ఖర్చులు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఆదాయ మార్గాలు మూసుకుపోతాయి. కాబట్టి జాగ్రత్తలు వహించాలి. ఆదాయంలో అసహన పరిస్థితులు ఉన్నా నెట్టుకు రాగలుగుతారు.

కన్యారాశి: వాహన కొనుగోళ్లు ఉపకరిస్తాయి. దూరప్రయాణాలు లాభిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆర్థిక ప్రోత్సాహం ఉంటుంది. ఆరోగ్యంలో, ఆదాయంలో అనుకూల మార్పులు ఉంటాయి. ప్రత్యర్థులు బలపడతారు.

తులారాశి: నూతన కార్యాలు, కార్యక్రమాలు లాభిస్తాయి. విద్యా ప్రయత్నాలు కలసి వస్తాయి. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. విదేశీలావాదేవీలు లాభిస్తాయి. సినీరంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యాలు ఉన్నా అంతిమ విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. సమాచారాలని సమయానికి సమర్పించలేకపోతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చికరాశి: గృహకార్యాలు, కార్యక్రమాలలో ప్రోత్సాహం ఉంటుంది. ఉద్యోగ యత్నాలు అనుకూలం. శుభవార్తలు వింటారు. మానసిక రుగ్మతలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూరాశి: శారీరక శ్రమ అధికమవుతుంది. వ్యాపార ఒప్పందాలు లాభిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. విదేశీలావాదేవీలు ఉపకరిస్తాయి. శ్రమ తగ్గుతుంది. పనులు వేగవంతంగా పూర్తి చేయగలుగుతారు. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకరరాశి: కోర్టు వ్యవహారాల్లో ఊరట లభిస్తుంది. ఆరోగ్య రక్షణ తప్పని సరి. వ్యాపార ఒప్పందాలు లాభిస్తాయి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. ఆకస్మిక విస్మయాలు ఆర్థికంగా ఉంటాయి. ఆదాయంలో అనుకూల వాతావరణం ఉంటుంది.

కుంభరాశి: వ్యాపార విస్తరణలు కలసి వస్తాయి. ఆర్థిక ప్రోత్సాహం ఉంటుంది. ఆర్థికప్రయత్నాలు కలసి వస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆకస్మిక ఖర్చులు లేకపోలేదు. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి. ప్రయాణాల విషయంలో కూడా సరైన అవగాహనతో కూడిన నిర్ణయాలు మాత్రమే విజయాలను కలిగిస్తాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి. విధులను సక్రమంగా నిర్వహించగలుగుతారు. ఆరోగ్య రక్షణ ఉంటుంది. ముఖ్యమైన పనులలో వేగంపెరుగుతుంది. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



ఆదర్శం

శరీరం కదపలేని స్థితిలో కూడా ఆమె తన కింద పనిచేసేవారికి ఆదేశాలను జారీ చేస్తుంది. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలన్న తపనతో కెమెరాల ద్వారా క్లాసులను నిర్వహిస్తూ నలుగురికీ ఆదర్శంగా జీవనం సాగిస్తోంది. ఆమె జీవితంలో ఎన్నో అవాంఛనీయ సంఘటనలు ఎదురైనా వాటన్నిటిని తట్టుకొని నిలబడి బతికి ఉన్నంతవరకు నలుగురికీ ఉపయోగపడాలనే తపనతో జీవనం సాగిస్తోంది. ఎన్నో సౌకర్యాలు మధ్య కూడా చిన్న చిన్న కారణాలతో ఆత్మహత్యలు చేసుకునేవారికి ఆమె నుంచి గుణపాఠం నేర్చుకోవాల్సిందే. విద్యార్థి జీవితాలను వెలుగువైపు నడిపిస్తున్న ఉమాశర్మ జీవిత విశేషాలు...

తల'రాత'ను తిరగరాసింది



ఉమాశర్మ ఉత్తర్‌ప్రదేశ్‌లోని షహ్రాన్‌పూర్‌కి చెందినవారు. వయసు 64 సంవత్సరాలు. నేషనల్ పబ్లిక్ స్కూల్‌కి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమె పదిసంవత్సరాలుగా బెడ్‌మీద ఉంటున్నారు. పక్షవాత ప్రభావం వల్ల ఆమె ముఖం, చేతులు తప్ప మిగతా శరీరం కదలలేని స్థితికి చేరుకుంది. తన పరిస్థితిని చూసి ఆమె కృంగిపోలేదు. ఉపాధ్యాయ వృత్తి అంటే ఆమెకెంతో ఇష్టం. ఈ పరిస్థితుల్లో ఆమె శరీరం సహకరించకపోయినా మానసికంగా వృత్తి పట్ల ఉత్సాహం తగ్గలేదు. అలా పడుకునే ప్రతి క్లాస్‌ను నిర్వహించడానికి కావలసిన ఏర్పాట్లను చేయించుకున్నారు. పాఠశాల చుట్టూరా సిసిటివిలు ఏర్పాటు చేసుకున్నారు. ఆమె ఇంట్లో బెడ్‌మీద పడుకొనే టాబ్లెట్ ఉపయోగించి పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఇంట్లోని బెడ్‌మీద పడుకొనే ఆమె స్కూల్‌లో జరిగే ప్రతిక్లాస్‌ని, స్టాఫ్‌రూమ్‌ని, ప్లేగ్రౌండ్‌ని పరిశీలిస్తున్నారు ఎవరెవరు ఏమేమి చేయాలనే ఆదేశాలు జారీచేస్తున్నారు. ఆమె పరిస్థితి బాగోక పోయినా ఏఒక్కరోజూ కూడా క్లాసులు తీసుకోకుండా ఉండేవారు కాదు. ఆమెలోని ఈ కార్యదక్షతను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆదర్శంగా తీసుకుంటున్నారు.

''ఆమె ఎప్పుడూ మా మధ్యలేదని మేము భావించటం లేదు. ఆమె తన టాబ్లెట్‌తో తను తెలియజేయాలనుకున్న అంశాలను నిరంతరాయంగా తెలుపుతున్నారు. ఆమె మా మధ్య లేకపోయినా ఆమె ఆలోచనలు నిరంతరం మాచుట్టూ తిరుగుతూ మమ్మల్ని ముందుకు నడిపిస్తున్నాయి'' అని స్కూల్ అడ్మినిస్ట్రేటర్ సురేంద్ర చౌహాన్ చెప్పారు.

ఆమె స్కూల్‌కి 5కిలోమీటర్ల దూరంలో ఉంటున్నారు. 27 సంవత్సరాల క్రితమే (1991) ఆమె భర్త మరణించారు. అతని మరణం తర్వాతనే ఆమె స్కూల్‌ని మొదలుపెట్టి విజయవంతంగా నడుపుతున్నారు. అబ్బాయి రాజీవ్ 2001లో మరణించాడు. కూతురు రిచా 2010లో మరణించింది. ఆమె అనారోగ్యానికి కారణం నరాలలో ఉన్న సమస్యలేనని డాక్టర్లు కనుగొన్నారు. ఎన్ని కఠిన పరీక్షలు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో ముందుకు దూసుకుపోతున్నారు ఉమా శర్మ. తనకంటూ ఎవరూ లేకపోయినా, పక్షవాతం బారిన పడినా, ఆమె తన ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. మిగతా స్కూల్స్ కంటే తమ స్కూల్ మంచి స్థాయిలో ఉండాలనే తపనతో ఆమె తన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పిల్లలకు తన టీచింగ్ ద్వారా ఎన్నో విషయాలను తెలియజేసి వారిని ఆదర్శవంతమైన విద్యార్థులుగా తీర్చిదిద్దాలన్నదే ఆమె ఆశ.

2007నుండి ఆమె పక్షవాతంతో బాధపడుతున్నారు. 2010నుండి ఆమె ముఖం, చేతులు తప్ప మిగతా భాగాలు కదలలేని స్థితికి చేరుకున్నాయి. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి ఆమె సిసిటివి కెమెరాలు, తన దగ్గర ఉన్న టాబ్లెట్‌తో ఆమె ప్రతి క్లాసుని నిర్వహించగలుగుతున్నారు. నేషనల్ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులతో ప్రతిరోజూ ఆడుకుంటారు.

''నాకు స్కూల్‌ని నిర్వహించడం అంటే ఎంతో ఇష్టం. ఆ ఇష్టంతోనే నా శరీరం పనిచేయకపోయినా నా బాధ్యతలు నేను నిర్వహిస్తున్నాను'' అని ఆమె తెలిపారు. దీనికి ముందుగా ఆమె చేసిందేమిటంటే వాళ్ల ఇంటికి, స్కూల్‌లో డిష్ యాంటెనాలను పెట్టించారు. దీనివల్ల ఆమె మాట్లాడిన మాటలు, చూపించే ఫొటోలు వాళ్లకు ప్రత్యక్షంగా కనబడతాయి. చాలా సందర్భాలలో ఆమె ఉపాధ్యాయులను, స్టాఫ్ మెంబర్లను గ్రూప్ డిస్కషన్‌కి పిలిచి అకడమిక్‌విషయాలు, అడ్మినిస్ట్రేటివ్ విషయాలను చర్చించేదాన్ని'' అని చెప్పారు. అంతేకాదు ప్రతిభా వంతులైన విద్యార్థులతో చాటింగ్‌లో మాట్లాడి చదువులో వెనుకబడిన వారికి సహాయాన్ని అందించేలా వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నానని తెలియజేశారు. ఇంతటి క్లిష్టపరిస్థితుల్లో కూడా నలుగురికీ విద్యను అందిస్తున్న ఉమాశర్మ ఎందరికో ఆదర్శనీయురాలు.

ఆంధ్రప్రభ నాయిక

కొత్త కళను సృష్టించిన కూలీ!

ఏ పనిలోనైనా ఆసక్తి ఉంటే ఆ రంగంలో రాణించవచ్చని నిరూపించారు తేజు బెహన్. రోజు కూలీపని చేసే ఆమె ఆర్టిస్ట్‌గా ఎలా మారిందో తెలుసుకుందాం.


తేజు బెహన్ వివాహం గణేష్ జోగితో 17సంవత్సరాల వయస్సులోనే అయ్యింది. వివాహం అయిన వెంటనే రాజస్థాన్ నుండి అహ్మదాబాద్‌కు భర్తతో బయలుదేరింది. అలా ఊరుదాటుతున్నప్పుడు తన జీవితంలో ఊహించని మలుపులు వస్తాయని ఆమె అనుకోలేదు. అహ్మదాబాద్‌కి చేరుకున్నాక మురుగుట్యాంకులకు సంబంధించిన పైపులైన్లకోసం గుంతలు తవ్వే పనిచేసేదామె. అలా ఆమె తవ్వడం వల్ల రోజుకూలీ 5రూపాయలు వచ్చేది. జోగి కుటుంబం పాటలు పాడేవారు. వాళ్లు ఆ ఊరిలో జరిగే ఉత్సవాలు, ఊరేగింపులలో వాళ్ల పాటలను ప్రదర్శించి డబ్బులు సంపాదించేవారు. అలా కార్యక్రమానికి వెళ్లేటప్పుడు ఆమెను కూడా తమతోపాటే తీసుకువెళ్లేవారు. ఇలా తీసుకువెళుతున్న సమయంలోనే ఆమెకు హాకు షాతో పరిచయం ఏర్పడింది. ఆయన సమకాలీన చిత్రకారుడు.

హాకుషా జోగి, తేజు బెహన్‌లో ఉన్న కళాత్మక నైపుణ్యాన్ని పసిగట్టారు. ఆమెకు ప్రోత్సాహాన్నిస్తే మంచి కళాకారిణిగా పేరు తెచ్చుకోగలదన్న విషయాన్ని జోగితో చెప్పాడు. కాని మా జీవితాలు రోజుకూలీమీదే ఆధారపడి ఉన్నాయని జోగి చెప్పాడు. తన దగ్గర పనిచేస్తే రోజుకు ఆరురూపాయలు వేతనం ఇస్తానని చెప్పాడు. దీనికి జోగి వెంటనే అంగీకరించాడు.



కొత్త కళ

షాకుషా తేజుబెహన్‌కు పెన్ను నిచ్చి మీకు తోచింది గీయమని చెప్పాడు. జోగికి అంతగారాకపోయినా తేజు బెహన్‌కి గీతలు గీయడం అంటే చాలా ఇష్టం. ఆమెలోని ఉత్సాహాన్ని చూసి భర్త, హాకు షా ఇద్దరూ ఆమెను ఎంతగానో ప్రోత్సహించారు. వారి ప్రోత్సాహంతో ఆమె తను సొంతంగా కొత్త కళను రూపొందించింది. ఆమె తమ కుల సంప్రదాయంలో ఉన్న రీతిరివాజులను ఆమె కళ్లకు కట్టినట్టు తన చిత్రకళలో చూపించింది. వాళ్ల పద్ధతులలో మహిళలు ఇంటి పనిలో ఉండాలి. బయటపనులకు నిషిద్ధమనేది తన చిత్రకళా ద్వారా అందరికీ తెలియజేసింది. మొదట్లో బొమ్మలు గీయడానికి కొంత ఆందోళన పడినా వారిద్దరి పర్యవేక్షణలో ఆమె ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. అప్పటినుండి ఆమె ప్రయాణం ఉత్సాహంతో ముందుకు సాగింది. ఆమె తన పెయింటింగ్‌లలో కచేరీలను కూడా జతకలిపింది.





ఈ కాలంలో 58సంవత్సరాల వయసు వారు కూడా ఆమె సమైక్యతా డ్రాయింగ్స్ ద్వారా, ఆమె జీవిత ఆశయాలను, కలలను తెలుసుకుంటున్నారు. ముందుగా భర్తతో మొదలైన ఈ ప్రోత్సాహం ఇప్పుడు కుటుంబం నుండి కూడా లభిస్తుంది.

ఆమె వెలుగులోకి తెచ్చిన ఈ కళను తేజు బెహన్ పిల్లలు, వారి మనుమలు అందరూ కూడా ఈ కళను నేర్చుకుని దానికి జీవం పోస్తున్నారు. మంచి డ్రాయింగ్స్ ను బొమ్మల బుక్‌గా ''డ్రాయింగ్ ఫ్రమ్ ది సిటీ'' అనే దాంట్లో పొందుపరిచింది. అందులో ఆమె పేదరికం నుంచి పెయింటింగ్‌వైపు ఏవిధంగా దారి మళ్లిందనే వివరాలు స్పష్టంగా తెలియజేసింది. అంతేకాదు ప్రపంచానికి ఒక కొత్తకళను కూడా అందించింది. దీనిని ముద్రించాలంటే రిసోగ్రఫీ చేయాలి. ఈకోఫ్రెండ్లీ సాంకేతికతతో ఇది చేయవచ్చు. ఆమె చిత్రకళ ఎప్పుడూ ప్రపంచంలో ఉన్న జానపద పండగలమీదే కేంద్రీకృతమై ఉండేవి. తేజు బెహన్ తన చిత్రకళతో మహిళలందరికీ ఆదర్శమైనది. ఆసక్తి ఉంటే ఎలాంటి పరిస్థితుల్లోనైనా అవకాశాలు అందిపుచ్చు కోవచ్చునని నిరూపించారు తేజు బెహన్. పేదరికం నుండి పెయింటింగ్‌వైపు సాగిన ఆమె ప్రయాణ విశేషాలు అందరికీ ఆదర్శనీయమైనవే. ఇప్పటికీ కూడా ఆమె తన కళతో చిత్రాలను గీస్తూనే ఉన్నారు. ఆమె మరిన్ని వందలాది పెయింటింగ్స్ వేయాలని ఆశిద్దాం.

ప్రత్యేకం

కార్డుబోర్డుతో కళాకృతులు

కార్డ్‌బోర్డు ప్రాముఖ్యత మన నిత్యజీవితంలో ఎంతో ఉంది. కొత్త ఇంటిలోకి వెళ్లాలంటే సామాన్లన్నింటినీ భద్రంగా ప్యాక్ చేసుకునేది ఈ కార్డ్‌బోర్డుల బాక్సులలోనే. కాని ఒకసారి వాడిన వాటిని మనకు అవసరంలేదని చెత్త కుండీలో పడేస్తుంటాము. అలా విసిరేసిన బాక్సులు ఏమవుతున్నాయో, మనకు తిరిగి ఏవిధంగా కొత్త బాక్సులు వస్తున్నాయనే అంశాన్ని ఆలోచించే తీరిక ఎవరికీ లేదు. అలా వృధా అనుకున్న వాటితోనే కొత్తగా ఇంటీరియర్ డిజైనింగ్‌కి ప్లాన్ చేసి అందరి మన్ననలు పొందుతున్నారు బందనా జైన్.

ఆన్‌లైన్ షాపింగ్‌లోనైనా, చెప్పులు కొన్నా, మనకు ఇలాంటి బాక్సులు కుప్పతెప్పలుగా వచ్చి పడుతుంటాయి. కాని వీటితోనే తన జీవితాన్ని వెలుగులోకి తెచ్చుకున్నారు ముంబయికి చెందిన ఆర్టిస్టు బందనా జైన్. ఈ కార్డ్‌బోర్డులతో వినూత్నమైన డెకరేషన్ లైట్లను తయారుచేసి అందరి మన్ననలను పొందుతున్నారు.

కేవలం వీటితో ల్యాంప్స్ మాత్రమే కాకుండా ఫర్నీచర్స్‌ను తయారుచేయడం మొదలుపెట్టింది. ఏదైనా తలచుకుంటే సాధ్యంకానిది లేదని ఆమె చేసిన ఈ ప్రయోగం వల్ల తెలుస్తుంది. ఈకో ఫ్రెండ్లీ హ్యాండీ క్రాఫ్ట్‌ల్యాంపులను, ఫర్నీచర్‌ను తన పేరుమీద డిజైన్ చేసి సిల్విన్ స్టూడియోలో ప్రదర్శనకు ఏర్పాటు చేసింది. ఆ స్టూడియోను ఆమెకు ముందు రోమన్ గాడ్ నిర్వహించేవారు. అతని తర్వాత ఆమె ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది. కొన్ని సంవత్సరాల క్రితమే ఆమె తన ప్రయత్నాన్ని ప్రారంభించింది. విజయం కూడా సాధించింది.

''మేము తయారుచేసిన కళాకృతులు కళాఖండాలను తలపిస్తాయి. పూర్తి సంతృప్తితో మీరు కొనుగోలు చేస్తారు. ఈ కళాకృతులను ప్రోత్సహించడంతో మీరు కూడా ధరిత్రి సంరక్షణలో పాలుపంచుకోగలుగుతారు''అని ఆమె అన్నారు.

ముంబయి చుట్టుపక్కల వెనకబడిన తరగతుల మహిళలకు ఉపాధి అవకాశాన్ని కల్పించి,ఆర్థికంగా వారికి స్వాతంత్ర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో కొంత మంది మహిళలకు వీటిని తయారుచేయడానికి శిక్షణను ఇచ్చారు. కేవలం వీరికే కాకుండా గ్రామీణ ప్రాంత మహిళలకు సాయం అందించడంలో ఆమె ఎప్పుడూ ముందే ఉంటుంది. వారికి ఆర్థికంగా స్థిరత్వం కల్పించాలన్నదే ఆమె ఆశయం. అలా ఆమె బీహార్‌లోని ఠాకూర్‌గంజ్ గ్రామంలోని మహిళలకు ఈ అవకాశాన్ని ఇచ్చింది.

''నేను ఒక చిన్న గ్రామం నుండి వచ్చాను. నా కళను ప్రదర్శించడానికి ప్రత్యేకించి ఎటువంటి ప్లాట్‌ఫామ్ నాకు త్వరగా దొరకలేదు. మొదట్లో చాలా



నిరుత్సాహానికి గురయ్యాను. అయినా వెనుకడుగు వేయలేదు. మళ్లీ మళ్లీ ప్రయత్నించి నేను ఈ స్థాయికి రాగలిగాను. నేను పడిన కష్టాలేమిటో నాకు తెలుసు కాబట్టి తోటిమహిళలకు తనవంతు సాయాన్ని ఎల్లప్పుడూ అందించాలనే తపన పడుతుంటాను '' అని బందనా చెప్పారు

ఆమె చదువుకున్నది ఎనిమిదవ తరగతే. ఆ తరువాత ఇంటి పరిస్థితుల రీత్యా ప్రైవేట్ స్కూళ్లలో చదువుకోలేకపోయారు. ప్రభుత్వ స్కూల్, కాలేజ్‌లో చదవడం వల్ల రోజూ స్కూల్‌కి వెళ్లకుండా పరీక్షలకు మాత్రమే వెళ్లి రాసి వచ్చేవారమని ఆమె అన్నారు.

''మా ఇంట్లో అమ్మాయంటే ఇంటి పనులకే అంకితమనే అభిప్రాయముండేది. నాకు 16 సంవత్సరాలు రాగానే కుటుంబ సభ్యులందరూ నా వివాహం గురించే చర్చించేవారు. కానీ, నాకు పెళ్లి ఇష్టముండేది కాదు. నా జీవితంలో ఏమేమి చేయాలనుకుంటున్నానన్నది మా తల్లిదండ్రులకు తెలిపాను. కాని వాళ్లు నా ఆలోచనలకు మద్దతు ఇవ్వలేదు. వారికి నెమ్మదిగా అన్నివిధాల నచ్చచెబితేగానీ కొన్ని రోజులు తర్వాత నేను ఢిల్లీలో ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సు చేయడానికి అంగీకరించలేదు. వాళ్ల అంగీకారంతోనే నేను పెద్ద ఆర్టిస్ట్ అయినట్టుగా ఎంతో సంతోషం కలిగింది. నేను కనీసం గీతలు గీయడం కూడా నేర్చుకోలేదు. స్వతహాగా తోచిన డిజైన్లను వేసేదాన్ని.

నా తల్లిదండ్రులను ఒప్పించాక నా జీవితంలో కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టాను. రెండురోజుల్లో నేను న్యూఢిల్లీకి ప్రయాణమవ్వాల్సి ఉంది. కాని అమ్మ బ్రెయిన్‌హేమరేజ్‌కి గురైంది. అది నాకు పెద్ద దెబ్బ. నెల తరువాత ఆమె మరణించింది. నా జీవితం అనుకోని మార్పులకు గురైంది. దానివల్ల నా కంటే పెద్దవాళ్లైనా అక్కలను చూసుకోవలసిన బాధ్యత నామీద పడింది. కొంతకాలానికి వాళ్ల పెళ్లిళ్లయి ఢిల్లీలో స్థిరపడ్డారు. వారిని నేను నా తల్లిస్థానంలో చూసేదాన్ని. నేను వంట చేసి అందరినీ జాగ్రత్తగా చూసుకునేదాన్ని. అనుకోకుండానే నా బాధ్యతలవల్ల నేను ఇంటికే పరిమితమైపోయాను''అని ఆమె తెలిపారు.

కొత్తదారికి బాటలు వేసుకున్నాను

కొన్ని రోజుల తరువాత నాలో ఆలోచన మొదలైంది. నా జీవితం ఇంతేనా, నా లక్ష్యాన్ని ఏం చేశానని నన్ను నేనే ప్రశ్నించుకోవడం మొదలుపెట్టాను. మా అక్క ఢిల్లీలో ఉంటుంది, ఆమె దగ్గరకు వెళ్లాను. ఆమె తనకిష్టమైన వ్యక్తిని పెళ్లి చేసుకుని 2009లో ముంబయికి వెళ్లిపోయింది. నేను కూడా పెళ్లిచేసుకుని గ్రామం నుండి పట్నానికి వచ్చాను. జెజెస్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ముంబయిలో అడ్మిషన్‌ను తీసుకున్నాను. ఈవిషయంలో నా భర్త ప్రోత్సాహం ఎంతో ఉంది అని చెప్పారు.

జెజెస్కూల్ ఆఫ్ ఆర్ట్స్ పేరుపొందిన స్కూల్. అంతమందిలో ప్రత్యేకతను సంపాదించాలంటే మామూలు విషయం కాదు. ఇక్కడ వేలల్లో ఒక్కరు విజయవంతమవుతారు.

కొంతమంది విద్యార్థులు నన్ను జావెద్ ములాని(పూర్వ విద్యార్థి)ని కలవమని చెప్పారు. అతను జెజె స్కూల్ ఎంట్రన్స్ పరీక్షల్లో విజయం సాధించడానికి కావలసిన మార్గాలను చెబుతాడని అన్నారు. అప్పటినుండి 15రోజులు పరీక్ష పాసవడానికి చాలా కఠిన శ్రమ చేశాను. జావేద్ ఎవరో నాకు తెలియదు. కాని నన్ను ఈపరీక్షలో పాసవడానికి కావలసిన సహాయాన్ని ఇచ్చాడు. రెండు, మూడు గంటలు నాదగ్గరే కూర్చుని ప్రాక్టీసు చేయించేవాడు. అతను వెళ్లిపోయాక కూడా నేను 12-14 గంటలు ప్రాక్టీసు చేసేదాన్ని. నేను పడిన కష్టానికి మంచి ఫలితాన్ని అందించాడు దేవుడు. పరీక్షల్లో పాసయ్యాను. ఆర్ట్స్ కోర్సులో జాయిన్ అవడానికి అర్హత సంపాదించాను అని అన్నారు.

జెజెస్కూల్ ఆమెకు స్వాగత ద్వారాలు తెరిచింది. అందులో చదువుకోవడం ఆమెకెంతో సంతోషాన్ని కలగజేసింది. ఆమె మొదట నుండి తన ప్రాజెక్ట్‌లో కార్డ్ బోర్డుతో డిజైనింగ్ చేయాలనే ప్రతిపాదన చేసుకుంది. కాని కొన్ని అవాంతరాలు ఎదురయ్యాయి.

2012లో కాలేజ్‌లో డిగ్రీ పాసయ్యింది. ఆమెను తిరిగి ఇంటికి తీసుకువచ్చారు. నేను నేర్చుకున్న డిజైనింగ్ కోర్సులోని మెలకువలతో నా ఇంటిని నేను అందంగా తీర్చిదిద్దాలనుకుంటున్నాను. ఉన్నవాటితో కాకుండా నాకు కావలసిన కొన్ని వస్తువులను తీసుకురండి మంచిగా అలంకరిస్తానని భర్తతో చెప్పాను. నా మంచానికి లెదర్ క్లాత్‌తో డిజైన్‌చేసాను. ఫర్నీచర్‌ను పేపర్ వుడ్‌తో చేశాను.

భిన్నంగా చేయాలనే తపనతో...

అందరిలా చేస్తే అందులో ప్రత్యేకత ఏముంటుంది. ఇప్పటి వరకూ ఎవరూ వాడని వస్తువులతో ఇంటరీయర్ డెకరేటింగ్ చేయాలని ఆమె కోరిక. దానికే కార్డ్‌బోర్డును ఎంచుకుంది. కాలేజ్‌లో ఉన్నప్పుడు చేయలేక పోయినా బయట ఆమె దానిమీద ప్రాక్టికల్స్ చేసింది. దీనితో కుర్చీని తయారుచేస్తే ఎలాగుంటుందనే ఆలోచన వచ్చి మొదలుపెట్టింది. తయారుచే యడానికి మూడునెలలు పట్టింది. దీనికి వాడినదంతా ఉపయోగంలేని కార్డ్‌బోర్డులే.

ఒక కుర్చీ 500రూపాయలకు తయారుచేయవచ్చని అనుకున్నాను. కాని 4000 రూపాయలు అయ్యింది. అంత మొత్తాన్ని పెట్టలేనని ఆ ప్రాజెక్టును మానుకున్నాను. సోఫాను ఒక నెలలో తయారుచేయగలిగాను. పేపర్‌కటర్‌తో షీట్లను కట్‌చేసి తయారుచేశాను. ఇది చాలా కష్టమైన విధానం. కాని పని పూర్తయినాక సోఫాను చూస్తే చాలా ముచ్చటేసింది. చాలా అందంగా కనబడింది. చాలా మన్నికైనది. ఇప్పటికీ ఆ కుర్చీని ఆమె వాడుకుంటున్నాను అని ఆమె చెప్పారు.

తర్వాత ల్యాంప్స్‌మీద ప్రయోగం చేసింది. 10, 12 ల్యాంప్‌లు కంప్లీట్ చేశాక వాటిని ప్రదర్శనకు పెట్టి తన స్నేహితులను, కొలీగ్స్‌ను, కుటుంబసభ్యులను చూడడానికి ఆహ్వానించారు. వాటిని కూడా కార్డ్‌బోర్డుతోనే తయారుచేశారు. అందరికీ నచ్చినవి. మీరు మరిన్ని డిజైన్స్‌ను తయారు చేయండని అందరూ ప్రోత్సాహించారు. ఆమె మొదటి ప్రదర్శనను ఎస్ఎస్ఇ గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. మొదటిరోజు అందరూ అందించే ప్రశంసలతో ఆమె బిజీ అయిపోయారు. మంచి సృజనాత్మకతను మాకు పరిచయం చేసినందుకు ధన్యవాదాలు అంటూ ప్రజలు ఆమెకు అభినందనలు తెలియజేశారు. కాని పెద్ద ఛాలెంజ్ ఏమిటంటే దీనిని మార్కెట్లోకి ఎలా ప్రవేశ పెట్టాలి. ఎంత రేటులో వీటిని అమ్మడానికి ఏర్పాటు చేయాలనేదే ప్రశ్నగా మారింది. ముంబయిలోని సిల్విన్ స్టూడియోలో వాల్ పానెలింగ్‌ను ఆమె దీనితోనే చేసింది. సిల్విన్ స్టూడియోలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఒక్కోదానికి 2000రూపాయల నుండి 20,000వరకు రేటు ఫిక్స్ చేసింది. ''నేను 5 సంవత్సరాలుగా దీనితోనే పనిచేస్తున్నాను. నేను తయారుచేసిన విభిన్న డిజైన్లు నన్ను బిజినెస్ మార్కెట్లో ఒక మోడల్‌గా నిల్పోబెట్టాయి. రేమండ్స్‌కి ఫర్నీచర్, ల్యాంప్స్‌ని, మెక్‌డొనాల్డ్స్‌కి, ది బాంబే స్టోర్, వన్ ఎబౌవ్, ధూప్ అంద్ ఎల్సీ వంటి వాటిలో ఆమె డిజైన్లే కనబడతాయి.

బందనా ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో మహారాష్ట్రకు చెందిన మహిళాకూలీలు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి పనులు చేస్తున్నారు. నిరుపేద కుటుంబాలకు నా డిజైనింగ్ వర్క్ ఉపాధిగా మారడం నాకెంతో సంతోషంగా ఉంది అని ఆమె ఎంతో ఆనందంతో అన్నారు.



చివరి మజిలీలో రంగస్థలం


రామ్‌చరణ్


నయనతార

రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్‌ల కలయికలో రూపొందుతున్న రంగస్థలం-1985 చిత్రం చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. రామ్‌చరణ్ సరసన సమంత నాయికగా నటిస్తున్న ఈ చిత్రం పల్లెటూరి ప్రేమకథ నేపథ్యంలో పీరియాడికల్‌గా సాగనుంది. కాగా ఈ చిత్రం కోసం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ప్రత్యేకంగా ఓ సెట్ నిర్మించి, అందులో ఓ మేజర్ షెడ్యూల్ చేశారు. అంతకుముందు రాజమండ్రి, పోలవరం పరిసరాల్లో కూడా కొంత షూటింగ్ జరిపిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ షెడ్యూల్లో భాగంగా ఇటీవల కొద్దిరోజుల పాటు బ్రేక్ తీసుకున్న చిత్రబృందం బుధవారం నుంచి తిరిగి షూటింగ్‌ను మొదలుపెట్టనుంది. ఈ నెల 10 వరకు హైదరాబాద్‌లోనే చిత్రీకరణ జరపనున్నారు. ఆ తర్వాత రాజమండ్రిలో షూటింగ్ జరిపేందుకు చిత్రబృందం పయనం కానుంది. అందులో భాగంగా కొన్ని ముఖ్యమైన సన్నివేశాలతో పాటు మిగిలివున్న రెండు పాటలను కూడా రాజమండ్రి పరిసరాల్లో చిత్రీకరిస్తారని, దీంతో చిత్రీకరణ ముగుస్తుందని అంటున్నారు. దర్శకుడు సుకుమార్ తొలిసారిగా రామ్‌చరణ్ కలయికలో చేస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్ చెరుకూరి నిర్మిస్తున్నారు. మార్చి 30న ప్రపంచవ్యాప్తంగా చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారట. ఈ చిత్రంలోని ఇతర ముఖ్యపాత్రల్లో ఆది పినిశెట్టి, జగపతిబాబు, ప్రకాష్‌రాజ్, రావురమేష్, అనసూయ నటిస్తుండగా, దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని, రత్నవేలు ఛాయాగ్రహణాన్ని అందిస్తున్నారు.

వారివల్లే జీవితం అర్థవంతంగా మారింది

నా జీవితాన్ని అర్థవంతంగా మార్చింది ప్రేక్షకాభిమానులే. వారి ఆదరణ వల్లే వినోదాత్మక చిత్రాలతో పాటు అరమ్ వంటి సందేశాత్మక చిత్రాల్లో నటించగలుగుతున్నా అని అందాల తార నయనతార చెప్పుకొచ్చారు. తమిళ, తెలుగు, మలయాళ చిత్రాల్లో నటిస్తూ తనదైన ప్రత్యేకతను చాటుకుంటూ ఎప్పటికప్పుడు ఏదోరకంగా వార్తలలో ఉండే ఆమె సొంతగా తాను రాసిన ఓ లెటర్‌ను సోషల్‌మీడియాలో ట్వీట్ చేయడం ఓ విశేషం. సినిమాల్లో నటించడం తప్ప ఇంకెలాంటి ప్రచారంలో సాధారణంగా పాల్గొనని ఆమె అభిమానులతో కూడా అంటీ అంటనట్లుగా ఏ విషయాలను షేర్ చేసుకోదన్న పేరుంది. అయితే నూతన ఏడాది సందర్భంగా ఓ పెద్ద లెటర్‌ను ఆమె పోస్ట్ చేయడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

అందులో అభిమానులకు పెద్దపీట వేస్తూ...వారు చూపుతున్న అభిమానం వల్లే తన జీవితం అందంగా మారిందని, దానివల్లే తన శాయశక్తులా పాత్రల్లో ఒదిగిపోయేందుకు కృషి చేస్తున్నానని ఆమె పేర్కొంది. అంతేకాదు మీడియా వారికి, అలాగే విమర్శకులకు కూడా కృతజ్ఞతలను తెలియజేస్తున్నానని...2018వ సంవత్సరం గతంలో కంటే మరింత బావుంటుందని తాను ఆశిస్తున్నానని ఆమె వెల్లడించింది. ఇదిలావుండగా...గతేడాది డోరా, అరమ్, వేలైక్కారన్ వంటి మూడు తమిళ చిత్రాలతో ఆమె ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇందులో డోర చిత్రం తెలుగులో అనువాదమైన సంగతి తెలిసిందే. ఇక ఈ ఏడాది ఇమైకానోడిగళ్, కొలైయుతుర్ కాలమ్, కొలమావుకోకిల అనే తమిళ చిత్రాలతో పాటు తెలుగులో జైసింహా, సైరా నరసింహారెడ్డి చిత్రాల ద్వారా ప్రేక్షకుల ముందుకు రానున్నారు. అరమ్ చిత్రం కర్తవ్యం పేరుతో తెలుగులో రానుంది. మొత్తంమీద ఈ ఏడాది రాబోయే చిత్రాలను చూస్తే తాను మరింత ప్రకాశించే అవకాశాలున్నాయని ఆమె భావిస్తోంది.

పంచభూతాలకు సంబంధించిన కొత్తరకమైన కథాంశంతో రూపుదిద్దుకుంటున్న సాక్ష్యం చిత్రంలో నటించడం మంచి అనుభూతిని కలిగిస్తోందని హీరో బెల్లంకొండ శ్రీనివాస్ పేర్కొన్నారు. అల్లుడు శీను, స్పీడున్నోడు, జయ జానకి నాయక చిత్రాల తర్వాత ఆయన నటిస్తున్న చిత్రమిది. కాగా బుధవారం తన జన్మదినోత్సవం సందర్భంగా ఆయన కొద్దిసేపు ముచ్చటించారు.

ఆల్‌రౌండర్‌గా పేరొస్తుంది

- బెల్లంకొండ శ్రీనివాస్



కొత్తగా ఉండే రివెంజ్ కథ

ప్రేమ కథలలో పూర్తిస్థాయి ప్రేమకథలు, రివెంజ్ కథలు, త్యాగభరితమైన కథల వంటి మూడు రకాలుంటాయి. ఇది కొత్తదనంతో కూడుకున్న రివెంజ్ కథ. పంచభూతాలకు సంబంధించిన అంశాన్ని ఆవిష్కరిస్తూ సహజత్వానికి దగ్గరగా, చాలా కొత్తగా ఈ చిత్రాన్ని రూపొందించడం జరుగుతోంది. ఇంతవరకు లవ్, యాక్షన్‌తో కూడుకున్న కమర్షియల్ చిత్రాలను చేసిన నాకు పూర్తి భిన్నమైన చిత్రమిది. కెరీర్ మొదట్లో ఇలాంటి కథ లభించడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. నటించేందుకు ఇందులోని పాత్రలో ఎంతో అవకాశం ఉంది. ఎన్నో అంశాలు పాత్రలో ఉండటమే అందుకు కారణం. నటుడిగా ఈ పాత్ర నాకు ఒక ఛాలెంజింగ్ మాత్రమే కాదు ఆల్‌రౌండర్‌గా నాకు పేరు తెచ్చిపెట్టే చిత్రమవుతుందన్న నమ్మకం ఉంది.

మంచి నటులున్నారు

సాక్ష్యం చిత్రంలో పాత్రలకు తగ్గ చాలా మంచి నటీనటులు కుదిరారు. శరత్‌కుమార్, జగపతిబాబు, రవికిషన్ వంటి పాత్రలలో ఒదిగిపోయే నటులు ఇందులో ఉన్నారు. ప్రతీపాత్ర కథకు అవసరమైన పాత్రే. ఇంత మంచి కాంబినేషన్‌లో చిత్రం చేస్తుండటం చాలా ఆనందంగా ఉంది.

డిమాండ్ మేరకే స్టంట్స్

ఈ చిత్రంలో యాక్షన్ పార్ట్ ఎక్కువగా ఉండదు. కథ డిమాండ్ మేరకే అవసరమైన చోట మాత్రమే యాక్షన్ సీక్వెన్స్‌లుంటాయి. స్టంట్ మాస్టర్ పీటర్ హెయిన్ అద్భుత ఫీట్‌లను రూపొందించారు. ఎలాంటి డూప్ లేకుండా రిస్కీ ఫైట్స్‌లో కూడా పాల్గొన్నాను. అవి ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. దర్శకుడు శ్రీవాస్ గతంలో లక్ష్యం చిత్రాన్ని ఎంత బాగా తీశారో అంతేబాగా ఈ చిత్రాన్ని మలుస్తున్నారు. హీరోగా నాకు, అలాగే మా బృందానికి, దర్శకుడిగా శ్రీవాస్‌కు పేరు తెచ్చేపెట్టే చిత్రమిది.

సమ్మర్‌లో విడుదల

ఇప్పటికే ఈ చిత్రం షూటింగ్ మూడొంతులకు పైగా పూర్తయింది. క్లైమాక్స్‌తో పాటు మూడు పాటల చిత్రీకరణ మిగిలివుంది. త్వరలో ఆ చిత్రీకరణను పూర్తిచేసి, సమ్మర్‌లో చిత్రాన్ని విడుదల చేయనున్నాం. ఇంతవరకు ఒక్కో ఏడాది ఒక్కో చిత్రం చేస్తూ వచ్చాను. అయితే ఒక ఏడాదిలో జయ జానకి నాయక తర్వాత ఎక్కువ గ్యాప్ లేకుండా చేసిన రెండో చిత్రమిది.

కథ నచ్చాలి

నాన్నగారు, నేను కథలను వింటుంటాం. కథ నచ్చితే పేరున్న దర్శకుడా? లేక కొత్త దర్శకుడా? అన్న అంశాన్ని చూడను. అలాగే ప్రేమ కథలా, యాక్షన్ కథలా అనే దానికంటే ఎవరు చెప్పిన కథైనా అద్భుతంగా ఆకట్టుకోగలిగినపుడు వాటిల్లో నటించేందుకు ఆసక్తిని కనబరుస్తాను.

జయ జానకి నాయక క్లైమాక్స్ భళా

జయ జానకి నాయక చిత్రం కూడా నటుడిగా నాకెంతో పేరు తెచ్చిపెట్టింది. ఇందులోని క్లైమాక్స్ ప్రేక్షకులను ఎంతగానో అలరించడంతో పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నన్ను కొత్తకోణంలో చూపాలని దర్శకుడు బోయపాటి శ్రీను ఈ చిత్రం కోసం ఎంతో తపన చెందారు.

తదుపరి చిత్రం కోసం కథలు వింటున్నా

సాక్ష్యం తర్వాత చేయబోయే చిత్రం ఇంకా ఖరారు కాలేదు. ప్రస్తుతం అందుకు సంబంధించిన కథలను వింటున్నాను. స్పష్టత వచ్చిన తర్వాత చేయబోయే చిత్రాన్ని తెలియజేస్తాను అంటూ ముగించారు.

రామ్‌తో కిరాక్ భామ!

కన్నడ భామ రష్మిక మరో తెలుగు సినిమాలో నటించడానికి అంగీకరించినట్టు తెలిసింది. కన్నడ సూపర్‌హిట్ సినిమా కిరాక్ పార్టీతో ఫామ్‌లోకి వచ్చిన రష్మికకు దక్షిణాది చిత్రరంగం నుండి అనేక ఆఫర్లు వచ్చాయి. డేట్స్ సర్దుబాటు చేయలేక కొన్ని సినిమాలు వదులుకుంది. ఇప్పటికే కిరాక్ పార్టీలో నిఖిల్‌తో నటిస్తోంది. నాగసూర్యతో ఛలో... ఇంకా విజయ్ దేవరకొండతో మరో సినిమా అంగీకరించింది. ఈ చిత్రాలు ఇంకా నిర్మాణం దశలోనే ఉన్నాయి. అయినప్పటికీ రష్మికకు మరిన్ని అవకాశాలు వస్తున్నాయి. తాజాగా రామ్‌తో నటించేందుకు అంగీకరించినట్లు తెలిసింది. రామ్, త్రినాథరావు నక్కిన (నేను లోకల్ ఫేమ్) కాంబినేషన్‌లో దిల్ రాజు నిర్మించే చిత్రంలో రష్మిక నాయికగా నటించనుందని సమాచారం. అయితే ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించలేదు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఫిబ్రవరిలో మొదలుకానుంది. దిల్ రాజు సంస్థలో రామ్ చాలా గ్యాప్ తర్వాత నటిస్తున్నాడు.


రష్మిక


చిత్రా శుక్లా, రాజ్ తరుణ్



సంక్రాంతి బరిలో రంగులరాట్నం

అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తున్న రంగులరాట్నం చిత్రం సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకురానుంది. గత ఏడాది రారండోయ్ వేడుక చూద్దాం, హలో చిత్రాలను నిర్మించిన అన్నపూర్ణ స్టూడియోస్ తాజా చిత్రం రంగులరాట్నం. రాజ్‌తరుణ్, చిత్రా శుక్లా జంటగా నటిస్తున్నారు. శ్రీరంజని దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తిచేశారు. పోస్ట్‌ప్రొడక్షన్ పనులు చివరిదశకి చేరుకున్నాయి. ఉయ్యాల జంపాల చిత్రం ద్వారా రాజ్‌తరుణ్‌ను పరిచయం చేసిన అన్నపూర్ణ స్టూడియోస్ ఇప్పుడు రంగులరాట్నం నిర్మిస్తోంది. ఇతర పాత్రల్లో సితార, ప్రియదర్శి నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం శ్రీచరణ్ పాకాల, ఛాయాగ్రహణం ఎల్.కె.విజయ్.



అర్జున్ యతజ్, పావని

లక్ష్యాన్ని చేరుకుంటేనే...

ప్రేమగొప్పదే.. జీవిత లక్ష్యం ఇంకా గొప్పది. ప్రేమంటే చంపటమో చావడమో కాదు, చచ్చేదాక కలిసి బ్రతకటం. కన్నవాళ్ళ కలలతో పాటు, ఆశించిన లక్ష్యాన్ని చేరుకోగలిగితే ప్రతి ఒక్కరి జీవితం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. అనే కథాంశంతో స్మైల్ పిక్చర్స్ ఓ సినిమాను నిర్మిస్తోంది. దాదాపు 40 చిత్రాలకు సంభాషణలు అందించిన రామస్వామి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

ఈ చిత్రానికి మూడు పువ్వులు ఆరు కాయలు అనే పేరు నిర్ణయించారు. షూటింగ్ పూర్తయింది. అర్జున్ యతజ్, భరత్ బండారు, రామస్వామి హీరోలుగా నటిస్తున్నారు. సౌమ్య వేణుగోపాల్, పావని, సీమా చౌదరి నాయికలు.

చిత్ర నిర్మాత వబ్బిన వెంకటరావు మాట్లాడుతూ నవ్వినా ఏడ్చినా కన్నీళ్ళే వస్తాయి. ఈ చిత్రంలో కడుపుబ్బ నవ్వించే హాస్యరసంతో పాటుగా, కంటతడి పెట్టించే కరుణరసం కూడా ఉంటుంది. రామస్వామి తొలిసారి దర్శకత్వం వహిస్తున్నారు అని చెప్పారు.

షూటింగ్ పూర్తయిందని, పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని చిత్ర సమర్పకులు డాక్టర్ మల్లె శ్రీనివాసరావు చెప్పారు. మంచి కాన్సెప్ట్‌తో సకుటుంబాన్ని అలరించేలా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్టు దర్శకుడు తెలిపారు.

ఈ చిత్రానికి సాహిత్యం చంద్రబోస్, భాస్కరభట్ల, ఫైట్స్ మార్షల్ రమణ, ఛాయాగ్రహణం ఎం.మోహన్ చంద్, సంగీతం కృష్ణసాయి.